శ్రీః
ఆళ్వార్ తిరువడిగళే శరణమ్
ఎమ్పెరుమానార్ తిరువడిగళే శరణమ్.
జీయర్ తిరువడిగళే శరణమ్.
శ్రీమతే అప్పలార్యాయ నమః

# శారీరక కారికావళి

## మొదటి అధ్యాయం

## శ్రీభాష్యానికి సులభమైన సంక్షిప్తవివరణం.

*శ్రీమాన్ కోళ్ళియాలం శ్రీనివాసాచార్యులవారి కారికావళి, దానికి పుత్తూర్ స్వామి శ్రీమాన్ S. కృష్ణస్వామిఅయ్యంగార్ సాయించిన ఎళియ తమిళ్వివరణానికి తెలుగు సేత.*

మహామహోపాధ్యాయ శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యస్వామివారి శిష్యుడు
భాగవతదాసుడు శ్రీభాష్యం శ్రీనివాసరామానుజదాసునిచేత
రచింపబడినది.
2009

శ్రీమతే రామానుజాయ నమః

# ఉపోద్ఘాతము

## అస్మద్గురుభ్యో నమః

శ్రీరామానుజుల గ్రంథాల్లో శ్రీభాష్యమే చాలా పెద్దదీ, చాలా కఠినమైనదీని. ఈశ్రీభాష్యంవల్ల వివరింపబడే శ్రీవేద్యాసవిరచితమైన బ్రహ్మసూత్రాలు నాలుగు అధ్యాయాలుగా ఏర్పాటు చెయ్యబడ్డాయి. సమన్వయాధ్యాయం అనబడే మొదటి అధ్యాయం అన్ని వేదాంతవాక్యాలూ నారాయణుడినే జగత్కారణంగా చెప్పుతున్నాయని సమన్వయపరిచి చూపిస్తోంది. అవిరోధాధ్యాయం అనబడే రెండో అధ్యాయంలో, ఇతరతత్వాలని జగత్సృష్టిస్థితిలయాలనిచేసే జగత్కారణంగాచెప్పే పక్షాలు ఖండింప బడ్డాయి. సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం, బౌద్ధం, శమణం(జైనం), పాశుపతం అనబడే మతాల సిద్ధాంతాలు వివరించబడి, వాటినిఖండించబడడం ద్వారా మొదటి అధ్యాయంలో స్థాపించబడ్డ బ్రహ్మకారణవాదానికి విరోధం లేదని ఈఅధ్యాయంలో నిరూపించబడడ్డది. సాధనాధ్యాయం అనబడే మూడో అధ్యాయంలో పరమాత్మవస్తువుని పొందడానికి సాధనం (మార్గం) వివరింపబడింది. చివరిదైన ఫలాధ్యాయం అనబడే నాలుగో అధ్యాయంలో మోక్షమనే ఫలం వివరించబడింది. శ్రీరామానుజులు బ్రహ్మసూత్రార్థాన్ని వేదాంతదీపం, వేదాంతసారం అనే (సంక్షిప్తరూపమైన)మిగతా రెండు గ్రంథాల్లోకూడా తెలియజేసేరు.

జగత్కారణవస్తువుని తెలియజేసే వేదాంతవాక్యాలని ఒకదానికొకటి విరోధంలేకుండా సమన్వయపరిచి చూపిస్తుంది మొదటి అధ్యాయం. వేదాంతవాక్యాలు రెండురకాలు. 1. వస్తువుని తెలుసుకోవడానికి ఇతర సహాయాన్ని ఎదురుచూడకుండా వాటంతట అవే స్పష్టంగాఉన్న నిరాకాంక్షవాక్యాలు, 2. ఇతరవేదాంతవాక్యాల సహాయంతో వాటిననుసరించి అర్థాన్నితెలియజేసే సాకాంక్షవాక్యాలు. జగత్కారణాన్నివివరించే వేదాంతవాక్యాలన్నింటినీ మనం చూస్తే, సాంఖ్యుల మూలప్రకృతి, నైయాయికుల పరమాణు మొదలైన అచేతనతత్త్వాలని, అవి జగత్కారణంగా చెప్పలేదనిన్నీ, అన్ని చేతనాచేతనాలనీ శరీరంగాగల శ్రీమన్నారాయణుడినే జగత్కారణంగా చెప్తున్నాయనీ తెలుస్తుంది.

శ్రీరామానుజుల వేదాంతం సంపూర్ణమైనదీ, దోషరహితమైనదీ అయిన భగవద్సిద్ధాంతాన్ని లోకానికి అందిస్తోంది. ఈసిద్ధాంతంలో పరమాత్మవస్తువూ, జీవుడూ ఒకరినొకరు విడిచి పెట్టకుండా వైరుధ్యంలేకుండా కలిసిఉంటారు. ప్రపత్తిసిద్ధాంతంలోలాగనే "చేతనాచేతనాలతోఏర్పాటైన జగత్తు, అంతర్యామియైన పరమాత్మకి శరీరమై ఉన్నది" అని చెప్పే శరీర-శరీరి భావసిద్ధాంతాన్ని వేదాంతులకి శ్రీరామానుజులు అందజేసిన అసాధారణమైన, ముఖ్యమైన, యథార్థమైన, భావం. ఇది విశిష్టాద్వైతసిద్ధాంతం తాలూకు ప్రధానమైన ప్రతితంత్రం (ముఖ్యసిద్ధాంతం) అనబడుతోంది. రామానుజులు ఎన్నోరకాలైన వేదాంతవాక్యాలకి వైరుధ్యం లేకుండా అర్థాన్నిచెప్పే పద్ధతిలో వెళ్ళేరు. శ్రీరామానుజులు శరీరశరీరిభావాన్నీ, ఉపాదాన-ఉపాదేయ (కార్యకారణ)భావాన్నీ సహాయంగాచేసుకొని, బ్రహ్మాన్ని ఇతరవస్తువులకంటే వేరైనదిగా చెప్పే *"**నేతి నేతి**"* (బ్రహ్మం ఇదికాదు, ఇదికాదు)మొదలైన వాక్యాలనీ, *"**సర్వం ఖల్విదం బ్రహ్మ**"* (ఇది అంతా పరమాత్మవస్తువే) మొదలైన అభేదశ్రుతులనీ, *"**నేహ నానాస్తి**"* (ఈపరమాత్మవస్తువుకి భేదం లేదు) మొదలైన భేదనిషేధ శ్రుతులనీ *"**పతిం విశ్వస్య నారాయణమ్**"* (లోకానికి స్వామి నారాయణుడే) మొదలైన భేదశ్రుతులనీ

ఇంకాఉన్న సమస్త వేదవాక్యాలనీ వైరుధ్యం లేకుండా పరమాత్మవిషయంలో సమన్వయపరుస్తున్నారు.

మనం అందరం పరమాత్మకి విశేషణవస్తువులం. పరమాత్మ ఒక్కడే విశేష్యవస్తువు. మనం విశేషణం అంటే, మన సహాయంతో పరమాత్మని విశేషింపజేస్తున్నామని భావం కాదు. పరమపురుషుడు ఎప్పుడూ సహజంగానే పరిపూర్ణుడుగా ఉన్నవాడు. మనం ఎప్పుడూ సహజంగానే ఆయనకి సొత్తుగానున్న వస్తువులు గానే ఉంటున్నాం. ఆయన ప్రకారి లేక విశేష్యంగానూ, మనం ప్రకారం లేక విశేషణంగానూ, ఆయన నియంత గానూ, మనం నియామ్యంగానూ ఆయన ఆధారంగానూ, మనం ఆధేయంగానూ, ఆయన శేషిగానూ, మనం శేషంగానూ, ఆయన అంశిగానూ, మనం అంశంగానూ ఉన్నాం. అచేతనతత్త్వాలూ, చేతనులూ యథార్థాలు గానూ, వేరువేరు తత్త్వాలుగానూ ఉన్నాయి. చేతనాచేతనాలు చేరియున్న పరమపురుషుడు ఒక్కడే. మనం పరమపురుషుడిలాగనే నిత్యమై ఉన్నప్పటికీ, ఎప్పుడూ ఆయనని వదిలి ఉండడం లేదు. చిదచిదీశ్వరుల భేదస్వభావం ఖండించబడకపోయినప్పటికీ, చేతనాచేతనాలతో కలిసిఉండే ఈశ్వరుడు ఒక్కడే తత్త్వం అన్నది కూడా బలపరచబడుతోంది. అద్వైతంలోలాగ జీవులు బ్రహ్మంయొక్క మిథ్యావతారాలుగావు. వాళ్ళు బ్రహ్మకి శరీరమై ఉన్నవాళ్ళు. "ఆత్మవల్ల ఎప్పుడూ నియమింపబడేదీ, ధరింపబడేదీ తనకే ఉపయోగపడేదే శరీరం" అనే అర్థంలోనే శ్రీరామానుజులు లోకాన్ని పరమాత్మవస్తువుకి శరీరం అని చెప్తున్నారు. హిందూవేదాంతంలో శరీరశరీరిభావమనేది చాలా విశేషమైన సృష్టిగా ఏర్పాటైన సిద్ధాంతం. ఈవిషయాలని వివరించే శ్రీభాష్యంలో ఉన్న వాదాలని వివరించి చెప్పడం చాలా కఠినమైనపని. అటువంటిదాన్ని శ్రీమాన్ కోళ్ళియాళం శ్రీనివాసాచార్యస్వామి చేపట్టి శారీరకకారికావళిని మనకి అందించేరు.

శారీరకకారికావళి అనే ఈగ్రంథం శ్రీరామానుజులవారి శ్రీభాష్యానికి అతివిశిష్టమైన సారం. ఇప్పుడు ప్రకాశితమౌతున్న మొదటి భాగం ముప్పైరెండు అధికరణాలున్న బ్రహ్మసూత్ర ప్రథమాధ్యాయనికి సారాన్ని (శ్రీభాష్యాన్ననుసరించి) 460 శ్లోకాల్లో సూత్రాల వివిధభావాలని పరిశీలించి రచించబడింది.

ఇక దీనిని రచించిన శ్రీమాన్ కోళ్ళియాలం శ్రీనివాసాచార్యులవారిని గురించి తెలుగుపాఠకులకోసం రెండు మాటలు. వీరినిగురించి మీమాంసార్ణవ, పండితరాజ శ్రీమాన్ దే. తి. తాతాచార్యస్వామివారు ఇలా అన్నారు.

"శ్రీ కోళ్ళియాలమ్ స్వామివారు అని ప్రసిద్ధులైన శ్రీమత్పరమహంసేత్యాదిబిరుదాలంకృత శ్రీరంగరామానుజ యతీంద్రమహాదేశికులకి పూర్వాశ్రమసోదరులూ, వారికి ప్రథమశిష్యులూ అయిన శ్రీ ఉ.వే శ్రీనివాసాచార్యస్వామి, సంప్రదాయసిద్ధంగా యజుర్వేదం సంపూర్ణంగా అధ్యయనంపూర్తిచేసినవారై, మంచి అనుష్ఠానాన్నికలిగి ఆత్మగుణసంపూర్తిని కలిగినవారు. "వేదాధ్యయనం, వేదార్థప్రవచనమే తపస్సు అని మౌద్గల్యులైన నాగరులు సాయించేరు" "వేదాధ్యయనం, వేదార్థప్రవచనమూ అనే రెండింట్లోనూ జారకూడదు" అని అన్వయవ్యతిరేకాలద్వారా వేదం మంచి ఆదరంతో శాసించే ఆజ్ఞని చిన్నవయస్సులోంచీ విచ్ఛేదంలేకుండా అనుష్ఠిస్తూ వచ్చినవారు. ఆచార్యోత్తములైన శ్రీ కోళ్ళియాలంస్వామి సన్నిధిలో ఈస్వామి సామాన్యశాస్త్రాలతోబాటు వేదాంతశాస్త్రాన్నికూడా అభ్యసించి దాని అర్థచింతనతో కలిగే పరమరసాన్ని అనుభవిస్తూ వేంచేసియున్నారు. కవులమార్గాన్ని అనుసరిస్తూ భగవద్విషయంగానూ, ఆచార్యుల విషయంగానూ ద్రావిడప్రబంధాలకి భాషాంతరీకరణంగానూ అనేకగ్రంథాలని రచించి ప్రకటించిన ఈస్వామి వెనుకచెప్పిన తమ అనుభవానికి ప్రకటనమార్గంగా వేదాంతగ్రంథాలని రచించడంలోనూ అభినివేశం గలవారై విద్వాంసులకందరికీ ప్రీతిపాత్రులైనారు.

ఈస్వామి, తమచేత రచించబడి కొన్నిసంవత్సరాలపూర్వం ప్రకాశింపజేయబడిన 525 శ్లోకాలుగల అన్నివిధాలా సుందరమైన సన్మతకారికావళి ద్వారా, విశిష్టాద్వైతసిద్ధాంతప్రమాణప్రమేయాలని నిరూపించి, విషయాలని సంగ్రహంగానూ, స్పష్టంగానూ సందేహంలేకుండా తెలుసుకోవాలనుకున్నవాళ్ళకి చాలా ఉపకారంచేసేరు.

ఇప్పుడు శ్రీశారీరకకారికావళీ అనేపేరుతో ప్రకాశింపజేసిన ఈస్వామివిరచితగ్రంథం సన్మత-కారికావళివలెనే విద్వాంసులమనస్సులని ఆకర్షించగలదు. ఇందులోనున్న కారికలు (శ్లోకాలు) బ్రహ్మసూత్రాల్లోనున్న ఒక్కొక్కసూత్రానికీ అంతరార్థాన్నీ, శ్రీభాష్యాన్ననుసరించి వివరిస్తున్నాయి. శ్రీభాష్యాన్ని అధికరించినవారికి ఆయాసూత్రాలఅర్థం మనస్సులో దృఢంగా నాటుకోవడానికి సులభమైన మార్గం అవసరంగా ఉన్నది. అటువంటి అవసరాన్ని పరిపూర్ణంగా తీరుస్తోంది ఈ శ్రీశారీరకకారికావళీ గ్రంథం. ఒక్కొక్క అధికరణంలోనూ వెనుకటి అధికరణసంగతికూడా చెప్పబడుతోంది.

అంతేకాదు, ఈస్వామే శారీరకాధికరణముక్తావళీ అనే పద్యరూపమైన గ్రంథాన్నొకదాన్ని రచించేరు. ఈగ్రంథంలో ఒక్కొక్కశ్లోకంలోనూ శారీరకశాస్త్రమైన బ్రహ్మసూత్రాధికరణాలకి అర్థం సూక్ష్మంగా చెప్పబడింది. కాంచీవరదరాజస్వామిగురించిన స్తుతికూడా చెయ్యబడుతోంది. ఒక్కొక్కశ్లోకంలోనూ నాలుగోపాదం ప్రత్యేకంగా ఉంటుంది. ఒక్కొక్క అధ్యాయంలో ఉన్న శ్లోకాల్లో నాలుగో పాదం వేరుగా ఉంటుంది. ఇప్పుడు ఈగ్రంథంలో మొదటధ్యాయం చివరగానున్నట్టుగా చేర్చబడింది. ఈవిధంగానే ఒక్కొక్క అధికరణార్థాన్నీ స్పష్టపరిచే "అధికరణార్థసంగ్రహం" అనే గద్యరూపమైన గ్రంథం ఒకటి ఈస్వామివారిచేత రచించబడి ప్రసిద్ధిపొందింది. ఇదికూడా శ్రీవైష్ణవసుదర్శనపత్రికలో వరుసగా ప్రకటించబడింది.

సన్మతకారికావళిలాగే శ్రీశారీరకకారికావళికి, శ్రీశారీరకాధికరణముక్తావళికీ శ్రీవైష్ణవసుదర్శన పత్రికాధిపతికూడా వేదాంతప్రమేయాల్లోనూ సంప్రదాయవిషయాల్లోనూ లోతైన గంభీరమైన పరిచయం గలవారైన శ్రీకృష్ణస్వామిఅయ్యంగార్ స్వామి అందమైనరీతిలో తమిళంలో వివరణం చేసి అచ్చువేయించడం మూలంగా ఈగ్రంధాల ఉపకారకత్వాన్ని అధికంచేసేరు.

ఈ కోళ్లియాలంస్వామి విద్వాంసులకీ, ఆచార్యులకీ, సంపూర్ణమైన గౌరవనీయతకీ స్థానమైన శ్రీవైష్ణవ కుటుంబానికి చెందినవారు. వీరు పరంపరాప్రాప్తమైనవేదాంతపరిశీలననీ, ప్రవచనాలనీ వారి తండ్రిగారి దగ్గరనుంచీ జరుగుతూవస్తున్నవాటిని చేస్తూవచ్చినవారు. శ్రీ శ్రీనివాసాచార్యస్వామి ఇదివరకే (ఈ గ్రంధాన్ని రచించడానికి పూర్వం) ఎన్నోగ్రంధాలని రచించేరు. వాధూలశ్రీనివాసాచార్యులవారి యతీంద్రమతదీపికకి సారాన్ని వీరు సరళమైన మధురమైన శైలిలో 525 సంస్కృతశ్లోకాల్లో రచించేరు. ఈగ్రంధం సన్మతకారికావళి అనే పేరుతో (ఇది ప్రస్తుతం శ్రీ సుదర్శనులనే పేరుగల శ్రీమాన్ కృష్ణస్వామివారి ప్రకాశనంగా) లభిస్తోంది. ఇది అనేకమందివిద్వాంసులచేత చాలాగొప్పదైనగ్రంధంగా ప్రశంసించబడింది. శ్రీమద్రామానుజుల విశిష్టాద్వైత వేదాంతాన్ని ఈ గ్రంధం చాలామధురమైన శైలిలో తెలియజేస్తుంది. మనస్వామి భగవానుడు, లక్ష్మీదేవి, శ్రీమద్రామానుజులు, శ్రీవేదాంతదేశికులనుగురించి కవితాసౌరభాన్ని వెలువరించే స్తోత్రాలనీ రచించేరు. ఇవి స్వరూపాద్యష్టకస్తుతి, శ్రీకృష్ణమంగళమాలిక, శ్రీరామానుజదేశికస్తోత్రాలు అనేపేరుతో వెలిసేయి.

ఈ గ్రంధానికివివరణంగా తమిళంలో తిరుచ్చిరాపల్లివాసులూ, శ్రీవైష్ణవసుదర్శనం పత్రికా

సంపాదకులూ, రామానుజసిద్ధాంతంమీద మహాభక్తిశ్రద్ధలుగలవారూ, గొప్పవిద్వాంసులూ, తెన్నాచార్య సంప్రదాయాన్ని దృఢంగా పరిరక్షించడానికి కంకణం కట్టుకున్నవారూ అయిన శ్రీకృష్ణస్వామి అయ్యంగార్ M.A., B.L వారు రచించిన వివరణం ఐదుసంవత్సరాలు తమిళంలో ప్రతీనెలా శ్రీవైష్ణవసుదర్శనం పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. దాసుడు అస్మదాచార్యులు శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులవారి దగ్గర శ్రీభాష్యకాలక్షేపం అయినతరువాత, శ్రీభాష్యంమీద మరికొంత కృషి చేస్తున్నప్పుడు ఈగ్రంథాన్ని చదవడం తటస్థించింది. తమిళభాషతోనూ, తమిళభాషాక్షరాలతోనూ పరిచయం అంతగాలేనివారికి దీన్ని అందిస్తే శ్రీభాష్యాన్ని తెలుసుకోవాలనుకునే వారికి మరికొంత ఉపకరిస్తుందని అనిపించి దీన్ని తెలుగులోకి అనువదించడం జరిగింది. ***దీనిని తెలుగులోకి అనువదించడానికి సహృదయంతో అంగీకరించిన శ్రీమాన్ ఉ.వే.ప్ర. కృష్ణస్వామి అయ్యంగారికి నాహృదయపూర్వకమైన ధన్యవాదాలు.*** ఆ తెనుగుసేత ఈ గ్రంధంలో చేర్చబడింది. ఈ గ్రంధం, దాని భాషాంతరీకరణం విశిష్టాద్వైతాన్ని అభ్యసించేవారికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. ఈ ప్రయత్నంలో ఎంబెరుమానారుల కటాక్షం పూర్తిగాఉండి, మోక్షచింతనపరుల ఆదరాన్ని అందుకోవాలని మా ఆచార్యులైన మహామహోపాధ్యాయ, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యస్వామివారినీ, వారిద్వారా శ్రీమన్నారాయణుడినీ, శ్రీమద్రామానుజులవారినీ కటాక్షించమని ప్రార్థిస్తున్నాను. దాసుడి ఈప్రయత్నాన్ని సహృదయులూ, పండితులూ స్వీకరించాలని దాసుడు ప్రార్థిస్తున్నాడు. ఇందులో పలికినవి చిలకపలుకులే అయినా, పలకడంలో దొర్లిన దోషాలని అవిజ్ఞాతాలుగా భావించి క్షమించమని దాసుడి విన్నపం. ఈగ్రంధాన్ని మా ఆచార్యులూ, దాసుడికి దేహబంధువూ అయిన మహామహోపాధ్యాయ ఉ.వే.ప్ర. శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యస్వామివారి శ్రీపాదపద్మాలమీద సమర్పిస్తున్నాను.

హైదరాబాదు. భాగవతదాసానుదాసుడు
మే 2009. శ్రీభాష్యం శ్రీనివాసాచార్య రామానుజదాసుడు

శ్రీః

శ్రీమత్ప్రణతార్తిహరవరదపరబ్రహ్మణే నమః॥

శ్రీమన్నాథయామునభగవద్రామానుజవేదాన్తదేశికేభ్యో నమః॥

శ్రీమతే రాఘవార్యమహాదేశికాయ నమః॥

శ్రీమతే రఙ్గరామానుజమహాదేశికాయనమః॥

# శ్రీశారీరక కారికావళీ

1. *జగత్సృష్ట్యాదిలీలం తమనఘం సద్గుణాలయం।*
*ఉపాస్యం ముక్తిదం ప్రాప్యం మహాదేవీశమాశ్రయే॥*

శ్రీమతే అప్పలార్యాయ నమః ॥

1. జగత్తునంతటినీ సృష్టించడం, రక్షించడం, నశింపజేయడం అనేలీలని జరిపేవాడును, అజ్ఞానాన్నిపోగొట్టేవాడును, సహజంగా అత్యుత్కృష్టమైనకల్యాణగుణాలుగలవాడును, బ్రహ్మ విద్యలవల్ల ఉపాసింపబడేవాడును మోక్షప్రదుడును, మోక్షకాములకి ప్రాప్యుడైన పెరుందేవీనాయకుడైన సర్వేశ్వరుడిని శరణంగా ఆశ్రయిస్తున్నాను.

2. *రామానుజాఙ్ఘ్రికమలం భాయాన్మన్మానసే సదా।*
*యదామోదాద్భాతి లోకే నిస్తులం వైష్ణవం కులమ్॥*

2. ఏతామరలచేసువాసితమైన శ్రీవైష్ణవకులం లోకంలోసాటిలేనిదిగ ప్రకాశిస్తోందో, అటువంటి ఎంబెరుమానారులైన శ్రీమద్రామానుజులశ్రీపాదకమలము నామనస్సులో సర్వదా వికసించుచుండు గాక.

3. *త్రయ్యంతార్యపదత్రాణాత్ శ్రేయోదం నేతరద్భువి।*
*యదాలమ్బ్య భవామ్భోధిం తరన్తి సుధియస్సుఖమ్॥*

3. జ్ఞానులు దేన్నాశ్రయించి సంసారసాగరాన్ని సులభంగ దాటుతున్నారో, అటువంటి శ్రీవేదాంతాచార్యుల శ్రీపాదుకలకంటె శ్రేయస్కరమైనది లోకంలో మరొకటిలేదు.

4. *యస్యాహం చరణధ్యానాత్సత్తాం ప్రాప్తోఽస్తకల్మషః।*
*స దదాతు ధియం భాష్యే శ్రీరాఘవగురూత్తమః॥*

4. ఎవరిశ్రీపాదాలని ధ్యానించడంవల్ల దాసుడుదోషాలను పోగొట్టుకొన్నాడో అటువంటి (దాసుని పెద్దతండ్రిగారైన) శ్రీరాఘవాచార్యులు శ్రీభాష్యమందు స్పష్టమైనజ్ఞానమును ప్రసాదింతురుగాక.

5. *వేదాన్తార్థవిచారైకనిష్ఠో యతిపతిర్మహాన్।*
*శ్రీరఙ్గరామావరజః లసతాన్మేఽనిశం హృది॥*

5. వేదాంతరహస్యార్థాలని విచారించడంలో పటిష్ఠులైన కోష్ఠియాళం శ్రీరంగరామానుజ మునులు నామనస్సులో ఎప్పుడును ప్రకాశింతురుగాక.

6. *శ్రీమద్భాష్యాధికరణప్రధానార్థాన్ గురోః శ్రుతాన్।*
*సఙ్గృహ్యాద్య యథాబుద్ధి లిఖామ్యాచార్యవీక్షయా॥*

6. ఆ ఆచార్యులనుండి అధికరించిన శ్రీభాష్యాధికరణాల ముఖ్యార్థాలని సూక్ష్మీకరించి బాగా తెలిసేటట్లు ఆచార్యకటాక్షంతో రచిస్తున్నాను.

7. *పాణ్డిత్యాదిఖ్యాపనాయ నారభే కార్యమీదృశం।*
*కిన్తు భాష్యార్థచిన్తాఖ్యతాత్కాలికఫలేప్సయా॥*

7. పాండిత్యం, కవితాసామర్థ్యం మొదలైనవాటిని ప్రదర్శింపజేయడానికి ఈరచనాకార్యాన్ని దాసుడు ప్రారంభించలేదు. శ్రీభాష్యార్థాలని ఆలోచింపజేయడమనే తాత్కాలికఫలాన్ని కోరుకొనే ఈకార్యంలో దిగేను.

*8.* *స్యాదేవ మహతాం ప్రీత్యై బాలిశస్యాస్య భాషితం।*
*నదదాతి శుకీయా వాక్ బుధానామపి కిం ముదమ్॥*

8. అల్పుడినైన దాసుడిమాట పెద్దలకికూడ ఆనందాన్ని కలిగించాలి. చిలుకపలుకులు జ్ఞానులకి ఆనందాన్నివ్వడంలేదా!

*9.* *స్వశిష్యజైమిన్యృషిణా వ్యాసో వేదార్థనిర్ణయం।*
*షోడశాధ్యాయసూత్రౌఘైః కారయామాస తత్త్వవిత్॥*

9. పరావరతత్త్వాలని తెలిసిన వ్యాసమహర్షి పూర్వమీమాంసాశాస్త్రాన్ని పదహారధ్యాయాల్లో సూత్రాలుగా తమశిష్యులైన జైమినిమహర్షిద్వారా వేదంతాలూకు పూర్వభాగార్థాన్ని నిశ్చయించేరు.

*10.* *ద్వియుగాధ్యాయశారీరశాస్త్రే వ్యాసేన విష్ణునా।*
*తేనైవ బ్రహ్మ వేదాన్తవేద్యం సమ్యఙ్నిరూపితమ్॥*

10. రెండురెళ్ళు(నాలుగు) అధ్యాయాలతోనున్న శారీరకశాస్త్రమనబడే బ్రహ్మమీమాంసా శాస్త్రంలో విష్ణుస్వరూపియైన ఆవ్యాసులవారిచేతనే వేదాల ఉత్తరభాగమైన వేదాంతాల్లో చెప్పబడ్డ బ్రహ్మం బాగా వివరించబడింది.

*11.* *వ్యాసావతారో భగవాన్ రామానుజమునిస్స్వయం।*
*తదధ్యాయస్థసూత్రాణాం భాష్యం చక్రేఽద్భుతం మహత్॥*

11. వేదవ్యాసులవారి అవతారమైన స్వామి రామానుజులు(ఎంబెరుమానారులు) తామే ఆశారీరక శాస్త్రాధ్యాయాల్లోఉన్న అన్నిసూత్రాలకీ ఆశ్చర్యకరమైనది, విశేషమైనది అయిన 'శ్రీభాష్యము' అనే సూత్రభాష్యాన్ని కటాక్షించేరు.

*12.* *ఆద్యద్వికేనేశ్వరస్య కారణత్వం సమర్థితం।*
*ఉత్తరేణ ద్వికేనోక్తం సాధనం చ ఫలం క్రమాత్॥*

12. నాలుగధ్యాయాలున్న ఆబ్రహ్మమీమాంసాశాస్త్రంలో మొదటిరెండధ్యాయాల్లోనూ సర్వేశ్వరుడికి కారణత్వం నిరూపించబడింది. తరువాతి రెండధ్యాయాల్లో మొదటిఅధ్యాయం మోక్షసాధనాన్నీ, చివరిఅధ్యాయం మోక్షఫలాన్నీ చూపించేయి.

*13.* *ఆద్యే సమన్వయాధ్యాయే వాక్యతాత్పర్యనిర్ణయాత్।*
*బ్రహ్మణస్సర్వజగతాం కారణత్వం ప్రసాధితమ్॥*

13. నాలుగింటిలో మొదటిదైన (వేదవాక్యాలని బ్రహ్మానికి చక్కగా అన్వయించి చూపించే) సమన్వయాధ్యాయంలో వేదంలోఉన్న కారణవాక్యాల అర్థాన్ని స్పష్టీకరించడంవల్ల బ్రహ్మమే అన్నిలోకాలకీ కారణమని నిరూపించబడింది.

*14.* *తత్రాఽయోగవ్యవచ్ఛేదపాద ఆద్యే నిరూపితం।*
*బ్రహ్మకారణమేవేతి తత్తద్వాక్యవిచారతః॥*

14. నాలుగుపాదాలున్న ఆమొదటధ్యాయంలోని మొదటిపాదం, అయోగవ్యవచ్ఛేదపాద మనబడుతుంది. అందులో బ్రహ్మం కారణంగా ఉన్నదని చెప్పే అయోగవ్యవచ్ఛేదం**తాలూకు అర్థం

ఆయావేదవాక్యాలని పరిశీలించడంద్వారా నిరూపింపబడింది.

**[ ఒకచోట ఒకవస్తువు లేక ఒకస్వభావము 'లేదు' అనే వాదాన్ని 'ఆవస్తువు అక్కడ ఉన్నది' అని సాధించడం అయోగవ్యవచ్ఛేదం అవుతుంది. ఉదా- శంఖంలో తెల్లదనంలేదు అనేవాళ్ళనిగురించి 'శంఖంతెల్లగానే ఉన్నది' అని సాధించడం. ఒకవస్తువు లేక స్వభావము అనేకస్థలాల్లోఉన్నది అనేవాళ్ళనిగురించి, ఒకచోటే ఉన్నది అని సాధించడం అన్యయోగవ్యవచ్ఛేదం అవుతుంది. ఉదా- విలుకాళ్ళు అనేకులు ఉన్నారు అన్నప్పుడు 'రాముడొక్కడే విలుకాడు' అనడం. మొదటిపాదంలో బ్రహ్మానికి కారణత్వం (కారణమవడం అనే స్వభావం) లేదు అనేవాళ్లవాదానికి ప్రతిగా బ్రహ్మం జగత్కారణత్వము గలిగినదే అని నిరూపించడంవల్ల ఇది అయోగవ్యవచ్ఛేదపాదం అని చెప్పబడుతోంది. "బ్రహ్మంకంటే, భిన్నమైన వస్తువులు కారణం" అని చెప్పేవాళ్ళని గురించి "ఆవస్తువులు కారణంగాదు, బ్రహ్మమే జగత్కారణము" అని నిరూపించబడడంవల్ల ఆపైనున్న మూడుపాదాలూ అన్యయోగవ్యవచ్ఛేదపాదాలు అనబడుతున్నాయి]**

*15.* *ఆదావత్ర చతుస్సూత్ర్యా మానానుగుణయుక్తిభిః।*
*శాస్త్రానారమ్భణీయత్వవాదస్సమ్యఙ్నిరస్యతే॥*

*॥ఇతి అవతారికా॥*

15. అందులో మొదటినాలుగుసూత్రాల్లోనే ప్రమాణాలననుసరించిన యుక్తులతో 'ఏకంగా బ్రహ్మ మీమాంసాశాస్త్రాన్నే ఆరంభించవీలుగాదు' అనేవాదం క్షుణ్ణంగా ఖండింపబడుతోంది.

అవతారిక సంపూర్తియైనది.

## *॥ జిజ్ఞాసాధికరణమ్ ॥1-1-1 ॥*

### *॥ సి. సూ.॥ ఓం॥ అథాతో బ్రహ్మజిజ్ఞాసా ॥ 1-1-1 ॥*

***అథ=*** (కర్మవిచారమునకు)తరువాత, ***అతః=*** ఆవిచారము కారణముగ, ***బ్రహ్మజిజ్ఞాసా=*** బ్రహ్మమును తెలుసుకొనగోరుట (చేయవలెను).

16. *వృత్తాదల్పాస్థిరఫలకర్మజ్ఞానాదనంతరం।*
*తత ఏవానంతఫలం బ్రహ్మ జిజ్ఞాస్యముచ్యతే॥*

16. ఇకపైన బ్రహ్మసూత్రాల్లో ఉన్న ఒక్కొక్క అధికరణానికీ అందులోని సూత్రాలకీ అర్థం వివరించబడుతోంది. మొదట సూత్రార్థం, అధికరణంలో ఏమి చేయబడుతోందో (అధికరణకృత్యము) చూపబడుతోంది. ఆతరువాత పూర్వపక్షివాదం వివరింపబడుతుంది. ఆపైన సిద్ధాంతం నిరూపింపబడుతుంది. అందులో మొదట జిజ్ఞాసాధికరణంలోనున్న ఒకేసూత్రంతాలూకు అర్థం మొదటిశ్లోకంలో వివరింపబడుతోంది.

సాంగంగా వేదంలోఉన్న పూర్వోత్తరభాగాలని అధ్యయనం చేసినవాడు మొదట పూర్వభాగార్థాన్ని నిర్ణయించే పూర్వమీమాంసాశాస్త్రవిచారంలో ప్రవేశించేడు. ఆవిచారంవల్ల పూర్వభాగంలో వివరించబడ్డ కర్మలు అల్పం, అస్థిరం అయిన ఫలాలను ఇస్తాయని తెలుసుకొన్నాడు. *"తద్యథేహ కర్మచితోలోకః క్షీయతే। ఏవమేవాముత్రపుణ్యచితో లోకః క్షీయతే॥* (ఛాం. 8-1-6) (ఎలా ఈజన్మలో కర్మలవల్ల పొందిన లోకం నశిస్తుందో అలాగే మరుజన్మలోకూడా, పుణ్యంవల్ల పొందబడే లోకంకూడా నశిస్తుంది.), *"అంతవదేవాస్య తద్భవతి"* (బృహ-5-8-10) (కర్మలవల్ల వీడుపొందేఫలము నశించేదే అవుతోంది.), *"నహ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్"* (కఠ. 2-10) (నిశ్చయంలేని(స్థిరతలేని) కర్మలవలన స్థిరమైన మోక్షాన్ని పొందడం కుదరదుగదా!) *"ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపాః"* (ముండక.1-2-7) (యాగాలనబడేవి దృఢత్వంలేని పడవలు.), *"నాస్త్యకృతః కృతేన"* (ముండక.1-2-12) (ఒకడిచేత చేయబడిన అనిత్యకార్యాలవల్ల, ఎవరిచేతా చేయబడని నిత్యఫలం లభించదు) అని కర్మలు అల్ప, అస్థిరఫలాలిచ్చేవేనని వేదాంతవాక్యాలవల్ల తెలుసుకున్నాడు.

"నపునర్మృత్యవే తదేకం పశ్యతి" (తిరిగి సంసారాన్ని పొందకుండడానికి సాటిలేని ఆపరమపురుషుడిని చూస్తాడు.) "నపశ్యో మృత్యుం పశ్యతి" (ఛాం. 8-16-2) (ఆతన్ని చూసినవాడు మరి సంసారాన్ని తిరిగి చూడడు), "స స్వరాడ్భవతి" (ఛాం. 7-15-2) (వాడు స్వతంత్రుడు (కర్మకి పరతంత్రుడు కానివాడు) అగును), "తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి" (పు.సూ.) (ఈవిధంగా ఆతడిని తెలుసుకున్నవాడు ఈజన్మలోనే తెలుసుకొనలేనివాడిని పొందుతాడు), "తేన అమృతత్వ మేతి" (శ్వే.1-6) (వాడివల్ల నాశంలేని స్థితిని పొందుతాడు),అని బ్రహ్మజ్ఞానం నాశంలేనిఫలాన్ని పొందిస్తుందనీన్నీ, వేదాంతవాక్యాలవల్ల ఊర్ధ్వగతిని పొందుతాడనీతెలుసుకొన్నాడు. ఈజ్ఞానంస్థిరంగాఉండడానికి, వేదాంతవాక్యవిచారరూపమైన శారీరకమీమాంసా శాస్త్రవిచారం చేయనారంభిస్తాడు. అందుచేత అల్పం, అస్థిరమైన కర్మలని గురించి తెలుసుకున్నతర్వాత ఆకర్మలు, అల్పం, అస్థిరమైన ఫలాన్నిస్తాయని నిశ్చయించుకున్నకారణంవల్ల అనంతఫలమైన బ్రహ్మన్ని తెలుసుకోవాలని బ్రహ్మసూత్రాల్లో మొదటి సూత్రంవల్ల చెప్పబడింది.

*17.* *వ్యుత్పత్త్యసంభవాధీనశాస్త్రానారాంభచోదనం।*
*నిరస్యతేऽత్ర జిజ్ఞాసాధికృతౌ సూపపత్తిభిః॥*

17. జిజ్ఞాసాధికరణంతాలూకు అధికరణకృత్యం ఇక్కడ చెప్పబడుతోంది. ఒకపదానికీ, వస్తువుకీ ఉన్నసంబంధాన్ని మొట్టమొదట తెలుసుకోవడం వ్యుత్పత్తి అనబడుతుంది. బ్రహ్మన్ని గురించి ఎవళ్ళకీ వ్యుత్పత్తే తెలియకపోవడంవల్ల అదేవిషయమైన బ్రహ్మమీమాంసాశాస్త్రాన్ని ఆరంభించడానికి వీలుగాదని పూర్వపక్షి ఆక్షేపిస్తే, ఈజిజ్ఞాసాధికరణంలో ఆఆక్షేపం చక్కనికారణాలని చూపి నిరసించడం జరుగుతోంది.

*పూర్వపక్షః*

*18.* *వ్యుత్పత్త్యసంభవాద్వృద్ధవ్యవహారానపేక్షయా।*
*కార్యార్థజ్ఞానహేతుత్వాత్ వ్యవహారస్య తాదృశే॥*

*19.* *కార్యార్థ ఏవ శబ్దస్య ప్రామాణ్యమితి నిశ్చయః।*
*బ్రహ్మణస్సిద్ధరూపత్వాత్మానం నాత్ర శ్రుతిర్భవేత్॥*

**20.* *అతశ్చ తద్విచారో నకార్యోऽత్రేతి మతం న సత్।*

(*- ఈగుర్తు లేకపోతే పూర్తిశ్లోకానికి అర్థం వివరింపబడుతోందనిన్నీ, అంకెకు ముందర ఉంటే శ్లోకపు పూర్వభాగానికిన్నీ, అంకెకు వెనకని గుర్తుంటే శ్లోకపు ఉత్తరార్థానికిన్నీ అర్థం వివరింపబడుతోందని గ్రహించాలి)

18-*20. **పూర్వపక్షం.** ఇకమీదట పూర్వపక్షం. **"వ్యుత్పత్తి"**తో మొదలై **"న కార్యః అత్ర"** అనే వరకూ వివరించబడుతోంది. జ్ఞానవృద్ధులకు వ్యుత్పత్తి ఉంటుంది. జ్ఞానవృద్ధుడు **"గోవును తీసుకు రా"** అని మరొకడికి చెప్తాడు. వాడుకూడా, దాన్ని తీసుకువస్తాడు. **"గోవును కట్టు"** అన్నాడు మొదటివాడు. రెండోవాడు దాన్ని కడతాడు. ఇది జ్ఞానంలేని చిన్నపిల్లడిని మనసులోనుంచుకొని చెప్పినది. రెండు వాక్యాల్లోనూ **'గోవు'** అనే శబ్దంరావడం, రెండు పనుల్లోను గోవును విషయంగాగమనించి అక్కడ కనబడే ప్రాణి **'గోవు'** అనబడు తుందనీ, మొదటివాక్యంలో **'తీసుకొని రా'** అన్నపుడు తీసుకొనిరావడాన్ని చెప్తుందనీ, రెండోవాక్యంలో **'కట్టు'** అనేపదం కట్టడాన్నిగురించినదనీ పిల్లవాడు తెలుసుకుంటున్నాడు. ఈవిధంగా వృద్ధవ్యవహారం అనేది ఎన్నో కార్యాలని గురించిన జ్ఞానం ఉండడంచేతనే వ్యుత్పత్తిని కలిగిస్తోందనీ స్పష్టం. అందువల్ల శబ్దమనేది ముందు చెప్పినట్లుగ కార్యవిషయంలోనే ప్రమాణం (ఉండడం అనే జ్ఞానాన్ని కలిగించడం) అయిందనీ తెలుస్తోంది. బ్రహ్మమైతే, అది కార్యం(ఒకడిచేత చెయ్యబడేది) కాదు, సిద్ధంగా ఉన్నది. అందువలన వేదాంతం అనబడే శబ్దం దాన్నితెలిపే ప్రమాణంగాదు. అంచేత ఇది బ్రహ్మవిచారం చేయతగిందిగాదని పూర్వపక్షం. ఈపూర్వపక్షి

భావం సరైనదిగాదని *"ఇతి మతం న సత్"* అని చెప్పడంచేత సిద్ధాంతం నిశ్చయం చెయ్యబడుతోంది.

**సిద్ధాన్తః**

20* పురస్థితాన్ తత్తదర్థాన్ నిర్దిశ్యాఽఙ్గులిముద్రయా॥
21. తత్తద్వాచకశబ్దాంశ్చ ప్రయుజ్య జనకాదయః।
బాలాన్ వ్యుత్పాదయన్తీమమవేహీత్యాదియత్నతః॥
22. అతశ్శబ్దార్థశక్తిజ్ఞాస్తే భవన్తి క్రమాత్స్వయమ్।
ఏవమాదిప్రకారేణ సిద్ధే వ్యుత్పత్తిసంభవాత్॥
23. ప్రామాణ్యమాగమాన్తానాం సిద్ధే బ్రహ్మణి సుస్థితమ్।
అతశ్చ బ్రహ్మమీమాంసా కార్యేవేతి సమర్థితమ్॥

20*- 23. ఈమూడున్నర శ్లోకాల్లో సిద్ధాంతం పూర్తిచెయ్యబడుతోంది. కార్యాన్ని తెలిపే వాక్యాల వల్లనే వ్యుత్పత్తి కలుగుతోంది అనడం తప్పు. లోకంలో తల్లిదండ్రులు మొదలైనవాళ్ళు తమవేలితో ఎదురుగా ఉండే ఎన్నో వస్తువులని చూపి, 'ఈయన నీతాత', 'ఈమె నీనాయనమ్మ',' ఇది చంద్రుడు' వంటి ఆయా వస్తువులని గురించిన శబ్దాలని చెప్పి 'దీనిని చూడు' , 'దానిని చూడు', అని చూపే ప్రయత్నం చేయడంవల్ల పిల్లలకి తాత, నాయనమ్మ, చంద్రుడు మొదలైన పదాలకి అర్థాలకీ ఉండే సంబంధం గురించిన జ్ఞానాన్ని కలిగిస్తున్నారు. ఈవిధంగా తాత, నాయనమ్మ మొదలైన సిద్ధవస్తువులను గురించి ఒకటొకటిగా వరసగా తమంతట తామే తెలుసుకోగలవారిగా పిల్లలున్నారు. ఇలా సిద్ధవస్తువును చెప్పే వాక్యాలవల్ల, వ్యుత్పత్తి కలుగుతుందని తెలుసుకొంటాం. అంచేత వేదాన్తవాక్యాలతో సిద్ధవస్తువైన బ్రహ్మవిషయంలో జ్ఞానం కలగ వచ్చు. అంచేత, ఆవాక్యాలు బ్రహ్మాన్ని తెలిపే ప్రమాణాలైనాయి. ఇందువల్ల బ్రహ్మాన్ని గురించిన విచారించ తగినదే అనినిరూపింపబడింది.

24. ఏవమాక్షేపసిద్ధాంతౌ సూచితౌ సూత్రఆదిమే।
విచారవిషయత్వస్య బ్రహ్మణ్యత్రప్రదర్శనాత్॥

॥ ఇతి జిజ్ఞాసాధికరణమ్ ॥

24. ఈపూర్వపక్షం, సిద్ధాంతం సూత్రంలో ఎక్కడ చెప్పబడ్డాయి అనే ప్రశ్న రావచ్చును. దానికి సమాధానము చెప్తోందీశ్లోకం. *'బ్రహ్మ జిజ్ఞాసా'* (బ్రహ్మాన్ని తెలుసుకోవటం కోరతగింది) అని బ్రహ్మాన్ని విచారించాలి అని ఈసూత్రంలో చూపడంచేత "దీనిని విచారించకూడదు" అని ఒక ఆక్షేపం ఉండి, ఇలా సిద్ధాంతం చేయబడుతోందని ఈసూత్రంలో సూచింపబడుతోంది. *"సూచనాత్ సూత్రమ్"* (సూచించటంచేత సూత్రం) అని సూత్రలక్షణం! ఇలా ఇకమీదట ఇంకా ఎన్నో సూత్రాల్లో పూర్వపక్షం, సిద్ధాంతం సూచన చేయబడుతున్నాయని తెలుసుకోవచ్చు.

*జిజ్ఞాసాధికరణం సంపూర్ణమ్.*

## ॥ జన్మాద్యధికరణమ్ ॥1-1-2 ॥

### ॥ సూ ॥ జన్మాద్యస్య యతః ॥ 1-1-2 ॥

***అస్య=*** (కార్యరూపమైన) ఈలోకానికి, ***జన్మాది=*** సృష్టించటం, రక్షించటం, సంహరించటం అనబడే కార్యాలు, ***యతః=*** దేనివల్ల కలుగుతున్నాయో, (అదే బ్రహ్మం అని వేదవాక్యంలో లక్షణంగా చెప్పగలం)

25. లక్షణం కిం బ్రహ్మణోఽస్య యత్ జిజ్ఞాస్యతయోచ్యతే।

*ఇత్యాకాంక్షాపూరణాయ బ్రహ్మలక్షణముచ్యతే॥*

26. *యత ఇత్యాదివాక్యాని పఠ్యన్తే తైత్తిరీయకే।*

*యతోజన్మ స్థితిలయా భవన్తి జగతోఽస్య తత్॥*

*27. *బ్రహ్మేతి లక్షణం జన్మకారణత్వాది కథ్యతే।*

25-*27. మొదటిసూత్రంలో తెలుసుకోవలసినదిగా చెప్పబడ్డ బ్రహ్మాన్ని తెలుసుకోడానికి ఉపకరించే లక్షణం ఏది? అనే ప్రశ్న వచ్చినపుడు, దానికి సమాధానంగా, బ్రహ్మలక్షణాన్ని ఈరెండో సూత్రం చెప్తోంది. ***"యతోవా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి । తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి॥*** (తై. భృ. 1) [దేనినుండి ఈలోకాలు సృష్టింపబడ్డాయో, దేనివలన నిలబడి ఉంటున్నాయో, (జీవించిఉన్నవీటిని) ప్రళయంలో ఏది లయంచేసుకొంటుందో, దానిని తెలుసుకోవాలి. అదే బ్రహ్మం.] అని తైత్తిరీయంలో, వేదం బ్రహ్మలక్షణాన్ని వివరించిందని ఈఅధికరణానికి అర్థం.

పూ.27* *బ్రహ్మలక్షణతో వాక్యాత్ ప్రతిపత్తుం నశక్యతే॥*

28. *విశేషణత్వేన వోపలక్షణత్వేన వా తథా।*

*జన్మాదీనాం బ్రహ్మణోఽస్య లక్షణత్వం నసంభవేత్॥*

29. *విశేషణత్వపక్షే హి తేషాం వ్యావర్తకత్వతః।*

*వ్యావర్తితం త్రిభిస్తైశ్చ బ్రహ్మఽనేకం భవేత్తథా॥*

30. *ద్వితీయేఽప్యుపలక్ష్యస్య జ్ఞాతాకారో హ్యపేక్షితః।*

*బ్రహ్మణస్తదభావాచ్చ పక్షోఽప్యేష న సంగతః॥*

31. *ఇత్థం లక్షణతో బ్రహ్మ ప్రతిపత్తుం నశక్యతే।*

*అతో జిజ్ఞాస్యత్వమస్య నేతి వాదోఽసమఞ్జసః॥*

**పూర్వపక్షం** వేదవాక్యంనుంచి బ్రహ్మ లక్షణాన్ని తెలుసుకొనడం సాధ్యంగాదు. ఒకవాక్యం ఒక వస్తువుకి లక్షణాన్ని చెప్పినప్పుడు రెండువిధాలుగ చెప్పవచ్చు. విశేషణలక్షణంతో చెప్పడం ఒకపద్ధతి. ఉపలక్షణ లక్షణంతో చెప్పడం మరోపద్ధతి. ***"సాస్న- గంగడోలు (మెడక్రింద వ్రేలాడుతున్న తోలు) మొదలైనవి గలది ఎద్దు"*** అనే వాక్యం ఎద్దుతాలూకు అసాధారణవిశేషాన్ని తీసుకొని దాన్నిలక్షణంగాచెప్పడంవల్ల ఈవాక్యం మొదటివర్గానికి చెందినదవుతుంది. ***"పక్షులు కూర్చునే స్థలం దేవదత్తుడి స్థానం"*** అన్న వాక్యం పక్షుల సంబంధం అనే ఉపలక్షణంతో దేవదత్తుడి స్థలాన్ని ఉపలక్షించేదిగనుక ఈవాక్యం రెండోవర్గానికి చెందింది. విశేషణలక్షణమంటే - ఒకలక్షణంతో లక్ష్యాన్ని (లక్షణంనిర్దేశించే వస్తువుని) తెలుసుకొనేటప్పుడు ఆజ్ఞానంలో ఆలక్షణంకూడ తప్పకుండ విషయంగాఉండడం. గంగడోలు అనేలక్షణంతో పశువును చెప్పినపుడు ఆగంగడోలుకూడ తప్పక తెలుసుకోబడడంవల్ల ఇదివిశేషణలక్షణం అవుతుంది. ఉపలక్షణ లక్షణమన్నది - ఒక లక్షణంతో లక్ష్యాన్ని తెలుసుకొనేటప్పుడు ఆతెలుసుకోవడంలో ఆలక్షణంగూడ తప్పకుండ విషయం ఔతుందనే నిర్బంధం లేకుండా ఉండడం. పక్షిసంబంధంతో దేవదత్తుడి సంబంధాన్ని మొదట తెలుసుకొన్నతరువాత, ఆస్థానాన్ని తెలుసుకొన్నప్పుడు అన్నిపక్షులసంబంధాన్ని తెలుసుకోవాలనే నిర్బంధం లేకపోవడంవల్ల, పక్షిసంబంధం అనబడడం ఈఉపలక్షణలక్షణమైంది. **"యతోవా ఇమాని భూతాని జాయన్తే"** అని ప్రారంభమయేవాక్యం రెండువిధాలుగా బ్రహ్మాన్ని తెలియచెప్పలేదు. ***"లోకానికి సృష్టికారణం, స్థితికారణం, లయకారణం అయినది బ్రహ్మం"*** అనడం మొదట బ్రహ్మానికి విశేషణలక్షణమనడానికి

వీలుగాదు. విశేషణాలు ఒక్కొక్కటీ, సహజంగానే విశేష్యాన్ని మిగతావస్తువుల నుంచి వేరుచేసేవిగ ఉంటాయి. ***"సగంకొమ్ములున్న పశువు, కొమ్ములేని పశువు, పూర్తికొమ్ములున్న పశువు"*** అనే వాక్యాలని తీసుకొని చూస్తే, ***సగంకొమ్మున్న పశువు*** అన్న విశేషణంతో అది ***కొమ్ములేని పశువు***కంటేనూ, ***పూర్తికొమ్ములున్న పశువుకంటేనూ*** వేరైనదిగా తెలుసుకొంటాం. అందుచేత, ఈవాక్యం మూడు పశువులను చెప్పడమేగాని ఒకపశువుని తెలియ జేయదు. అలాగే, ***'సృష్టికారణం, స్థితికారణం, లయకారణం అయిన బ్రహ్మం'*** అన్న వేదాంతవాక్యంకూడా విశేషణపద్ధతిలో బ్రహ్మలక్షణాన్ని చెప్పేదైనా, మూడు బ్రహ్మములని సిద్ధింపజేస్తుందే తప్ప ఒకబ్రహ్మాన్ని సిద్ధింపచెయ్యదు. ఇక్కడ ఒక ఆక్షేపం రావచ్చును. ***"నల్లనివాడై, యౌవనవయసు గలవాడై, ఎఱ్ఱటికళ్ళున్నవాడై, తనఎత్తుకుతగిన శరీరం మొదలైనవిగల సమపరిమాణంగలవాడు దేవదత్తుడు"*** అనేవాక్యంలో విశేషణాలెన్నోఉన్నా, ఒకే దేవదత్తుడికి వర్తిస్తున్నాయి గదా? అలాగే వెనకచెప్పిన వేదవాక్యంలోకూడా ఒకేబ్రహ్మం సిద్ధించవచ్చుకదా? అంటే, అనేకవిశేషణాలున్న దేవదత్తుడు ఒకడేఅవడం ప్రత్యక్షంగా చూడడంవల్ల ఆవాక్యంలోని దేవదత్తుడు ఒకడుగా సిద్ధించడం జరిగింది. బ్రహ్మంవిషయంలో, ప్రత్యక్షంలోగాని, లేకమరోప్రమాణంచేతగాని ఒకడే అని సిద్ధించలేదు. అందుచేత, వేదవాక్యంచెప్పేది ముగ్గురు బ్రహ్మలనే అవుతుంది.

ఇక ఆవేదవాక్యం ఉపలక్షణపద్ధతిలో బ్రహ్మలక్షణాన్ని చెప్తోందని అనడంగూడ కుదరదు. ***"పక్షులుండే స్థలం దేవదత్తుడి స్థలం"*** అనే ఉపలక్షణలక్షణవాక్యంలో స్థలంగాఉండే స్వభావమున్న ఒక ఆకారాన్ని, మొదటే అటువంటిస్థలాన్ని తెలిసినవాడికి మాత్రమే పక్షిసంబంధం అనబడే ఉపలక్షణం ***'ఈస్థలం దేవదత్తుడికి చెందినది'*** అని మరొకఆకారాన్ని తెలియజేస్తుంది. ఈవిధంగా ఉపలక్షణస్థలాని కెప్పుడూ పూర్వప్రతిపన్నం అయిన ఆకారం (ముందరే తెలిసిఉన్న అంశం) ఒకటి అవసరం అవుతోంది. అలాగే జన్మకారణత్వం, స్థితి కారణత్వం, లయకారణత్వం అనే ఉపలక్షణాలతో బ్రహ్మశబ్దార్థమైయుండడం అనే ఆకారాన్ని వేదవాక్యము తెలియజేయవలసినా, ఆబ్రహ్మనికి పూర్వప్రతిపన్నాకారం ఒకటి అవసరం అవుతోంది. బ్రహ్మవిషయంలో ముందుగానే తెలిసున్న అటువంటిఆకారం ఏదీలేదు. అందుచేత, ఉపలక్షణపద్ధతిలోకూడా, వేదవాక్యం బ్రహ్మ లక్షణాన్ని చెప్పలేదు. అందుచేత ఇంతవరకూ చెప్పినదాని వల్ల, విశేషణపద్ధతిలోగాని, ఉపలక్షణపద్ధతిలోగాని వేదవాక్యం బ్రహ్మలక్షణాన్ని చెప్పలేదనడంవల్ల బ్రహ్మని లక్షణాలచేత తెలుసుకోవీలుకాకపోవడంవల్ల బ్రహ్మం (వెనకటిసూత్రంలో చెప్పబడినదానిలాగ) విచారింపతగినదిగాదని స్పష్టమైంది. ఇంతవరకూ పూర్వపక్షం. ఈ పూర్వపక్షవాదం తప్పని సిద్ధాంతంలో నిరూపించబడుతోంది.

***సి.32.*** *అవిరుద్ధైః కాలభేదాజ్జన్మకారణతాదిభిః।*
*విశేషణైర్బ్రహ్మణోఽన్యబహుత్వాపాదనం న సత్॥*

***33.*** *శ్రీపతిత్వాదినాఽన్యత్ర ప్రతిపన్నం చ వస్తు తత్।*
*జ్ఞాప్యతే బ్రహ్మశబ్దార్థతయా తైర్లక్షణైరిహ॥*

***34.*** *తస్మాజ్జన్మ స్థేమలయకారణత్వత్రయం పృథక్।*
*లక్షణం బ్రహ్మణోఽస్య స్యాత్ సంభూయాపి చ తద్భవేత్॥*

*ఇతి జన్మాద్యధికరణమ్.*

32-34. **సిద్ధాంతం.** మొదట విశేషణపద్ధతిలో వేదవాక్యం బ్రహ్మలక్షణాన్ని చెప్పగలిగిందనడం చూద్దాం. విశేషణాలు, వాటికి విరుద్ధమైన విశేషణాలున్న వస్తువులనుండి, వాటి విశేష్యాన్ని వేఱైనదిగా చూపించడంలేదు. **'నల్లనివాడును, యౌవనవయస్కుడును, ఎఱ్ఱనికన్నులు గలవాడును, సమపరిమాణము**

**గలవాడునైన దేవదత్తుడు'** అనే వాక్యంలో విశేషణాలలో ఒకదానికొకటి విరుద్ధాలుకాక పోవడంవల్ల అన్ని విశేషణాలూ ఒకే దేవదత్తుడి గురించినవే. ***"మొండికొమ్ములున్నది; కొమ్ములులేనిది; పూర్తికొమ్ములున్న పశువు"*** అన్న వాక్యాల్లో విశేషణాలు ఒకదానికొకటి విరోధాలవడంతో ఒకేపశువును గురించి చెప్పలేనివిగా ఉన్నాయి. ఒకప్పుడు లోకానికి జన్మకారణమైన బ్రహ్మం, మరొకప్పుడు స్థితికారణంగాను, మరొకప్పుడు లయకారణంగాను ఉండవచ్చును గనుక ఈవిశేషణాల్లో విరోధంలేదు. అందుచేత ఇవన్నీ, ఒకే బ్రహ్మాన్ని చూపుతాయి. అంచేత, దీనివల్ల, విశేషణపద్ధతిలో వేదవాక్యం బ్రహ్మలక్షణాలని చూపతగినదేనని చెప్పగలం. ఇక ఉపలక్షణపద్ధతిలోకుడా, అలాగే చూపగలదని చూస్తున్నాం. ***"హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ"***(పు.సూ.) [భూదేవి, శ్రీదేవి నీభార్యలు.] మొదలైన వేదవాక్యాల్లో శ్రియఃపతిగాఉండడం మొదలైన ఆకారాలున్నవాడని నారాయణుడనే ఒకవస్తువు తెలియబడుతోంది. వీనిని, పూర్వప్రతిపన్నాకారంగా జన్మకారణత్వము, మొదలైన ఉపలక్షణాలచేత శ్రీమన్నారాయణుడి విషయంలో బ్రహ్మశబ్దార్థం అయిన ఆకారాన్ని ***"యతోవా"*** అనిమొదలు పెట్టబడే వాక్యంచేత తెలుసుకోవచ్చుగనుక ఉపలక్షణపద్ధతిలోకూడా వేదవాక్యం బ్రహ్మలక్షణాలని చెప్పగలదని సిద్ధిస్తోంది. అంచేత జన్మకారణత్వం, స్థితికారణత్వం, లయకారణత్వం అనేమూడూ ఒక్కొక్కటిగానో, ఒకటిగానో బ్రహ్మనికి లక్షణాలుకాగలవని సిద్ధాంతీకరింపబడింది. ఒకటిగాఉండి లక్షణమైనప్పుడు బ్రహ్మ సృష్టికారణం గాను, రుద్రుడు లయకారణంగాను అయినారనే సందేహాన్ని పోగొట్టడంతో మూడూవిశేషణాలని ఉపయోగించినవే అయినవి.

*జన్మాద్యధికరణం పూర్తయింది.*

## *॥శాస్త్రయోనిత్వాధికరణమ్॥ 1-1-3 ॥*

### *॥ శాస్త్రయోనిత్వాత్ ॥ 1-1-3 ॥*

***శాస్త్రయోనిత్వాత్=*** శాస్త్రమొక్కటే (తనని తెలుసుకొనటానికి) కారణంగా స్వీకరించడంవల్ల (బ్రహ్మము వేదాంతవాక్యాలతో విచారింపతగినదే)

*పూ.35.* *యద్యపి బ్రహ్మ శక్యం తత్ప్రతిపత్తుంచ లక్షణైః।*
*తథాపి తద్బ్రహ్మ వేద్యమనుమానప్రమాణతః॥*

*36.* *మానాన్తరావేద్యమేవ శాస్త్రవేద్యం భవేదతః।*
*యత ఇత్యాదివాక్యానాం ప్రామాణ్యం నాత్ర సఙ్గతమ్॥*

35-36.**పూర్వపక్షం.** వెనకటిఅధికరణంలో సాధించినట్లే బ్రహ్మాన్ని దానిలక్షణాలవల్ల తెలుసుకోదగినదే అయినా, అది అనుమానప్రమాణంవల్లనే తెలుసుకోదగినదౌతోంది. "భూమిమొదలైనవి ఒకకర్తని కలిగి ఉన్నాయి. కార్యమై ఉండడంచేత ఘటం మొదలైనవాటిలాగ" అని బ్రహ్మాన్ని సాధిస్తే అది అనుమానం ఔతుంది. శాస్త్రమే అంటే, మరోప్రమాణంవల్ల తెలుసుకొనలేనిదాన్నే చెప్తుంది. అంచేత అనుమానంవల్ల తెలియబడే బ్రహ్మవిషయంలో **"యతో వా"** తో మొదలైన వేదవాక్యం ప్రమాణం అవడానికి అవకాశంలేదు. ఇది పూర్వపక్షం. ఈపూర్వపక్షం ఇకపైన సిద్ధాంతంలో ఖండింపబడుతోంది.

*సి.37.* *మైవం సిసాధయిషితం సర్వజ్ఞం సర్వశక్తికం।*
*జీవాద్విలక్షణం బ్రహ్మ న సిద్ధ్యేదనుమానతః॥*

*38.* *అతోఽన్యమానావేద్యత్వాత్ శాస్త్రైకవిషయత్వతః।*

*బ్రహ్మణస్తత్ర శాస్త్రాణాం ప్రామాణ్యే కాపి న క్షతిః॥*

*॥ ఇతి శాస్త్రయోనిత్వాధికరణమ్ ॥*

*37-38.* **సిద్ధాంతం.** ఈపూర్వపక్షం కుదరదు. పూర్వపక్షంలో చెప్పినట్లు కార్యాలతో కారణాన్ని అనుమానించాలని చూస్తే ఘటాలకి కారణంగ లోకంలోఉన్న కుమ్మరి మొదలైన జీవుల్లాగే, లోపాలున్న ఒకజీవుడిగానే జగత్కారణవస్తువు సిద్ధిస్తుంది. అనుమానంవల్ల ఈశ్వరుడిని సాధించేవాళ్ళున్నూ ఆయన్ని (అన్నీ తెలిసినవాడని) సర్వజ్ఞుడనీ, సర్వశక్తిమంతుడనీ, జీవులకంటె భిన్నమైనవాడనీ ఒప్పుకొంటున్నారు. అటువంటి ఈశ్వరుడు లోకదృష్టాంతంచేత సమర్థింపబడే అనుమానప్రమాణంచేత సిద్ధించనే సిద్ధించవీలుగాదు. అందువల్ల ఈశ్వరుడు అనుమానప్రమాణంవల్ల తెలుసుకోడానికి వీలుకానివాడు. శాస్త్రం ఒక్కదానివల్లే తెలుసుకోదగినవాడు. అందుచేతనే శాస్త్రాలు బ్రహ్మన్నిచెప్పే ప్రమాణం అవడానికి ఒక్క లోపంకూడా లేనివి. కనుకనే మొదటిసూత్రంలో చెప్పినట్లు బ్రహ్మ విచారించడానికితగినదేనని భావం.

*శాస్త్రయోనిత్వాధికరణం పూర్తైంది.*

## ॥ సమన్వయాధికరణమ్ ॥ 1-1-4 ॥

## ॥ సూ ॥ తత్తు సమన్వయాత్ ॥ 1-1-4 ॥

**సమన్వయాత్=** (బ్రహ్మం అనబడేది శాస్త్రంచేతనే) పురుషార్థంగ బాగా చెప్పబడడంచేత, **తత్ తు=** బ్రహ్మవిషయంలో శాస్త్రం ప్రమాణంగా యుండడం (కుదురుతుంది)

*పూ.39.* *అప్రాప్తత్వేऽప్యన్యమానైః ప్రవృత్త్యాదావనన్వయాత్।*
*బ్రహ్మణస్సిద్ధరూపత్వాచ్చాప్రయోజనరూపతః॥*

*40.* *శాస్త్రస్య తస్మిన్ప్రామాణ్యాసంభవాత్తద్విబోధ్యతా।*
*నాస్త్యసంభవతీత్యేవం వాదోऽతీవాऽసమంజసః॥*

39-40. **పూర్వపక్షం.** ఇందులో బ్రహ్మం విచారింపతగ్గది అనడానికి ఇంకోవిధంగా ఆక్షేపం తెలియజేయ బడుతోంది. అనుమానం మొదలైన మిగతాప్రమాణాలవల్ల తెలియడానికివీలుగానిదై, శాస్త్రం ఒక్కదానిచేతనే తెలియబడడానికి వీలుగాఉండడంవల్ల, ఇతరప్రమాణాలవల్ల తెలుసుకోవీల్లేనిదని చెప్పేశాస్త్రం బ్రహ్మ విషయంలో ప్రమాణంగా ఉండదగిందని వెనకటి సూత్రంలో సిద్ధాంతం చెయ్యడం ఒప్పుకున్నా, బ్రహ్మం అన్నది ఒకమనిషి కోరదగినపురుషార్థంగా కూడనిదిగనుక దాన్ని శాస్త్రం చెప్పడమే కుదరదు. పురుషార్థాలని (మనుష్యుడు కోరదగిన ఫలాలని) చెప్పవచ్చిందికదా శాస్త్రం! బ్రహ్మం పురుషార్థంగా ఎందుకుకాకూడదు? అంటే, పురుషార్థమనేది ఇష్టప్రాప్తి, అనిష్టనివృత్తి అని రెండురకాలుగా ఉంటుంది. అందులో స్వర్గంపొందడం వంటి ఇష్టప్రాప్తనబడేవి, జ్యోతిష్టోమయాగం మొదలైనకార్యాలని చెయ్యడంవల్ల లభిస్తాయి. అందువల్ల దాన్ని **"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత"** [స్వర్గం కోరేవాడు జ్యోతిష్టోమయాగం చేయాలి] అని వేదం విధిస్తుంది. అనిష్టనివృత్తనేది కొన్నిచెయ్యకూడని కార్యాల్ని చెయ్యడంనుంచితప్పించుకొనడంవల్ల లభిస్తాయి. అందువల్ల అటువంటి కార్యాలని **"న కళంజం భక్షయేత్"** [ ఉల్లి, వెల్లుల్లి తినవద్దు.], **"న హింస్యాత్ సర్వా భూతాని"** [ఏప్రాణిని హింసించవద్దు] మొదలైనవాక్యాల్లో వేదం విధించింది. బ్రహ్మం అంటే సిద్ధవస్తువైఉన్నది. ప్రవృత్తికీ, నివృత్తికీ విషయంగానున్నదికాదు. అందువల్ల అదిపురుషార్థంకాలేదు. అందుచేత, పురుషార్థాలనే చెప్పేశాస్త్రం దానినిచెప్పనేచెప్పదు. గనుక, బ్రహ్మవిచారాన్ని శాస్త్రవచనాలతో చేయడానికి వీలుగాదు. ఇది పూర్వపక్షం. ఇది ఎలాచూసినా సమంజసంకాని వాదంఅనడాన్ని సిద్ధాంతంలో నిరూపింపబడుతోంది.

*సి.41.* *శాస్త్రప్రమాణకత్వం తత్ పురుషార్థతయాऽన్వయాత్।*

బ్రహ్మణస్సంభవత్యేవ వేదాన్తాః పురుషం పరమ్॥

42. నిర్గతావధికానన్దస్వరూపం బోధయన్తి హి।
గుణవత్పుత్రపిత్రాదిజీవనజ్ఞానవత్తథా॥

43. బ్రహ్మజ్ఞానమపీదృక్షం పురుషార్థాత్మకం భవేత్।
అత్యుత్కృష్టపుమర్థేఽస్మిన్ పరమానన్దదే స్వయమ్॥

44. ఆనన్దరూపే శాస్త్రస్య బోధకత్వేన చాన్వయాత్।
శాస్త్రప్రమాణకత్వం తత్ బ్రహ్మణస్తస్య సిద్ధ్యతి॥

॥ ఇతి సమన్వయాధికరణమ్ ॥

41-44. **సిద్ధాంతం.** బ్రహ్మం పురుషార్థమేఅవుతుందిగనుక, శాస్త్రం దాన్నిచెప్పడానికి తగినదేనని నిరూపించబడుతోంది. వేదాంతాలు పరమపురుషుడిని అంతులేని ఆనందస్వరూపుడిగ చెప్తున్నాయనడం ఆనందవల్లివల్ల ప్రసిద్ధం. ఒకడి కొడుకు చిన్నప్పుడు కనబడకుండ తప్పిపోయినాడు. చాలకాలం గడిచిన తర్వాత, వాడు యుక్తవయస్కుడైనాడని, మంచి గుణశాలిగ ప్రసిద్ధుడైనాడని తండ్రి తెలుసుకుంటే తండ్రికి ఎంతో ఆనందం కలుగుతుందిగదా! దీన్ని అలభ్యలాభంగా అనుకుంటాడుగదా! అలాగే తండ్రినుంచి దూరమైన కొడుకుకూడా, ఆయన వయసుమళ్ళినవాడని తెలిస్తే, గొప్పలాభాన్ని పొందినట్లు తలుస్తాడు. తండ్రికి కొడుకూ, కొడుక్కి తండ్రీ, స్వయంప్రయోజనమైఉన్నవాళ్ళుగదా! వీటివల్ల ప్రవృత్తినివృత్తివిషయాలుకాని సిద్ధవస్తువులుకూడా పురుషార్థాలవడానికి సాధ్యమని తెలుస్తోంది. కనుక, పురుషార్థాలనే చెప్పే వేదం అతి విశిష్టమైన పురుషార్థాన్నీ, అనవధికానందాన్నీ ఇచ్చేదీ, స్వయంగా ఆనందరూపమైనదీ కావడంచేత ప్రాణులందరికీ, తండ్రి, తల్లి, కుమారుడు మొదలైన అన్నిరకాలబంధువు అవడంచేత, స్వయం ప్రయోజనకారైన బ్రహ్మన్ని తెలియజేసేదవడంచేత బ్రహ్మం శాస్త్రాన్ని ప్రమాణంగ స్వీకరించేదని వెనకటి సూత్రంలో సిద్ధాంతీకరించడానికి లోటేమీలేదు. అందుచేత, ఈనాలుగధికరణాలవల్లా, బ్రహ్మం విచారం చేయతగినదే అని నిర్ణయింపబడింది.

సమన్వయాధికరణం పూర్తి అయింది.

## ॥ ఈక్షత్యధికరణమ్ ॥ 1-1-5 ॥

### ॥ సి.సూ. ॥ ఈక్షతేర్నాశబ్దమ్ ॥ 1-1-5 ॥

***న అశబ్దం=*** (సద్విద్యలో చెప్పబడిన 'సత్' అనబడే జగత్కారణవస్తువు) శబ్దంచేతనే తెలుసుకొన వీల్లేని మూలప్రకృతిగాదు, ***ఈక్షతే=*** (దానికి) సంకల్పం చెప్పబడడంవల్ల.

45. ఇత్థం కృతం చతుస్సూత్ర్యా శాస్త్రారంభసమర్థనం।
ప్రధానాదేః కారణత్వవాదోఽథ క్షిప్యతే క్రమాత్॥

46. సద్విద్యాయాం కారణత్వం ప్రకృతేః శ్రూయతేఽచితః।
కథం జగత్కారణస్య పురుషార్థత్వసంభవః॥

*47. ఇత్యుక్తిశమనాయాఽభూదీక్షత్యధికృతిస్తతః।

45-*47. మొదటినాలుగుసూత్రాలవల్లా నాలుగుకారణాలతో బ్రహ్మవిచారశాస్త్రం మొదలుపెట్ట తగిందిగాదనే ఆక్షేపానికి సమాధానంచెప్పబడి, బ్రహ్మవిచారశాస్త్రం ఆరంభింపతగిందేనని నిర్ణయింపబడింది. ఇకవేదవాక్యాలచేత మూలప్రకృతి, జీవుడు, జగత్కారణభూతులనిచెప్పేవాదాలు మొదటధ్యాయంలోని

నాలుగుపాదాల్లో నిరసింపబడుతున్నాయి. వేదవాక్యాల్లో నాలుగురకాలుగా ఇవి నిరసింపబడ్డాయి. జీవుడో లేక అచిత్తో జగత్కారణవస్తువని ఏమాత్రం స్పష్టతలేని గుర్తులవల్ల అనిపించేటట్లుచేసేవి కొన్ని, స్పష్టతలేని లక్షణాలవల్ల అలాతోపించేవి మరికొన్ని, స్పష్టమైనలక్షణాలవల్ల తోపించేవి ఇంకామరికొన్ని, బాగాస్పష్టమైన లక్షణాలవల్ల తోపించేవి మిగిలినవి. ఈనాలుగురకాలవాక్యాలవల్లా చెప్పబడే జగత్కారణవస్తువు బ్రహ్మమేనని క్రమంగా మొదటిపాదంలో ఇకమీదవచ్చే పద్ధతిలోను, రెండవ, మూడవ, నాలుగవ పాదాల్లోను నిర్ణయింపబడుతోంది. అందులో జీవఅచిత్తులనుగురించిన అత్యస్పష్టమైన లక్షణాలతో (అస్పష్టతరమైన జీవాదిలింగమైన) వేదవాక్యాలు మొదటిపాదంలో ఇకవిచారింపబడుతున్నాయి. అందులో మొదటిదైన ఈక్షత్యధికరణంలో విచారింపబడేది - ***"వెనుకటి సమన్వయాధికరణసూత్రంలో జగత్కారణమైన బ్రహ్మం, పురుషార్థమవడంవల్ల బ్రహ్మవిచారం చేయతగిందే"***నని చెప్పబడ్డది. ఛాందోగ్యోపనిషత్తులో సద్విద్యలో జ్ఞానంలేనిమూలప్రకృతే జగత్కారణంగ చెప్పబడుతోంది, అందుచేత జ్ఞానములేనిది, దోషాస్పదమైనది అయిన జగత్కారణమూల ప్రకృతి ఎలాపురుషార్థమవడం సంభవం? అనిపూర్వపక్షంచేస్తే దానికిసమాధానంచెప్పడంతో ఈక్షత్యధికరణంలో సద్విద్యావాక్యాలు పరమచేతనమైన బ్రహ్మన్నే చెప్తున్నాయి అని చూపబడుతోంది.

*పూ.47** *గుణత్రయాత్మకస్యాస్య జగతో వస్తు తాదృశమ్॥*

*48.* *ఉత్పాదనం భవేత్కార్యసాజాత్యం స్యాత్తథాసతి।*
*"తత్తేజ ఐక్షత"త్యాదౌ గౌణేక్షాశ్రవణాత్తథా॥*

*49.* *"తదైక్షత"తి వాక్యేఽపి గౌణమేవేక్షణం భవేత్।*
*అత్ర ప్రతిజ్ఞాదృష్టాంతకథనాచ్చానుమానికమ్॥*

**50.* *ప్రధానమేవ సచ్ఛబ్దవేద్యమిత్యాద్యసన్మతమ్।*

47*-*50.**పూర్వపక్షం.** ఈజగత్తు సత్వం, రజస్సు, తమస్సు అనబడేమూడుగుణాలతో ఉంది (గుణమయం). అలాంటిఈజగత్తుకి ఈమూడుగుణాలతోఉన్న మూలప్రకృతే ఉపాదానకారణంగ ఉండతగింది. అలా అయితే కార్యంతోకూడి ఉన్నదిగ కారణం ఉంటుంది. *"తదైక్షత"* (ఛాం. 6-2-1) (సత్ అనబడే ఆ పరవస్తువు సంకల్పించింది.) అనిజగత్కారణమైన సత్తుకి సంకల్పము చెప్పడంవల్ల అది జ్ఞానంలేని మూలప్రకృతి ఎలా అయియుండగలదు? అంటే, ఈసద్విద్యలోనే *'తత్తేజ ఐక్షత'* (ఛాం.6-2-3) {ఆఅగ్ని సంకల్పించింది} అనిమొదలుపెట్టి అగ్ని, జలం, మొదలైన జ్ఞానంలేనివస్తువులకి సంకల్పం చెప్పబడుతోంది. ఈస్థానాల్లో సంకల్పాన్నిచెప్పేపదం, దానిముఖ్యార్థంలో ప్రయోగింపబడలేదనే తెలుసుకోవాలి. అలాగే, *"తదైక్షత"* (ఆ'సత్' సంకల్పించింది)అన్నప్పుడుకూడా గౌణమైన (ముఖ్యంకానిదైన) సంకల్పమే చెప్పబడుతోందనే నిర్వాహంచెయ్యాలి. అంచేత మూలప్రకృతే జగత్కారణమని గ్రహించడంలో దోషంలేదు. పైగా, ఈసద్విద్యలో *"జగత్కారణమైన 'సత్'ను తెలుసుకొన్నట్లైతే, అన్నింటిని తెలిసికొన్నట్లే"* అనిచెప్పి, దానిని వివరించడానికి *"మట్టినుండి ఘటం మొదలైనవి తయారైనట్లు, బంగారం నుంచి కిరీటం మొదలైనవి తయారైనట్లు, 'సత్'నుంచి ఈజగత్తంతా సృష్టింపబడింది"* అనడం మొదలైన దృష్టాంతాలు ఇయ్యబడ్డాయి. ప్రతిజ్ఞ, హేతు, దృష్టాంతం, ఉపనయం, నిగమనం అనేఐదవయవాలతోనున్న అనుమానంలో ప్రతిజ్ఞ, దృష్టాంతము అనేరెండవయవాలు ఇక్కడ కనబడడంవల్ల వేదం అనుమానప్రమాణం వల్లనే జగత్కారణవస్తువుని సాధిస్తోందని స్పష్టమౌతోంది. మూలప్రకృతి కార్యాన్ని అనుమానంచేత తెలియచేస్తోందనీ, అందువల్లే అది *"ఆనుమానికమ్"* (అనుమానప్రమాణంచేత తెలియబడేది), *"అశబ్దమ్"* (శబ్ద మొక్కదానిచేత

తెలియశక్యంగానిది)అని చెప్పబడుతోంది. సిద్ధాంతులుచెప్పే బ్రహ్మంమాత్రం అనుమానంచేత తెలుసుకో సాధ్యంగాదు. శాస్త్రంఒక్కదానివల్లనే తెలుసుకోసాధ్యమైంది. ఈకారణం చేత, ఈసద్విద్యలో అనుమానంచేత తెలియబడేదిగా (చెప్పబడే) తెలియబడే జగత్కారణవస్తువు మూలప్రకృతే అవాలి.

సి.50* సచ్ఛబ్దార్థః ప్రధానం న సత ఈక్షితృతాశ్రుతేః॥

51. బ్రహ్మణశ్చిదచిన్మూర్తేస్సర్వసాజాత్యసంభవాత్।
ముఖ్యేక్షాసంభవాచ్చాత్ర హేతోరప్రతిపాదనాత్॥

52. అనుమానాప్రతీతేశ్చ ఛాన్దోగ్యశ్రుతిగోచరే।
సద్విద్యావాదివాక్యే సత్పదోక్తః పరమః పుమాన్॥

50*-52. **సిద్ధాంతం.** ఈ పూర్వపక్షిమతం తప్పు. 'సత్' అనబడే జగత్కారణవస్తువుకి సంకల్పం చెప్ప బడటంవల్ల అది అచేతనమైన మూలప్రకృతి కానేరదు. సూక్ష్మచేతనాచేతనాలని శరీరంగా స్వీకరించిన పర బ్రహ్మమే కార్యంగాఅవడంచేత బ్రహ్మకారణవాదంలోమాత్రం కార్యకారణాల్లో సంబంధముంది. మూలప్రకృతే కారణమనేపక్షంలో కార్యజగత్తుతాలూకు చేతనాంశంతో మూలప్రకృతికి భేదమే ఉన్నది తప్ప (కలిసి ఉండే సంబంధంలేదు) ఒకటిగాదు. బ్రహ్మం కారణమనేపక్షంలో చేతనాంశం, అచేతనాంశం కూడా తనలోఉన్న బ్రహ్మమే కారణంగాను, కార్యంగాను అవడంచేత, ఈపక్షంలో కార్యకారణ-ఏకత్వం ఉన్నది. పూర్వపక్షిమతంలో సంకల్పాన్ని ముఖ్యంగానిదని చెప్పినదోషంకూడా ఉంది. సిద్ధాంతిపక్షంలో మహాచైతన్యమున్నబ్రహ్మనికి ముఖ్యసంకల్పమే అమరిఉండటంవల్ల ఆదోషంకూడా లేదు. అనుమానంలో అవయవాలైన ప్రతిజ్ఞ, దృష్టాంతాలు చెప్పబడడంచేత, ఆనుమానికమైన ప్రధానమే (మూలప్రకృతే) ఇక్కడ చెప్పబడుతోందని చెప్పడమూ తప్పే. ప్రతిజ్ఞాదృష్టాంతాలున్నంతమాత్రం, దీనిని ఆనుమానికస్థలంగా చెప్పటంకూడా కుదరదు. అనుమానంలో ముఖ్యావయవమైన ***"హేతు"*** కనబడక పోవటంతో ఇక్కడ అనుమానం పుట్టదు. అందువలన ఛాందోగ్యోపనిషత్తులోనున్న సద్విద్యని చెప్పేవాక్యాల్లో చెప్పబడే 'సత్'అనబడే జగత్కారణం పరమపురుషుడే.

*॥ సి. సూ.॥ గౌణశ్చేన్నాత్మశబ్దాత్ ॥ 1-1-6 ॥*

***గౌణః చేత్=*** ('సత్'కి చెప్పబడే సంకల్పం) ముఖ్యంకానిదే అంటే, ***న=*** (అలా చెప్పటం) సరిగాదు, ***ఆత్మశబ్దాత్=*** ('సత్'ని గురించి) ***'ఆత్మా'*** అనేశబ్దం ప్రయోగింపబడటంచేత.

పూ. *53. గౌణీ "తదైక్షతే"తీక్షా గౌణేక్షాసాహచర్యతః।

*53. వెనకచెప్పినసిద్ధాంతంమీద మరొక **పూర్వపక్షం** ఇలా వస్తుంది.. ***"తేజ ఐక్షత"*** [అగ్ని సంకల్పిస్తోంది] మొదలైనస్థానాల్లో అగ్ని అచేతనంకనక సంకల్పాన్ని ముఖ్యంకానిదనే తీసుకోవాలి. అంచేత దానితోబాటుగచెప్పబడే ***"సత్"***తాలూకు సంకల్పంగూడ ముఖ్యంకానిదానిగానే ఉండాలి. అంచేత ప్రధానమే ***'సత్'*** అనబడే జగత్కారణం.

సి.53* మైవం సచ్ఛబ్దవాచ్యేఽస్మిన్ ఈక్షితర్యాత్మశబ్దతః॥

54.. ముఖ్యైవేక్షాఽత్రాఽఽత్మగతా తేజఆదేరపీక్షణం।
ముఖ్యం సదాత్మకత్వాత్తస్యై "తదాత్మ్య"మితి శ్రుతేః॥

సి.53*-54. ఈపూర్వపక్షంసరిగాదు. సచ్ఛబ్దవాచ్యమైనవస్తువే ముందు *'సన్మూలాః'*అని మొద లయే వాక్యంలో ఎత్తుకోబడి, ***"స ఆత్మా"***[అదే ఆత్మయగును] అని చేతనమైన అంతర్యామియైన ఆత్మగా

చెప్పబడుతోంది. అందుచేత ఈపదానికిచెప్పబడే సంకల్పం ముఖ్యమైనదిగనే ఉండాలి. "అగ్ని సంకల్పి స్తోంది" మొదలైన వాక్యాల్లోకూడ ముఖ్యమైన సంకల్పం కుదురుతుంది. ఎందువల్లంటే 'తేజస్' అనేపదం అగ్నికి అంతర్యామిగానున్న సచ్ఛబ్దవాచ్యమైన పరమాత్మనేచెప్తుంది. ఆపరమాత్మ అగ్నిమొదలైన అన్నింటికీ ఆత్మగాఉందని *"ఐతదాత్మ్యమిదం సర్వం"* (ఛాం.6-8-7) [ఇవియన్నీ ఈ'సత్'నే ఆత్మగా కలిగియున్నవి] అని ఈప్రకరణంలోనే చూపబడుతోంది. దేహాన్నిచెప్పే పదాలు ఆత్మనేచెప్తాయనేది లోకవేద్యం. అంచేత బ్రహ్మమే సద్విద్యలో చెప్పబడే జగత్కారణస్తువు.

*// సి.సూ.// తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్ // 1-1-7 //*

**తన్నిష్ఠస్య=** 'సత్' అనబడే జగత్కారణవస్తువును ఉపాసించేవాడికి, **మోక్షోపదేశాత్=** మోక్షాన్ని ఉపదేశించడంచేత (జగత్కారణమైన 'సత్' ప్రకృతిగాదు).

*55.* *సదుపాసననిష్ఠస్య జీవస్య పరమం ఫలం।*
*మోక్షాఖ్యం శ్రూయతేఽతశ్చ సద్వాచ్యం బ్రహ్మ న త్వజా॥*

55. ఇదిమొదలు ఆరుసూత్రాల్లో ఆరుకారణాలనిచూపి జగత్కారణమైన'సత్' మూలప్రకృతిగాదని చూపబడుతోంది. అందులో ఈసూత్రంలో చెప్పేదిఏమిటంటే -- ఈప్రకరణంలో *"తత్త్వ మసి"* (ఛాం. 6-8-7) అని ముముక్షువైన శ్వేతకేతు తనని "సత్"రూపంగయున్నవాడిగనే అనుసంధించాలని ఉపదేశిస్తోంది. *"తస్య తావదేవచిరం యావత్ నవిమోక్ష్యే అథసంపత్స్యే"* (ఛాం. 6-14-2) [జగత్కారణమైన సత్‌ను ఉపాసించే వాడికి శరీరం పోయేంతవరకే మోక్షంపొందడానికి ఆలస్యం. శరీరాన్ని వదిలినవెంటనే మోక్షాన్ని పొందుతాడు.] అని ఈవిధంగా సదాత్మకుడిగా తనని ఉపాసించేవాడికి ఉత్కృష్టమైన, బలమైన మోక్షం ఉంటుందని చెప్పబడుతోంది. మూలప్రకృతే 'సత్' అంటే, మూలప్రకృతిరూపుడిగా తనని అనుసంధించే వాడికి (ప్రకృతి) మోక్షం నియమింపబడదు. *"యదాక్రతురస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి"* (ఛాం. 3-14-1) [ఈలోకంలో పురుషుడు ఏవిధంగా ఉపాసిస్తాడో, అదేవిధంగా మరణించిన తర్వాత అవుతాడు] అనేన్యాయంప్రకారం ముముక్షువైనవాడు జ్ఞానశూన్యమైన అచేతనంగానే అవాల్సి వస్తుంది. వేయిమంది తల్లిదండ్రులకంటె ఎక్కువగ ప్రేమించేశాస్త్రం ఇలా జ్ఞానశూన్యమైనదాన్ని మోక్షంగ ఉపదేశించదు. ప్రధానకారణవాదులుగూడ, ప్రధానాన్ని ఉపాసించేవాడికి మోక్షముంటుందని చెప్పలేదే! అంచేత తనను ఉపాసించేవాడికి మోక్షాన్నిచ్చేదిగా చెప్పబడే 'సత్' మూలప్రకృతిగానేరదు.

*// సి.సూ.// హేయత్వావచనాచ్చ // 1-1-8 //*

**హేయత్వావచనాత్ చ=** (సత్ అనబడు వస్తువునకు) హేయత చెప్పబడకపోవటంచేత, (అది ప్రకృతి గానేరదు)

***56.*** *యదీహ కారణతయా ప్రధానం తద్వివక్షితమ్।*
*తస్య మోక్షవిరోధిత్వాదుచ్యేతాఽముష్య హేయతా॥*

***57.** *న చోచ్యతే హేయతాఽతః ప్రధానం న వివక్షితమ్।*

56-*57. ఇక్కడ జగత్కారణంగచెప్పబడేవస్తువు మూలప్రకృతైతే, అది మోక్షానికి విరోధియైనందువల్ల మోక్షవిరోధిగయుండటంమొదలైన హేయతలు దానికిచెప్పబడుండాలి. అలాంటి హేయతలు చెప్పబడలేదు. వెనుకటిసూత్రంలో చెప్పినట్లుగా మోక్షసాధనంగాఉండటం అనే విశిష్టతే చెప్పబడింది. ఈకారణంచేత, ఇక్కడ చెప్పబడే 'సత్' మూలప్రకృతి కావడంకుదరదు.

## // సి.సూ. // ప్రతిజ్ఞావిరోధాత్ // 1-1-9 //

**ప్రతిజ్ఞావిరోధాత్=** ప్రతిజ్ఞకు విరోధము రావలసిందిగనుక (సత్ మూలప్రకృతి గానేరదు)

57* *యేనాశ్రుతం శ్రుతమితి ప్రతిజ్ఞాఽత్ర విరుధ్యతే।*

58. *సద్విజ్ఞానేన చిదచిత్ప్రపఞ్చజ్ఞానమత్ర హి।*
*ప్రతిజ్ఞాతం ప్రధానం చేద్వాచ్యం జీవగణాన్ ప్రతి॥*

59 *ప్రధానస్యాకారణత్వాత్ జ్ఞాయన్తే తే న తద్ధియా।*
*తస్మాదసజ్ఞతా సా స్యాత్ప్రతిజ్ఞాఽతశ్చ న త్వజా॥*

57*-59. ఈప్రకరణప్రారంభంలో "జగత్కారణమైన 'సత్'ను తెలుసుకొంటే అన్నింటినీ తెలిసికొన్నట్లే అగును" అనినిర్వచనంచేయబడింది. 'సత్'అనేది మూలప్రకృతైతే ఈనిర్వచనం కుదరదు. ఎందుచేతంటే, 'సత్'ను తెలుసుకొంటే చేతనాచేతనరూపమైనలోకాన్ని తెలుసుకోవడమే అవుతుందనిగదా ఇక్కడి నిర్వచనం (ప్రతిజ్ఞ). ప్రధానమే చైతన్యమున్నజీవులకు కారణం కానేరకపోవటంతో ప్రధానాన్ని తెలిసినంతమాత్రం లోకంలోఉన్న జీవులనితెలిసికొన్నట్లుగాదు. కనుక ఇదివరలో చూపబడిన నిర్వచనం ఇక్కడకుదరలేదు. ఈకారణంచేత 'సత్'అనబడేవస్తువు ['అజా' (పుట్టుకలేని మూలప్రకృతి) అని శ్వేతాశ్వతరోపనిషత్తు మొదలైనవాటిలో చెప్పబడే]మూలప్రకృతి కానేరదు.

## // సి. సూ. // స్వాప్యయాత్ // 1-1-10 //

**స్వాప్యయాత్=** (జీవుడు) తనకు కారణమైన 'సత్'లో (నిదురించేటపుడు) లయించేదిగ (వేదవాక్యం) చెప్పటంచేత, ('సత్'అనేది మూలప్రకృతిగాదు)

60. *సుషుప్తస్య చితస్స్వాయ హేతౌ సత్యప్యయశ్రుతిః।*
*విరుద్ధా స్యాత్ప్రధానస్యాకారణత్వాచ్చితం ప్రతి॥*

60. ***"యత్రైతత్పురుషః స్వపితి నామ, సతాసోమ్య తదా సంపన్నో భవతి స్వమపీతో భవతి తస్మాదేనం స్వపితీత్యాచక్షతే స్వం హ్యపీతో భవతి"*** (ఛాం. 6-8-1) [ఈజీవుడు నిద్రించేటపుడు 'సత్'తో కలిసినవాడవుతాడు. తానుకారణమైనదానిలో అణిగియుంటుంది. అంచేతనే నిద్రిస్తున్నవాడిని 'స్వపితి' అనిచెప్తున్నారు. స్వంఅయిన(స్వకారణమైన) 'సత్' లోనేగదా అప్యయాన్ని (లయమును) పొందుతాడు.] అని మనుష్యుడు నిద్రించేటపుడు జీవుడు తనకికారణమైన 'సత్'లో ఇమిడియున్నట్లుగా ఈప్రకరణంలోఉన్న వేదవాక్యం చెప్పింది. మూలప్రకృతి అన్నది జీవుడికి కారణంకాకపోవటంచేత ప్రధానమే జగత్కారణమైన 'సత్'అనే పక్షంలో ఈవాక్యం కూడా విరోధిస్తుంది. ఈకారణంచేతగూడ 'సత్' అనబడే జగత్కారణం మూలప్రకృతి కానేరదు.

## // సి. సూ.// గతి సామాన్యాత్ // 1-1-11 //

**గతిసామాన్యాత్=** ఇతర ఉపనిషద్వాక్యాలకి ఏదిగతో అదే ఈవాక్యానికి కూడా గతి అయియుండాల్సి యుండటంచేత (జగత్కారణం ప్రధానం కానేరదు)

61. *ఇతరోపనిషద్వాక్యసమానార్థతయాఽస్య చ।*
*కారణం న ప్రధానం స్యాత్పరం బ్రహ్మైవ కారణమ్॥*

61. జగత్కారణం మూలప్రకృతిగాదనడానికి మరొకకారణం చెప్పబడుతోంది. జగత్కారణాన్ని చెప్పే ఉపనిషద్వాక్యాలన్నింటికీ ఒకదానితోఒకటి విరోధించనట్లుగా అర్థంచెప్పుకోవాలి. మిగతా ఉపనిషత్తు

లని చూస్తే, *"యస్సర్వజ్ఞ స్సర్వవిత్... తస్మాదేతద్బ్రహ్మ నామరూపమన్నంచ జాయతే"* (ముండక. 1-1-10) [ఎవడు అన్నివస్తువులస్వరూపస్వభావాలనీ తెలిసియున్నాడో, వాడివల్ల ఈమూలప్రకృతి నామరూపాలున్న భోక్తలైన జీవులుగాను, భోగ్యవస్తువులుగాను ఉన్నది], *"పురుష ఏవేదం సర్వమ్"*(పు.సూ.) [ఇవన్నీ ఆపరమపురుషుడే], *"తస్మాత్ విరాడజాయత"* (పు.సూ.1-5) [ఆపరమపురుషునినుండి అండము జనించింది], *"ఆత్మన ఆకాశస్సంభూతః"*(తై. ఆనం. 1) [పరమాత్మనుండి ఆకాశము సంభవించింది], *"ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్"*(ఐతరేయ 1-1-1) [ఇది ఆత్మయైన ఒకవస్తువుగనే మొదటయుండెను], *"ఏకోహవై నారాయణ ఆసీత్"*(మహో.) [నారాయణుడొకడే మొదటయుండెను.]అని అన్నింటినీతెలిసినవాడు, సర్వాత్మైన నారాయణుడే జగత్కారణమని తెలుస్తోంది. ఈవాక్యాలకేది అర్థమో, అదే *"సదేవ సోమ్య"* అనేవాక్యానికర్థమై ఉండాలిగనుక ఇక్కడ పరమపురుషుడే కారణంగ చెప్పబడుతున్నాడనీ, మూలప్రకృతి కారణంగా చెప్పబడలేదనీ సిద్ధించింది.

*// సి. సూ. // శ్రుతత్వాచ్చ // 1-1-12 //*

**శ్రుతత్వాచ్చ=** (ఈఉపనిషత్తులోనే పరమాత్మనుండి అంతా సృష్టింపబడిందని) చెప్పబడటంచేతకూడ (కారణం మూలప్రకృతి కానేరదు.)

***62.*** *"ఆత్మతః ప్రాణ"ఇత్యాది శ్రూయతేఽత్రైవ సామాని।*
*అతః ప్రధానాదేవాన్యత్సర్వజ్ఞం బ్రహ్మకారణమ్॥*

*// ఇతి ఈక్షత్యధికరణమ్ //*

62. *"ఆత్మతః ప్రాణః... ఆత్మతః ఆకాశః.... ఆత్మత ఏవేదం సర్వమ్"* (ఛాం. 7-26-1) [ఆత్మనుండి ప్రాణం, ఆకాశం, ఇవన్నీ సృష్టింపబడినాయి] అని సామవేదానికిచెందిన ఈఉపనిషత్తులోనే పరమాత్మ నుంచే లోకాలన్నీ సృష్టింపబడినట్లు చెప్పబడుతోంది. దీనివలనకూడా, మూలప్రకృతి జగత్కారణం కానేరదు. అంచేత అన్నింటినీ తెలిసిన పరమాత్మే జగత్కారణమైనాడు.

ఈక్షత్యధికరణము పూర్తియైనది.

*// ఆనందమయాధికరణమ్ // 1-1-6 //*

*// సి. సూ.// ఆనందమయోఽభ్యాసాత్ // 1-1-13 //*

**ఆనందమయః=** (తైత్తిరీయానందవల్లిలో) ఆనందమయుడిగా వచింపబడినవాడు (పరమపురుషుడే;) **అభ్యాసాత్=** *"తేయేశతమ్"*అని వాడిఆనందాన్ని ఎక్కువెక్కువగ(మీదమీదకు) వృద్ధి చెయ్యడంవల్ల.

***అవ. 63.*** *అచేతనస్య ముఖ్యేక్షాఽసంభవాత్తన్న కారణమ్।*
*ఇత్యుక్తం తర్హి జీవోఽస్త్వితాక్షేపోఽత్ర నిరస్యతే॥*

**అవతారిక:** వెనుకటిఅధికరణంలో "అచేతనమైన మూలప్రకృతికి ముఖ్యమైన సంకల్పం కుదిరేది కాకపోవడంవల్ల అదికారణంగాదని చెప్పబడింది. "అలాగైతే జీవుడికి ముఖ్యమైన సంకల్పం తగియుంటుంది గనుక వాడేజగత్కారణమైయుండకూడదా?" అనేఆక్షేపం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

***పూ. 64.*** *ఆనందవల్ల్యాం 'విజ్ఞానమయాదన్యోఽన్తరస్తథా।*
*ఆత్మాఽఽనందమయస్తేనే"త్యాదివాక్యం ప్రపఠ్యతే॥*

***65.*** *సచానన్దమయో జీవస్తస్య శారీరతాశ్రుతేః।*
*జీవాసాధారణం తచ్చ శారీరత్వమతోఽస్య చ॥*

*66. *అత్రేక్షాపూర్వికా సృష్టిశ్చేతనత్వాత్సుసజ్గతా।*

64-*66. **పూర్వపక్షం.** తైత్తిరీయోపనిషత్తులో ఆనందవల్లిలో **"ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః"** (తై. ఆనం.-1) [ఈఆత్మనుండిఆకాశము సృష్టింపబడెను.]అని జగత్కారణవస్తువును చెప్పడం ప్రారంభించి, **"తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాదన్యోంతర ఆత్మానన్దమయః। తేనైష పూర్ణః"** (తై.ఆనం. 5-2) [అలాంటి ఈవిజ్ఞానమయుడైన బుద్ధికంటే వేఱైనవాడును, సూక్ష్మమైనవాడునైన ఆత్మైయున్నవాడు ఆనందమయుడు; ఆతనిచేతనే విజ్ఞానమయుడు పూర్తినిగలవాడుగయున్నాడు] అని ఆతన్ని ఆనందమయుడిగ చెప్తోంది. **"తస్యైష ఏవ శారీర ఆత్మా"** (తై. ఆనం. 5) [ఆవిజ్ఞానమయుడికి ఈఆనందమయుడే శరీరసంబంధైన ఆత్మ] అని ఆఆనందమయుడికి శరీరసంబంధం చెప్పటంచేత ఆతడు జీవాత్మే అయిఉండాలి. శరీరసంబంధం కలవాడు జీవాత్మేగదా! ఈప్రకరణంలో అన్నమయుడని అన్నంవల్ల వృద్ధిచెందేశరీరాన్నిచెప్పి అందులో సూక్ష్మమైనదై దానినిధరించిన పంచవృత్తిప్రాణిగా ***"అన్యోంతరఆత్మా ప్రాణమయః"*** (తై.ఆనం.2)అని ప్రాణ మయుడిగచెప్పి దానికంటెసూక్ష్మమైన మనస్సునీ దానికంటెసూక్ష్మమైనబుద్ధినీ వరసగా మనోమయుడనీ, విజ్ఞానమయుడనీ చెప్పి, అన్నిటికంటె సూక్ష్మమై అన్నింటిని ధరించే జీవాత్మని ***"అన్యోంతర ఆత్మా ఆనందమయః"*** (తై.ఆనం.5-2)అని ఆనందమయుడిగచెప్పి పూర్తిచేయబడింది. ఇందువల్లకూడ ఆనంద మయుడు జీవుడేనని తెలుస్తోంది. పైగా, ప్రకృతిలాగ వీడిసంకల్పాన్ని అముఖ్యమైనదని నిర్వహించాల్సిన అవసరమూలేదు. వీడు చేతనుడు (జ్ఞానముగలవాడు). అంచేతవీడికి ముఖ్యమైన సంకల్పమే బాగా కుదురుతుంది. ***"అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య"*** (ఛాం. 6-3-2) [నేనుగాఉన్న ఈజీవుడివల్ల వ్యాపించి], ***"తత్త్వమసి శ్వేతకేతో"***(ఛాం. 6-8-7) [ఓశ్వేతకేతూ! నువ్వే పరమపురుషుడివై ఉన్నావు.] అని జీవుడూ జగత్కారణత్వం ఒకటేఅనిచెప్పే వేదవాక్యాలుకూడా జగత్కారణమైన ఆనందమయుడు జీవుడే అనేదాన్ని బలంగా నిశ్చయిస్తున్నాయి. అంచేత జీవుడే ఆనందమయుడిగ తైత్తిరీయంలో చెప్పబడే జగత్కారణం.

సి.66* *మైవమత్రానన్దమయః పరో జీవాద్విలక్షణః॥*

67. *నిర్గతాతిశయత్వేనాఽభ్యస్తానన్దస్య యోగతః।*
*తాదృశానన్దయోగిత్వం జీవస్యాస్య న సంభవేత్॥*

68. *శారీరత్వం ముఖ్యమేవ బ్రహ్మణశ్చిదచిత్తనోః।*
*తస్మాదత్రానన్దమయః పరమాత్మేతి గీయతే॥*

66*-68. **సిద్ధాంతము.** ఈప్రకరణంలో అన్నమయమని అన్నంచేతవృద్ధిపొందే శరీరాన్ని చెప్పి దానికంటె సూక్ష్మమైనదై, దానినిధరించేపంచప్రాణమైనదాన్ని ప్రాణమయమని చెప్పబడింది. దానికంటె సూక్ష్మమైన మనస్సుని మనోమయుడన్నది. తరువాతిస్థితిగ దానికంటెసూక్ష్మమైన ఒకవస్తువుని విజ్ఞానమయుడని చెప్పబడుతోంది. ఈవిజ్ఞానమయుడు జ్ఞానమేఅయినబుద్ధి అని చెప్పడానికి కుదరదు. 'విజ్ఞానమయుడ'నటంతో జ్ఞానంగల జీవుడే ఇతను. 'మయట్'అనే ప్రత్యయం భేదాన్ని సూచిస్తుంది. అన్నమయుడని అన్నంకంటెభిన్నమైన, అన్నాన్నికలిగిన శరీరాన్నిచెప్పినట్లు, ఇక్కడ జ్ఞానంకంటెభిన్నమైన జ్ఞానంగల జీవుడిని జ్ఞానమయుడని చెప్పడమే సరైనది. ప్రాణమయుడు, మనోమయుడు అన్నప్పుడు వేరుమార్గంలేక 'మయట్'కి ప్రాణం, మనస్సు అనే స్వార్థవస్తువు గ్రహింపబడింది. విజ్ఞానమయుడిని జీవుడిగ చెప్పినప్పుడు 'స్వార్థే మయట్'గా దాన్ని మార్చి అర్థాన్ని గ్రహించడం స్వారస్యంగాదు. ***"విజ్ఞానం యజ్ఞం తనుతే"*** (తై.ఆ.5-1) [జ్ఞానం యజ్ఞాన్ని చేస్తోంది.] మొదలైనచోట్ల ఈప్రకరణంలోనే జ్ఞానమున్న జీవుడిని

జ్ఞానంగానే చెప్పటం చూస్తున్నాం. తెలివినే (జ్ఞానమే) స్వరూపంగానూ, గుణంగానూ కలిగిన జీవుడిని, జ్ఞానమనీ, జ్ఞానమయుడనీ చెప్పడంకుదురుతుంది. అందుచేత, ఇలా విజ్ఞానమయుడనడం జీవుడినే అని సిద్ధించినట్లుగా, వాడికంటెసూక్ష్మమైనవాడై, వాడినిధరించియుండే పరమాత్మే ఆనందమయుడని చెప్పబడుతున్నాడనేది స్పష్టం. వీడుజీవుడుగా ఉండశక్యంగాదనటానికి మరొక ముఖ్యకారణంకూడా ఉంది. అదేమిటంటే, *"సైషాऽऽనందస్య మీమాంసా భవతి"* (తై.ఆ.8) [ఈఆనందమయుడి ఆనందాన్ని కొలవటానికి ఇచ్చుఉంది] అని ఈప్రకరణంలోనే ఆనందమయుడి ఆనందాన్ని లెక్కపెట్టటానికి (కొలవటానికి) ప్రారంభించి, ఎక్కువైన ఆనందంగల ఒకమనుష్యుడిని కల్పించి, ఆ మనుష్యుడి ఆనందంకంటె నూరురెట్లున్న మనుష్యగంధర్వానందాన్నీ, దానికినూరురెట్లున్న దేవగంధర్వానందాన్నీ, దానికినూరురెట్లున్న పితరుల ఆనందాన్నీ, దానికినూరురెట్లున్న ఆజానుజదేవానందాన్నీ, దానికినూరురెట్లున్న కర్మదేవానందాన్నీ, దానికి నూరింతలైన దేవానందాన్నీ, దానికి నూరురెట్లైన ఇంద్రానందాన్నీ, దానికినూరురెట్లైన బృహస్పతిఆనందాన్నీ, దానికినూరురెట్లున్న ప్రజాపతిఆనందాన్నీ కల్పించి, ఆనందమయుడైన బ్రహ్మఆనందం దానికి నూరురెట్లైనదై ఉంటుందని ఉత్ప్రేక్షించి, దానితోనూ తృప్తిపడక, *"యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసాసహ, ఆనందం బ్రహ్మణో విద్వాన్ నబిభేతి కుతశ్చన"* [మనస్సుతోకూడినవాక్కులు దేనినిపొందలేక (కాలతత్త్వమున్నంత వరకూ) తిరిగివచ్చేయో, ఆబ్రహ్మానందాన్నితెలుసుకొన్నవాడు దేనికీ భయపడడు.] అని వెనుక ఉత్ప్రేక్షించిన బ్రహ్మానందాన్ని మనుష్యానందంగా ఎంచి నూరునూరురెట్లుగ పెంచుకొని పోయి, తిరిగితిరిగి, కాలమంతా పరిశోధించినా, బ్రహ్మంతాలూకు ఆనందాన్ని ఇంత అని లెక్క వేసి తెలుసుకోవడానికి సాధ్యపడక తిరిగితిరిగి వెనక్కి వచ్చియుండవలసివచ్చిందని వేదం ఘోషిస్తోంది. ఇలాంటి మహానందం గలవాడు, దుఃఖంలో కొట్టుమిట్టాడే జీవుడైయుండశక్యమా? *"శారీర ఆత్మా"*అని శరీరసంబంధంచెప్పడంచేత, ఇతడు జీవుడేఅయియుండాలనడం దోషమే. పరమాత్మైన అతను అన్నిచేతనాచేతనాలనీ శరీరంగా కలిగినవాడని *"యస్యపృథివీ శరీరం ... యస్యాత్మా శరీరం"* మొదలైన ఎన్నోవేదవాక్యాలు ఉద్ఘోషించినందువల్ల ఆనందమయుడైన పరమపురుషుడికి శరీరసంబంధం కూడును. శరీరాన్నిచెప్పేశబ్దాలు శరీరినిగూడచెప్పడం వేదాలలో మనము చూస్తున్నాంగనుక *"జీవేన ఆత్మనా"* (ఛాం. 6-3-2), *"తత్త్వమసి"* (ఛాం.6-8-7) మొదలైనవాక్యాల్లో జీవుడిని, పరమపురుషుడిని ఒకేవర్గంలో చెప్పడం తప్పుకాదు. *"సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలాన్"* [బ్రహ్మ నుండిపుట్టి, జీవించి, నశించిపోవటంచేత అన్నివస్తువులూబ్రహ్మమే] మొదలైనవాక్యాలు చేతనాచేతనాలనీ, బ్రహ్మన్నీ ఒకటిగా చెప్పడానికి కారణము శరీరశరీరిభావమేగాని స్వరూపైక్యము కాదనిచూపుతున్నాయి. అందుచే ఈకారణాలవల్ల ఇచట ఆనంద మయుడిగ కీర్తింపబడేవాడు పరమాత్మే అని సిద్ధించింది.

### *// సి. సూ. // వికారశబ్దాన్నేతి చేన్న ప్రాచుర్యాత్ // 1-1-14 //*

**వికారశబ్దాత్=** (ఆనందముయొక్క) వికారము (ఆనందమయుడు) అనిచూపే 'మయట్' ప్రయోగించడంవల్ల, **న=** (ఆనందమయుడు) పరమాత్మకానేరడు **ఇతిచేత్=** అంటే, **న=** అట్లుగాదు. **ప్రాచుర్యాత్=** (ఆఆనందం) ప్రాచుర్యాన్నే 'మయట్' ప్రత్యయం చూపించడంవల్ల.

### *పూ. *69. మయటోऽస్య వికారార్థతయాऽత్రాऽవికృతః పరః।*

*69. **పూర్వపక్షం.** "సువర్ణమయము"మొదలైనచోట్ల 'మయట్'ప్రత్యయం మార్పుచెందిన అర్థంలో లోకప్రసిద్ధంగ ప్రయోగింపబడుతోంది. 'అన్నమయుడ'ని ఈప్రకరణప్రారంభంలోనే అన్నంతాలూకు వికారమైనశరీరం అనిచెప్పడంవల్ల ఆఅర్థమే ఇచ్చటగ్రహింపతగినది. అంచేత ఆనందమయుడంటే ఆనందం తాలూకు వికారం అనే అర్థం.. పరమాత్మ వికారముచెందనివాడని ప్రసిద్ధమైనవాడు. అందుచేత ఆతడు

ఆనందవికారుడిగా ఇక్కడచెప్పబడే ఆనందమయుడిగా కుదరదు.

*సి.69** *న వాచ్య ఇతి చేన్నైతన్మయట్ ప్రాచుర్యబోధకః॥*

*70.* *తాదృ గేవ మయట్ పూర్వ ప్రకృతోఽతః పరః పుమాన్।*

*"యతో వాచ" ఇతి ప్రోక్తానందప్రాచుర్యవానయమ్॥*

*69*--70.* **సిద్ధాంతము.** ఈపూర్వపక్షం సరిగాదు. *"అన్నమయం యజ్ఞం"* మొదలైనవాట్లో 'మయట్' ప్రత్యయానికి ఎక్కువ అనేఅర్థంగూడ ప్రసిద్ధిలోఉంది. మయట్ ప్రత్యయం ఈ ప్రకరణప్రారంభం లోనే అన్నమయశబ్దంలో వికారార్థంచూపించినా, తరువాతి ప్రాణమనోమయశబ్దాల్లో ఆ అర్థాన్ని చూపలేదు. తరవాత ఉన్న విజ్ఞానమయశబ్దంలో ఇపుడు వివరించినట్లుగా జ్ఞానం ఎక్కువగ ఉన్నజీవుడిని చెప్పడంవల్ల 'ప్రాచుర్యం' (ఆధిక్యం) అనేఅర్థం వస్తోంది. దాన్నుండే ఈ ఆనందమయశబ్దంలోనూ, ఈ ఆధిక్యతనిచూపే అర్థమే తగిఉన్నది. *"యతోవాచో నివర్తన్తే"* అని చాలాఎక్కువైన ఆనందంగలవాడుగ చెప్పబడే ఆనందమయుడివిషయంలో ఆనందవికారంగలవాడని అర్థాన్ని చెప్పడంకుదరదు. అందువల్ల ఆనంద-మయుడుగ చెప్పబడేవాడు అధికమైన మహదానందంగల పరమపురుషుడే అవుతాడు.

*॥ సి. సూ. ॥తద్ధేతువ్యపదేశాచ్చ॥ 1-1-15 ॥*

**తద్ధేతువ్యపదేశాత్ చ=** జీవుడి ఆనందానికి కారణంగా (ఆనందమయుడిని) చెప్పడంచేతను; (ఆనందమయుడు జీవుడుకంటె వేరైన బ్రహ్మమే).

*71.* *జీవానందయితృత్వం చాస్యై "ష హ్యేవే"తి వాక్యతః।*

*ఉచ్యతేఽతశ్చ జీవాస్యాదన్య ఆనన్దరూప్యయమ్॥*

71. *"కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందోనస్యాత్। ఏష హ్యేవానన్దయాతి"* (తై. ఆనం.1) [అంతటాప్రకాశించే ఈఆనందమయుడు లేకపోతే ఎవడు ఈజన్మ, తరువాతి జన్మల ఫలాన్ని పొందడానికి సాధ్యం అవుతుంది? ఈఆనందమయుడే (అందరికీ) ఆనందాన్ని పొందింపచేస్తున్నాడు] అనే వాక్యంలో ఆనందమయుడిని జీవుల ఆనందానికి కారణంగ చెప్పబడింది. దీనివల్లకూడా ఆనందాన్ని పొందించే ఆనందమయుడు, వీడినుంచి ఆనందాన్ని పొందే జీవుడికంటే భిన్నమైనవాడని సిద్ధిస్తోంది.

*॥ సి. సూ.॥ మాంత్రవర్ణికమేవ చ గీయతే ॥ 1-1-16 ॥*

**మాంత్రవర్ణికమేవ చ=** మంత్రవర్ణంలో చెప్పబడిన బ్రహ్మమే **గీయతే=** (ఆనందమయుడని) పాడబడుతోంది.

*72.* *"సత్య "మిత్యాదిమన్త్రోక్తం బ్రహ్మైవ హ్యత్ర గీయతే।*

*ఆనన్దమయశబ్దేనాతశ్చానన్దమయః పరః॥*

72. *"సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ"* (తై. ఆన. 1) [సత్యంగాను, జ్ఞానంగాను, అంతంలేని వాడుగానుండే బ్రహ్మమును]అని మంత్రవర్ణంలోచెప్పబడ్డ బ్రహ్మమేగదా ఆనందమయుడిగా ఈప్రకరణంలో చెప్పబడుతోంది. *"బ్రహ్మవిదాప్నోతి పరమ్"* (తై.ఆన.1) [బ్రహ్మాన్ని తెలుసుకొన్నవాడు ఉత్తమఫలమైన ఆ బ్రహ్మాన్ని పొందుతున్నాడు]అని జీవుడికిప్రాప్యంగ ఈబ్రహ్మం చెప్పబడుతూండడంచేత, ఆనందమయుడు జీవుడికంటే వేరైన బ్రహ్మమే అవుతుంది.

*॥ సి. సూ.॥నేతరోనుపపత్తేః ॥ 1-1-17 ॥*

**అనుపపత్తేః=** ['విపశ్చిత్' (గొప్పజ్ఞానము గలవాడు) అని చెప్పటం] కుదరకపోవటంచేత, **.ఇతరః న=**

(ఆనందమయుడు) జీవుడు కాలేడు.

*73.* *మంత్రవర్ణోదితో న స్యాజ్జీవో యో బ్రహ్మణః పరః।*
*బ్రహ్మైకాన్తవిపశ్చిత్త్వధర్మశ్చానుపపత్తితః॥*

73.మంత్రవర్ణంలో బ్రహ్మమనిచెప్పబడ్డ ముక్తిపొందినజీవుడి స్వరూపమవగూడదా? అంటే, కాకూడదనే సమాధానం. *"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి"* (తై.ఆన.1) [ఎన్నోవిధాలుగ ఉండే జ్ఞానంగలబ్రహ్మంతోగూడ ముక్తజీవుడు అన్నికోరికలనీ(ఇష్టాలనీ) అనుభవిస్తాడు.]అని విపశ్చిత్ అని బ్రహ్మం చెప్పబడుతోంది. 'విపశ్చిత్' అంటే వివిధాలుగనుండే జ్ఞానంగలది అనిఅర్థం. ఇది సంసారిజీవుడికి కుదరదనేది స్పష్టం. *"బహుస్యాం ప్రజాయేయ"* (తై.ఆన. 6) [నేనే దేవతలు మొదలైన అన్నింటిగాను అవుతాను. (దానికోసం ఆకాశం మొదలైనవిగా) పుట్టతగినవాడిని] అని సంకల్పంకూడా విపశ్చిత్అయిన బ్రహ్మంతాలూకు సర్వజ్ఞత్వంలో ఉందని ఈఉపనిషత్తులోనే ముందుముందు చెప్పబడుతోంది. ఈ జగద్వ్యాపారసంకల్పం ముక్తుడికి లేకపోవడంచేత "విపశ్చిత్"గా చెప్పబడే ఆనందమయుడు ముక్తిపొందిన జీవుడు కాలేడు.

*॥ సి. సూ.॥ భేదవ్యపదేశాచ్చ॥ 1-1-18 ॥*

**భేదవ్యపదేశాత్ చ=** (జీవునికంటెను) ఆనందమయుడికి భేదాన్ని చెప్పటంవల్ల (ఆనందమయుడు జీవుడికంటె వేఱైనవాడు)

*74.* *"తస్మాద్వా" ఇతి వాక్యేన విజ్ఞానమయశబ్దితాత్।*
*అస్యానన్దమయస్యోక్తో భేదో జీవాదతః పరః॥*

74. *"తస్మాద్వా ఏతస్మాత్ విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽఽనన్దమయః॥"* (తై.ఆన.5) [అటువంటి ఈవిజ్ఞానమయుడికంటె వేఱైనవాడై, సూక్ష్మమైనవాడై, ఆత్మగానున్నవాడు ఆనందమయుడు] అని విజ్ఞానమయుడైనజీవునికంటె ఆనందమయుడు వేఱనిచెప్పటంచేత, ఈతడు బ్రహ్మమే ఔతాడు. విజ్ఞానమయుడనటం బుద్ధినిగాదు, జీవుడినే అనేవిషయం ఇంతకుముందే *"ఆనందమయోఽభ్యాసాత్"*అనే 13వ సూత్రం సిద్ధాంతంలో నిరూపించబడింది.

*॥ సి. సూ.॥కామాచ్చ నానుమానాపేక్షా॥ 1-1-19 ॥*

**కామాత్ చ=** (ఆనందమయుడి జగత్సృష్టి)కేవలసంకల్పంచేతనే ఔతుంది; **న అనుమానాపేక్షా=** ప్రకృతిని అపేక్షించలేదు. (దీనివల్లకూడా, ఆనందమయుడు జీవుడికంటె వేఱైనవాడు.)

*75.* *సంకల్పేన జగత్సృష్టిర్నాజాపేక్షాఽస్య విద్యతే।*
*జీవస్య తదపేక్షాఽల్పేప్యతశ్చాయం పరః పుమాన్॥*

75. *"సోకామయత। బహుస్యామ్"* (తై.ఆన.6) [ఆనందమయుడు సంకల్పించెను- "అనేకములుగా అవడానికి తగినవాడిని(అగుదునుగాక)" అని] అనేవాక్యంలో ఆనందమయుడు లోకాన్ని సృష్టించేటపుడు 'కామమ్' అనేసంకల్పంచేత సృష్టిస్తాడు అనబడుతోంది. దీన్నుంచి జీవుల్లా ఈతడు శరీరేంద్రియాలతో సృష్టిచేయలేదని తెలుస్తోంది. జీవుడికిమాత్రం ఒకచిన్నకుండని చెయ్యడానికికూడ శరీరం, ఇంద్రియాలు మొదలైనవి లేకపోతే శక్యంగాదు. అంచేత అనుమానమని పిలవబడే ప్రకృతిపరిణామమైన శరీరేంద్రియాలు లేకుండా లోకాన్ని సంకల్పంచేతనే సృష్టించే ఆనందమయుడు జీవుడు కానేరడు.

*॥ సి. సూ.॥ అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి॥ 1-1-20 ॥*

**అస్మిన్=** ఈ ఆనందమయుడి విషయంలో, **అస్య చ=** ఈజీవుడికి, **తత్ యోగం=** ఆఆనందంతో కూడి ఉండడం, **శాస్తి=** (వేదవాక్యం) శాసిస్తోంది- విధిస్తోంది; (అంచేతకూడా ఆనందమయుడు జీవుడికంటె భిన్నమైనవాడే)

*76.* *ఆనన్దయోగ ఆనన్దమయే జీవస్య కథ్యతే।*
*"రసం హ్యేవే"త్యాది వాక్యాత్తస్మాజ్జీవాన్య ఇష్యతే॥*

*॥ఇతి ఆనన్దమయాధికరణమ్॥*

76. *"రసోవైసః। రసం హ్యేవాయం లబ్ధ్వాऽऽనన్దీ భవతి"* (తై.ఆన.7-1) [ఆఆనందమయుడు రస స్వరూపుడు కదా! ఈరసస్వరూపినిపొంది ఈజీవుడుకూడా, ఆనందముగలవాడౌతాడు] అనేవాక్యంలో జీవుడు ఆనందమయుడినుండి ఆనందాన్నిపొందుతాడని చెప్పబడుతోంది. దీనివల్లకూడా ఆనందమయుడు జీవుడికంటె వేఱైన పరమాత్మేఅయియుండాలి. ఈకారణాలన్నింటిచేతా, తైత్తిరీయోపనిషత్తులో చెప్పబడిన ఆనందమయుడు జీవుడికంటె వేఱైన బ్రహ్మమని నిరూపింపబడింది.

*ఆనందమయాధికరణము పూర్తి అయినది.*

## ॥ అంతరధికరణమ్ ॥ 1-1-7 ॥

### ॥ సి. సూ.॥అన్తస్తద్ధర్మోపదేశాత్॥ 1-1-21 ॥

**అన్తః=** (ఆదిత్యుడికీ, కంటికీ) లోపలున్నవాడు (పరమాత్మే); **తద్ధర్మోపదేశాత్=** పరమాత్మకే తగిన ధర్మాలని ఉపదేశించినందువల్ల.

*77.* *జీవసామాన్యస్య పూర్వం కారణత్వం నిరాకృతమ్।*
*తద్విశేషే తదాశఙ్క్య న్యాయేఽముష్మిన్నిరస్యతే॥*

77. సామాన్యంగా జీవులు జగత్కారణంగాఉండడం సాధ్యంగాదని ఆనందమయాధికరణంలో నిరూపించబడింది. అశక్తులైన సామాన్యజీవులకి జగత్కారణత్వమనే గొప్పదనం సాధ్యంగానిదైనా, విశేషశక్తిగల ఆదిత్యపురుషుడు, అక్షిపురుషుడు మొదలైన విశేషజీవులకి జగత్కారణత్వం తగునని పూర్వపక్షిద్వారా శంకించి, ఆశంక ఈఅధికరణంలో తొలగింపబడుతోంది.

*పూ.78.* *ఛాందోగ్యే యో "య ఏషోఽన్త"రితి వాక్యే శ్రుతః పుమాన్।*
*అక్ష్యాదిత్యాధారతయా స చ జీవో విలక్షణః॥*

**79.* *శరీరవత్త్వశ్రవణాత్ జీవా ఏవహి తద్యుజః।*

78-*79. **పూర్వపక్షం:** *"యఏషోన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే, హిరణ్యశ్మశ్రుః హిరణ్య కేశః ఆప్రణఖాత్ సర్వఏవసువర్ణః। తస్య యథా కప్యాసం పుండరీకమేవమక్షిణీ"* (ఛాం. 1-6-6) [ఆదిత్యుడిలో ఏబంగారంతోనిండిన పురుషుడున్నాడో, ఆతనికి బంగారుమీసం, బంగారుకేశాలూ, గోళ్ళూ మొదలైనవన్నీ, బంగారుమయమై యుంటాయి. ఆతనికి సూర్యుడివల్ల వికసించిన తామరలవంటి రెండుకళ్ళున్నాయి] అనీ, "*యఏషోన్తరక్షిణీ పురుషో దృశ్యతే... తస్యైతస్య తదేవరూపం యదముష్యరూపమ్*" (ఛాం.1-7-5) [కంట్లో ఏపురుషుడు కనబడుతున్నాడో, వాడికి ఆదిత్యపురుషుడిలోఉన్నట్లుగానే రూపంఉన్నది.] అని ఛాందోగ్యంలో ఆదిత్యుడిలోను, అక్షిలోను ఉన్నవాడిగా చెప్పబడే పురుషుడు శక్తులధికంగానున్నజీవుడే అయియుండాలి. ఎంచేతంటే ఆతడికి శరీరముందని చెప్పబడిందిగదా! శరీరం జీవులకేగదా ఉన్నది! అంచేత ఈతడు జీవుడే అయిఉండాలి. జీవుడైనా, విశేషశక్తిని కలిగినవాడవటంచేత ఈతడు జగత్సృష్టి చేయటం తగును.

సి.79*. మైవమక్ష్యాదిత్యవర్తీ పరమాత్మైవ నేతరః।

80 ఉపదేశాదపహతపాప్మత్వాదిగుణావలేః।

శరీరవత్త్వం న స్యాద్ధి కర్మవశ్యత్వసాధకమ్॥

81. అప్రాకృతస్స్వానురూపో దివ్యమంగళవిగ్రహః।

స్వేచ్ఛాగృహీత ఏవాస్తీత్యామ్నాయైర్జ్ఞాయతేఽఖిలైః॥

79*-81.**సిద్ధాంతం.** ఈపూర్వపక్షంసరిగాదు. ఆదిత్యమండలంలో, అక్షిలో ఉన్నవాడు పరమాత్మే తప్ప జీవుడుగాడు. *"సఏషసర్వేభ్యః పాప్మభ్యః ఉదితః"* (ఛాం. 1-6-7) [ఈఆదిత్య పురుషుడు అన్ని పాపాలకీ ఆవలివాడు.], *"తస్య ఋక్చసామచ గేష్ణౌ"* (ఛాం.1-6-7) [అతనికి ఋగ్వేదం, సామవేదం గాయ కులు], *"సైవఋక్ తత్సామతదుక్థం తద్యజుస్ తద్బ్రహ్మ"*(ఛాం.1-7-5) [అక్షిపురుషుడైనఅతనే ఋగ్వేదం, సామవేదం అయేడు, ఉక్థంఅనేమంత్రం అయేడు. యజుర్వేదంఅయేడు. బ్రహ్మంఆయెను.] అని సూర్య మండలంలో, అక్షిలోనున్నపురుషుడికి పాపాలంటకుండటం, వేదాలచేతగానంచెయ్యబడటం, బ్రహ్మంగా ఉండటంమొదలైన పరమాత్మగుణగణాలున్నాయని చెప్పబడటంచేత ఈపురుషుడు పరమాత్మగాఉంటాడే తప్ప జీవుడుగాఉండడంసాధ్యంగాదు. శరీరంగలవాడుగనుక వీడు కర్మవశ్యుడైనజీవుడనటం సరిగాదు. *"ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్"* (పు. సూ.) [ప్రకృతికిఆవలివాడైన సూర్యుడివంటి తేజస్సు గలవాడై అవతరించిఉన్న మహాపురుషుడిని], *"సర్వేనిమేషాజజ్ఞిరే విద్యుతః పురుషాదధి"* (తై.నా. 1-8) [మెరుపు వంటి కాంతిగలపురుషుడినుండి కాలమంతా సృష్టింపబడింది], *"నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా"* (తై.నా. 11) [నీలమేఘంలోనున్నమెరుపుతీగలాగ ప్రకాశించేది.], *"పురుషం కృష్ణపింగళం"* తై.నా. 12) [నలుపు, పసుపు కలసినరంగుగల పురుషుడు] మొదలైన వేదవాక్యాలనించీ, భగవద్గీతమొదలైన ఉప బృంహణవాక్యాలనించీ, ప్రకృతికార్యంకానిదై పరమపురుషుడైనవాడికేతగినదై, తనఇష్టప్రకారం నడుచుకొనే దివ్యమంగళవిగ్రహం పరమాత్మకుంటుందని తెలుస్తోంది. అంచేత అక్షిమండలం ఆదిత్య మండలాల్లో ఉండే పురుషుడు పరమాత్మే అయియున్నాడు.

## ॥ సి. సూ.॥ భేదవ్యపదేశాచ్చాన్యః॥ 1-1-22 ॥

**భేదవ్యపదేశాత్ చ=** (ఆదిత్యుడు మొదలైన జీవులకంటే) భేదాన్ని చెప్పటంచేతను, **అన్యః=** ఈతడు జీవుడికంటె వేఱైన పరమాత్మే.

82. "య ఆత్మనీ"త్యాదివాక్యైరాదిత్యముఖజీవతః।

భేదోపదేశాత్ అన్యోఽన్తరాత్మా నారాయణః ప్రభుః॥

॥ఇత్యంతరధికరణమ్॥

82. *"యఆత్మని తిష్ఠన్ ఆత్మనోన్తరోయమాత్మా నవేద, యస్యాత్మా శరీరం, యఆత్మానమంతరో యమయతి"* (బృహ.5-7-22) [ఎవడు ఆత్మలోనించున్నాడో ఆత్మాంతరాల్లో యున్నాడో, ఎవడిని ఆత్మ తెలుసుకొనలేదో, ఎవడికి ఆత్మ శరీరమో, ఎవడు ఆత్మని లోపలినుంచి నియమిస్తాడో], *"యఆదిత్యే తిష్ఠన్ ఆదిత్యాదంతరో యం ఆదిత్యో నవేద, యస్యాదిత్యః శరీరం యఆదిత్యమంతరో యమయతి"* (బృహ. 5-7-9) [ఎవడు ఆదిత్యుడిలోనించున్నాడో, ఆదిత్యుడిలో ఉండి నియమిస్తున్నాడో], *"యో క్షరమంతరో సంచరన్ యస్యాక్షరంశరీరం యమక్షరం నవేద... ఏషసర్వభూతాంతరాత్మాఽపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణః"* (సుబాలో-7) [ఎవడు అక్షరమనబడే జీవుడితోకూడిన అచేతనంలో సంచరిస్తాడో, ఎవరికి ఆఅక్షరము శరీరమో, ఎవడు ఆఅక్షరానికి తెలియడో, అట్టివాడే అన్నిభూతాలకిన్నీ అంతర్యామిగా

పాపంలేనివాడై పరమపదంలోనుండే సాటిలేని నారాయణుడనే దేవుడు] అని ఆదిత్యుడు మొదలుగాగల అందరుజీవులనీ ఈతనికి శరీరంగాను, ఇతనిని వాళ్ళకి ఆత్మగాను చెప్పి ఇలాగ జీవులకంటే, ఇతనికి భేదాన్ని చెప్పటంచేత అటువంటివాడు ఈజీవుడికంటె భిన్నమైన పరమాత్మే అవుతాడు.

*అంతరధికరణము పూర్తియైనది.*

## // ఆకాశాధికరణమ్ // 1-1-8 //

## // సి.సూ.ఆకాశస్తల్లిఙ్గాత్ // 1-1-23 //

**ఆకాశః=** ఆకాశమనబడేది (పరమాత్మే), **తల్లిఙ్గాత్=** పరమాత్మకేతగినచిహ్నాలు కనబడటంచేత.

83. *కారణం వస్తు నిర్ణీతం చిదచిద్భ్యాం విలక్షణమ్।*
*తదసఙ్గతమిత్యేష వాదోఽత్ర వినివార్యతే॥*

83. వెనకటి అధికరణంలో చేతనులకంటెను అచేతనవస్తువులకంటెను భిన్నమైన బ్రహ్మమే జగత్కారణమని నిర్ణయించటం జరిగింది. "ఇది సరిగాదు, వేదాంతాలు ఆకాశం జగత్కారణమని చెప్పటంచేత" అనే పూర్వపక్షవాదం ఇక్కడ నిరసింపబడుతోంది.

పూ.84. *సామ్ని "సర్వాణి హ"త్యాదౌ కారణత్వేన సంశ్రుతః।*
*ఆకాశో వియదేవ స్యాత్ లోకే తత్ర ప్రయోగతః॥*

85 *కుతో భూతాని జాయన్త ఇత్యనిర్ధారణే సతి।*
*'ఆకాశా'దితివాక్యం స్యాద్విశేషార్థసమర్పకమ్॥*

84-85. **పూర్వపక్షం.** సామవేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తులో ***"సర్వాణి హవా ఇమాని భూతాని 'ఆకాశాదేవ సముత్పద్యన్తే ఆకాశం ప్రత్యస్తం యన్తి"*** (ఛాం. 1-9-1) [ఈసమస్తభూతాలున్నూ ఆకాశంనుంచి గదా జన్మించేయి; ఆకాశంలోనే కలిసిపోతున్నాయికూడా] అనేవాక్యం చెప్పబడుతోంది. దీనివల్ల జగత్కారణ వస్తువు ఆకాశమేఅని సిద్ధిస్తోంది. లోకంలో ఆకాశశబ్దం పంచభూతాల్లోను మొదటిదైన భూతాన్నే చెప్తోందని ప్రసిద్ధం. ***"సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్"*** (ఛాం. 6-2-1) [ఈలోకం మొదట 'సత్'గానేఉన్నది.] మొదలైన వాక్యాల్లో జగత్కారణమైనది 'సత్'మొదలైన సామాన్యశబ్దాలచేతనే చెప్పబడుతోంది. వీటన్నిటివల్ల జగత్కారణం ఫలానాదని స్పష్టంచేయబడలేదు. ఈవాక్యం ఆకాశమనే విశేషశబ్దాన్ని ప్రయోగించటంచేత ప్రసిద్ధమైన ఆకాశమే జగత్కారణమని చూపిస్తోంది. అందువల్ల ఆకాశమే వేదాంతవాక్యాల్లో చెప్పబడ్డ జగత్కారణవస్తువని సిద్ధిస్తోంది.

సి.86. *మైవమత్రాకాశశబ్దవాచ్యః పరమపూరుషః।*
*వియదన్యస్తదేకాన్తలిఙ్గానాం భూయసాం శ్రుతేః॥*

87 *సిద్ధానువాదరూపం చ శ్రూయతే వాక్యమత్ర హి।*
*అతః ప్రమాణాన్తరస్య ప్రాప్తిమేతదపేక్షతే॥*

88 *బోధయత్యఖిలం మానం బ్రహ్మ నారాయణాహ్వయం।*
*వ్యుత్పత్త్యాఽఽకాశత ఇతి తస్య తచ్ఛబ్దవాచ్యతా॥*

*// ఇత్యాకాశాధికరణమ్ //*

సిద్ధాంతం. 86-88.***"ఆకాశాదేవ సముత్పద్యన్తే... ఆకాశోహ్యేవైభ్యో జ్యాయాన్ ఆకాశః పరాయణమ్"***

(ఛాం. 1-9-1) [ఆకాశంనుండి అన్నిభూతాలూ పుట్టేయి....ఆకాశమే వీటన్నిటికంటే పెద్దది. ఆకాశమే వీటికి ఉత్తమమైనగతి.]అని ఇక్కడ ఆకాశానికి సర్వజగత్కారణంగాఉండటం, అన్నింట్లోను గొప్పదిగా ఉండటం, ఉత్తమమైనగతిగాఉండటం మొదలైన పరమాత్మకేతగిన లక్షణాలని చెప్పటంచేత ఈ ఆకాశం ప్రసిద్ధాకాశంకంటె భిన్నమైన పరమాత్మే కావాలి. 'సత్' మొదలైన సామాన్యశబ్దాలు 'ఆకాశమ'నేవిశేషాన్ని సూచిస్తుందని ఈవాక్యం చూపుతోందనటం సరిగాదు. *"సర్వాణి హవై"* అనిమొదలయ్యే ఈవాక్యంలో **"హవై"** అనేపదం మిగతాశ్రుతుల్లో 'ప్రసిద్ధమైన అర్థమే ఇది' అని చూపిస్తోంది. *"సదేవ సోమ్య"* (ఛాం. 6-2-1), *"ఆత్మావా ఇదమగ్ర ఆసీత్"* (ఐతరేయ. 1-1-1) [ఈలోకము ఆత్మగనే మొదట ఉండెను.], *"ఆత్మనః ఆకాశః సంభూతః"* (తై. ఆనం. 1-2) [ఆత్మనుండి ఆకాశము పుట్టినది], *"ఏకోహవై నారాయణ ఆసీత్ నబ్రహ్మా నేశానః"* (మహోపనిషత్) [నారాయణుడు ఒక్కడే మొదట ఉండెను. బ్రహ్మయు లేడు శివుడును లేడు], *"నారాయణాత్ బ్రహ్మా జాయతే నారాయణాత్ రుద్రో జాయతే"* (నారాయణోపనిషత్) [నారాయణునినుండి బ్రహ్మ జనించెను. నారాయణునినుండి రుద్రుడు జనించెను] మొదలైన వేదవాక్యాలు సామాన్యవిశేష న్యాయంవల్ల పరమచేతనుడైన నారాయణుడే జగత్కారణభూతుడని చూపుతున్నాయి. అంచేత, అచేతనమైన ఆకాశం కారణంగా ఉండసాధ్యంగాదు. *"ఆసమన్తాత్ కాశతేఇతి ఆకాశః"* (అంతటా ప్రకాశించేవాడవటంచేత ఆకాశము అనబడుతున్నవాడు పరమాత్మ) అనే వ్యుత్పత్తి ప్రకారం ఆకాశశబ్దం పరమాత్మనే సూచిస్తోంది. నారాయణాదిశబ్దాలు ఆకాశాన్ని సూచించవీలుగాదు. అంచేత ప్రసిద్ధమైన ఆకాశంకంటె భిన్నమైన పరమాత్మే ఈవాక్యంలో చెప్పబడ్డ జగత్కారణం.

*ఆకాశాధికరణం పూర్తి అయింది.*

## *// ప్రాణాధికరణమ్ // 1-1-9 //*

### *సి.సూ // అత ఏవ ప్రాణః // 1-1-24 //*

**అతః ఏవ**=(పరమాత్మకేతగిన చిహ్నాలుకనబడటం అనే) ఈకారణంచేతనే, **ప్రాణః**= ప్రాణం అనబడేదికూడా పరమాత్మే.

*89.* *పూర్వత్ర వియతస్సర్వకారణత్వం నిరాకృతమ్।*
*నిరస్యతేఽత్ర వాయోశ్చ కారణత్వం పరోదితమ్॥*

89. వెనుకటి అధికరణంలో ఆకాశమే జగత్కారణమనే సందేహం పోగొట్టబడింది. ఇక్కడ వాయువే జగత్కారణం అని కొంతమంది చేసేవాదం నిరాకరింపబడుతోంది.

*90.* *సామ్ని "సర్వాణి హే"త్యాది శ్రూయతే వాక్యమత్ర చ।*
*ఆకాశశబ్దవత్ప్రాణశబ్దోఽపి బ్రహ్మబోధకః॥*
*91.* *పరాసాధారణాల్లిఙ్గాత్ప్రసిద్ధవదుదాహృతాత్।*
*శఙ్కాఽధికా త్వత్ర భూతజాతస్థిత్యాదికస్య చ॥*
*92.* *ప్రాణాధీనత్వతో వాయుర్భూతం కారణమస్త్వితి।*
*పరిహారశ్శిలాదౌచ చిత్స్వరూపే చ నేతి తత్॥*

*// ఇతి ప్రాణాధికరణమ్ //*

90-92. **సిద్ధాంతము:** ఛాందోగ్యోపనిషత్తులో *"సర్వామి హ వా ఇమాని భూతాని ప్రాణమేవా*

*భిసంవిశన్తి ప్రాణమభ్యజ్జిహతే"* (ఛాం. 1-11-4) [ఈఅన్నిభూతాలున్నూ ప్రాణంలోనే లయం పొందుతాయి. ప్రాణములోంచే వెలికివస్తాయి] అనేవాక్యం ఉన్నది. ఇక్కడ ప్రాణమనబడేది అన్నిజీవరాసులు జీవించటానికి కారణమైన ప్రాణవాయువేనని పూర్వపక్షి భావిస్తున్నాడు. అన్నిభూతాలున్నూ ప్రాణవాయువువల్లనే జీవించటం, వ్యవహరించటంచేతనూ, అదే ఆకాశంకంటే జగత్కారణమవటానికి తగిఉందని భావిస్తున్నాడు.. ఈవాదం సరిగాదని ఈఅధికరణంలో నిరాకరింపబడుతోంది. అన్ని భూతాలున్ను వీనియందే లయించటంవల్ల వాటికి ఉత్పత్తిస్థానంగానుండటం మొదలైన స్వభావాలు పరమాత్మకే తగునుగాని ప్రాణవాయువుకి తగదు. వెనుకటి అధికరణంలోలాగే ఇక్కడకూడ **"హవై"** అని ప్రసిద్ధిని చూపేపదం ఉండటంతో మిగతవేదవాక్యాల్లో జగత్కారణుడిగా చెప్పబడిన పరమాత్మనే ప్రాణమనిచెప్పినట్లుగా గ్రహించాలి. అన్నిజీవరాసులనీ 'ప్రాణనము'గ (జీవించియుండునదిగ) చేసేవాడవటంచేత పరమాత్మే ప్రాణమనబడటానికి తగినవాడు. సమస్తభూతాలున్నూ ప్రాణవాయువువల్లనే జీవించియుంటాయనీ, పనిచేస్తున్నాయనీచెప్పటం సరిగాదు. జీవరాసులశరీరాలు ప్రాణంవల్లనే బ్రతికి వ్యవహరించేటట్టు చేయటమేతప్ప జీవస్వరూపం ప్రాణంవలన బ్రతికియుండటంగాని వ్యవహారంచేయటంగాని జరుగదు. ఇంకా, రాయి, కర్ర మొదలైన జీవశరీరాలు ప్రాణంచేత బ్రతికియుండటంగాని, పనిచేయటంగాని మనంచూడలేదు. అందుచేత ఆకాశానికి, ప్రాణానికీ ఈవిషయంలో భిన్నత్వంలేదు. కనుక, ప్రసిద్ధమైన ప్రాణంకంటె భిన్నమైన పరమాత్మే ఈవాక్యంలో చెప్పబడిన జగత్కారణం.

*ప్రాణాధికరణము పూర్తి అయినది.*

## *॥ జ్యోతిరధికరణమ్ ॥ 1-1-10 ॥*

### *॥ సి. సూ. ॥జ్యోతిశ్చరణాభిధానాత్ ॥ 1-1-25 ॥*

**చరణాభిధానాత్=** (అన్ని భూతాలున్నూ) ఈజ్యోతిస్సుయొక్క ఒకపాదంగా చెప్పబడటంచేత, **జ్యోతిః=** జ్యోతిస్సు అనబడేది (పరమాత్మే)

**93.** *నిరాకృత్యా ఽ ఽకాశవాయ్వోః కారణత్వమథ క్రమాత్।*
*తేజసః కారణత్వం చ న్యాయేఽ ముష్మిన్నిరస్యతే॥*

93. ఆకాశాధికరణంలో పంచభూతాల్లోను మొదటిదైన ఆకాశం జగత్కారణం అనేపక్షం నిరాకరింపబడింది. తరువాతి ప్రాణాధికరణంలో *"ఆకాశాద్వాయుః"* (తై.ఆనం. 1) అన్నట్లుగ ఆకాశంనుండి ఉద్భవించినదై రెండోభూతమైన వాయువును జగత్కారణంగా చెప్పే పక్షంగూడ నిరసింపబడింది. తరువాతి మెట్టుగ ఈఅధికరణంలో *"వాయోరగ్నిః"* (తై.ఆనం. 1) అనిచెప్పిన ప్రకారం వాయువునుండి పుట్టినదై మూడోభూతమైనఅగ్నిని జగత్కారణంగాచెప్పే వాదం తిరస్కరింపబడుతోంది.

**పూ. 94.** *"అతః పరో దివో జ్యోతి"రితి వాక్యేఽతిదీప్తిమత్।*
*శ్రూయతే తత్కారణం స్యాత్కౌక్షేయజ్యోతిషా సహ॥*

***95.** *ఐక్యోపదేశాచ్ఛ్రుత్యోక్తం ప్రసిద్ధజ్యోతిరస్తు తత్।*

**పూర్వపక్షం:** 94-*95. *"అథ యదతఃపరోదివోజ్యోతిర్దీప్యతే విశ్వతః పృష్ఠేషు సర్వతః పృష్ఠేషు అనుత్తమేషు ఉత్తమేషులోకేషు, ఇదం వావతద్యదిదమంతః పురుషే జ్యోతిః"* (ఛాం. 3-13-7) [వ్యష్టిపదార్థాలకిన్నీ సమష్టిపదార్థములకిన్నీ ఆవల పరమపదానికవతల వాటికిమించినదిలేని, అతివిశిష్టమైన లోకాల్లో ఏది ఒకజ్యోతిస్సనే ప్రకాశాన్నిస్తోందో, అదే ఈమనుష్యుడిలోపల ప్రకాశించే (జాఠరాగ్ని అనెడి) జ్యోతి అగును.]

అని ఛాందోగ్యోపనిషత్తులో ఒకవాక్యం వివరిస్తోంది. అందులో సాటిలేనితేజస్సుగలదానిగా చెప్పబడే జ్యోతిస్స నబడేది మనుష్యుడి జఠరంలోఉండే జాఠరాగ్నితో ఒకటిగా చెప్పబడటంచేత లోకంలో ప్రసిద్ధమైన అగ్ని, సూర్యుడు మొదలైన అచేతనమైన జ్యోతులలో ఒకటి అవాలి. ఈవాక్యంలో ప్రసిద్ధిని చూపే *"యత్"* అనే పదమున్నా, ఆకాశప్రాణాధికరణవాక్యాలలోలాగ ఈవాక్యంలో పరమాత్మకేతగిన చిహ్నాల్లో ఒక్కటికూడా లేదు. *"పరంజ్యోతిరుప సంపద్య"* (ఛాం. 8-3-4) [పరంజ్యోతిని పొంది], *"తస్యభాసా సర్వమిదం భాతి"* (ముండ. 2-2-11) [ఆపరంజ్యోతియొక్కతేజస్సుచేత అన్ని జ్యోతులును ప్రకాశిస్తున్నవి.] వంటి మరికొన్ని వేదవాక్యాల్లో కూడా అన్ని జ్యోతులకీ ప్రకాశాన్నిచ్చే అచేతనమైన పరంజ్యోతి ఒకటే జగత్కారణంగా చెప్పబడుతోంది. అందుచేత, ఈవాక్యంలో జ్యోతిగా అధ్యయనం చేయబడేది పంచభూతాల్లో ఒకటైన తేజస్సే అయియుండాలి.

*సి.95*.* *మైవం జ్యోతిశ్శబ్దవాచ్యమత్ర బ్రహ్మైవ నేతరత్॥*

*96.* *పూర్వవాక్యే సర్వభూతచరణత్వాభిధానతః।*

*తచ్చ బ్రహ్మణ ఏవ స్యాత్పుంసూక్తాదిప్రసిద్ధితః॥*

95*-96. **సిద్ధాంతం.** ఈపూర్వపక్షంసరిగాదు. ఈప్రకరణంలోనున్నదీ, దీనికిముందరదీ అయిన ఒకవాక్యంలో *"పాదోస్య సర్వాభూతాని త్రిపాదస్యామృతం దివి"* (ఛాం. 3-12-6) [ఈ(పరమమైన వస్తువుకు) పరమాత్మకన్నిభూతాలూ ఒకపాదమవుతాయి. ఈపరమాత్మయొక్క మిగిలినమూడు పాదాలు పరమపదములోనున్నాయి.] అని ఈజ్యోతిని గురించి చెప్పబడింది. ఈలోకంలోనున్న అన్నిభూతాలున్నూ ఒకపాదంగ చెప్పటంఅనేఈవిశేషం పురుషసూక్తంమొదలైనవాటిలో పరంజ్యోతిగ వల్లెవేయబడుతున్న నారాయణుడికే చెప్పబడింది. లోకంలోకానవచ్చే జ్ఞానంలేనిజ్యోతులకి ఈమహత్వం కుదరదు. కనుక నారాయణవల్లి మొదలైనవాటిలో పరంజ్యోతిగా వచింపబడిన నారాయణుడే ఇక్కడ చెప్పబడిన పరంజ్యోతి అయియుండాలి. *"ఆదిత్యవర్ణం తమసఃపరస్తాత్"* (పుసూ.) [తమస్సుకు ఆవల సూర్యుడివంటి ప్రకాశంగలవాడిని], *"విద్యుల్లేఖేవ భాస్వరా"* (తై.నా.-11) [మెరుపుతీగవంటి ప్రకాశంగల దివ్యమంగళ శరీరం], *"దివిసూర్య సహస్రస్య భవేత్ యుగపదుత్థితా। యది భాఃసదృశీ సాస్యాత్ భాసస్తస్య మహాత్మనః॥"* (భ.గీ.11-12) [ఆకాశంలో వేయిసూర్యులప్రకాశం ఒకేసమయంలో ఉన్నట్లైతే అది ఆమహాపురుషుడి తేజస్సుకు సాటి అవుతుంది]అని శ్రుతిస్మృతుల్లో పరమాత్మయొక్క దివ్యమంగళవిగ్రహాన్ని జ్యోతిమయ మైనదని చెప్పటంచేత పరమాత్మని అన్నిజ్యోతులకీ ప్రకాశాన్నిచ్చే పరంజ్యోతిఅని చెప్పటం తగినదే అవుతుంది. జాఠరాగ్నితోబాటు ఈతడిని ఒకడినిగా చెప్పటం, జాఠరాగ్నికీన్నీ ఈతడే అంతర్యామిగానున్నాడు అనే భావనలోనిదే అవుతుంది. *"చక్షుష్యః శ్రుతో భవతి యఏవం వేద"* (ఛాం. 3-13-8) [ఎవడు ఈవిధముగ పరంజ్యోతిగ జాఠరాగ్నిస్వరూపంగ తెలియబడుతున్నాడో, ఆతడు కంటికి ప్రీతిని కలిగించేవాడుగను, గొప్పకీర్తిగలవాడుగను అయియున్నాడు] అని తరువాతిమెట్టుగ ఫలాంతరం ఒకటని చెప్పటంచేత, ఈఫలం కోసం పరంజ్యోతిని జాఠరాగ్నిగా ధ్యానించాలని ఇక్కడ విధించబడుతోందని స్పష్టం. *"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః"* (భ.గీ. 15-14) [నేనేజాఠరాగ్నిగ ప్రాణులదేహమందుంటున్నాను]అని భగవద్గీతలో భగవానుడేతాను జాఠరాగ్నిగ నుండటాన్ని చెప్పేడు. అంచేత ఇక్కడ జ్యోతియనబడేది పరంజ్యోతియైన నారాయణుడే.

*॥ సి. సూ.॥ ఛందోభిధానాన్నేతిచేన్న తథాచేతోర్పణనిగమా త్తథాహి దర్శనమ్ ॥ 1-1-26 ॥*

**ఛందోభిధానాత్=** (వెనకటివాక్యం ఒకదానిలో) గాయత్రీఛందస్సును చెప్పటంచేత, **న=** *(పాదోస్య సర్వాభూతాని"* అనే మంత్రంలో చెప్పబడింది) బ్రహ్మం గాదు, **ఇతి చేత్=**అని చెప్పితే, **న=** అది సరిగాదు.

**తథాచేతోర్పణ నిగమాత్=** బ్రహ్మమును గాయత్రీసదృశంగా మనసులోఅనుసంధించేటట్లు ఉపదేశించటంచేత, **తథాహిదర్శనమ్=** అలాగే (సాదృశ్యతచేత ఛందస్సునిచెప్పి శబ్దం వేరొకటిగ చెప్పటం) మరొక వేదవాక్యంలో చూస్తున్నాంగద!

*పూ. *97.* *పూర్వవాక్యోక్తగాయత్రీఛన్ద ఏవాత్ర గీయతే।*

*97. **పూర్వపక్షం.** ఈప్రకరణంలో మొదటనున్న ఒకవాక్యంలో *"గాయత్రీ వా ఇదం సర్వమ్"* (ఛాం. 3-12-1)[గాయత్రియే ఇవిఅన్నీ]అనిచెప్పి *"తదేతదృశాభ్యనూక్తం"* (ఛాం.3-12-5) అని ఆగాయత్రీమహాత్మ్యం తరువాతవచ్చే ఋక్కుచేత చెప్పబడుతోందని చెప్పి, ఆతరువాతి వాక్యంగా *"పాదోస్య సర్వాభూతాని"* (ఛాం. 3-12-6) అనేమంత్రంలో నాలుగుపాదాలున్న గాయత్రిమహిమను వివరించటంద్వారా ఈమంత్రంలో పరమాత్మనేచెప్పినట్టు చెప్పటంసరిగాదు. కనుక దీనిననుసరించే పరంజ్యోతినిచెప్పే (3-13-7)వాక్యంకూడా పరమాత్మనేచెప్పేదిగా గ్రహించాలనే ఆవశ్యకతలేదు. అందువలన జగత్కారణమైన ఈజ్యోతి భూతాలలోని దయిన ఒకజ్యోతిస్సే అవుతుంది.

*సి.97** *ఋచా తదర్థబోధిన్యా న తద్బ్రహ్మేతి చేన్నతత్।।*

*98.* *పరే ఫలాయ గాయత్రీతౌల్యదృష్టిర్విధీయతే।*

*చతుష్పదో బ్రహ్మణోఽస్య తాదృశా చ తయా తులా।।*

**99.* *దృష్టస్సంవర్గవిద్యాదౌ తౌల్యే ఛన్దోవచోన్వయః।*

97*-*99.**సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాదు. *"చక్షుష్యః శ్రుతో భవతి"* (ఛాం. 3-13-8) [కంటికి ఇంపైనవాడుగను, కీర్తిగలవానిగను ఆయెను.] అనిచెప్పబడిన ఫలాంతరాన్ని పొందటానికి పరమపురుషుడిని గాయత్రికి తగినవాడినిగ ఉపాసించాలని ఇక్కడచెప్పబడుతోందేతప్ప, గాయత్రినే ఉపాసించాలని చెప్పబడ లేదు. గాయత్రియొక్క ఒకపాదం అన్నిభూతాలెట్లా అవుతాయి? ఈమహత్తు గాయత్రికే ఉన్నట్లైతే, నాలుగు పాదాలున్న గాయత్రిలాగ బ్రహ్మం నాలుగుపాదాలుగలదని, మనసులో అనుసంధించుకోవాలనీ ఉపదేశించటంకోసమే బ్రహ్మాన్ని గాయత్రిఅని వేదంచెప్తోందని గ్రహించితీరాలి. సామాన్యంగ గాయత్రి ఛందస్సు మూడుపాదాలు గలిగినదిగద! ఎంచేతంటే, *"ఇంద్రః శచీపతిః। వలేన పీడితః। దుశ్చ్యవనో వృషా। సమిత్సుసాసహిః।"* అన్నమంత్రంలో గాయత్రీఛందస్సు నాలుగుపాదాలున్నదిగా కనబడటంలో దోషంలేదు. సంవర్గవిద్యలో *"తేవా ఏతే పంచాన్యే పంచాన్యే దశసంపద్యన్తే"* (ఛాం. 4-3-8) [అగ్ని, సూర్యుడు, జలము, చంద్రుడు, వాయువు అనే ఐదున్నూ, వాక్కు, కన్ను, చెవి, మనస్సు, ప్రాణము అనేఐదూ, కలిసి పది అయినాయి] అనిచెప్పి, పదిఅని లెక్కకి సాదృశ్యాన్నితీసుకొని *"సైషా విరాట్"* (ఛాం. 4-3-8) [ఆవిధంగా ఈ పదీ విరాట్ అవుతాయి] అని పదిఅక్షరాలతో 'విరాట్'అనే ఛందస్సుగానే అగ్నిమొదలైన పదివస్తువులూ అను-సంధింపబడ్డాయి. అదేవిధంగ ఇక్కడకూడ నాలుగుపాదాలున్నబ్రహ్మము నాలుగు పాదాలున్న గాయత్రితో సదృశంగ అనుసంధించేదనిగ్రహించటంలో దోషంలేదు. కనుక ఇక్కడచెప్పబడినపరంజ్యోతి నారాయణుడే!

*।। సి. సూ.।। భూతాదిపాదవ్యపదేశోపపత్తేశ్చైవమ్ ।। 1-1-27 ।।*

**భూతాదిపాదవ్యపదేశోపపత్తేః చ=** భూతములు మొదలైనవాటిని గాయత్రికి పాదంగా చెప్పటం కుదరటంకోసమే, **ఏవం=** గాయత్రి అనబడేది బ్రహ్మమనే గ్రహించాలి.

*99** *సైషా చతుష్పదేత్యుక్తిర్భూతాద్యంఘ్రిత్వబోధికా।।*

**100.* *గాయత్రీశబ్దవాచ్యేఽస్మిన్ బ్రహ్మణ్యేవోపపద్యతే।*

99*-*100. ఛాందోగ్యం మూడోప్రపాఠకం పన్నెండోఖండంలో మొదటినాలుగు మంత్రాల్లోనూ క్రమంగా అన్నిభూతాలైన ఆత్మసమూహాన్ని, కర్మఫలభోగభూమి అయినభూమిని, భోగోపకరణమైన శరీరాన్నీ, ఆత్మలుండేహృదయాన్నీచెప్పి అయిదోమంత్రంలో *"సైషా చతుష్పదా గాయత్రీ"* [ఈనాలుగింటినీ పాదాలుగాగలది గాయత్రి] అనిచెప్పబడింది. గాయత్రీఛందస్సుకి ఇవినాలుగూ నాలుగుపాదాలవటానికి వీలుగాదు. బ్రహ్మనికే ఇవి పాదాలుగా ఉండతగినవి. ఈకారణంచేతగూడ గాయత్రి అనేది బ్రహ్మమే అయి యుండాలి.

*// సి. సూ.// ఉపదేశభేదాన్నేతి చేన్నోభయస్మిన్నప్యవిరోధాత్ // 1-1-28. //*

**ఉపదేశభేదాత్=** దివి, దివః అను రెండుమంత్రాల్లోఉపదేశం వేఱువేఱుగ ఉండటంచేత, **న=** (తరువాతి మంత్రంలోచెప్పబడినది ముందరిమంత్రంలోచెప్పబడినది) కాదు, **ఇతిచేత్=** అని చెప్పితే, **న=** అదిసరిగాదు. **ఉభయస్మిన్‌అపి=** రెండుఉపదేశాల్లోను, **అవిరోధాత్=** విరోధం లేకపోవటంచేత.

*పూ. 100*   దివో దివీతి భిన్నార్థవిభక్తివ్యతిరేకతః//*

**101.   ప్రత్యభిజ్ఞాయతే నాత్ర బ్రహ్మ పూర్వత్ర సంశ్రుతమ్/*

100*-*101. **పూర్వపక్షం.** *"పాదోస్యసర్వాభూతాని త్రిపాదస్యామృతం దివి"* (ఛాం. 3-12-6) [ఈ పరమాత్మకి అన్నిభూతాలున్నూ ఒకపాదం అవుతాయి.. మూడుపాదాలు ద్యులోకంలోఉన్నాయి.]అనే వెనుకటి మంత్రంలో చెప్పబడేగాయత్రి బ్రహ్మమేఅయిఉండాలి. అయినా, తరువాతి మంత్రంలో ***"పరోదివః జ్యోతిః"*** (ఛాం. 3-13-7) (ద్యులోకంకంటె పైనున్న జ్యోతి) అని చెప్పబడిన జ్యోతి ఆబ్రహ్మము కాలేదు. ఎంచేతంటే, వెనకటి మంత్రంలో 'దివి'(ద్యులోకంలో) అని బ్రహ్మం ద్యులోకంలోఉండేదిగా చెప్పబడింది. తరువాతిమంత్రంలో ***"దివః పరః"*** (ద్యులోకానికి మీదను) అని పరంజ్యోతియైనది ఆలోకానికి మీదనున్న దానిగా చెప్పబడుతోంది. కనుక ముందరిమంత్రంలోచెప్పబడ్డ బ్రహ్మమే తరువాతిమంత్రంలోనూ చెప్పబడినదిగా గ్రహించటానికివీలుగాదు. అందుచేత, వెనకమంత్రంలో చెప్పబడింది భూతాల్లో ఒకటైన జ్యోతిస్సే అవాలి.

*సి. 101*   మైవమర్థస్వభావైక్యాదుపదేశద్వయేఽపి చ//*

*102.   అబాధాత్ప్రత్యభిజ్ఞాయాః పర ఏవాత్ర కథ్యతే/*

*కౌక్షేయెక్యోపదేశస్తు ఫలాయైవేతి నిశ్చితమ్//*

*103.   పరమాత్మాత్మకత్వంచ గీతాప్రోక్తం విభావసోః/*

*తస్మాత్స పరమాత్మైవేత్యేతదత్ర సునిశ్చితమ్//*

*// ఇతి జ్యోతిరధికరణమ్ //*

101*-103.**సిద్ధాంతం.** రెండు ఉపదేశాల్లోను అర్థభేదంలేకపోవటంచేత, రెండింటిలోనూ వేఱువేఱు తత్త్వాలు చెప్పబడుతున్నట్లుగ గ్రహించనక్కర్లేదు. చెట్టుచివరనుండేగ్రద్దని చూసి, చెట్టు శిఖరంమీదున్నగ్రద్ద అనిచెప్పినా, చెట్టుచివరపైనున్నగ్రద్ద అనిచెప్పినా భేదంలేదుకదా! అలాగే "పరమపదంలోఉన్నద"ని మొదటి మంత్రంలో ఉపదేశించినదానికీ, పరమపదానికిపైనఉన్నదని తరువాతిమంత్రంలో చెప్పినదానికీ భేదంలేక పోవటంతో, తరువాతిమంత్రంలోచెప్పిన పరంజ్యోతి, ముందరిమంత్రంలోచెప్పిన పరమపురుషుడే అవుతాడు. సౌందర్యం, కీర్తి, అనేఫలాలనిపొందటానికే ఈపరంజ్యోతిని జాఠరాగ్నితో ఒకటిగా ఉపాసించే పద్ధతి ఉపదేశించబడిందనీ, జాఠరాగ్ని అనేది పరమాత్మని అంతర్యామిగాకలిగినదనీ భగవద్గీతలో చెప్పబడిందని ఇదివరలోనే చూసేంగదా! అంచేత, ***'పరోదివో జ్యోతిః'*** (ఛాం. 3-13-7) అని చెప్పబడిన పరంజ్యోతి

*'నారాయణ పరోజ్యోతిః'* (తై.నా. 11) అని చెప్పబడిన నారాయణుడే.

*॥జ్యోతిరధికరణము పూర్తియైనది.॥*

## *॥ ఇంద్రప్రాణాధికరణమ్ ॥ 1-1-11 ॥*

### *॥ సి. సూ.॥ ప్రాణస్తథానుగమాత్ ॥ 1-1-29. ॥*

**ప్రాణః=** ప్రాణం అనబడేదీ (పరమాత్మే), **తథా అనుగమాత్=** పరమాత్మ ధర్మాలైన ఆనందం మొదలైనవాటిలో ఈప్రాణానికి చేర్తియుండటంచేతనే.

*104.* *జ్యోతిశ్శబ్దితసూర్యాదేః కారణత్వం నిరాకృతం।*
*తత్పతిత్వేన సిద్ధస్య దేవేంద్రస్య నిరస్యతే॥*

104. వెనుకటి అధికరణంలో సూర్యుడు, అగ్ని మొదలైన జ్యోతులకు కారణత్వంలేదని చూపబడింది. ఆ సూర్యుడు, అగ్ని మొదలైన జ్యోతులకు (అధిపతియైన) నాయకుడైన ఇంద్రుడే జగత్కారణం అనే పక్షం ఈ అధికరణంలో త్రోసిపుచ్చబడుతోంది.

*పూ.ప. 105.* *'ప్రతర్దనో హే'తి వాక్యే కౌషీతక్యభిధశ్రుతౌ।*
*ముక్త్యుపాసనకర్మత్వేనేంద్రప్రాణపదేరితః॥*

*106.* *జీవ ఏవేంద్రశబ్దస్య తస్మిన్నేవ ప్రసిద్ధితః।*
*తథైవ ప్రాణవాచోఽపి స్యాత్త్మోపాసనమత్ర సః॥*

*107.* *ఉపాదిశద్ధితతమమమృతత్వాప్తిసాధనమ్।*
*కారణోపాసనస్యైవామృతత్వప్రాప్తిహేతుతా॥*

*108.* *'తస్య తావ'దితి శ్రుత్యా జ్ఞాయతేఽతశ్చ కారణం।*
*ప్రసిద్ధజీవభావోఽయమింద్ర ఏవేతి నిశ్చయః॥*

105-108.**పూర్వపక్షం:** *"ప్రతర్దనో హవై దైవోదాసిరింద్రస్య ప్రియంధామ ఉపజగామయుద్ధేన చ పౌరుషేణ చ। తమ్ హేంద్ర ఉవాచ ప్రతర్దన వరం తే దదానీతి। స హోవాచ ప్రతర్దన స్త్వమేవ మే వరం వృణీష్వ యం త్వం మనుష్యాయ హితతమం మన్యసే"* (కౌషీ-2) [దివోదాసుని పుత్రుడైన ప్రతర్దనుడు యుద్ధసాధనమైన ఫలము,వీర్యము గలవాడై ఇంద్రుని ప్రీతికరమైన స్థలమును చేరెను. వానితో ఇంద్రుడు చెప్పినాడు- "ప్రతర్దనా! నీకువరమునిచ్చెదను". దానికిసమాధానముగ ప్రతర్దనుడిట్లనినాడు-"ఏది మనుష్యునకు మిక్కిలి హితమైనదిగ తలంచుచున్నావో, దానిని నీవేనాకువరముగనిమ్ము".] అని ప్రారంభించి, *"సహోవాచ మామేవ విజానీహి। ఏతదేవాహం మనుష్యాయ హితతమం మన్యేయన్మాం విజానీయాత్"* (కౌషీ-2) [ ఇంద్రుడిట్లనెను- నన్నే తెలుసుకొనుము. నన్నుపాసించుట అను ఇదియే నేను మనుష్యునకు చాలమంచిదనితలంతును]అనిన్నీ, *"సహోవాచ ప్రాణోస్మి, ప్రజ్ఞాత్మా తం మామాయురమృత మిత్యుపాస్వ"* (కౌషీ-2) [ఇంద్రుడు చెప్పెను- "జ్ఞానరూపమైనఆత్మఅయియుండు నేనే ప్రాణముగనున్నాను. ప్రాణముగ నున్న నన్నే ఆయుస్సుగను, అమృతముగను ఉపాసించుము"] అనిన్నీ కౌషీతకీఉపనిషత్తులో చెప్పబడింది. మనుష్యుడికి చాలమంచిది మోక్షోపాయమే. ఆమోక్షసాధనం జీవుడైనఇంద్రుని ఉపాసించటమేనని ఈ వాక్యాలలో ఇంద్రుడుపదేశిస్తున్నాడు. ఇంద్రపదవితోబాటు ఒకటిగచెప్పబడే ప్రాణశబ్దంకూడా ఇంద్రుడినే చెప్పేది అయియుండాలి. జీవుడైన ఇంద్రుడికే తగిన "త్వష్టకుమారుడిని సంహరించినవాడు" మొదలైన

చిహ్నాలు ఈప్రకరణంలో చెప్పబడ్డాయి. అంచేత ఇంద్రుడనబడే జీవుడి ఉపాసనమే మోక్షసాధనమని నిశ్చయం. *"తస్య తావదేవ చిరం యావన్నవిమోక్ష్యే అథ సంపత్స్యే"* (ఛాం. 6-14-2) [శరీరం నశించే వరకే ఉపాసకుడికి మోక్షంపొందటంలో ఆలస్యం. శరీరంనశించినవెంటనే మోక్షాన్ని పొందుతాడు.] అనేవాక్యంలో జగత్కారణవస్తువును ఉపాసించేవాడికే మోక్షముంటుందని చెప్పటంవల్ల ఇక్కడ మోక్షసాధనంగ చెప్పబడిన ఉపాసనవిషయమైన ఇంద్రుడే జగత్కారణుడు.

*సి. 109.* *మైవమింద్రప్రాణశబ్ద్యం జీవమాత్రం న కిన్త్వతః।*
*అర్థాన్తరం బ్రహ్మ తాభ్యాం పదాభ్యాం ప్రస్తుతస్య చ॥*
**110.* *స్వభావసిద్ధానందత్వామృతత్వాదేశ్చ సంశ్రుతేః।*

109-*110. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షవాదం సరిగాదు. ఇక్కడ ఇంద్రుడనీ, ప్రాణమనీ చెప్పబడటం ఇంద్రుడనే జీవస్వరూపం మాత్రమేగాదు. జీవుడైన ఇంద్రుడికంటె వేఱైనదీ, వాడికీ అంతర్యామిగ ఉన్నదని చెప్పబడిన బ్రహ్మమే ఆశబ్దాలచేత చెప్పబడిందౌతుంది. *"సఏష ప్రాణఏవ ప్రజ్ఞాత్మా ఆనందోऽజరోమృతః"* (కౌషీ.2) [ప్రాణమనబడే ఆసర్వజ్ఞుడైన ఆత్మ ఆనందంగాను, ముసలితనంలేనివాడుగాను, మరణంలేనివాడు గాను ఉన్నవాడు] అని ఇక్కడ ఇంద్రప్రాణశబ్దాలచేత చెప్పబడిన ఆత్మఅనేది స్వభావసిద్ధంగ ఆనందస్వరూపం గాను, అమృతస్వరూపంగాను, అజరస్వరూపంగాను ఉన్నదని చెప్పబడుతోంది. ఆది, మధ్య, అంతం మొదలైన తక్కువగుణాలుగలవాడిగా శాస్త్రాల్లోచెప్పబడిన ఇంద్రుడికి ఈలక్షణాలు కుదరవు. అంచేత, ఇక్కడ ఇంద్రప్రాణశబ్దాలచేత చెప్పబడిన *"సేంద్రః"* (తై.నా.-11) అని ఇంద్రుడికి అంతర్యామిగా ఉండటంచేత ఇంద్రుడని చెప్పబడేవాడు నారాయణుడే.

*॥ సి. సూ. ॥ నవక్తురాత్మోపదేశాదితి చేదధ్యాత్మసంబంధభూమా హ్యస్మిన్ ॥ 1-1-30 ॥*

**వక్తుః ఆత్మోపదేశాత్=** ఉపదేశించేవాడైన ఇంద్రుడు తననే ఉపాసించమని చెప్తున్నాడుగనుక, **న=** (ఇంద్రుడు, ప్రాణం అనబడేది బ్రహ్మముగా) కుదరదు, **ఇతిచేత్=** అంటే, **అధ్యాత్మసంబంధ భూమాహి అస్మిన్=** పరమాత్మకే సంబంధించే మహత్త్వాలు ఈప్రకరణంలో (లేదా ఇక్కడ ఉపదేశించే ఇంద్రుడు అనబడేవాడికి) కనబడుతున్నాయిగదా!

*110.** *ప్రజ్ఞాతజీవభావస్య స్వస్యైవోపాస్యతామయమ్॥*
**111.* *వదత్యతో జీవ ఏవోపాస్యః ప్రకాన్త ఉచ్యతే।*

110*-*111. **పూర్వపక్షం.** ఇంద్రుడనీ ప్రాణమనీ చెప్పబడేది పరబ్రహ్మమేనని వెనుకటి సూత్రంలో చెప్పినది సరిగాదు. ఈప్రకరణప్రారంభంలో *"మామేవహి విజానీహి"*,(కౌషీ.2) [నన్నే తెలుసుకో.], *"మామ్ ఉపాస్వ"* (నన్నే ఉపాసించు)అని ఇంద్రుడుతననే ఉపాసించేవిధానాన్ని చెప్పేడు. *"త్రిశీర్షాణాం త్వాష్ట్రమహనమ్"* (కౌషీ.-2) [మూడుతలలు గలవాడు, త్వష్టకుమారుడు అయిన విశ్వరూపుడిని నేను చంపేను] అనిప్రారంభించి, జీవుడైనతనకే తగిన చిహ్నాలని చూపేడు. ఈవిధంగ, ఈప్రకరణోపక్రమంలో (ప్రారంభంలో) జీవుడికేతగినచిహ్నాలనిచూపటంచేత, ఉపసంహారంలో ఉన్న(చివరనున్న) *"ఆనందో ऽజరోऽమృతః"* (కౌషీ-2) [ఆనందస్వరూపుడుగా, ముసలితనంలేనివాడుగా, మరణంలేనివాడిగా ఉన్నవాడు] అనేవాక్యానికి ఉపక్రమసహితంగనే అర్థాన్ని గ్రహించాలని పూర్వమీమాంసలో ఉపక్రమాధికరణంలో చెప్పబడింది. కనుక, ఇక్కడ చెప్పబడినవాడు ఇంద్రుడనిచెప్పబడే జీవుడే.

*సి.111** *మైవమత్ర శ్రుతా ధర్మాః పరస్మిన్నేవ సంగతాః।*

**112.** *మోక్షార్థోపాస్తికర్మత్వం సర్వాధారత్వమప్యథ।*
*కర్మకారయితృత్వం చేత్యాద్యా ధర్మాః పరస్య హి॥*

111*-112.**సిద్ధాంతం:** ఈపూర్వపక్షందోషభూయిష్ఠం. ఈప్రకరణంలోమొదట జీవలింగాన్ని చెప్పటానికి ముందుగానే పరమాత్మకేతగిన మోక్షోపాసనవిషయమైన మహత్వం **"మాముపాస్వ"** అని ఇంద్రుడు మాటాడేటట్లు చేసింది. పైగా, *"తద్యథా రథస్యారేషు నేమిరర్పితా నాభావరా అర్పితాః। ఏవమేవైతా భూతమాత్రాః ప్రజ్ఞామాత్రాస్వర్పితాః। ప్రజ్ఞామాత్రాః ప్రాణేऽర్పితాః॥* (కౌషీ.3) [రథచక్రపుఆకులలో నేమి అనబడే చక్రం ఎట్లా బిగింపబడిందో, ఆఅరలు (మధ్యనున్న) నాభిలో ఎట్లాబిగింపబడినాయో, అలాగే ఈ అచేతనవస్తువులు, చేతనవస్తువులలో అమర్చబడినాయి. ఆచేతనాలు ప్రాణమనబడే పరమాత్మతో అమర్చబడియున్నాయి] అని సమస్తచేతనాచేతనాలకీ ఆధారమైఉన్న పరమాత్మధర్మంకూడ ఇక్కడ ప్రాణానికి చెప్పబడింది. *"ఏషఏవ సాధుకర్మ కారయతి తమ్ యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతి। ఏషఏవాస్తు కర్మకారయతి తం యమేధోనినీషతి।"* (కౌషీ.3-9)[ఎవనిని పైలోకాలకి తీసుకొనివెళ్ళగోరుతాడో, వానికీతడే మంచికర్మలని చేయటంలో సహాయపడును. ఎవనిని క్రిందకు త్రోసివేయాలనుకుంటాడో, వానికీతడే చెడుకర్మలుచేయటంలో సహాయపడును.] అని చేతనుడిచేత కర్మలనుచేయించటం అనే పరమాత్మధర్మంకూడా ఈతనికిచెప్పబడింది. ఇవి పరమాత్మకే తగునుతప్ప జీవునికిచెందవు. ఈవిధంగా ఉపక్రమంలోనూ, మధ్యనీ, చివరనూకూడ పరమాత్మకే తగిన గొప్పదనాలే ఇక్కడ జీవలింగాలకంటె ఎక్కువగచెప్పబడ్డాయి. అంచేత ఇక్కడ ఇంద్రప్రాణశబ్దాలచేత చెప్పబడినవాడు పరమాత్మేతప్ప జీవుడుగాడు.

*॥ సి. సూ. ॥ శాస్త్రదృష్ట్యా తూపదేశో వామదేవవత్ ॥ 1-1-31 ॥*

**వామదేవవత్=** వామదేవఋషివలె, **ఉపదేశః తు=** (ఇక్కడ ఇంద్రుడి) ఉపదేశంగూడ, **శాస్త్ర దృష్ట్యా=** శాస్త్రదృష్టిచేతనే అగును.

**113.** *అంతర్యామిబ్రాహ్మణాదేర్విజ్ఞాయాऽऽత్మశరీరితాం।*
*'అనేనజీవేనే'త్యాద్యైః శబ్దానాం జీవవాచినామ్॥*

**114.** *పరే పర్యవసానం చ "మాముపాస్వే"తి వాక్యతః।*
*స్వదేహకం పరం బ్రహ్మోపాస్యత్వేనోపదిష్టవాన్॥*

**115.** *వామదేవాదయోऽప్యేవం వదన్త్యధ్యాత్మవిద్వరాః।*
*"అహం మనురహం సర్వ"మిత్యాదిభిరనేకధా॥*

113-115. పరమాత్మలింగాలు ఎక్కువగనుక ఇక్కడ చెప్పబడినవాడు పరమాత్మేనని వెనకటి సూత్రంలో చెప్పబడింది. కాని 'నన్నే ఉపాసించు' అనివెనక ఇంద్రుడు చెప్పినది ఎలా పొసుగుతుందనే ప్రశ్నవస్తుంది.. దీనికిసమాధానం ఈసూత్రం చెప్తోంది. *"యఆత్మని తిష్ఠన్ ఆత్మనోంతరః యమాత్మా నవేద, యస్యాత్మా శరీరం యఆత్మానమంతరో యమయతి"* (బృహ-5-7-22) (ఎవడు జీవాత్మలో ఉండువాడో, జీవాత్మకు లోపలనున్నాడో, ఎవనిని జీవాత్మ తెలుసుకొనలేదో, ఎవనికి జీవాత్మ శరీరమో, ఎవడు జీవాత్మని లోపల ప్రవేశించి నియమిస్తున్నాడో), *"అంతఃప్రవిశ్య శాస్తా జనానాం సర్వాత్మా"* (యజు. ఆరణ్య. 3-11) (సర్వాంతర్యామియైన పరమాత్మ అందరుజనులను, లోపల ప్రవేశించి నియమిస్తున్నాడు), *"ఏష సర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకో నారాయణః"* (సుబాలో.-7) (అన్నిభూతాలకిన్నీ అంతరాత్మగాను, పాపాలు లేనివాడుగాను ఉన్నవాడు పరమపదంలోఉండే నారాయణుడనే దేవుడొక్కడే)

మొదలైన వేదవాక్యాలు జీవాత్మకిన్నీ ఆత్మగా ఉండేవాడు పరమాత్మఅని తెలియజేస్తున్నాయి. ఇలా, అచిత్తు, జీవుడు, శరీరంగానూ, పరమాత్మ ఆత్మగానూ ఉండటంచేత చిదచిత్తులని పరమపురుషుడితో భేదంలేనిదిగ చెప్పాలననటాన్ని, *"అనేనజీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపేవ్యాకరవాణి"* (ఛాం. 6-3-2) (నేనే అయియుండే ఈజీవుడిద్వారా అచిత్తులో వ్యాపించి, దానికి నామరూపములను ఏర్పరుస్తాను), *"సర్వం ఖల్విదం బ్రహ్మ"* (ఛాం.3-14-1) (ఇవిఅన్నీ పరమాత్మగానేఉన్నాయి) మొదలైన వేదవాక్యాలు చూపిస్తున్నాయి.. ఇలాగ శాస్త్రంవల్ల తెలుసుకొనటం అనే శాస్త్రదృష్టిచేతనే, ఇక్కడకూడ *"మామ్ ఉపాస్వ"* (నన్ను ఉపాసింపుము) అన్నపుడు, '**మామ్**' (నన్ను) అనేపదంలో తనకంతర్యామిగాయున్న ఆపరమాత్మే, "మామ్" అనే శబ్దంచేత ఇంద్రుడుగాచెప్పబడుతున్నాడని గ్రహించాలి. పరమాత్మజ్ఞానులైన వామదేవుడు మొదలగు జీవులుగూడ, ఇట్లే తమనుగురించిన శబ్దములచే పరమాత్మను చెప్పియున్నారు. -*"తద్ధైతత్ పశ్యన్ ఋషిర్వామదేవః ప్రతిపేదే అహం మనురభవం సూర్యశ్చాహమ్"* (బృహ3-4-10) (ఈబ్రహ్మను దర్శించిన (ఉపాసించిన) వామదేవఋషి 'నేనే మనువును, సూర్యునిగను అయినాను' అని తెలిపేరు.) అన్నపుడు కూడా, జీవుడైన వామదేవఋషి తానే మనువుగాను, సూర్యుడుగాను అయినట్లు చెప్పేరు. తనకు అంతర్యామియైన పరమాత్మే మనువుకీ, సూర్యుడికీ, అంతర్యామిఅని అర్థంచేసుకోవాలిగాని, ఇతరత్ర ఈవాక్యంకుదరదు. ఇలాగనే వామదేవుడనబడే రుద్రుడుకూడా *"అహమేకః ప్రథమమాసం"*(అధర్వశిరస్) (నేనొకడినే మొదట ఉంటిని) అన్నాడు.

*"సర్వగతత్వాత్ అనంతస్య సఏవాహమవస్థితః।*
*మత్తః సర్వమహం సర్వం మయిసర్వం సనాతనే॥"* (వి.పు. 1-19-89)

(అనంతుడంతటా ఉండటంచేత నేనుకూడ ఆతడే అయినాను. నానుండి అన్నీపుట్టేయి. నేనే అంతా. పూర్వుడినైన నానుంచే అన్నీ పుట్టేయి) అని ప్రహ్లాదుడు చెప్పేడు. వీరిలాగానే శాస్త్రదృష్టిచేత ఇంద్రుడును, తనకు అంతర్యామియైన పరమాత్మను ఉద్దేశించి నన్నే ఉపాసించు అని చెప్పేడని స్పష్టంగా తెలుస్తోంది.

### *॥ సి. సూ. ॥జీవముఖ్యప్రాణలిఙ్గాన్నేతి చేన్నోపాసాత్రైవిధ్యాదాశ్రితత్వాదిహ తద్యోగాత్॥ 1-1-32 ॥*

**జీవముఖ్యప్రాణలింగాత్=** జీవుడి చిహ్నాలున్నూ, ముఖ్యప్రాణం చిహ్నాలున్నూ ఇక్కడ ఉండటంచేత, **న=** (పరమాత్మ ధర్మాలతో అర్థనిర్ణయంచేయటం) కూడదు. **ఇతిచేత్=** అని చెప్పినట్లైతే, **న=** అది సరిగాదు. **ఉపాసాత్రైవిధ్యాత్=** ఉపాసన మూడువిధాలుగాను, **ఆశ్రితత్వాత్=** ఆశ్రయించి ఉండటంచేతను, **ఇహ తద్యోగాత్=** ఇక్కడకూడా, మూడువిధాల ఉపాసన చెప్పియుండడంచేతను.

*పూ. 116.* *జీవముఖ్యప్రాణగతలిఙ్గానామత్ర దర్శనాత్।*
*పూర్వోక్తాధ్యాత్మసంబంధభూమ్నా నాత్రార్థనిశ్చయః॥*

116. **పూర్వపక్షం:** *"నవాచం విజిజ్ఞాసీత వక్తారం విద్యాత్"* (కౌషీ. 2-58) (వాక్కుని ఉపాసించ వీలుగాదు. మాటాడేజీవుడిని ఉపాసించాలి.), *"త్రిశీర్షాణాం త్వాష్ట్రమహనం అరున్ముఖాత్ యతీన్ సాలావృకేభ్యః ప్రాయచ్ఛమ్"* (కౌషీ 2-9,10) (మూడుతలలు గలవాడు, త్వష్టకుమారుడూ అయిన విశ్వరూపుడిని సంహరించేను. వేదాన్ని వల్లెవేయనిసన్యాసులని అడవికుక్కలుతినటానికి ఇచ్చేస్తాను)అని జీవలింగమున్నూ, *"యావదస్మిన్ శరీరే ప్రాణోవసతి తావదాయుః"* (కౌషీ-2-15) (ఈశరీరంలో ప్రాణమున్నంత వరకూ ఆయువున్నది.) మొదలైనవాటిలో ముఖ్యప్రాణలింగాలున్నూ, ఈప్రకరణంలో ఎక్కువగ కనబడుతుండటంచేత, పరమాత్మలింగాలధికంగా ఉండటంచేత, ఇక్కడచెప్పబడినవాడు పరమాత్మే అని

వెనకటి(30వ) సూత్రంలోచెప్పటం సరిగాదు. అంచేత ఇక్కడ ఇంద్రప్రాణశబ్దంవల్ల చెప్పబడేవాడు ప్రాణంతోకలసిన ఇంద్రుడే అవుతాడు.

సి. 117. *మైవమత్రోపాసనస్యత్రివిధత్వాభిసంధితః।*
*స్వస్వరూపేణ జీవాత్మశరీరకతయా తథా॥*

118. *ప్రాణాఖ్యకత్వేనేత్థం చ పరాత్మోపాసనం త్రిధా।*
*త్రిధా తదుపదేశాయ తత్తచ్ఛబ్దేన భాషణమ్॥*

119. *ఇయంచ త్రివిధోపాస్తిరన్యత్రాపి శ్రుతౌ శ్రుతా।*
*అతః ప్రకరణం చైతత్తాదృశోపాస్తిబోధకమ్॥*

120. *అతోఽత్రేన్ద్రప్రాణశబ్దవాచ్యో జీవేతరః పరః।*
*భోక్తృభోగ్యశరీరోఽత్ర పరమాత్మోపదిశ్యతే॥*

*॥ ఇతి ఇన్ద్రప్రాణాధికరణమ్ ॥*

*॥ ఇతి ప్రథమాధ్యాయే ప్రథమపాదః ॥*

117-120. **సిద్ధాంతం:** జీవలింగాలూ, ముఖ్యప్రాణలింగాలూ, ఈప్రకరణంలో ఎక్కువగ కనబడటం వల్ల ఇంద్రప్రాణశబ్దాలచేత చెప్పబడేవాడు ప్రాణంతోకూడినఇంద్రుడే అనేపూర్వపక్షం తప్పు. ఈప్రకరణంలో మూడు విధాలైన పరమాత్మోపాసనం విధించబడింది. సర్వజగత్కారణమైన బ్రహ్మస్వరూపాన్ని అలానే అనుసంధించు కోవడం మొదటిపద్ధతిలోని ఉపాసనం. *"భోక్తా, భోగ్యం"* (శ్వేతా) [అనుభవించే జీవుడు, అనుభవింపబడే అచేతనం] అని చెప్పబడేవాటిలో మొదటిది 'చిత్' (జ్ఞానం ఉన్నది) అనిన్నీ, 'భోక్తా' (అనుభవించేవాడు) అని చెప్పబడే జీవనస్వరూపానికి అంతర్యామిగా అనుసంధించడం రెండోపద్ధతి. *"భోక్తా భోగ్యం"* (శ్వే.) అని చెప్పేవాటిలో రెండోదైన 'అచిత్' (జ్ఞానంలేనిది) అనిన్నీ, భోగ్యం (అనుభవింపబడేది) అనిచెప్పబడే అచేతన స్వరూపానికి అంతర్యామిగా అనుసంధించటం మూడోవిధంలోని ఉపాసనం. ఈవిధంగా మూడురకాలైన ఉపాసనాలని ఉపదేశించటంకొఅకే ఈప్రకరణంలో బ్రహ్మస్వరూపాన్ని నేరుగచెప్పేపదాలని జీవుడైనఇంద్రుడికి అంతర్యామిగా పరమాత్మనేచెప్పే ఇంద్రపదాన్ని అచేతనమైన ప్రాణానికంతర్యామిగా పరమాత్మనిచెప్పే ప్రాణపదాన్నీ ఈఉపనిషత్తులో ప్రయోగించటం జరిగింది. బ్రహ్మని ఈవిధంగా మూడురకాలుగా ఉపాసించడం ఉంటుందని మరికొన్నిచోట్లకూడా ఉన్నది. తైత్తిరీయంలో *"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ"* (తై. ఆనం.1) సహజంగఉన్నదై, (ఎప్పుడూ దోషాలులేని) జ్ఞానమే స్వరూపంగాను, గుణంగాను ఉన్నదై, దేశకాలవస్తు పరిచ్ఛేదరహితమైనది బ్రహ్మం. *"ఆనందో బ్రహ్మ"* (తై.భృ-6) [ఆనందమే బ్రహ్మం] మొదలైన వాక్యాల్లో బ్రహ్మస్వరూపోపాసనం చెప్పబడింది. *"తత్ సృష్ట్వా। తదేవానుప్రావిశత్। తదనుప్రవిశ్య। సచ్చత్యచ్చాభవత్। నిరుక్తంచానిరుక్తంచ నిలయనం చానిలయనంచ। విజ్ఞానంచావిజ్ఞానంచ। సత్యంచానృతంచ సత్యమభవత్॥"* (తై. ఆనం. 6-2) [దాన్ని సృష్టించి, దాన్నే వ్యాపించినది. దాన్ని వ్యాపించి వికారంలేనిదై (జాతిని, గుణాలని చెప్పేశబ్దాలచేత చెప్పశక్యంగానిదై) అచిత్తునాధారంగా చేసుకోనిదై జ్ఞానమయమైన జీవుడుగాను, వికారాస్పదమై (జాతిగుణాలనిచెప్పే శబ్దాలచేత) చెప్పబడేదై, (జీవుడిని) ఆధారంగా కలిగినదై, జ్ఞానంలేని అచేతనంగా అయినది. జీవుడుగను, అచిత్తుగను అయినప్పటికీ, (బ్రహ్మం వికారాస్పదంకానిదిగానే ఉన్నది) మొదలైనవాక్యాల్లో భోక్తైనజీవుడిని శరీరంగాగ్రహించిన బ్రహ్మోపాసనాన్ని, భోగ్యంగానూ, భోగోపకరణంగానూ ఉండే అచేతనాన్ని శరీరంగాగ్రహించిన బ్రహ్మని ఉపాసించడం చెప్పబడింది. ఈకౌషీతకీ ఉపనిషత్తులోగూడ, బ్రహ్మస్వరూపోపాసనంతోబాటు చేతనాచేతనాలని శరీరంగా గ్రహించిన బ్రహ్మంతాలూకు మరిరెండురకాల

ఉపాసనాలని కూడా ఉపదేశించటంకోసమే ఇంద్రపదంచేతను, ప్రాణపదంచేతను బ్రహ్మాన్ని చెప్తోందని స్పష్టం. కనుక ఇక్కడ చెప్పబడే ఇంద్రప్రాణశబ్దవాచ్యుడు పరమాత్మే ఆయెను.

కనుక ఈఅధికరణంవల్ల చెప్పబడింది - ఇంద్రుడు మొదలైన జీవులకో, ప్రకృతిమొదలైన అచేతన వస్తువులకో కొన్ని వేదవాక్యాల్లో పరమాత్మకే తగిన ధర్మాలు చెప్పబడటంచేతను, లేదా వాటిని పరమాత్మతో బాటు ఒకటిగా చెప్పటంచేతనో ఆవాక్యాల్లో ఆచేతనాచేతనాలకి అంతరాత్మగా పరమాత్మ యొక్క ఉపాసనం విధింపబడుతోంది.

*// ఇంద్రప్రాణాధికరణం పూర్తైనది. //*

*// మొదటి అధ్యాయంలో మొదటి పాదం పూర్తైనది. //*

## మొదటిపాదంలో సూక్ష్మంగా అధికరణార్థాలు.

1. **జిజ్ఞాసాధికరణం:** సిద్ధవస్తువైన బ్రహ్మాన్ని వేదాంతవాక్యాలు తెలియజేయవీలవుతుంది.
2. **జన్మాద్యధికరణం:** వేదవాక్యం బ్రహ్మానికి లక్షణం చెప్పటం కుదురుతుంది.
3. **శాస్త్రయోనిత్వాధికరణం:** శాస్త్రం బ్రహ్మవిషయంలో ప్రమాణంగా కుదురుతుంది.
4. **సమన్వయాధికరణం:** పరమపురుషార్థంగనుక బ్రహ్మాన్ని శాస్త్రం తెలియజేయటానికి శక్యమే.
5. **ఈక్షత్యధికరణం:** ఛాందోగ్యంలో సద్విద్యవల్ల చెప్పబడిన జగత్కారణం బ్రహ్మమే, మూలప్రకృతిగాదు.
6. **ఆనందమయాధికరణం:** తైత్తిరీయానందవల్లిలో చెప్పబడ్డ ఆనందమయుడు బ్రహ్మమే, జీవుడుకాదు.
7. **అంతరధికరణం:** ఛాందోగ్యంలో ఆదిత్యుడిలోను, కంటిలోను ఉన్నవాడు బ్రహ్మమే, జీవుడు గాదు.
8. **ఆకాశాధికరణం:** ఛాందోగ్యంలో జగత్కారణంగ చెప్పబడే ఆకాశం బ్రహ్మమేగాని భూతాకాశంగాదు
9. **ప్రాణాధికరణం:** ఛాందోగ్యంలో జగత్కారణంగ చెప్పబడే ప్రాణం బ్రహ్మమేగాని వాయువుగాదు.
10. **జ్యోతిరధికరణం:** ఛాందోగ్యంలో చెప్పబడే జ్యోతి బ్రహ్మమేగాని అగ్నిగాదు.
11. **ఇంద్రప్రాణాధికరణం:** కౌషీతకిలో ఇంద్రుడు అనేదీ, ప్రాణం అనేదీ బ్రహ్మమే. ప్రసిద్ధమైన ఇంద్రుడూ, ప్రాణం, కావు.

***

## *// ప్రథమాధ్యాయే ద్వితీయః పాదః //*

## *// సర్వత్రప్రసిద్ధ్యధికరణమ్ // 1-2-1 //*

### *// సి. సూ. // సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్ // 1-2-1 //*

**సర్వత్ర=** (**"సర్వం ఖల్విదం బ్రహ్మ"** అనే వాక్యంలో) అన్నిపదార్థాలతోటీ, (ఒకే భాగంగా చెప్పబడిన వస్తువు పరబ్రహ్మమే), **ప్రసిద్ధోపదేశాత్=** సుప్రసిద్ధమైనదిగా (దానిని) ఉపదేశించటంచేత.

*121.* *అస్పష్టతరజీవాదిలిఙ్గవాక్యం విచారితమ్।*
*విచార్యతే వాక్యజాతం పాదేఽత్రాస్పష్టలిఙ్గకమ్॥*

121. మొదటధ్యాయం మొదటిపాదంలో చేతనాచేతనాలనిగురించి అతిస్పష్టతలేని చిహ్నాలని చెప్పేవాక్యాలు పరిశీలించబడ్డాయి. ఈరెండోపాదంలో చేతనాచేతనాలనిగురించి స్పష్టతలేని చిహ్నాలని చెప్పేవాక్యాలు పరిశీలింపబడుతాయి. వెనుకటిపాదంకంటె ఈపాదంలో పూర్వపక్షి ఆక్షేపాలకి స్థలం ఎక్కువ అని భావం.

122. *కారణత్వముపాస్యత్వం చోక్తం ప్రాణశరీరిణః।*
*జీవస్య స్యాత్తదుభయమిత్యాశఙ్క్య నిరస్యతే॥*

122. వెనుకటి అధికరణంలో ప్రాణంశరీరంగా కలవస్తువుకి జగత్కారణత్వం, ముముక్షూపాస్యత్వం చెప్పబడ్డాయి. ఈరెండు స్వభావాలున్నూ జీవుడికే ఉండాలనే ఆక్షేపం ఈఅధికరణంలో ఖండింపబడుతోంది.

పూ. 123. *"సర్వం ఖల్విద"మిత్యాదౌ సర్వాత్మకతయా శ్రుతః।*
*జీవ ఏవ యతోఽస్యైవ సర్వతాదాత్మ్యసంభవః॥*

124. *బ్రహ్మాదిసర్వభావశ్చ తస్యైవ స్యాదుపాధితః।*
*పరస్యాఽస్పృష్టదోషస్య తద్భావో నోపపద్యతే॥*

125. *జీవేఽపి చ క్వచిద్వాక్యే బ్రహ్మశబ్దః ప్రయుజ్యతే।*
*తదీయకర్మహేతుత్వాజ్జన్మాదే"స్తజ్జలాని"తి॥*

*126. *హేతూక్తిరపి యుక్తాస్యాదిత్యేతత్తు న సన్మతమ్।*

123-*126. **పూర్వపక్షం:** ఛాందోగ్యంలో *"సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాన్త ఉపాసీత"* (ఛాం.3-14-1) ["ఇదంతా బ్రహ్మమే. దానివల్లనే ఇవి పుట్టడం, బ్రతకడం, అందులోనే నశించడం" అని శాంతిగలవాడై ఉపాసింపతగినవాడు] అనిచెప్పబడింది. ఇందులో అన్నీఅయియుండటం అనిచెప్పబడే బ్రహ్మం జీవుడైయుండటం శక్యం. జీవుడే కర్మసంబంధంచేత బ్రహ్మమొదలు గడ్డిపోచవరకూ ఉన్న సమస్తవస్తుజాతం అవడంసాధ్యం. దోషంస్పర్శించడానికికూడాశక్యంగాని పరమాత్మైనవాడు దోషాలకి స్థానమైన సమస్తవస్తుజాతం అవటానికివీలేలేదు. జీవాత్మనిగూడ శాస్త్రాల్లో కొన్నివాక్యాల్లో బ్రహ్మశబ్దంతో చెప్పడం చూస్తున్నాం. జీవునికర్మకారణంవల్ల లోకమంతా పుట్టడం, బ్రతకడం, నశించడం జరుగుతుంది. 'తజ్జలాన్' [దానిచే పుట్టి పెరిగి నశించడంవల్ల] అని కారణాన్ని చెప్పడం జీవుడికే తగియున్నది. అందుచే, ఈవాక్యంలో చెప్పబడేవాడు జీవుడే అవుతాడు.

సి. 126* *సర్వవస్తున్యాత్మతయా ప్రోక్తం బ్రహ్మ పరః పుమాన్॥*

127. *స్థలాన్తరే ప్రసిద్ధస్య తస్యైవాత్రానువాదతః।*
*తజ్జత్వాదీననూద్యోక్తా తద్ధేతుకతదాత్మతా॥*

128. *జీవాత్మనః కర్మకృతదేవమర్త్యాదిరూపిణః।*
*న స్యాద్వేదాన్తవాక్యేషు యస్మాజ్జన్మాదయశ్శ్రుతాః॥*

129. *స ఏవాత్ర బ్రహ్మశబ్దవాచ్యస్స్యాత్స పరః పుమాన్।*
*బ్రహ్మణశ్చిదచిద్వస్తుశరీరత్వాచ్ఛరీరిణి॥*

130. *దోషాశ్శరీరగా న స్యురతో నిర్దుష్ట ఏవ సః।*
*జీవస్య సర్వతాదాత్మ్యముక్తం తన్నోపపద్యతే॥*

131. *తత్తచ్ఛరీరభిన్నానాం తాదాత్మ్యసంభవాన్మిథః।*
*అతోఽత్ర పరమాత్మైవ బ్రహ్మశబ్దార్థ ఇష్యతే॥*

*126*-131.* ***సిద్ధాంతం:*** *ఈపూర్వపక్షం సరియైన భావాన్ని చెప్పడంలేదు.* *"సర్వం ఖల్విదం బ్రహ్మ"* (ఛా. 3-14-1) (ఇదంతా బ్రహ్మమే) అని అన్నివస్తువులతోటి ఐక్యతనిచెప్పే బ్రహ్మం పరమపురుషుడే

తప్ప జీవుడుగాడు. లోకమంతా బ్రహ్మవల్లనే పుట్టి, పెరిగి, లయించటంచేత 'లోకమంతా బ్రహ్మమేగదా!' అనే ఈవాక్యంలో 'ఖలు'(గదా)అనేపదంచేత లోకమంతటినీ సృష్టించి, పెంచి, నశింపజేసినట్లుగా మరికొన్ని వాక్యాల్లో **సుప్రసిద్ధమైన** పరబ్రహ్మమే ఇచ్చట 'అంతా' అనిచెప్పబడుతోందని తెలియ జేయబడుతోంది. *"యతోవా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్య భిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి।"* (తై.భృ.-1) (ఎవడినుండి అన్నిపదార్థాలూ పుడుతున్నాయో, పుట్టినవి దేనివల్ల బతుకుతు న్నాయో, ప్రళయకాలంలో దేనిలోలయిస్తున్నాయో, అటువంటిదాన్ని తెలుసుకో. అదే పరబ్రహ్మం.) మొదలైన వాక్యాల్లో పరబ్రహ్మమేగదా లోకమంతటినీ సృష్టించి, కాపాడి సంహరిస్తోందని చెప్పబడుతోంది. అంచేత ఇక్కడకూడా జగత్సృష్టిస్థితిసంహారహేతువుగా చెప్పబడే బ్రహ్మం పరమాత్మగానే యుండాలిగాని జీవుడు గాలేడు. పైగా, "ఇవన్నీ ఈబ్రహ్మంవల్లనే పుట్టి, పెరిగి లయించటం చేత ఇదంతా పరబ్రహ్మమే" అని జగత్సృష్టిస్థితిలయాలని చేయడం కారణంగాను, అన్నివస్తువులైఉండే స్వభావం దానివల్ల వస్తున్నదిగను, ఇక్కడచెప్పబడుతోంది. జీవుడికర్మ కారణంగా లోకసృష్టిస్థితిలయాలు ఏర్పడటంచేతమాత్రం, జీవుడివల్లనే లోకసృష్టిస్థితిలయాలేర్పడుతున్నాయనిచెప్పటం కుదరదు. పైగా, అదికారణంగా జీవుడు అన్నీఅవుతాడని చెప్పడం కుదరనేకుదరదు. అంచేత ఈవేదాంతవాక్యాల్లో జగత్సృష్టి స్థితిలయకారకుడిగా చెప్పబడే పరమాత్మే ఇక్కడ అంతాఅవుతాడని చెప్పబడుతున్నాడని స్పష్టం. దోషాలంటనివాడైన పరమాత్మ దోషాలకిస్థానమైన అన్నిపదార్థాలూ అవుతాడనటం ఎలాకుదురుతుంది అంటే, ప్రళయకాలంలో సూక్ష్మంగాను, తరువాత స్థూలంగానూ ఉండే చేతనాచేతనపదార్థాలని శరీరంగా గ్రహించిన బ్రహ్మమే ఇక్కడ అన్నిపదార్థాలూ అవుతాడనిచెప్పబడుతోంది. దోషాలు, శరీరంగాఉన్నచేతనాచేతనాలకే ఉన్నాయి. శరీరియైనపరమాత్మకి అవి ఉండడం సాధ్యంగాదు. అంచేత పరమాత్మే అన్నివస్తువులుగను అవుతాడనిచెప్పడానికి ఎలాంటిఅభ్యంతరం లేదు. ఒకశరీరంతో ఉండే ఒకజీవుడు మరొకశరీరంతోఉండే మరోజీవుడిగా అవటానికివీలుగాదు. అంచేత, జీవుడిని అన్నీ అయేవాడని చెప్పటం ఏవిధంగాను, వీలుగాదు. కాబట్టి, ఇక్కడ జగత్కారణంగాను, సర్వాత్మగాను, చెప్పబడేవాడు పరబ్రహ్మమే అనేది స్పష్టమైంది.

*// సి. సూ.// వివక్షితగుణోపపత్తేశ్చ // 1-2-2 //*

**వివక్షితగుణోపపత్తేః చ=** ఇక్కడ కోరి చెప్పబడే గుణాలు తగియుండవలసియుండటంచేతకూడా (ఇక్కడ చెప్పబడేది పరమాత్మవస్తువే.)

***132.*** *మనోమయత్వాదయశ్చ గుణాస్సర్వే వివక్షితాః।*
*పర ఏవోపపద్యన్తే సత్యసంకల్పతాన్వితాః॥*

132. ఇంకా మరోకారణంచేతకూడా *"సర్వం ఖలు"* అనేవాక్యంలో చెప్పబడేవాడు పరమాత్మేనని తెలుస్తోంది. *"మనోమయః ప్రాణశరీరోభారూపః సత్యసంకల్ప ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామః సర్వగంధః సర్వరసః సర్వమిదం అభ్యాత్తః అవాక్యనాదరః"* (ఛాం. 3-14-2) [పరిశుద్ధమైన మనసుచేత తెలుసుకోదగిన వాడు, ప్రాణాన్నిశరీరంగాగలవాడు, తేజోరూపమైనవాడు, అడ్డులేని సంకల్పంగలవాడు, ఆకాశంవంటి సూక్ష్మ మైనస్వరూపంగలవాడు, అన్నికార్యాలనీచేసేవాడు, కోరదగినఅన్నివస్తువులనీగలవాడు, అన్నిగంధాలూ గలవాడు, అన్నిరుచులనీ గలవాడు. ఈ సమస్తకల్యాణగుణాలూ గలవాడు (ఒకరిని) ఆదరించవలసిన ఆవశ్యకతలేనివాడు, (అందుచేతనే ఎవరివద్దా) నోటితోమాటలేనివాడు] అని ఈప్రకరణంలో వీనినిగురించి చెప్పబడుతోంది. ఈగుణాలు పరమాత్మకేతగినవి. అంచేతగూడా ఈతడు పరమాత్మే అగుటకు వీలగును.

*// సి. సూ. // అనుపపత్తేస్తు న శారీరః // 1-2-3 //*

**అనుపపత్తేః తు=** (వెనకచెప్పిన గుణాలు) జీవుడికి కుదిరినవిగాకపోవటంచేతను, **న శారీరః=** ఈతడు జీవుడు గానేరడు.

*133.* *ఏషాం గుణానామేతస్మిన్ శారీరేఽనుపపత్తితః।*
*నశారీరోఽయమపి తు పరం బ్రహ్మాత్ర గీయతే॥*

133. వెనకటిసూత్రంలో చెప్పబడిన గుణాలు శరీరసంబంధం ఉన్న ఈజీవుడికి కుదరవు. అంచేతగూడ ఈప్రకరణంలో చెప్పబడేవాడు జీవుడు కానేరడు. పరమాత్మవస్తువే అయినవాడు.

*॥ సి. సూ.॥ కర్మకర్తృవ్యపదేశాచ్చ ॥ 1-2-4 ॥*

**కర్మకర్తృవ్యపదేశాత్ చ=** (పరమాత్మని) పొందబడేవాడుగను, (జీవుని) పొందేవాడిగను చెప్పటంచేత (ఈతడు పరమాత్మే)

*134.* *"అభిసంభవితాస్మీ"తి ధ్యేయః ప్రాప్యతయోచ్యతే।*
*జీవః ప్రాప్తృతయోక్తోఽతో జీవాదన్యః పరః పుమాన్॥*

134. *"ఏతమితః ప్రేత్య అభిసంభవితాస్మి"* (ఛాం. 3-14-4) (ఈపరమాత్మని మరణంపొందిన వెంటనే పొందుతాను.) అనిఈప్రకరణంలో పరమాత్మని పొందడానికి కర్మఅయి (విషయమై) - పొందబడే వస్తువై - ఉండేవాడిగాను, జీవుడు పొందే కర్తఅయి పొందేవాడిగాను వేదం చెప్తోంది. దీనిచేతకూడా ఇక్కడ ఉపాసింపబడేవాడిగ చెప్పబడేవాడు జీవుడికంటె భిన్నమైన పరమాత్మే.

*॥ సి. సూ.॥ శబ్దవిశేషాత్ ॥ 1-2-5 ॥*

**శబ్దవిశేషాత్=** ఒకవిధమైన శబ్దంచేతకూడా (ఈతడు జీవునికంటె వేరైన వాడే.)

*135.* *వాక్య "ఏష మ ఆత్మే"తి షష్ఠ్యా శరీర ఉచ్యతే ।*
*ఉపాస్యస్తు ప్రథమయా తస్మాదన్యః పరః పుమాన్॥*

135. "*ఏష మ ఆత్మాఅంతర్హృదయే*" (ఛాం.3-14-3) (హృదయంలో ఉండే ఈతడు నాకు ఆత్మ) అని ఈప్రకరణంలోఉన్న మరొకవాక్యంలో "మే" అని జీవుడిని షష్ఠీవిభక్త్యంతంతోను, "ఆత్మా" అని పరమాత్మని ప్రథమావిభక్త్యంతంతోను చెప్పి ముందరివాడికి, తరువాతివాడు అంతర్యామిగా చెప్తోంది. అంచేత ఇతడు జీవుడికంటె వేరైన పరమాత్మే.

*॥ సి. సూ. ॥ స్మృతేశ్చ ॥ 1-2-6 ॥*

**స్మృతేః చ=** స్మృతిచేతనుగూడ (ఈతడు పరమాత్మే)

*136.* *"సర్వస్య చాహ"మిత్యాదిస్మృతిర్జీవముపాసకమ్।*
*పరాత్మానముపాస్యం చ వక్తి జీవేతరస్తతః॥*

136. "*సర్వస్య చాహం హృది సన్నివిష్టః*" (భ.గీ. 15-15) (నేనే అందరిహృదయాల్లోను ఉంటాను) అని వేదాన్ని వివరించే భగవద్గీత మొదలైన స్మృతులుకూడా, జీవుడిని ఉపాసించేవాడుగాను, పరమపురుషుడిని ఉపాసింపబడేవాడిగాను, హృదయంలో ఉండేవాడిగాను చెప్తున్నాయి. అంచేతకూడా, "***ఉపాసీత***" అని ఇక్కడ ఉపాస్యుడిగ చెప్పబడేవాడు పరమాత్మే.

*॥ సి. సూ.॥ అర్భకౌకస్త్వాత్తద్వ్యపదేశాచ్చ నేతి చేన్న నిచాయ్యత్వాదేవం వ్యోమవచ్చ ॥ 1-2-7 ॥*

**అర్భకౌకస్త్వాత్=** చిన్నదైన హృదయాన్ని నివాసస్థానంగ గలవాడవటంవల్ల, **తద్వ్యపదేశాత్ చ=** అల్పుడని చెప్పడంచేతనూ, **న ఇతిచేత్=** ఈతడు పరమాత్మ కాజాలడంటే, **న=** అది సరిగాదు,

**నిచాయ్యత్వాత్ ఏవం=** హృదయంలోఉన్నవాడుగ ఉపాసించడానికి ఈవిధంగా చెప్పబడుతోంది. **వ్యోమవత్ చ=** ఆకాశంలాగ (పెద్దవాడిలాకూడా చెప్పబడుతున్నాడు)

**పూ. 137.* *నాల్పత్వాల్పస్థానవత్త్వవ్యపదేశాదయం పరః।*

*137. **పూర్వపక్షం:** "*ఏష మ ఆత్మాంతర్హృదయే*"(ఛాం. 3-14-3) (హృదయంలోఉండే ఈనాఆత్మ) అని బొటనవ్రేలిపరిమాణంతో హృదయంలో ఈఆత్మఉంటుందని చెప్పినప్రకారంవల్లా, "***అణీయాన్ వ్రీహేర్వా యవాద్వా సర్షపాద్వా***" (ఛాం. 3-14-3) ధాన్యపుగింజకంటెను, గోధుమ గింజకంటెను, ఆవగింజకంటెను సూక్ష్మమైనవాడు) అని చాలసూక్ష్మమైనవాడుగా ఇతడిని చెప్పడంచేతను, ఇతను సర్వవ్యాపిఅవటంచేతా చాలపెద్దవాడుగడుండే పరమాత్మకానేరడు. అంచేత ఇతడు జీవుడేఅయి యుండాలి.

*సి. 137** *ఇతి చేన్నోపదేశోఽయం తథోపాస్యత్వ హేతుకః॥*

**138.* *న స్వరూపాల్పతాసూచీ జ్యాయస్త్వవ్యపదేశతః॥*

137*-*138. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాలేదు. హృదయంలో పరమాత్మని ఉపాసించాలనటానికే ఆతనికి హృదయమనేస్థానంచెప్పబడింది. ఆతడు సూక్ష్మమైనవాడని చెప్పబడెను. ఈవిధంగ చెప్పినంతమాత్రం, ఇతడుస్వరూపంలో చిన్నవాడనటం జరగదు. "***జ్యాయాన్ పృథివ్యా జ్యాయానంతరిక్షాత్ జ్యాయాన్ దివో, జ్యాయానేభ్యో లోకేభ్యః***" (ఛాం. 3-14-3) (భూమికంటే పెద్దవాడు, అంతరిక్షంకంటే పెద్దవాడు, దేవలోకంకంటే పెద్దవాడు, ఈలోకాలన్నింటికంటే పెద్దవాడు) అని తరవాత ఈతన్ని ఆకాశంలా చాలపెద్దవాడుగా చెప్తోంది. ఘటాకాశం, మఠాకాశం అని ఆయావస్తువులపరిమితిలో ఉన్న ఆకాశాన్ని చిన్నదిగ చెప్పినా, ఆకాశం గొప్పదనం తరిగిపోదుగదా! అలాగే ఇక్కడకూడా. అంచేత, ఈకారణంవల్ల, ఈతడు జీవుడనటం కుదరదు. పరమపురుషుడే అగును.

*॥ సి. సూ.॥ సంభోగప్రాప్తిరితిచేన్న వైశేష్యాత్ ॥ 1-2-8 ॥*

**సంభోగప్రాప్తిః=** (శరీరంలోపలఉన్నదిగా ఒప్పుకొంటే) సుఖదుఃఖాల అనుభవం పరమాత్మకికూడా వచ్చియుండాలిగదా, **ఇతిచేత్=** అంటే, **న=** రాదు, **వైశేష్యాత్=** (కారణం) భేదముండటంచేత.

*పూ. 138*.* *ఉపాసకశరీరేఽసౌ పరాత్మా వర్తతే యది॥*

**139.* *సుఖదుఃఖోపభోగస్య ప్రాప్తిస్తద్వదముష్య చ।*

138*-*139. **పూర్వపక్షం:** "***ఆత్మా అంతర్హృదయే***" (ఛాం.3-14-3) (హృదయంలో ఆత్మ) అని శరీరంలో ఉన్నవాడు పరమాత్మఅనిచెప్పి శరీరంతోనుండే జీవుడిలా ఈపరమాత్మకూడా సుఖదుఃఖాలని అనుభవించవలసిరావడంవల్ల ఈతడు పరమాత్మ కానేరడు. జీవుడే అవాలి.

*సి. 139*.* *ఇతి చేన్న శరీరాంతస్స్థత్వమేవ న కారణమ్॥*

*140.* *కర్మవశ్యత్వమేవోర్పభోగే హేతు న తత్పరే।*

*హేయప్రతిభటే సర్వకల్యాణగుణసాగరే॥*

*॥ ఇతి సర్వత్రప్రసిద్ధ్యధికరణమ్ ॥*

139*-140. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాదు. శరీరంలోనుండే కారణంచేతనే జీవుడు సుఖదుఃఖాలని అనుభవిస్తాడనటం తప్పు. కర్మకువశమైనవాడుగనుకనే జీవుడుసుఖదుఃఖాలనుభవిస్తాడు. హేయాలన్నిటికిని ఎదిరైనవాడును, కల్యాణగుణసముద్రుడూ అయిన పురుషోత్తముడు మాత్రం కర్మవశ్యుడు గాడు. తన ఇచ్ఛచేతనే శరీరంలోఉన్నవాడు. అంచేత ఆతడికి సుఖదుఃఖాలు లేవు. "***తయోరన్యః పిప్పలం***

*స్వాదు అత్తి అనశ్నన్ అన్యో అభిచాకశీతి*" (ముండ. 3-1-1) (జీవపరమాత్మల్లో జీవుడు కర్మఫలాన్ని అనుభవిస్తున్నాడు. దానిని అనుభవించని పరమాత్మ బాగా ప్రకాశిస్తున్నాడు) అనిశ్రుతికూడా చెప్పింది. అంచేత "**సర్వం ఖలు**" అని ప్రారంభంఅయే వేదవాక్యంలో చెప్పబడేవాడు పరమపురుషుడే.

*సర్వత్రప్రసిద్ధ్యధికరణము ముగిసెను.*

## *॥ అత్త్రధికరణమ్ ॥ 1-2-2 ॥*

### *॥ సి. సూ. ॥ అత్తా చరాచరగ్రహణాత్ ॥ 1-2-9 ॥*

**అత్తా=** (బ్రాహ్మణక్షత్రియులను) తినేవాడుగ చెప్పబడినవాడు (పరమాత్మే), **చరాచరగ్రహణాత్=** (ఆహారంగా) స్థావరాలూ, జంగమాలూ అయిన అన్ని పదార్థాలనీ తీసుకొనటంచేత.

*141.* *పరో యది న భోక్తా స్యాత్తర్హి భోక్తృతయా శ్రుతః।*
*సర్వత్ర జీవ ఏవ స్యాదితి వాదోఽత్ర వార్యతే॥*

141. వెనకటిసూత్రంలో పరమాత్మకి సుఖదుఃఖానుభవం ఉండదని చెప్పబడింది. అలాగైతే, బ్రాహ్మణక్షత్రియులనబడే ఆహారం, మృత్యువనేఊరగాయ మొదలైనవాటిని భుజించేవాడిగా చెప్పినపుడు చెప్పబడినవాడు జీవుడేఅయిఉండాలనేవాదం ఈఅధికరణంలో ఖండింపబడుతోంది.

*142.* *"యస్యబ్రహ్మే"త్యాది మంత్రే కఠవల్లీగతే శ్రుతః।*
*అత్తా జీవోఽస్యైవ కర్మఫలభోక్తృత్వసంభవాత్॥*

142.పూర్వపక్షం: "*యస్య బ్రహ్మచ క్షత్రంచ ఉభే భవత ఓదనః। మృత్యుర్యస్యోపసేచనమ్*" (కఠ.1-2-25) (ఎవనికి బ్రాహ్మణులును, క్షత్రియులుననబడేరెండువర్గాలున్నూ ఆహారమవుతున్నాయో, యముడెవనికి ఊరగాయ ఆయెనో) అని కఠవల్లిలో ఆహారాన్నీ, ఊరగాయతో తినేవాడిగ ఒకడు చెప్పబడ్డాడు. కర్మఫలానుభవంఉన్న జీవుడే ఆహారం మొదలైనవాటిని తినగలడు. అంచేత, ఇక్కడ చెప్పబడినవాడు జీవుడే అయియుండాలి.

*సి. 143.* *మైవమత్తా పరాత్మైవ విశ్వాత్తృత్వశ్రుతేరిహ।*
*మృత్యూపసేచనాద్యత్ర కృత్స్నస్యాదనముచ్యతే॥*

*144.* *ఈదృశం చాదనం సర్వసంహారోఽత్ర వివక్షితః।*
*కర్మోపాధికభోక్తృత్వం నేదం కిం తు పరాత్మనః॥*

*145.* *ఉపసంహర్తృత్వమిదం భోక్తృత్వం జగతాం తతః।*
*జీవేఽసంభావితమిదం తస్మాదత్తా పరః పుమాన్॥*

143-145. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాదు. ఇక్కడ బ్రాహ్మణక్షత్రియులు ఆహారంగాను, యముడు ఊరగాయగాను చెప్పబడుతున్నారు. యముడు బ్రాహ్మణక్షత్రియులని మాత్రంగాక లోకాన్నంతటినీ సంహరించేవాడు గనుక, ఇక్కడ బ్రాహ్మణక్షత్రియులనడం లోకమంతటికినీ ఉపలక్షణం. ఊరగాయసహాయంతో ఆహారాన్ని తినేవాడు, ఆహారాన్నీ, ఊరగాయనీ, తేడాలేకుండానే తిన్నట్లుగానే యముడిసహాయంతో లోకాన్నంతటినీ సంహరించేపరమాత్మ ఆలోకమంతటినీ, ఆయముడినికూడ ఏమీ భేదంలేకుండానే సంహరిస్తున్నాడనే ఈమంత్రానికర్థం. ఈవిధంగా యముడితోబాటు లోకాన్నంతటినీ మింగేవాడిగ చెప్పబడిన ఆతడు పరమాత్మే అవుతాడుగాని జీవుడుకాలేడు. ఇక్కడ చెప్పబడే ఆహారాన్ని భుజించటం పరమాత్మచేతనే

చేయబడే సర్వసంహారమేతప్ప కర్మకారణంగవచ్చే సాధారణభోజనంగాదు. లోకమంతటిని ఆరగించటంఅనేది జీవునివిషయంలో తగనిది- సాధ్యంగానిది. అంచేత, ఇక్కడ చెప్పబడిన వాడు పరమాత్మే అవుతాడు.

*// సి. సూ.// ప్రకరణాచ్చ // 1-2-10 //*

**ప్రకరణాత్ చ=** ప్రకరణంచేత గూడ (ఈతడు పరమాత్మే)

*146.* *"మహాన్తం విభుమాత్మానం", "నాయమాత్మే"తి చ స్థితమ్।*
*పరస్యేదం ప్రకరణం తస్మాచ్చాయం పరః పుమాన్॥*

146. "**మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి**" (కఠ. 1-2-22) (గొప్పవాడును, సర్వవ్యాపీ అయిన పరమాత్మనుపాసించేజ్ఞాని శోకించడు), "*నాయమాత్మా ప్రవచనేన లభ్యః నమేధయా నబహునా శ్రుతేన। యమేవైష వృణుతే తేనలభ్య స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్*" (కఠ. 1-2-23) (ఈపరమాత్మయనేవాడు శ్రవణమననధ్యానాలచేతమాత్రం పొందబడడు. ఎవనినిఈతడు వరిస్తాడో, వానిచేతనే ఈతడుపొందబడగలడు. ఆతడికేఈతడు తనస్వరూపాన్నిచూపును.), "*క ఇత్థా వేద యత్ర సః*" (కఠ.1-2-25) (ఆపరమాత్మ ఇట్టివాడని ఎవడు తెలుసుకొనినవాడు)అని ఈప్రకరణంలో ఈతనిగురించి చెప్పబడుతోంది. ఈమహత్త్వాలు పరమాత్మకే తగునుగాని జీవుడికి పొసగవు. దీనివలనకూడా ఈతడు పరమాత్మే.

*// సి. సూ.// గుహాం ప్రవిష్టావాత్మానౌ హి తద్దర్శనాత్ // 1-2-11 //*

**గుహాం ప్రవిష్టౌ=** హృదయగుహలో ప్రవేశించిన ఇద్దరూ, **ఆత్మానౌ హి=** జీవాత్మ, పరమాత్మే ఔతారు. (ప్రాణ,జీవులుగారు) **తద్దర్శనాత్=** జీవపరమాత్మలకే హృదయగుహలో ప్రవేశించిఉండటం కానరావటంచేత.

*పూ. *147.* *"ఋతం పిబన్తా"విత్యత్ర ఫలభోక్తృతయా శ్రుతః।*

**147.* **పూర్వపక్షం:** "*ఋతం పిబన్తౌ సుకృతస్య లోకే గుహాం ప్రవిష్టౌ*" (కఠ.1-3-1) (కర్మఫలాన్ననుభవించేవారున్ను, పుణ్యలోకమైన ఈలోకంలో హృదయగుహలో ప్రవేశించినవాళ్ళైన ఇద్దరు) అన్న కఠవల్లీమంత్రంలో కర్మఫలాన్ననుభవించే ఇద్దరు హృదయగుహలో ప్రవేశించినట్లు చెప్పబడింది. కర్మఫలాన్ననుభవించేవారిగ ఇద్దరిని చెప్పడంవల్ల వీళ్ళుజీవుడు, ప్రాణంగాని, జీవుడు బుద్ధిగాని అయియుండాలి. పరమపురుషుడికి కర్మానుభవం ఉండదుగనుక వీళ్ళు జీవపరమాత్మలు కాలేరు. అంచేత ఈవిధంగ ఇక్కడ ప్రాణంతో, లేదా బుద్ధితోకలిసిన జీవుడే చెప్పబడటంవల్ల "*ఉభే భవత ఓదనః*" అని లోకాన్ని భుజించేవాడుగ చెప్పబడేవాడుకూడా జీవుడే అవాలి.

*సి. 147*.* *సప్రాణో జీవ ఏవాతశ్చాత్రాప్యత్తా స ఇత్యసత్॥*

*148.* *గుహాం ప్రవిష్టావుచ్యేతే అత్ర జీవపరావుభౌ।*
*తత్ప్రవేశస్తయోరేవ స్థలేఽస్మిన్ కిల దృశ్యతే॥*

*149.* *"తం దుర్దర్శ"మితి శ్రుత్యా పరస్యోక్తా గుహాస్థితిః।*
*జీవస్య తత్స్థితిస్త్వత్ర "యా ప్రాణేనే"తి వాక్యతః॥*

*150.* *"ఋతం పిబన్తా"విత్యుక్తిశ్ఛత్రిన్యాయేన సంగతా।*
*పరస్య పానే యోగస్స్యాత్ప్రయోజకతయాపి వా॥*

147*-150. **సిద్ధాంతము:** ఈపూర్వపక్షం దోషభూయిష్ఠం. హృదయగుహలో ప్రవేశించినవారుగ ఇక్కడ చెప్పబడినవాళ్ళు జీవపరమాత్మలే. ప్రాణం-జీవులో; బుద్ధి-జీవులో; కాదు. ఎంచేతంటే, జీవపరమాత్మలకే ఈ

ప్రకరణంలో హృదయగుహాప్రవేశం చెప్పబడింది. *"తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణం। అధ్యాత్మయోగాధిగమేన దేవం మత్వా ధీరో హర్షశోకౌ జహాతి"* (కఠ.1-2-12) (కనబడనివాడును, (కర్మకారణంగా మనకు) కనబడకుండా ఉన్నవాడును, అంతటా వ్యాపించి ఉన్నవాడును, హృదయగుహలోఉండేవాడును, అంతర్యామిగానుండేవాడును, పురాణమైనవాడును, దేవుడును అయిన పరమాత్మని ఆత్మజ్ఞానంచేతనే తెలుసుకొనే జ్ఞానిఅయినవాడు సుఖదుఃఖాలని వదులుతాడు)అని పరమాత్మ హృదయగుహలో ఉండటంచెప్పబడింది. *"యా ప్రాణేన సంభవతి అదితిర్దేవతా మయీ గుహాంప్రవిశ్య తిష్ఠన్తీ యాభూతేభిర్వ్యజాయత"* (కఠ. 1-4-7) (కర్మఫలాన్ని అనుభవించటంచేత అదితిఅనబడే ఒకజీవుడు ప్రాణంతో సుఖంగ బ్రతుకుతున్నాడో, 'దేవుళ్ళ'నబడే ఇంద్రియాలచేత అనుభవింపబడే సుఖదుఃఖాలు గలవాడయ్యేనో, హృదయగుహలో ప్రవేశించిఉన్నాడో, పంచభూతాలతో కలసి జన్మిస్తున్నాడో) అని జీవుడు హృదయగుహలో ఉండటం చెప్పబడింది. అంచేత, "**ఋతం పిబన్తౌ**"అనేమంత్రంలో హృదయగుహలో ఉన్న వాళ్ళుగ చెప్పబడినవాళ్ళు జీవపరమాత్మలే అవాలి. "**ఋతంపిబన్తౌ**"అని పరమాత్మని, జీవుడితో భేదం లేకుండా కర్మఫలాన్నిభుజించేవాడిగ చెప్పడంకుదరదే అంటే, ఒక (సమూహంలో) కూటమిలో కొంతమంది గొడుగు వేసుకొని వెళ్ళినా, కూటమంతటిని గొడుగుకలవాళ్ళువెళ్తున్నారని చెప్పినట్లే 'కర్మఫలాన్ననుభవించే జీవుడితోచేర్చి పరమాత్మనుకూడ కర్మఫలాన్ననుభవించేవాడని చెప్పినట్లుగ తీసుకోవాలి. లేదా, జీవుడు కర్మఫలాన్ననుభవించేవాడిగా, అనుభవింపజేసేవాడినికూడ అనుభవించేవాడిగాచెప్పడం ఉండడంతో ఇద్దరినీ చేర్చి 'కర్మఫలాన్ననుభవించేవాళ్ళు' అని చెప్పినట్లు గ్రహించాలి. అందువలన దీన్ని తీసుకొని, ఇక్కడ పరమాత్మచెప్పబడలేదనిచెప్పటానికి వీలుగాదు. కనుక, లోకాన్ని భుజించేవాడిగ చెప్పబడినవాడు పరమాత్మే.

### // సి. సూ. // విశేషణాచ్చ // 1-2-12 //

**విశేషణాత్ చ**: (జీవపరమాత్మలు ఈప్రకరణంలో) విశేషించబడటంవల్లగూడ (ఈతను పరమాత్మే)

151. *ఆదితోఽస్మిన్ ప్రకరణ ఆన్తం జీవపరావుభౌ।*

*తత్తద్ధర్మైర్విశిష్యేతే తస్మాదత్తా పరః పుమాన్॥*

*// ఇత్యత్త్రధికరణమ్ //*

151. ఈప్రకరణంలో *"నజాయతే మ్రియతే వా విపశ్చిత్"* (కఠ.1-2-18) మొదలైనచోట్ల జీవుడున్నూ, *"అణోరణీయాన్ మహతో మహీయాన్"* (కఠ.1-2-20) (పరమాత్మ అణువుకంటే అణువైనవాడు, గొప్పదైనదాని కంటే గొప్పవాడు), *"మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి"* (కఠ.1-2-22) (గొప్పవాడు, సర్వవ్యాపి అయిన పరమాత్మని తెలుసుకొనే జ్ఞానియైనజీవుడు శోకించడు), *"నాయమాత్మా ప్రవచనేన లభ్యో నమేధయా నబహునా శ్రుతే। యమేవైషవృణుతే తేన లభ్యస్తస్యైషా ఆత్మా వివృణుతే తనూం స్వాం।"* (కఠ. 1-2-23) (ఈపరమాత్మైనవాడు కేవలం శ్రవణమననధ్యానాలవల్ల పొందడానికి శక్యంగానివాడు. ఏజీవుడిని ఈయనవరిస్తాడో, వాడిచేతనే పొందబడగలడు. ఆతనికే ఈపరమాత్మ తనస్వరూపాన్ని దర్శింపజేస్తాడు), *"విజ్ఞానసారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్ నరః। సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్॥"* (జ్ఞానానికి సారథ్యం చేసేవాడును, మనసును కట్టుబాటులోనుంచేమానవుడు సంసార మార్గానికి ఆవలిఒడ్డయిన విష్ణువు యొక్క పరమపదాన్ని పొందుతాడు) వంటివాక్యాల్లో జీవుడు, పరమాత్మ, క్రమంగా ఉపాసక, ఉపాస్యుడు గాను; పొందేవాడు, పొందబడేవాడుగాను, విశేషంగ చెప్పబడ్డారు. దీనివలనగూడ ఈప్రకరణంలో చెప్పబడే వాళ్ళు జీవపరమాత్మలేతప్ప బుద్ధి, జీవుడు; గాని ప్రాణం జీవుడు;గాని కారు అనిస్పష్టమవుతోంది. అంచేత ఇక్కడ చరాచరాలని అనుభవించేవాడిగ చెప్పబడేవాడు పరమాత్మే.

అత్త్రధికరణము ముగిసెను.

## ॥అంతరాధికరణమ్॥ 1-2-3 ॥

### ॥ సి. సూ. ॥ అంతర ఉపపత్తేః ॥ 1-2-13 ॥

**అంతరః=** కంటిలో ఉండేవాడుగ చెప్పబడేవాడు (పరమాత్మే); **ఉపపత్తేః=** (అక్కడ చెప్పబడే గుణాలు) పరమపురుషుడికే తగినవిగనుక.

*152* *దుర్జ్ఞేయత్వం పరస్యోక్తం "క ఇత్థే"త్యాదినా పురా।*
*తర్హి దృశ్యతయోక్తో న పర ఇత్యేతదస్యతే॥*

152. *"క ఇత్థా వేద యత్ర సః"* అని వెనకటి అధికరణవాక్యంలో పరమాత్మ తెలుసుకోడానికి శక్యం కానివాడుగ చెప్పబడింది. అట్లైనచో, ఛాందోగ్యంలో కంటిలో కనబడేవాడుగ చెప్పబడినవాడు పరమాత్మ కాలేడనే వాదం ఈఅధికరణంలో తిరస్కరింపబడుతోంది.

*పూ. 153.* *అక్ష్యాధారః శ్రుతస్సామ్ని 'య ఏష' ఇతి వాక్యతః।*
*జీవో వా ప్రతిబింబో వాఽథాక్ష్యధిష్ఠాతృదేవతా॥*

*154.* *ప్రసిద్ధవద్వచనత ఏష్వేవాన్యతమో భవేత్।*
*పరాత్మనస్త్వక్షి దృశ్యత్వాప్రసిద్ధ్యా స నోచ్యతే॥*

153-154. **పూర్వపక్షం:** సామవేదానికి చెందిన ఛాందోగ్యంలో *"య ఏషోఽక్షిణి పురుషో దృశ్యతే। ఏషఆత్మేతిహోవాచ ఏతదమృతమభయమేతత్ బ్రహ్మ"* (ఛాం4-15-1) (కంటిలో ఏపురుషుడు కనబడుతున్నాడో అతడే ఆత్మయనినీ, అమృతమనినీ, అభయమనినీ, బ్రహ్మమనినీ చెప్పేరు) అనిచెప్పబడింది. ఈతనిని "**య ఏషః**"అని కంటిలోఉన్నవాడుగాను, సుప్రసిద్ధుడుగాను చెప్పటంచేత ఇతను జీవుడుగానో, (ఎదురుగ నించునిఉన్నవారి) ప్రతిబింబంగానో కంటికి అభిమానిదేవతగానో అయి ఉండాలి. పరమాత్మైనవాడు కంటిలోకనబడతాడని ప్రసిద్ధిలేకపోవటంవల్ల ఇతడే ఆతడు కానేరడు.

*సి. 155.* *మైవం పరోఽక్ష్యంతరస్థస్తస్మిన్నేవోపపత్తితః।*
*సంయద్వామత్వాదినిత్యనిసర్గగుణసంపదామ్॥*

155.**సిద్ధాంతం:** ఇది దోషభూయిష్ఠమైన వాదం. కంటిలోఉండేవాడుగ చెప్పబడేవాడు పరమాత్మే. *"ఏష ఆత్మేతిహోవాచ। ఏతదమృతమభయమేతద్బ్రహ్మేతి। ఏవం సమ్యద్వామ ఇత్యా చక్షతే। ఏతంహి సర్వాణి వామాన్యభిసంయంతి। ఏష ఉ ఏవ వామనీః। ఏషహి సర్వేషులోకేషు భాతి॥"* (ఛాం.4- 15-3)(ఇతనే (అందరికీ)ఆత్మ అనిచెప్పేరు. ఇతనే తృప్తితీరనిఅమృతం. ఇతనే భయంలేనివాడు, సమ్యద్వాముడు (అందమైనవన్నీ పూర్తిగాపొందినవాడు))అని ఇతనిని చెప్పేరు. ఈతడే మంచి వస్తువులన్నింటిని పొందేవాడు గదా! ఇతనే వామని (దాసులకి శ్రేష్ఠమైనవాటినిచ్చేవాడు) అవుతున్నాడు. ఇతనే తనదాసులకి శుభాల నిచ్చేవాడుగదా! ఇతడే 'భామని' (బాగాప్రకాశించువాడు) అనబడుతున్నాడు. ఇతడే లోకాలన్నింట్లోను ప్రకాశించేవాడుగదా!)అని చెప్పబడేవిగాను, సహజమైనవిగాను ఉన్న అనేకకల్యాణగుణాలు, సంపదలు ఇతనికి చెప్పబడుతున్నాయి. ఇవిపరమాత్మకేతగునుతప్ప జీవుడికో, ప్రతిబింబానికో, కంటిఅభిమానిదేవతకో తగినవి కావు. అంచేత ఇతను పరమాత్మే.

### ॥ సి. సూ. ॥స్థానాది వ్యపదేశాచ్చ ॥ 1-2-14. ॥

**స్థానాదివ్యపదేశాత్ చ=** (కంటిలో) ఉండటం, నియమించడం, మొదలైనవి (పరమాత్మకి) చెప్పటంచేత

(ఇతను పరమాత్మే).

156. అక్షి స్థితినియంతృత్వాద్యస్యైవ పరమాత్మనః।
"యశ్చక్షుషీ"త్యేవమాదౌ శ్రూయతేఽతోఽక్షిగః పరః॥

157. ప్రసిద్ధవద్వచోఽతశ్చ పరాత్మన్యేవ యుజ్యతే।
అత్ర "దృశ్యత" ఇత్యుక్తిర్యోగిదృశ్యత్వ హేతుకా॥

157."యశ్చక్షుషి తిష్ఠన్....యమయతి" (బృహ.5-7-8) (ఏపరమాత్మ కంట్లోఉండి నియమిస్తున్నాడో) వంటి వేదవాక్యాల్లో పరమాత్మ, కంటిలోఉన్నవాడుగాను నియమించేవాడుగాను చెప్పబడ్డాడు. అంచేత, "యఏషోఽక్షిణీ పురుషః" అని కంట్లో ఉన్నవాడుగ ఇక్కడ చెప్పబడేవాడు పరమాత్మే. ఈకారణంచేత "యఏషః" అనే ప్రసిద్ధికూడా ఇతనికి తగియున్నది. "దృశ్యతే" అని కనబడుతున్నాడని చెప్పబడుతోందే, అలాంటి ఇతడిని కంట్లో చూడడం శక్యమా? అంటే, యోగులచేత కంటిలో ఇతడిని చూడడంశక్యం గనుకనే ఇది ఇతనికి తగిఉంది. "కమలక్కణ్ణన్ ఎన్ కణ్ణినుళ్ళాన్ కాణ్బాన్" (తి.వా.మొ. 1-9-9) అని నమ్మాళ్వారుకూడా అన్నారుగదా!

// సి. సూ. ॥ సుఖవిశిష్టాభిధానాదేవ చ ॥ 1-2-15 ॥

**సుఖవిశిష్టాభిధానాత్ ఏవ చ=** సుఖముతోకూడినవాడుగ చెప్పటంచేతను (ఈతడు పరమాత్మే).

158. సుఖవైశిష్ట్యవత్త్వేన "కం బ్రహ్మే"త్యాదినా పురా।
ప్రకృతస్య పరస్యైవోపాస్తిస్థానాదిసిద్ధయే॥

*159. "య ఏష" ఇతి నిర్దేశాదత్రాక్షిపురుషః పరః।

158-*159."కం బ్రహ్మ ఖం బ్రహ్మ"(ఛాం.4-10-5)(సుఖంతో కూడినది బ్రహ్మం. చాలగొప్పది బ్రహ్మం) అని మొదటసుఖంతోకూడినవాడుగ ఇతనినిచెప్పి, ఇతడినెక్కడఉపాసించాలో చూపటానికి "య ఏషోఽక్షిణీ" అన్న వాక్యంచెప్పబడిందిగనుక, ఇతను పరమాత్మగానే తగునుతప్ప సుఖంలేని ఇతరుడుగ తగదు.

సి.సూ॥ అత ఏవచ స బ్రహ్మ ॥ 1-2-16 ॥

**అత ఏవచ=** ఈకారణంచేతనే, **సః=** ఆతడు **బ్రహ్మ=** బ్రహ్మమయినాడు.

పూ. 159*. "కం బ్రహ్మే"త్యాదినా ప్రోక్తం కథం బ్రహ్మేతి కథ్యతే।

*160. కే ఖే చైవ బ్రహ్మదృష్టివిధిస్స్యాదితి చేన్న తత్॥

159*-*160. **పూర్వపక్షం.**"కంబ్రహ్మ ఖంబ్రహ్మ" అనిచెప్పబడినది బ్రహ్మమనిఎలాచెప్పసాధ్యం? 'కం'అంటే సుఖం, 'ఖం'అంటే ఆకాశంఅనీ అర్థాలు. ఈవాక్యంనుంచి సుఖంలోను, ఆకాశంలోను బ్రహ్మదృష్టిని పెట్టి- అంటే "నామబ్రహ్మ"(ఛాం.7-1-5), "మనోబ్రహ్మ" (ఛాం. 7-3-2) అన్నప్పుడులాగ వాటిని బ్రహ్మంగ భావించి, ఉపాసించాలని విధించినదిగా ఏర్పడిందేతప్ప బ్రహ్మన్ని చెప్పినట్లవదు. అంచేత "యఏషః"అనే వాక్యంలో చెప్పబడినవాడు పరమాత్మ కానేరడు.

సి. 160* "యద్వావ కం తదేవే"తి యతస్తత్ర ఖవస్తునః॥

161. సుఖవైశిష్ట్యోపదేశోఽత ఏవాత్ర స్వశబ్దితః।
ఆకాశస్స పరంబ్రహ్మపరిచ్ఛిన్నసుఖాత్మకమ్॥

162. ప్రాణం చాస్మై తదాకాశం చోచురిత్యుక్తమన్తతః।
తస్మాత్ప్రాక్ ప్రకృతం బ్రహ్మపరిచ్ఛిన్నసుఖాత్మకమ్॥

*163. అక్ష్యాధారతయాత్రాపి శ్రూయతేఽతోఽక్షిగః పరః।

160*-*163. **సిద్ధాంతం**: ఈపూర్వపక్షం తప్పు. "కం బ్రహ్మ, ఖం బ్రహ్మ" అని చెప్పిన ఈప్రకరణంలో "యద్వావ కం తదేవ ఖం, యదేవ ఖం, తదేవ కం" (ఛాం. 4-10-5) (కం (సుఖం) అనబడేదే ఖం (ఆకాశం) అనబడేది అవుతుంది, ఖం (ఆకాశం) అనబడేదే కం (సుఖం) అనబడేది అవుతుంది.) అని ఖం (ఆకాశం)అని చెప్పబడ్డ పదార్థమే సుఖంతోకూడినదని చెప్పబడుతోంది. ఇది ప్రాకృతమైన ఆకాశానికి కుదరదు. అంచేత అనంతమైనసుఖస్వరూపుడైన పరమాత్మే కం, ఖం అని చెప్పబడుతున్నాడు. పైగా, ఈప్రకరణంలోనే "ప్రాణం చ హాస్మై తదాకాశం చ ఊచుః" (ఛాం.4-10-5) (ప్రాణమైఉండే ఆఆకాశాన్నే చెప్పేరు.) అనిచెప్పబడుతోంది. ప్రసిద్ధిచెందిన ఆకాశానికి ప్రాణంగా ఉండటం కుదరదు. అంచేతకూడ ప్రాణానికి, ఆకాశానికి, అంతర్యామైన పరమాత్మవస్తువే ఇక్కడచెప్పబడింది. అంచేత ఇక్కడ అంతులేని సుఖరూపంగ చెప్పబడిన బ్రహ్మమే, కంటిలోఉన్నవాడుగ చెప్పబడుతున్నాడనిస్పష్టం. ఈకారణాలచేత కంటిలోఉన్నవాడు పరమాత్మేగాని జీవుడు మొదలైనవాళ్ళుగాదు.

// సి. సూ. // శ్రుతోపనిషత్కగత్యభిధానాచ్చ // 1-2-17 //

**శ్రుతోపనిషత్కగత్యభిధానాత్ చ=** పరమపురుషునిగురించిన నిజమైన జ్ఞానంగలవాడికి (అను సంధించతగినదిగా) చెప్పబడే అర్చిరాదిగతి చెప్పటంవల్లకూడా (అక్షిపురుషుడు పరమాత్మే).

163*. విజ్ఞాతబ్రహ్మయాథాత్మ్యైర్గన్తవ్యత్వేన యా గతిః॥

164. బ్రహ్మప్తయే శ్రుతాఽన్యత్ర సార్చిరాదిగతిస్త్విహ।

శ్రుతాక్షిపురుషస్యాభిగన్తవ్యత్వేన పఠ్యతే॥

*165. అతోఽప్యసావక్షివర్తీ పరమాత్మేతి నిశ్చితః।

163*-*165. పరమపురుషునిగురించిన యథార్థజ్ఞానంగలవారు అనుసంధించవలసినదిగను, ముక్తిపొందేటప్పుడు వెళ్ళతగినదిన్నీ, మిగతావేదవాక్యాల్లోచెప్పబడిన అర్చిరాదిగతి అనబడే బ్రహ్మని చేర్చే మోక్షమార్గం, "తేఽర్చిషమేవాభిసంభవన్తి" (ఛాందో. 4-15-5) (వాళ్ళు అర్చిరాదిగతిని పొందుతారు.) అనిప్రారంభించి ఇక్కడ అక్షిపురుషుడినితెలిసిన ఉపకోసలుడికిన్నీ వెళ్ళదగ్గమార్గంగ ఉపదేశింపబడుతోంది. ఈకారణంచేతకూడా అక్షిపురుషుడు పరమాత్మే అయియుండాలితప్ప, అర్చిరాదిగతివల్ల పొందటానికి తగని జీవుడు మొదలైనవాళ్ళు కాదు.

// సి. సూ. // అనవస్థితేరసంభవాచ్చ నేతరః // 1-2-18 //

**అనవస్థితేః=** (జీవుడు మొదలైనవారు కంటిలో ఎప్పుడూ) ఉండకపోవటంచేత, **అసంభవాత్ చ=** (సహజమైనఅమృతత్వం మొదలైనగుణాలు జీవాదులకి) తగనివి కావటంవల్ల, (అక్షిపురుషుడు పరమాత్మే.)

165*. జీవస్య ప్రతిబింబస్యాదిత్యస్యాప్యనవస్థితేః॥

166. నియమేనాక్షిణి తథా నిరుపాధికతాజుషాం।

అసంభవాద్గుణానాం చ పరాత్మైవాక్షిగః పుమాన్॥

// ఇత్యంతరాధికరణమ్ //

165*-166. జీవుడు సర్వేంద్రియాలనీ నియమించటానికి, వాటన్నిటికీమూలమైన హృదయంలోనే ఉంటాడు. అంచేతవాడు కంటిలోలేడు. ప్రతిబింబంకూడ బింబమున్నపుడే ఉంటుందికనుక ఎప్పుడూ కంట్లో ఉండదు. "రశ్మిభిరేషోఽస్మిన్ ప్రతిష్ఠితః" (బృహ 7-5-10) (కిరణాలవల్లనే ఆదిత్యుడు కంటిలో స్థిరంగ ఉన్నాడు)

అనిచెప్పటంచేత చాలదూరంలోఉన్న ఆదిత్యుడుకూడా, తనకిరణాలచేతనే కంటిలో ఉన్నవాడుగ చెప్పబడుతున్నాడుతప్ప తిన్నగా కంటిలోఉన్నవాడుగ చెప్పబడలేదు. పైగా ఇక్కడ సహజమైనఅమృతత్వం (మరణంలేనివాడుగ ఉండటం) మొదలైనగుణాలు అక్షిపురుషుడికి చెప్పబడ్డాయి. ఇవికూడా, పరమపురుషుడికి తగునుతప్ప జీవుడు, ప్రతిబింబం, సూర్యుడు మొదలైనవారికి తగవు. ఈరెండుకారణాలచేత కంటిలో ఉండేవాడుగా ఇక్కడచెప్పబడే పురుషుడు పరమపురుషుడే కాని జీవుడో ప్రతిబింబమో, సూర్యుడో కావటానికి వీలుగాదు. అంచేత అక్షిపురుషుడు పరమాత్మే.

*అంతరాధికరణము ముగిసెను.*

## *॥ అంతర్యామ్యధికరణమ్ ॥ 1-2-4 ॥*

### *॥ సి. సూ. ॥ అంతర్యామ్యధిదైవాధిలోకాదిషు తద్ధర్మవ్యపదేశాత్॥ 1-2-19 ॥*

**అధిదైవాధిలోకాదిషు=** 'అధిదైవము' 'అధిలోకము' వంటిపదాలతో ఉన్నవాక్యాల్లో చెప్పబడిన **అంతర్యామీ=** అంతర్యామి(పరమాత్మే); **తద్ధర్మవ్యపదేశాత్=**ఆపరమపురుషుడికేతగిన ధర్మాలని చెప్పటంచేత.

***167.*** *చక్షుస్స్థితిం పరస్య ప్రాక్ నిశ్చిత్యార్థః ప్రసాధితః।*
*జీవస్యైవ స్థితిస్సేతి వాదోఽత్ర వినివార్యతే॥*

167. వెనకటి అంతరాధికరణంలో ***"యశ్చక్షుషి తిష్ఠన్"*** (బృహ 5-7-18) అన్నవాక్యంలో పరమాత్మే కంటిలోఉన్నవాడుగ చెప్పబడుతున్నాడని నిశ్చయించి ***'అక్షిణి పురుషో దృశ్యతే'*** (ఛాం. 4-15-1) అనే వాక్యంలో కంటిలోఉన్నవాడుగ చెప్పబడేవాడుకూడా ఆతడేఅని నిరూపింపబడింది. ఈఅధికరణంలో ***"యశ్చక్షుషి తిష్ఠన్"*** అనే ఆవాక్యంలో చెప్పబడ్డవాడుకూడా జీవుడే యనే వాదం నిరసింపబడుతోంది.

***పూ. 168.*** *అంతర్యామిబ్రాహ్మణే "యః పృథివ్యా"మితి వాక్యతః।*
*అంతర్యామీ శ్రుతో యోఽసౌ జీవోస్తు ద్రష్టృతాదిభిః॥*

168. **పూర్వపక్షం.** బృహదారణ్యకోపనిషత్తులో కాణ్వపాఠప్రకారమున్న అంతర్యామి బ్రాహ్మణంలో ***"యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అంతరః, యం పృథివీ నవేద, యస్య పృథివీ శరీరం, యః పృథివీమంతరో యమయతి, ఏషతఆత్మా అంతర్యామ్యమృతః"***(బృహ.5-7-7) (ఎవడు భూమిపై నివసిస్తున్నాడో, భూమిలోపలఉంటాడో, ఎవనిని భూమితెలుసుకొనదో, ఎవనికి భూమిశరీరమో, ఎవడు భూమిని లోపలప్రవేశించి నియమిస్తున్నాడో, ఆతడే నీకు ఆత్మగాను, మరణం లేనివాడుగను ఉండే అంతర్యామి) అనిప్రారంభించి జలం, అగ్ని, అంతరిక్షం, వాయువు, ద్యులోకం, ఆదిత్యుడు, దిక్కులు, చంద్రతారకాలు, ఆకాశం, తమస్సు, తేజస్సు మొదలైనవాటిలోకూడ, ఇదేవిధంగ అంతర్యామిగచెప్పి, ***"ఇత్యధిదైవతమథాధిభూతమ్"*** (5-7-18)అనిమొదలుబెట్టి, సర్వభూతాల్లోనూ అంతర్యామిగచెప్పి ***"ఇత్యధిభూతమధ్యాత్మం"*** (5-7-19)అనిప్రారంభించి, ప్రాణం, వాక్కు, కన్ను, చెవి, మనస్సు, చర్మం, విజ్ఞానం, రేతస్సు అనబడేవాటిలో అంతర్యామిగ చెప్పబడినది. ఇదే ఉపనిషత్తులో మాధ్యందినపాఠప్రకారము అంతర్యామిబ్రాహ్మణంలో (3-7) ***అధిలోకము, అధివేదము, అధియజ్ఞము*** అనే పర్యాయపదాలని తరుచుగా చెప్పడంచేత, అన్నిలోకాల్లోనూ, అన్నివేదాల్లోనూ, అన్నియజ్ఞాల్లోను, అంతర్యామినిచెప్పింది. కాణ్వపాఠంలో ***"యోవిజ్ఞానే తిష్ఠన్"***(5-7-26) అని ప్రారంభించి చెప్పినచోటను, మాధ్యందినపాఠంలో ***"యఆత్మనితిష్ఠన్"*** (3-7-30) అని ప్రారంభించి చెప్పినది ఈఅంతర్యామి జీవాత్మా లేక పరమాత్మాఅని విచారిస్తే జీవాత్మ అనే అనకోవలసివస్తోంది. ఎంచేతంటే, ఈవిధంగ అంతర్యామిని చెప్పినతరువాత ***'ద్రష్టా శ్రోతా'*** (5-7-27) (చూసేవాడు, వినేవాడు)

అనిఇతనిని కంటితో చూడబడేవాడనీ, చెవితో వినబడేవాడనీ చెప్పింది. ఇలా ఇంద్రియాలవల్ల కలిగే జ్ఞానంగలవాడుగ చెప్పటంచేతను, *"నాన్యోऽతోస్తి ద్రష్టా"* (5-7-27) (వీడికంటే చూడబడేవాడు వేరొకడులేడు) అని చెప్పటంచేతను, వీడు జీవుడే అయిఉండాలిగాని పరమాత్మకానేరడు.

*సి. 169.* *ద్రష్టృంతరనిషేధాచ్చేత్యేవంవాదో న సంమతః।*
*అధిదైవాధిలోకాదిపదాంకితవచశ్శృతః॥*

*170.* *అంతర్యామీ పరాత్మైవ తద్ధర్మవ్యపదేశతః।*
*జగచ్ఛరీరకత్వం చ సర్వాంతర్యామితా తథా॥*

*171.* *అత్రైవమాద్యాః పఠితా ధర్మా నారాయణాశ్రితాః।*
*దర్శనాది తు రూపాదిసాక్షాత్కారో న చాన్యథా॥*

**172.* *నాన్యోऽతోస్తీత్యదోవాక్యం తుల్యద్రష్టృనిషేధకం।*

170-*172. **సిద్ధాంతం:** *"అధిదైవతమ్", "అధిలోకమ్", "అధిభూతమ్", "అధ్యాత్మ్యమ్", "అధివేదమ్"* మొదలైన పదాలతోఉన్న బృహదారణ్యక కాణ్వమాధ్యందినపాఠాల్లో చెప్పబడే వాక్యాల్లో ఉద్ఘోషించబడిన అంతర్యామి పరమాత్మే కావాలితప్ప జీవాత్మకాలేడు. భూమిమొదలైన అన్నిలోకాలనీ ఈయనకి శరీరంగాను అన్నింటికీ ఈయన్నే అంతర్యామిగాను (లోపలప్రవేశించి నియమించేవాడుగానూ, ఇంకా ఎన్నోవిధాలుగా వేదం ఇక్కడ ఇతనిని చెప్తోంది. ఈధర్మాలన్నీ *"ఏషసర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకో నారాయణః"*, (సుబాలో.), *"అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః"* (తై.నా.)అని లోకమంతటా లోపల, బయట వ్యాపించిఉండేవాడుగ చెప్పబడిన నారాయణుడికి తగునేతప్ప తనశరీరాన్నే సరిగ్గా నియమించలేని జీవుడికి తగనేతగదు. *"ద్రష్టా, శ్రోతా"* అనిఈయననే చూసేవాడుగాను, వినేవాడుగాను చెప్పినంతమాత్రం ఈతడు జీవుడైయుండటం సాధ్యంగాదు. *"పశ్యత్యచక్షుః సశ్రుణోత్యకర్ణః"*(శ్వే-3-19) (పరమాత్మ కన్నులేకనే చూస్తున్నాడు, చెవిలేకనే వింటున్నాడు)అని పరమపురుషుడిగురించి ఉపనిషత్తు చెప్పింది. చూస్తున్నాడంటే కేవలం ఇంద్రియాలతో చూస్తున్నాడనికాదు. రూపం, శబ్దం మొదలైనవాటిని తెలుసుకోవడమే చూడటం, వినడం అనబడుతుంది. ఇది పరమాత్మకీఉంటుంది. *"నాన్యోతోస్తి ద్రష్టా"* (ఈయనతప్ప మరోచూసేవాడులేడు) అన్నదీ, వెనకచెప్పినప్రకారం ఇతనిలాగ సర్వసాక్షాత్కార నియమనాదులు చేసేవాడూ మరొకడు లేడన్నమాట. ఇలా చెప్పకపోతే జీవపరులిద్దరినీ తెలుసుకొనేవాళ్ళుగా చెప్పే వాక్యాలు విరోధిస్తాయి.

*॥ సి. సూ.॥ న చ స్మార్తమతద్ధర్మాభిలాపాచ్ఛారీరశ్చ॥ 1-2-20 ॥*

**స్మార్తంచ=** ప్రధానమున్ను, **శరీరః చ=** శరీరసంబంధంఉండే జీవుడున్ను, **న=** అంతర్యాములు గారు, **అతద్ధర్మాభిలాపాత్=** వారికి తగని ధర్మాలని చెప్పటంచేత.

*172*.* *ప్రధానం చ తథా జీవో నాంతర్యామీ తయోర్ద్వయోః॥*

*173.* *అసంభావితధర్మాణాం అభిలాపాదనేకశః।*
*అచేతనం యథా నార్హమేతేషాం చేతనస్తథా॥*

172*-173. ఇక్కడ స్మృతిఅంటే అనుమానం. స్మార్తమని అనుమానంవల్ల తెలియబడే ప్రకృతి చెప్పబడుతోంది. మూలప్రకృతీ, శరీరసంబంధమున్నజీవుడూ ఇక్కడచెప్పబడే అంతర్యామి కాలేరు. సహజంగా అన్నింటిని చూడటం, అన్నింటిని నియమించటం, అన్నింటికీ ఆత్మగాఉండటం, సహజంగా మరణంలేనివాడుగా ఉండటం మొదలైనఎన్నోగుణాలిక్కడ అంతర్యామికి చెప్పబడుతున్నాయి. ఇవి ప్రకృతికి,

జీవుడికీ ఏమాత్రం తగిఉండవు. అంచేత ఇతను పరమాత్మే. అంతర్యామిగాడని ఎత్తుకొని నిరసించడం, తగిన అర్హతలేని మూలప్రకృతినీ ఇక్కడచెప్పి తోసివేయడం ఎందుకు? అంటే, ఎలా మూలప్రకృతిఅనేది అంతర్యామి కాదని ఎత్తి తప్పించడంకూడ తగనిదో, అలాగే, జీవుడుకూడా తగనివాడే అనిచూపటానికి ప్రధానాన్ని ఎత్తుకొని సూత్రకారులు తోసివేస్తున్నారు.

*// సి. సూ. // ఉభయేఽపి హి భేదేనైనమధీయతే // 1-2-21 //*

**ఉభయే అపి=** కాణ్వం, మాధ్యందినం అనే రెండుశాఖలూ, **ఏనం=** ఈ అంతర్యామిని, **భేదేన=** (జీవుడికంటె) భిన్నమైనవాడుగ **అధీయతేహి=** చెప్తున్నాయిగదా!

*174.* *కాణ్వా మాధ్యందినాశ్చైవ "యో విజ్ఞానే", "య ఆత్మని"।*
*ఇత్యంతర్యామిణం జీవాత్ భేదేనాధీయతే యతః॥*

*175.* *జీవాద్విలక్షణోఽతోసావన్తర్యామీ పరఃపుమాన్।*
*ధ్వస్తపాప్మా పరాత్మా స నారాయణ ఇతి స్థితమ్॥*

*// ఇత్యంతర్యామ్యధికరణమ్ //*

174-175. కాణ్వశాఖలో *"యో విజ్ఞానే తిష్ఠన్"* అనిప్రారంభించి చెప్పినచోట, మాధ్యందినశాఖలో *"య ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరః యమాత్మా నవేద, యస్యాత్మా శరీరం యఆత్మాన మంతరో యమయతి సత ఆత్మాఽన్తర్యామ్యమృతః"* (ఎవడు ఆత్మలోనివసిస్తున్నాడో, ఆత్మ లోపలున్నాడో, ఎవనిని ఆత్మ తెలుసుకొనలేదో, ఎవనికి ఆత్మ శరీరమో, ఎవడు ఆత్మలో ప్రవేశించి నియమిస్తున్నాడో, వాడే నీకు ఆత్మగాను, అంతర్యామిగాను, మరణంలేనివాడుగాను ఉన్నాడు) అనిచెప్పబడింది. ఇలాగ జీవుడిని అంతర్యామికంటె చాలభిన్నమైనవాడుగ చెప్పడంవల్ల ఇక్కడ ఉద్ఘోషింపబడే అంతర్యామి జీవుడు కాలేడు. *"యస్య పృథివీ శరీరం యః పృథివీమంతరే సంచరన్ యం పృథివీ నవేద, యస్యాపః శరీరం..."* అని ప్రారంభించి బృహదారణ్యకవాక్యచ్ఛాయగా మంత్రాలని చెప్పి, *"ఏష సర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణః"* అని పాపములులేనివాడు, పరమపదంలోఉండే పరమాత్మైననారాయణుడే ఇలా సర్వభూతాంతర్యామిగా ఉండేవాడని సుబాలోపనిషత్తు చెప్పటంచేత, ఇక్కడచెప్పబడే అంతర్యామికూడా అతడే అన్నది సర్వశాఖాప్రత్యయన్యాయంవల్ల సిద్ధిస్తోంది.

*అంతర్యామ్యధికరణం ముగిసింది.*

## *// అదృశ్యత్వాదిగుణకాధికరణమ్ // 1-2-5 //*

*// సి. సూ. //అదృశ్యత్వాదిగుణకో ధర్మోక్తేః//1--2--22 //*

***అదృశ్యత్వాది గుణకః=*** కనబడకపోవటం మొదలైనవాటిని గుణంగాఉన్నవాడుగా చెప్పబడేవాడు (పరమాత్మే.): ***ధర్మోక్తేః=*** (ఆతనికే తగిన) గుణాలని చెప్పటంచేత.

*176.* *ఉక్తం ద్రష్ట్రుత్వాదినా ప్రాక్ పరాత్మత్వం న యత్ర తత్।*
*తత్ర ప్రధానమేవ స్యాదితి శంకా వ్యుదస్యతే॥*

176. క్రిందటి అధికరణంలో *"అదృష్టో ద్రష్టా"* (ఒక్కడిచేతగూడ చూడబడనివాడుగ ఉన్నవాడు, అంతనీ చూసేవాడు) అని అంతటినీచూసేవాడుగా చెప్పబడే అంతర్యామి పరమాత్మేనని నిరూపింపబడింది. అలా చూసేవాడని చెప్పకుండా, కనబడనివాడుగ మాత్రం ముండకోపనిషత్తులో చెప్పబడినతత్త్వం మూల

ప్రకృతే అవవచ్చు అనే సందేహం ఈఅధికరణంలో నిరాకరింపబడుతోంది.

పూ. 177. *"యత్తదద్రేశ్య"మిత్యాదౌ శ్రూయతే ముండకశ్రుతౌ।*

*"యద్భూతయోని"మితి చాథా"క్షరాత్పరతః పరః"॥*

178. *స్థలేఽత్రాజాజీవఘనావేవోచ్యేతే యథాక్రమమ్।*

*ప్రతిషేధాదచిద్వర్తిదృశ్యత్వాదేరచేతనమ్॥*

*179. *సజాతీయం ప్రధానం స్యాత్ భూతయోన్యక్షరం తథా।*

177-*179. **పూర్వపక్షం:** అధర్వణవేదానికు చెందిన ముండకోపనిషత్తులో *"అథ పరాయయా తదక్షా మధిగమ్యతే యత్తదద్రేశ్యమగ్రాహ్య మగోత్రమవర్ణం అచక్షుః అశ్రోత్రం తదపాణిపాదం ।నిత్యంవిభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥*(ముండకో. 1-1-5,6) ( తదుపరిగా, పరవిద్యవల్ల నక్షరమైన(నశించని) ఆవస్తువు పొందబడుతోంది. ఆవస్తువు కనబడదు, తెలుసుకొనబడదు, గోత్రములేనిది, వర్ణములేనిది, కన్ను,చెవిలేనిది, కాలు,చెయ్యిలేనిది, ఎల్లప్పుడూ ఉండేది, గొప్పతనం గలది. అన్నిచోట్లా వ్యాపించి ఉండేది, చాలసూక్ష్మ మైనది, నాశంలేనిది, భూతాలకి కారణమైనది, దీనిని జ్ఞానులు చూస్తారు.) అని ఒకవస్తువు చెప్పబడింది. ఇలా భూతయోనిఅయిన అక్షరాన్ని చెప్పినతరువాత, తరువాతి వాక్యం ఒకదానిలో *"అక్షరాత్పరతఃపరః"* (ముండకో. 2-1-2) (గొప్పదైన (మేలైన) అక్షరంకంటే మేలైనవాడు) అని మరొక తత్త్వం చెప్పబడింది. ఇలా రెండువాక్యాల్లోనూ, చెప్పబడిన తత్త్వాలు క్రమంగ ప్రకృతి, పురుషులే అయియుండాలి. మొదటివాక్యంలో అక్షరమని ఒకదాన్ని చెప్పి, రెండోవాక్యంలో అక్షరానికి మీదిదైన మరోదాన్ని చెప్పటంచేత, ఇవి పరమాత్మైనఒకేతత్త్వం అవటానికివీలుగాదు. వేఱువేఱు తత్త్వాలైన ప్రకృతి, పురుషులే అయియుండాలి. పైగా, మొదటివాక్యంలో భూతయోనిఅయిన అక్షరానికి చూడబడటం మొదలైన లక్షణాలు లేవనిచెప్పబడింది. ఈగుణాలు మనంచూసే స్థూలమైన అచేతనవస్తువుల్లోనే కనబడేవి. ఈగుణాలు లేనిదని ఇక్కడ చెప్పబడే భూతయోనియైన (పంచభూతాలకీ కారణమైన) అక్షరం స్థూలమైన అచేతనవస్తువుకి సజాతీయమైనదై, కారణమై, సూక్ష్మ మైన మూలప్రకృతేనని గ్రహించడం ఉచితం. రెండోవాక్యంలో స్థూలమైన అచేతనంకంటే గొప్పదైన ఈఅక్షరం కంటే, మేలైనవాడుగా చెప్పబడేవాడు పరమపురుషుడే అవాలి.

సి. 179* *పరతశ్చాక్షరాజ్జీవఘనస్యాత్పర ఇత్యసత్॥*

180. *అత్రాదృశ్యత్వాదిగుణశ్చాక్షరాత్పరతః పరః।*

*పరమాత్మైవ తద్ధర్మసర్వజ్ఞత్వాదిసంశ్రుతేః॥*

181. *పంచమ్యన్తాక్షరపదం భూతసూక్ష్మం బ్రవీతి తత్।*

*నాదృశ్యత్వాదిగుణకమక్షరం తస్య సర్వతః॥*

182. *పరత్వేన తతోఽన్యస్య పరత్వాసంభవాదిదమ్।*

*సర్వజ్ఞత్వజగద్యోనిత్వాదిభిర్హి విశేష్యతే॥*

179*-182. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాదు. మొదటివాక్యంలో 'కనబడకపోవడం' వంటి గుణాలున్నవాడుగా చెప్పబడే భూతయోన్యక్షరమూ, రెండోవాక్యంలో అక్షరంకంటె మేలైనవాడుగ (పరుడు) చెప్పబడేవాడూ, పరమాత్మే. *"యస్సర్వజ్ఞస్సర్వవిత్"*(ముండకో.1-1-9) (ఎవడు అన్నివస్తువుల స్వరూప స్వభావాలనీ తెలిసినవాడో) అనిప్రారంభించి, ఈభూతయోన్యక్షరానికి సర్వజ్ఞత్వంవంటి పరమాత్మధర్మాలు చెప్పబడ్డాయిగనుక ఇది మూలప్రకృతి కానేరదు. రెండోవాక్యంలో చెప్పబడే అక్షరం మూలప్రకృతే అవుతుంది.

అన్నింటికంటే పెద్దదై, తనమీద మరొకటిలేని భూతయోన్యక్షరమున్నూ, అదీ ఒకటిగావు. ***"అక్షరాత్ పరతః పరః"*** (ముండకో.2-1-2) (అక్షరమనబడే మూలప్రకృతికంటే, గొప్పదైన పురుషతత్త్వంకంటే మీదివాడై ఉన్నాడు.) అనిరెండోవాక్యంలోచెప్పబడినవాడు మొదటివాక్యంలో భూతయోన్యక్షరంగా చెప్పబడ్డ పరమాత్మే అయినవాడు. ***"యస్సర్వజ్ఞః"*** అని ఈభూతయోన్యక్షరాన్ని అన్నీతెలిసినదిగాను, ***"తథాక్షరాత్ సంభవతి ఇహావిశ్వమ్"*** (ముండక 1-1-2) (ఈఅక్షరంనుంచి చేతనాచేతనాలన్నీ, పుట్టేయి) అని చేతనాచేతనాలున్న లోకమంతటికీ కారణంగా చెప్పటంచేత, ఇది మూలప్రకృతిగానేరదు. పరమపురుషుడే అవాలి.

***సి.సూ//విశేషణభేదవ్యపదేశాభ్యాం చ నేతరౌ// 1-2-23//***

***విశేషణభేదవ్యపదేశాభ్యాం చ=*** విశేషించబడిచెప్పడంచేతనూ, భేదాన్ని చెప్పటంచేతనూ, ***ఇతరౌ=*** ప్రకృతి, పురుషుడు, న: ఇచ్చట చెప్పబడలేదు.

***183.*** *మహాప్రకరణం చాత్రప్రధానాత్పురుషాదపి।*
*సర్వజ్ఞానప్రతిజ్ఞాద్యైర్వ్యావర్తయతి చాక్షరమ్॥*

***184.*** *"పరతః పర' ఇత్యాభ్యాం భేదశ్చాస్యోపదిశ్యతే।*
*తస్మాదత్రోచ్యతే తాభ్యాం పరోనారాయణః ప్రభుః॥*

183-184. ఈప్రకరణంలో భూతయోన్యక్షరమైన ఈవస్తువును తెలుసుకుంటే అన్నింటినీ తెలుసుకున్నట్లవుతుందని విశేషించబడింది. దీనిని ఉపాసిస్తే బ్రహ్మానుభవమనే మోక్షం సిద్ధిస్తుందనీ చెప్పబడింది. భూతయోన్యక్షరం ప్రధానమనో పురుషుడనో అనుకుంటే ఇలా విశేషించటం కుదరదు. పైగా, ***"అక్షరాత్ పరతః పరః"*** (ముండక. 2-1-2) (అక్షరమనే మూలప్రకృతికంటే మీదివాడైన పురుషుడుకంటే మీదివాడు.) అని ప్రకృతి, పురుషులకంటే భూతయోన్యక్షరం పైనఉన్నదనిఇక్కడ ఉపనిషత్తు చెప్తోంది. ***"పరతః అక్షరాత్ పరః"*** అని అన్వయించి, ***"(మహదాదులకంటే) మీదిదైన అక్షరమనబడే మూలప్రకృతికంటే మీదివాడు"*** అని పురుష తత్త్వాన్ని చెప్పేదిగా పూర్వపక్షి అర్థంచెప్పడంసరిగాదు. ఇలా అర్థాన్ని తీసుకుంటే రెండుదోషాలున్నవి. ***"అక్షరాత్ పరతః"*** (అక్షరంకంటే మేలైనదానికంటే) అని చెప్పినదాన్ని ***"పరతః అక్షరాత్"*** (మీదిదైన అక్షరం కంటె) అని మార్చిఅర్థము చెప్పుకోవటం ఒకదోషం. అలాఅర్థంతీసుకున్నా, దేనికంటెమేలైన అక్షరమో శ్రుతిలో చెప్పక పోయినందువల్ల ***"మహదాదులకంటె మీదిదైన అక్షరం"***అనితీసుకోవడానికి, ***"మహదాదులకన్న'***అనే పదాన్ని అధ్యాహారంచెయ్యడం రెండోదోషం. అంచేత మేంచెప్పినపద్ధతిలోనే అర్థాన్నితీసుకుంటే, అది తగియుంటుంది. ***"పరతః అక్షరాత్ పరః"*** అనిచూపించే అర్థంతీసుకోవలసివచ్చినా, (ప్రధానంకంటే) మీదివాడైన జీవుడికంటే మీదివాడైనపరమాత్మ అనే ప్రకరణాన్ననుసరించి అర్థం చెప్పుకోవాలి. అప్పుడూ పరమాత్మకి భేదమే చెప్పబడుతోంది. అంచేత ఈప్రకరణంలో ప్రకృతిపురుషులకంటే భూతయోన్యక్షరాన్ని విశేషించి చెప్పటంచేత, ఈఅక్షరం ప్రకృతిగాని, పురుషుడుగాని కాలేదు. వాటికంటె, గొప్పవాడైన నారాయణుడే అవడం సాధ్యమని స్పష్టం.

***// సి. సూ. // రూపోపన్యాసాచ్చ // 1-2-24 //***

***రూపోపన్యాసాత్ చ=*** (లోకమంతా అక్షరానికి) శరీరంగా చెప్పటంచేత, (అక్షరం పరమాత్మే).

***185.*** *"అగ్నిర్మూర్ధే"త్యాదినోక్తం రూపం త్రైలోక్యరూపిణః।*
*పరమాత్మన ఏవ స్యాదతోఽయం పరమః పుమాన్॥*

*//ఇత్యదృశ్యత్వాదిగుణకాధికరణమ్ //*

185. *"అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః వాయుః ప్రాణో హృదయం విశ్వమస్య పద్భ్యాం పృథివీ హ్యేషసర్వభూతాంతరాత్మా॥* (ముండకో.2-1-4) (ఇతనికి అగ్నిఅనబడే ద్యులోకం తలగాను, చంద్రసూర్యులు కళ్ళుగాను, దిక్కులు చెవులుగాను, వేదాలు మాటలుగాను, వాయువనబడేవాడు ప్రాణంగాను లోకమంతా హృదయంగాను భూమిఅనేది కాళ్ళుగాను ఉన్నాయి. ఇతడు అన్నిభూతాలకీ అంతరాత్మగఉండేవాడు)అని ఈఉపనిషత్తులో ఈభూతయోన్యక్షరానికి లోకమంతా అంగాలుగా ఉన్నశరీరమని చెప్పబడుతోంది. లోకమంతాశరీరంగాఉన్న పరమపురుషుడికి ఇలాంటి శరీరంతగునుగాని, మూలప్రకృతికో లేదాపురుషునికో ఇలాంటి శరీరముండలేదు. అందుచేతగూడ ఇక్కడ అదృశ్యత్వం (కనబడకపోవడం) మొదలైనగుణాలున్నదిగా చెప్పబడే భూతయోన్యక్షరం పరమాత్మేనని సిద్ధించింది.

*అదృశ్యత్వాదిగుణకాధికరణము ముగిసెను.*

## ॥వైశ్వానరాధికరణమ్ ॥1--2--6 ॥

### ॥ సి. సూ. ॥ వైశ్వానరస్సాధారణశబ్దవిశేషాత్ ॥ 1-2-25 ॥

***వైశ్వానరః=*** వైశ్వానరుడనిచెప్పబడేవాడు (పరమాత్మే), ***సాధారణశబ్దవిశేషాత్=*** సామాన్యశబ్దాన్ని విశేషించడంచేత.

**186.** *త్రైలోక్యమూర్తిమత్త్వేన పరాత్మత్వం సమర్థితమ్।*
*తత్ తదన్యస్యాపి చాస్తీత్యాశఙ్కాత్ర వ్యుదస్యతే॥*

186. వెనకటిఅధికరణం చివరిసూత్రంలో మూడులోకాలనీ శరీరంగాగలవాడవటంవల్ల భూత-యోన్యక్షరం పరమాత్మేనని నిరూపింపబడింది. ఇలా మూడులోకాలనీ శరీరంగాగలవాడనే గొప్పదనం పరమాత్మకేగాక మిగతామరికొన్నివస్తువులకికూడా ఉంటుందా అనేసందేహం ఈఅధికరణంలో తీర్చబడుతోంది.

**పు. 187.** *సామాన్యా"త్మానమేవేమం వైశ్వానర'"మితి స్థలే।*
*వైశ్వానరః పరాత్మేతి నిర్ణేతుం నైవ శక్యతే ॥*

**188.** *జాఠరాగ్నౌ తత్పదస్య భూతే దేవే పరాత్మని।*
*చతుర్ష్వపి ప్రయోగాదత్రైషాం లిఙ్గోపలబ్ధితః॥*

187-188. **పూర్వపక్షం:** సామవేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తులో *"ఆత్మానమేవేమం వైశ్వానరం సంప్రత్యధ్యేషి తమేవనో బ్రూహి"* (ఛాం. 5-11-6) (మీరు ఈవైశ్వానరాత్మనే ఇప్పుడు ఉపాసిస్తున్నారు. దానినే మాకు చెప్పుదురుగాక) అని ప్రారంభించి, *"యస్త్వేవమేతం ప్రాదేశమాత్రమభి విమానమాత్మానం వైశ్వానరముపాస్తే స సర్వేషులోకేషు సర్వేషు భూతేషు సర్వేష్వాత్మస్వన్నమత్తి"* (ఛాం. 4-8-1) (ఎవడు అంతటాఉండేవాడవటంచేత అపరిచ్ఛిన్నుడైన వైశ్వానరాత్మని ఒకేచోటఉండేవాడుగ ఉపాసిస్తున్నాడో వాడు సర్వలోకసర్వభూతసర్వాత్మలలోనూ అన్నాన్ని తింటున్నాడు) అన్నట్లు వైశ్వానరుడనేఒకతత్త్వం చెప్పబడింది. ఈవైశ్వానరుడు పరమాత్మేనని నిశ్చయించడానికి వీల్లేదు. *"అయమగ్నిర్వైశ్వానరః"* (బృహ7-9-1) అన్నప్పుడు జాఠరాగ్నిగాను, *"విశ్వస్మా అగ్నిం భువనాయ దేవా వైశ్వానరమ్"* అన్నప్పుడు పంచభూతాల్లో ఒకటైన అగ్నిగాను, *"వైశ్వానరస్యసుమతౌస్యామ"* (యజు. కాఠ. 1-5-11)అన్నచోట ఒకదేవతగాను, *"సఏష వైశ్వానరో విశ్వరూపః"* (ప్రశ్నో.1-7) అని పరమాత్మగాను వైశ్వానరశబ్దం ప్రయోగింపబడింది. ఈప్రకరణంలో కూడా ఈనాలుగుతత్త్వాలకీ ఉన్న చిహ్నాలు కనబడుతున్నాయి. అంచేత ఇక్కడచెప్పబడే వైశ్వానరుడు

పరమాత్మేనని నిశ్చయింపవీలుగాదు.

సి.189. మైవం వైశ్వానరపదవాచ్యః పరమపూరుషః।

సాధారణైతచ్ఛబ్దస్య పరాసాధారణైర్గుణైః॥

*190. విశేష్యమాణత్వాదత్రానేకైః సర్వాత్మతాదిభిః॥

189-*190. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. "కోన ఆత్మా కిం బ్రహ్మ" (ఛాం. 5-11-1) (మనకి ఆత్మ ఎవరు? ఏదిబ్రహ్మం?)అని ఈప్రకరణంమొదట్లో అందరికీ ఆత్మగా బ్రహ్మమనే ఒకతత్త్వాన్ని చెప్పి తరువాత "ఆత్మానం వైశ్వానరం" (ఛాం. 5-11-2)అని ఈతత్త్వాన్నే వైశ్వానరాత్మఅని ఉపనిషత్తు చెప్తోంది. మొదట బ్రహ్మమనిచెప్పబడేవస్తువే తరువాత ఎన్నోచోట్ల వైశ్వానరుడిగా చెప్పబడటంచేతను, అందరికీ ఆత్మగా ఉండడం మొదలైన పరమపురుషలక్షణాలతో ఈవైశ్వానరుని విశేషించడంచేతను, నాలుగువస్తువులనీ చెప్పగలిగిన సాధారణపదమైన వైశ్వానరపదం ఇక్కడ బ్రహ్మం ఒక్కదాన్నే చెప్తోందని గ్రహించాలి.

॥ సి. సూ. ॥ స్మర్యమాణమనుమానం స్యాదితి ॥ 1-2-26 ॥

**ఇతి=** ఇట్లా (లోకమంతా శరీరంగా గలదిగ) **స్మర్యమాణం=** తెలియజేయడం, **అనుమానం స్యాత్=** (వైశ్వానరుడు పరమాత్మే అనే విషయంలో) చిహ్నం కావచ్చును.

190* ద్యుమూర్ధత్వాదిమద్రూపకం వైశ్వానరాత్మనః॥

191. శ్రుతిస్మృతిప్రసిద్ధం తత్ తదేవేదమితీహ చ।

ప్రత్యభిజ్ఞాయమానం సదస్య వైశ్వానరాత్మనః॥

*192. పరాత్మత్వే లింగమేతదతో వైశ్వానరః పరః।

190*-*192. ఈప్రకరణంలో ఈవైశ్వానరుడికి ద్యులోకంమొదలు భూమివరకూఉన్న వస్తువులన్నీ శిరస్సునుండి పాదంవరకూఉన్న అవయవాలుగా ఉపనిషత్తు చెప్తోంది. "అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః। వాయుః ప్రాణో హృదయం విశ్వమస్యపద్భ్యాం పృథివీ హ్యేష సర్వ భూతాంతరాత్మా" (ముండకో. 2-1-4) (ఇతనికి అగ్నియనబడేద్యులోకం శిరస్సుగాను, చంద్రసూర్యులు కళ్ళుగాను, దిక్కులు చెవులుగాను, వేదాలు మాటలుగాను, వాయువు ప్రాణంగాను, లోకమంతా హృదయం గాను, భూమి పాదాలుగాను ఉన్నాయి. ఇతను అన్నిభూతాలకీ అంతరాత్మగా ఉన్నాడు) అని శ్రుతిలోనూ,

భూఃపాదౌయస్యనాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌచనేత్రే

కర్ణావాశాః శిరోద్యౌర్ముఖమపి దహనో యస్యవాస్తేయమబ్ధిః।

అంతస్థం యస్యవిశ్వం సురనరఖగగోభోగిగంధర్వదైత్యైః,

చిత్రం రం రమ్యమాణం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి॥

(ఎవనికి భూమి పాదాలైందో, ఆకాశం నాభిగాను, వాయువు ప్రాణంగాను, సూర్యచంద్రులు నేత్రాలుగాను, దిక్కులు చెవులుగాను, ద్యులోకం శిరస్సుగాను, అగ్ని ముఖంగాను, సముద్రం మూత్రకోశంగాను, దేవతలు, మనుష్యులు, పక్షులు, పాములు, గంధర్వులు, అసురులు మొదలైన వాళ్ళచేత విచిత్రంగాను, అందంగాను ప్రకాశించే లోకమంతా ఎవనికి హృదయమైందో, మూడులోకాలనీ శరీరంగాగల ప్రభువైన ఆవిష్ణువుకి నమస్కరిస్తున్నాను) వంటి నూరుకంటే ఎక్కువైన స్మృతి, ఇతిహాసపురాణవచనాల్లోనూ, ఈగొప్పతనం పరమపురుషుడికే చెప్పబడుతోంది. ఇట్లా పరమపురుషుడికే తగిన త్రైలోక్యశరీరత్వం అనబడే ఈగొప్పదనం ఇక్కడ వైశ్వానరుడికి తెలియచేస్తోందికనుక, ఈవైశ్వానరుడు పరమాత్మేనని చూపే చిహ్నంఅవుతోంది. అంచేత

ఈవైశ్వానరుడు పరమాత్మే.

సి.సూ ॥శబ్దాదిభ్యోఽన్తఃప్రతిష్ఠానాచ్చ నేతి చేన్న తథా దృష్ట్యుపదేశాదసంభవాత్ పురుషమపి చైనమధీయతే॥ 1-2-27 ॥

***శబ్దాదిభ్యః=*** శబ్దం మొదలైనవాటిచేతను, ***అంతఃప్రతిష్ఠానాత్ చ=*** (శరీరం)లోపలఉండేవాడవటంచేతను ***న=*** వైశ్వానరుడు పరమాత్మేనని చెప్పశక్యముగాదు, ***ఇతి చేత్=*** అనిచెప్పినచో, ***న=*** అది సరిగాదు. ***తథా దృష్ట్యుపదేశాత్=*** జాఠరాగ్నిని శరీరంగ గలవాడవటంవల్ల పరమాత్మవస్తువును గురించిన ఉపాసనం ఉపదేశింప బడటంచేతను, ***అసంభవాత్=*** (కేవలజాఠరాగ్నికి మూడులోకాలూ శరీరంగాఉండటం) తగకపోవటం చేతను, (వైశ్వానరుడు పరమాత్మేనని చెప్పవీలగును) ***ఏతం=*** ఈవైశ్వానరుడిని, ***పురుషం అపిచ అధీయతే=*** (ఒకవేదవాక్యం) పురుషుడనిగదా చెప్తోంది.

*పూ. 192** *"అగ్నిర్వైశ్వానర"ఇతి సామానాధికరణ్యతః॥*

*193.* *అగ్నిత్రేతాకల్పనాచ్చ స్థానాత్ప్రాణాహుతేస్తథా।*
*శరీరాన్తః స్థితేశ్చాస్య జాఠరత్వం ప్రతీయతే॥*

192*-193.**పూర్వపక్షం:** ఈవైశ్వానరుడు పరమాత్మేనని నిర్ణయించవీలుగాదు. ఎంచేతంటే, *"సఏషోగ్నిర్వైశ్వానరః"* (ప్రశ్నో.1-7) (ఈఅగ్నే వైశ్వానరుడు)అని ఒకవాక్యంలో వైశ్వానరుడు జాఠరాగ్నిగా చెప్పబడ్డాడు. ఈప్రకరణంలోకూడా, *"హృదయం గార్హపత్యో మనోన్వాహార్యపచన ఆస్యమాహవనీయః"* (ఛాం.5-18-2) (హృదయం గార్హపత్యాగ్ని, మనస్సు అన్వాహార్యాగ్ని, నోరు ఆహవనీయాగ్ని) అని హృదయం, మనస్సు, ముఖం అనుమూడుచోట్లలోఉన్న ఈవైశ్వానరుడిని గార్హపత్యం మొదలైన మూడు అగ్నులుగా కల్పించటంవల్ల, *"యాం ప్రథమామాహుతిం జుహుయాత్ తాం జుహుయాత్ ప్రాణాయ స్వాహా"*(ఛాం. 5-19-1) ((జాఠరాగ్నినిగురించి) మొదటచేయబడే ఆహుతిని 'ప్రాణాయ స్వాహా' అని హోమంచేయాలి) అని ప్రాణాహుతికి ఆధారంగ వైశ్వానరుని చెప్పటంచేతను, *"ఏతమేవమగ్నిం వైశ్వానరం పురుషవిధం పురుషేన్తః ప్రతిష్ఠితం..."* (శత.బ్రా. X.6-1-11) (ఎవడు ఈవిధంగ ఈవైశ్వానరాగ్నిని పురుషుడిగాను, పురుషుడిలో ఉన్నవాడుగాను తెలుసుకుంటాడో...)అని శుక్లయజుర్వేదవాక్యమొకదాంట్లో వైశ్వానరుడిని పురుషశరీరంలో ఉన్నట్లు చెప్పటంచేతను, ఇక్కడచెప్పబడే వైశ్వానరుడు జాఠరాగ్నే అయి ఉండాలి. అంచేత ఇతడు పరమాత్మేనని నిశ్చయించడానికి వీలులేదు.

*సి. 194* *తస్మాదస్యపరాత్మత్వం నేతి చేత్తన్న తాదృశః।*
*వైశ్వానరస్యాదర్యాగ్నిశరీరకతయాఽత్ర చ॥*

*195.* *తద్విశిష్టోపాసనస్య విధానాత్కేవలస్య తు।*
*జాఠరస్య త్రిలోకాంగకత్వాసంభవతస్తథా॥*

*196.* *ఏవం వైశ్వానరాత్మానమేకే వాజసనేయినః।*
*పురుషం చాధీయతే "స ఏషోగ్ని"రితి వాక్యతః॥*

*197.* *నిర్గతోపాధిపురుషశబ్దవాచ్యత్వమస్య వై।*
*అతోవైశ్వానరాత్మైవోపాస్యో నారాయణః ప్రభుః॥*

194-197. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాదు. వెనకచెప్పినట్లు, మూడులోకాలనీ శరీరంగా

గలవాడవటం మొదలైనగుణాలున్న వైశ్వానరుడనబడే పరమాత్మైనవాడు జాఠరాగ్నిని శరీరంగాగలవాడు. ఈప్రకరణంలో జాఠరాగ్నిశరీరంగాగల పరమాత్మని ఉపాసనంచేయడాన్నే ఉపదేశించటంచేత, వైశ్వానరుడిని అగ్నిఅనిచెప్పటంమొదలైనవి విరోధించవు. ఇక్కడచెప్పబడిన త్రైలోక్యశరీరత్వం మొదలైన పరమాత్మ ధర్మాలు కేవలజాఠరాగ్నికి సంబంధించినవిగావు. *"సఏషోగ్నిర్వైశ్వానరో యత్పురుషః"* అనే శుక్లయజుర్వేద వాక్యం ఒకటి వైశ్వానరాత్మని పురుషుడనికూడా చెప్తోంది. *"సహస్రశీర్షా పురుషః", "భగవానితి శబ్దోయం తథా పురుషఇత్యపి। నిరుపాధీచ వర్తతేతే వాసుదేవే సనాతనే"* (శత.బ్రా.X.6.1.11) (భగవానుడనేశబ్దం, అలానే పురుషుడనేశబ్దం, సహజంగ సనాతనుడైన వాసుదేవుడికి చెందింది.) అనిశ్రుతిస్మృతులలో పురుషశబ్దంచేత ముఖ్యంగచెప్పబడేవాడు పరమాత్మైన నారాయణుడే. ఈకారణాలవల్ల ఇక్కడచెప్పబడిన వైశ్వానరుడు జాఠరాగ్నిని శరీరంగాగల పరమపురుషుడవటం సాధ్యమే!

*॥ సి. సూ. ॥ అత ఏవ న దేవతా భూతంచ ॥ 1-2-28 ॥*

***అతః ఏవ=*** అంచేత, ***దేవతా=*** దేవత, ***భూతంచ=*** (మూడో)భూతమైన అగ్ని, ***న=*** వైశ్వానరుడు గాడు.

*198.* *యతో వైశ్వానరాత్మా ఽయం పురుషో నిరుపాధికః।*
*త్రైలోక్యాఙ్గశ్చాత ఏవ న భూతం న చ దేవతా॥*

198. సహజంగానే పురుషుడనిచెప్పబడేవాడుగాను, మూడులోకాలనీ శరీరంగాగల వాడు గాను వైశ్వానరుడిని చెప్పటంచేత ఆతడు జాఠరాగ్నికాడని వెనకటిసూత్రంలో నిరూపింపబడింది. స్వభావసిద్ధం గానే పురుషుడైయుండటం, మూడులోకాలనీ శరీరంగాకలిగియుండటం అనే ఈరెండు గొప్పలక్షణాలనీ వైశ్వానరుడనే దేవతకి (సూర్యదేవత అని తెలియబడేవాడికి) గాని, వైశ్వానరుడని కొన్నిచోట్ల చెప్పబడిన మూడోభూతమైన అగ్నికిగాని తగిఉండకపోవటంచేత ఇక్కడ వైశ్వానరుడనబడేవాడు ఆఇద్దరూ కానేరరని వెనక చెప్పినట్లు ఈసూత్రంలోకుడా నిరూపింపబడుతోంది. అంచేత వైశ్వానరుడు పరమాత్మేనని స్పష్టమగుచున్నది.

*సి.సూ ॥ సాక్షాదప్యవిరోధం జైమినిః ॥ 1-2-29 ॥*

***సాక్షాదపి=*** (అగ్నిశబ్దానికిన్నీ)సాక్షాత్తూ (పరమాత్మపరంగా అర్థం తీసుకున్నా), ***అవిరోధమ్=*** విరోధంలేదు (అని) ***జైమినిః=*** జైమిని అనే ఆచార్యుడు (భావించేరు)

*199.* *అగ్నిశబ్దో ఽప్యత్ర సాక్షాదగ్రప్రాపకతాగుణాత్।*
*పరమాత్మానమాచష్టే వైశ్వానరపదం యథా॥*

*200.* *అతోవైశ్వానరస్యాగ్నిశబ్దితత్వం న బాధితం।*
*పరత్వనిర్ణయే ఽత్రేతి జైమినిర్మన్యతే మునిః॥*

199-200.*"అహం వైశ్వానరో భూత్వా"*(భ.గీ.15-14)అనిభగవద్గీతలో చెప్పినట్లు పరమపురుషుడు జాఠరాగ్నినిశరీరంగా గలవాడవటంచేత *"సఏషోగ్నిర్వైశ్వానరః"*(ప్రశ్నో.1-7)అని ఉపనిషత్తు వైశ్వానరుడిని అగ్నిగాచెప్పిందని వెనకటిసూత్రంఒకదాన్లో నిరూపింపబడింది. ఇది బ్రహ్మసూత్రకారులైన బాదరాయణుల నిర్వాహం. జైమినిఅనే ఆచార్యులు ఈవాక్యాన్ని వేఱువిధంగా నిర్వహించేరంటున్నారు సూత్రకారులు. అంటే ఎన్నోతత్త్వాలను గురించిన వైశ్వానరశబ్దాన్ని ఎలా *"విశ్వేషాం నరాణాం నేతా వైశ్వానరః"* (అంతమంది నరులనీ పిలుచుకొనివెళ్లేవాడు వైశ్వానరుడు) అనేవ్యుత్పత్తితో పరమాత్మని చెప్పేదిగా ఎలా గ్రహిస్తున్నామో, అలాగే అగ్నిదేవుడువంటి ఎంతోమందిని చెప్పగలిగిన అగ్నిశబ్దాన్నిగూడ *"అగ్రం నయతీతి అగ్నిః"* (ఉత్తమగతికి తీసుకు పోవువాడు గనుక అగ్ని అయినాడు) అనేవ్యుత్పత్తిచేత సహజంగానేఅందరినీ

చాలఉత్తమమైనగతికి పిలుచుకొనివెళ్ళగలవాడైన పరమాత్మని గురించినదిగ గ్రహించాలి. అంచేత "అగ్నిర్వైశ్వానరః" అనిచెప్పటంచేత ఈవైశ్వానరుడిని పరమాత్మకానిమరొక తత్త్వంగా గ్రహించకూడదనేది జైమిని నిర్వాహం. (దీనిని దాచకుండ చెప్పడంవల్ల ఇది వ్యాసులవారికికూడా అభిమతమే. దీని తరువాతి మూడు సూత్రాల్లోనూ అలాగే గ్రహించాలి)

**సి.సూ॥ అభివ్యక్తేరిత్యాశ్మరథ్యః॥ 1-2-30 ॥**

***అభివ్యక్తేః=*** (ఉపాసకుడికి) కనబడడానికి (నియమనముతో చెప్పు) ***ఇతి=*** అని, ***ఆశ్మరథ్యః=*** ఆశ్మరథ్యులనే ఆచార్యులు (భావిస్తున్నారు).

**201.** *ఉపాసకాభివ్యక్త్యర్థం విమానస్య పరాత్మనః।*
*పరిచ్ఛిన్నత్వోపదేశ ఇత్యాహాత్రాఽఽశ్మరథ్యకః॥*

201. *"యస్త్వేవమేదం ప్రాదేశమాత్రం అభివిమానమ్"* (ఛాం.5-18-1) (ఎవడు అపరిచ్ఛిన్నుడైన ఈవైశ్వానరుడిని ఈవిధంగాద్యులోకంవంటిప్రదేశాల్లోమాత్రం పరిచ్ఛిన్నుడిగ (పరిమితిగలవాడిగ) ఉపాసిస్తాడో) మొదలైనవాక్యాల్లో అపరిచ్ఛిన్నుడైన పరమాత్మకి ద్యులోకాన్ని శిరస్సుగను, సూర్యుడిని కన్నుగాను, వాయువును ప్రాణంగాను, ఆకాశాన్ని ప్రదేశంగాను నీటిని వస్తిఅనబడే మూత్రకోశంగాను, భూమిని పాదంగాను చెప్పటంవల్ల పరమపురుషుడిని పరిచ్ఛిన్నుడిగాచెప్పటం ఎలా సాధ్యపడుతుందనేప్రశ్న వస్తోంది. ఉపాసకుడు ఉపాసించేటప్పుడు ఉపాసడిని మనస్సులో అపరిచ్ఛిన్నుడైన పరమపురుషుడిని ప్రకాశింపజేసి ఉపాసనాసౌకర్యాన్ని కలగజేయటానికే ఇలా అతడిని పరిచ్ఛిన్నుడిగ చెప్పటంఅనిఆశ్మరథ్యుడనే ఆచార్యుడు దీనికి సమాధానం చెప్పేరు.

**॥ సి. సూ. ॥ అనుస్మృతేర్బాదరిః ॥ 1-2-31 ॥**

***అనుస్మృతేః=*** ఉపాసించటానికి (పురుషాకారుడుగ పరమాత్మని చెప్పటం) అని, ***బాదరిః=*** బాదరి అనే ఆచార్యుడు (భావిస్తున్నారు)

**202.** *మూర్ధప్రభృతిపాదాన్తదేహకల్పనమత్ర యత్।*
*తథోపాస్త్యర్థమిత్యాహ బాదరిర్భగవానృషిః॥*

202. పరమపురుషుడికి ద్యులోకం, భూమిమొదలైనవాటిని శిరస్సు, కాలు, మొదలైన అవయవాలుగాచెప్పి, ఆతడిని ఒకపురుషరూపుడిగాచెప్పటం ఎందుకనేప్రశ్నవచ్చింది. మోక్షాన్ని కోరేవాడు అలా పురుషాకారుడిగ ఆతడిని ఉపాసించాలనడానికేనని బాదరిఅనే మహర్షి ఈప్రశ్నకు సమాధానం చెప్పేరు.

**॥ సి. సూ.॥ సంపత్తేరితి జైమినిస్తథాహి దర్శయతి ॥ 1-2-32 ॥**

***సంపత్తేః=*** (ఉపాసకుడి అవయవాలని వేదిమొదలైనవాటిగ కల్పించటం ఈవైశ్వానరవిద్యకి అంగమైన ప్రాణాహుతిని) అగ్నిహోత్రంగా చెయ్యటానికి, ***ఇతి=*** అని, ***జైమినిః=*** జైమిని (తలుస్తున్నారు), ***తథాహి దర్శయతి=*** (శ్రుతిగూడ ) అలానే చూపిస్తోంది గదా!

**203.** *ఉపాసకస్య చాఙ్గానాం గార్హపత్యాదికల్పనమ్।*
*ప్రత్యహం క్రియమాణస్య ప్రాణాహుత్యాఖ్యకర్మణః॥*

**204.** *అగ్నిహోత్రత్వసంపత్త్యై ఇతి జైమినిరబ్రవీత్।*
*"య ఏతదేవ"మితి చ సంపత్తిం దర్శయత్యమూమ్॥*

203-204. *"ఉరఏవ వేదిర్లోమాని బర్హిర్హృదయం గార్హపత్యః"* (ఛాం. 5-18-2) (వక్షస్థలమే వేది,

రోమాలే బర్హిస్సనే దర్భలు, హృదయం గార్హపత్యాగ్ని) అని ప్రారంభించి, ఉపాసకుడి హృదయం మొదలైన అవయవాలని గార్హపత్యం మొదలైనవిగ ఈప్రకరణంలో ఎందుకు కల్పించబడుతున్నాయి అనేప్రశ్న వస్తోంది. దీనికి జైమినిఅనేఆచార్యుడు ఈక్రిందివిధంగ బదులు చెప్తున్నారు. ఈఉపాసకుడు, ఈవైశ్వానరవిద్యకి అంగంగా ప్రతిదినం ప్రాణాహుతియనేకర్మ చెయ్యాలి. ఈప్రాణాహుతిని అగ్నిహోత్రంగా నిరూపించటడానికే ఇక్కడ వక్షస్థలాన్ని వేదికగాను, రోమాలని దర్భలుగాను హృదయాన్ని గార్హపత్యంగాను చెప్పటం. *"యఏతదేవం విద్వానగ్నిహోత్రం జుహోతి తస్య సర్వేషులోకేషు, సర్వేషుభూతేషు, సర్వేష్వాత్మసు హుతం భవతి తద్యథేషీకతూలమగ్నౌ ప్రోతం ప్రదూయతే ఏవం హాస్యసర్వేపాప్మానః ప్రదూయన్తే"* (ఛాం. 5-24-1) (ఎవడు దీనిని ఈవిధంగా తెలుసుకొని (ప్రాణాహుతైన) అగ్నిహోత్రహోమాన్ని చేస్తాడో, వాడు అన్ని లోకాల్లోను, అన్ని భూతాల్లోనూ, అన్ని ఆత్మల్లోనూ హోమంచేసినవాడవుతాడు, నిప్పులో పడేసిన పత్తిపొది లాగ వీడి పాపాలన్నీ నశిస్తాయి.) అని వేదవాక్యం ఈప్రాణాహుతిని అగ్నిహోత్రంగ చూపిస్తోంది. పరమాత్మోపాసనానికి తగినఫలంగా సర్వపాపవినాశాన్ని చూపిస్తోంది. అంచేత వక్షస్థలం మొదలైనవాటిచేత వేది మొదలైనవాటిని చూపించటంచేతమాత్రం ఇక్కడ చెప్పబడేది జాఠరాగ్ని కాదు. పరమాత్మే అయియుండాలి.

***// సి. సూ.// ఆమనన్తి చైనమస్మిన్ // 1-2-33 //***

***ఏనం=*** ఈపరమాత్మను, ***అస్మిన్=*** ఈఉపాసకుడి శరీరంలో, ***ఆమనన్తి చ=*** (ప్రాణాగ్నిహోత్రంచేత ఆరాధించటానికి) వేదవాక్యాలు చెప్పటంకూడ చేస్తున్నాయి.

***205.*** *ఉపాసకశరీరేఽస్మిన్నేనం ద్యుభ్వాదిదేహకం।*
*వైశ్వానరం పరాత్మానం ప్రాణాగ్నిహవనేన చ॥*

***206.*** *ఆరాధ్యత్వాయామనన్తి వాచ"స్తస్యే"త్యుపక్రమాః।*
*అతో నారాయణ ఇతి సిద్ధం వైశ్వానరః పుమాన్॥*

*//ఇతి వైశ్వానరాధికరణమ్ //*

*// ఇతి ప్రథమాధ్యాయే ద్వితీయఃపాదః //*

205-206. *"తస్యహవా ఏతస్యాత్మనో మూర్ధైవసుతేజాః"* (ఛాం.5-18-2)(ఈఉపాసకుడి (వైశ్వానరుడి) శిరస్సే (పరమాత్మశిరస్సైన) 'సుతేజాః'అనబడేద్యులోకం) అనిప్రారంభమయే వేదవాక్యం ఉపాసకుడి తలనే పరమాత్మశిరస్సైన ద్యులోకంగానూ, ఉపాసకుడి కన్ను, ప్రాణం, నడుము, మూత్రకోశం, కాళ్ళు మొదలైనవాటిని పరమాత్మయొక్క ఆయాఅవయవాలుగా వెనకచూపబడ్డ ఒకవేదవాక్యంలో చెప్పబడిన సూర్యుడు వాయువు, ఆకాశం, జలం, పృథ్వి అయినవిగ అనుసంధించాలని చెప్పటంచేత పరమాత్మని తనదగ్గరేఉన్నవాడినిగా ధ్యానించాలని చెప్పి, ఇలాంటి వైశ్వానరాగ్ని అనబడే పరమాత్మలో ప్రాణాహుతి అనబడే అగ్నిహోత్రాన్నిజేసి ఆతడినారాధించాలని చూపిస్తోంది. దీనివల్లకుడా ఇక్కడ చెప్పబడే వైశ్వానరాగ్ని పరమాత్మగానే యుండాలి గాని మరొక తత్త్వంగానేరదు.

*వైశ్వానరాధికరణము ముగిసింది.*

*మొదటి అధ్యాయమందు రెండవపాదము పూర్తిఅయింది.*

## *// అథ ప్రథమాధ్యాయే తృతీయః పాదః //*

## *// ద్యుభ్వాద్యధికరణమ్ // 1-3-1 //*

// సి. సూ.// ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్ // 1-3-1 //

**ద్యుభ్వాద్యాయతనమ్=** దేవలోకం, భూమి, మొదలైనవాటికి స్థానంగ చెప్పబడినవాడు (పరమాత్మే); **స్వశబ్దాత్=** ఆతనికే తగిన శబ్దాలు కనబడటంచేత.

*207.* *ప్రాగస్పష్టతరాస్పష్టలిఙ్గవాక్యం విచారితమ్।*
*పాదేఽత్ర స్పష్టజీవాదిలిఙ్గవాక్యం విచార్యతే॥*

207. మొదటిఅధ్యాయం మొదటిపాదంలో జీవుడు, అచేతనం మొదలైనవాటి చిహ్నాలు, స్పష్టతలోపించిన వేదవాక్యాలని, రెండవపాదంలో ఆగుర్తులు స్పష్టాస్పష్టంగాఉన్న (కొంత స్పష్టతలేకుండా ఉన్న) వేదవాక్యాలనీ విచారించి ఆవాక్యాలు బ్రహ్మాన్నిచెప్పేవేఅని చూపబడింది. ఇప్పుడు ఈమూడో పాదంలో ఆచిహ్నాలు స్పష్టంగాఉండే వేదవాక్యాలని విచారించి అవికూడా బ్రహ్మాన్నే చెప్తున్నాయని చూపబడుతోంది. ఒకపాదంకంటే మరోపాదంలో వరుసగా జీవాదిలింగాల స్పష్టత ఎక్కువౌతోందని భావం.

*208.* *ద్యుపృథివ్యాద్యాశ్రయస్య పరాత్మత్వం సమర్థితమ్।*
*తదేవాత్రాధికరణ ఆక్షిప్య స్థాప్యతే దృఢమ్॥*

208. వెనకటి అధికరణంలో దేవలోకం, భూమి మొదలైనవాటిని శరీరంగా స్వీకరించినట్లు చెప్పబడటంచేత వైశ్వానరుడు పరమాత్మేఅని నిరూపింపబడింది. దేవలోకం మొదలైనవాటినిశరీరంగా గలవాడుకూడా జీవుడే అని పూర్వపక్షంచేసి "ఆతడు జీవుడు కాలేడు, పరమాత్మే అయియుండాలి"అని స్పష్టంగా ఈఅధికరణంలో నిరూపించబడుతోంది.

*పూ.209.* *"యస్మిన్ ద్యౌః పృథివీ చే"తి ముండోపనిషది శ్రుతః।*
*జీవ ఏవాత్ర కరణాశ్రయత్వం బహుధా జనిః॥*

**210.* *నాడీయోగశ్చైవమాదిజీవధర్మచయశ్రుతేః।*

209-*210. **పూర్వపక్షం:** *"యస్మిన్ ద్యౌః పృథివీచాంతరిక్షమోతం మనఃసహప్రాణైశ్చ సర్వైః తమేవైకం జానథాత్మానం అన్యావాచో విముంచథ అమృతస్యైష సేతుః"* (ముండకో. 2-2-5) (ఎవనివద్ద దేవలోకం, భూమి, అంతరిక్షం, మనస్సు, ఇంద్రియాలన్నీ చేరిఉన్నాయో ఆఆత్మనొక్కదాన్నే తెలుసుకో. మిగతవాటిని వదులు. ఈతడే మోక్షానికి మార్గం అవుతున్నాడు.) అని ముండకోపనిషత్తులో దేవలోకం, భూమిమొదలైన వాటికి ఆధారమైనవాడుగా చెప్పబడేవాడు జీవుడుగానే ఉండటం సాధ్యం. ఎంచేతంటే, *"మనస్సహప్రాణైః ఓతం"* అని మనస్సుమొదలైన ఇంద్రియాలు వీడితో కలిసుంటాయని చెప్పబడుతోంది. *"సఏషోంతరశ్చరతే బహుధాజాయమానః"* (ముండకో.2-2-6) (ఎన్నో విధాలుగా పుట్టే వీడు శరీరంలో సంచరిస్తున్నాడు) అని వీడు ఎన్నోరకాలుగ పుడతాడని చెప్పబడుతోంది. *"అరాఇవ రథనాభౌ సంహతా యత్రనాడ్యః"* (ముండకో. 2-2-6) (చక్రానికి ఆకులు చక్రనాభిలో చేరినట్లుగా జీవుడి నాడులు వాడిలో చేరిఉన్నాయి) అని నాడులు వీడివద్దే చేరియుండేవిగా చెప్పబడుతున్నాయి. ఇవి అన్నీ జీవుడికి తగిన స్వభావంగలిగినవే తప్ప పరమాత్మచిహ్నాలు గావు. అంచేత దేవలోకంమొదలైనవాటికి ఆధారంగా ఇక్కడ చెప్పబడేవాడు జీవుడే అయి ఉండాలి.

*సి.210** *మైవం ద్యుభ్వాద్యాయతనం పరం బ్రహ్మ స్వశబ్దతః॥*

*211.* *స్వశబ్దోఽత్రా"మృతస్యైష సేతు"రిత్యేవమాదికః।*
*అమృతత్వప్రాప్తిహేతుస్స ఏవేతి నిగద్యతే॥*

*212.* *ఆత్మశబ్దశ్చాత్ర పరే వర్తతే నిరుపాధికః।*

*సర్వజ్ఞత్వాదయోఽత్రోక్తాస్తస్మిన్నేవ సుసఙ్గతాః॥*

213. *నాడ్యాశ్రయత్వం చాప్యుక్తం సన్తతశ్రుతివాక్యతః।*
*"అజాయమాన"ఇత్యాదిశ్రుత్యాఽ"జోఽపీ"తి చ స్మృతేః॥*

214. *బహుధా జాయమానత్వం సిద్ధమస్య నిజేచ్ఛయా।*
*మనఃప్రభృత్యాశ్రయత్వం సర్వాధారస్య యుజ్యతే॥*

*210-214.**సిద్ధాంతం:** ఈపూర్వపక్షంసరిగాదు. పరమాత్మకేతగినలక్షణాలు ఇక్కడ చెప్పబడటంచేత, దేవలోకం మొదలైనవాటికి ఆధారంగా చెప్పబడేవాడు పరమాత్మే. ఆలక్షణాలు ఏవంటే -***"అమృతస్యైష సేతుః"*** అని ఇతడు ఇక్కడ మోక్షసాధనంగా చెప్పబడుతున్నాడు. ***"తమేవం విద్వాన్ అమృతఇహాభవతి। నాన్యఃపంథా అయనాయ విద్యతే"*** (పు.సూ.. తై.ఆర. 3-12-7) (ఆపరమపురుషుడిని ఈవిధంగా తెలుసుకున్నవాడే ముక్తుడౌతాడు. మోక్షానికి మరోమార్గం లేదు) మొదలైనచోట్ల పరమపురుషుడే మోక్షసాధనం అని చెప్పబడుతోంది. 'జీవుడు ఎవడూ ఏవాక్యంలోనూ మోక్షసాధనంగా చెప్పబడలేదు. అన్నీ తానుగానే వ్యాపించియుండేవాడు పరమపురుషుడే అవటంచేత ***"ఆత్మా"*** (వ్యాపించేవాడు) అనబడే పదం ఇతనికే సహజమైనదిగా తగిఉన్నది. ***"యస్సర్వజ్ఞ స్సర్వవిత్"*** (ముండకో. 2-2-7) (ఎవడు అన్నింటి స్వరూపస్వభావాలను తెలిసినవాడో)అని ఇక్కడచెప్పబడటంచేత అన్నింటినీతెలిసినవాడుగా ఇతడినిచెప్పటం మొదలైనవికూడా ఇతను పరమాత్మగా ఉండటంచేతనే బాగాఅమరిఉన్నాయి. ***"సంతతం సిరాభిస్తు లంబత్యాకోశసన్నిభం, తస్యాన్తే సుషిరం సూక్ష్మం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం"*** (మహానారా. 11-8-12)(చిన్నదీ, విరిసిన తామరలాఉన్నఆహృదయం ఎప్పుడూ నాడులచేతబాగా చుట్టబడి ప్రతిష్ఠింపబడింది. దానిమధ్యని సన్నని ఒకద్వారం ఉన్నది. అందులో సర్వాత్మైననారాయణుడు స్థిరంగాఉన్నాడు) అని మొదలుబెట్టి నారాయణ వల్లిలో పరమాత్మైన నారాయణుడు నాడులన్నింటికీ ఆధారంగా ఉన్నాడని చెప్పబడటంవల్ల నాడులతో కలిసి ఉండటంకూడా, పరమపురుషుడికే చెల్లుతుంది. ***"అజాయమానో బహుధా విజాయతే"*** (పు.సూ. తై.ఆర. 3-13-1) (జన్మలేనివాడైనా, ఎన్నోరూపాలలో పరమపురుషుడు జన్మించేడు) అనివేదంలోనూ, ***"అజోపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపిసన్। ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా॥"*** (భ.గీ..4-6)(జన్మలేనివాడుగాను, నాశంలేనివాడుగాను, భూతాలకి ఈశ్వరుడుగాను, ఉంటూనే నాదివ్యమంగళ విగ్రహంతో నాసంకల్పంచేతనే జన్మిస్తున్నాను.)అని భగవద్గీతలోనూ, పరమపురుషుడు కర్మవశుడుగాకాకుండా తనఇచ్ఛచేతనే అనేకవిధాలైన జన్మలు పొందుతున్నాడని తెలుస్తోంది. అంచేతనే ఈప్రకరణంలో ***"బహుధా జాయమానః"*** అని ఎన్నోవిధాలుగా చెప్పడంకూడా పరమాత్మకే తగిఉన్నది. ***"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణఃస్థితః"*** అని అన్నివస్తువులకీ ఆధారంగాచెప్పబడే నారాయణుడు మనస్సుమొదలైన ఇంద్రియాలకిన్నీ ఆధారంగాఉన్నవాడవటంచేత ***"మనస్సహప్రాణైః ఓతం"*** అని ఇక్కడ చెప్పడంకూడా, పరమపురుషుడికి తగిఉంటుంది. ఈకారణాలచేత ఇక్కడ దేవలోకం మొదలైనవాటికి ఆధారంగా చెప్పబడేవాడు జీవుడుకాడనీ, పరమపురుషుడే అనీ స్పష్టమౌతోంది.

*॥ సి. సూ.॥ ముక్తోపసృప్యవ్యపదేశాచ్చ ॥ 1-3-2 ॥*

***ముక్తోపసృప్యవ్యపదేశాత్ చ=*** ముక్తిపొందేవారిచేత పొందబడేవాడుగా చెప్పటంచేతకూడా (ఇతడు పరమపురుషుడే)

215. *"తదావిద్వాన్ పుణ్యపాపే" ఇత్యాదిశ్రుతివాక్యతః।*

*బద్ధాన్ముక్తైః ప్రాప్యతయా నిర్దేశాచ్చ పరః పుమాన్॥*

**215.** *"యదాపశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం। తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి॥"* (ముండకో.3-1-3) (బ్రహ్మజ్ఞాని ఎప్పుడు బంగారురంగుగలవాడూ, లోకాలని సృష్టించేవాడూ, నియమించేవాడూ, లోకాలకి ఉపాదానకారణమైన వాడూ, అయిన పరమపురుషుడినిచూస్తాడో, అప్పుడు ఆతడు పుణ్యపాపాలని దులిపేసుకొని (వదిలి) ప్రకృతిసంబంధంపోయినవాడై, పరమపురుషుడితో ఉత్కృష్టమైన సామ్యాన్ని పొందుతున్నాడు)అని ఈద్యుభ్వాద్యాయతనపురుషుడిని సంసారబంధంలోంచి విడిపించుకున్నవాళ్ళచేత పొందబడేవాడిగా ఈఉపనిషత్తు చెప్తోంది. అంచేతకూడా, ఇతడు పరమపురుషుడే తప్ప జీవుడు గాడు.

*॥ సి. సూ. ॥ నానుమానమతచ్ఛబ్దాత్ప్రాణభృచ్చ ॥ 1-3-3 ॥*

***అతచ్ఛబ్దాత్=*** దానిని చెప్పే శబ్దం లేకపోవటంచేతకూడా, ***న అనుమానం=*** (ఇక్కడ చెప్పబడేది) మూలప్రకృతిగాదు. ***(న) ప్రాణభృత్ చ=*** ప్రాణాలతోనున్న జీవుడూ గాడు.

**216.** *నాత్ర ప్రధానం తద్వాచిశబ్దాభావాద్యథోచ్యతే।*
*తథా ప్రాణభృదప్యేష ప్రతిపాద్యో న వాక్యతః॥*

216. ఎలా ఈప్రకరణంలో మూలప్రకృతినిచెప్పే శబ్దంలేకపోవటంచేత ఇక్కడ చెప్పబడే ద్యుభ్వాద్యాయతన పురుషుడు మూలప్రకృతి కాలేడో, అలాగే ప్రాణంతోఉన్న జీవుడినిచెప్పే వాక్యాలుకూడా ఇక్కడ లేకపోవటంచేత ఇక్కడ చెప్పబడేవాడు జీవుడు కాడు.

*॥ సి. సూ. ॥ భేదవ్యపదేశాత్ ॥ 1-3-4 ॥*

***భేదవ్యపదేశాత్=*** (జీవుడికంటే) భిన్నమైనవాడుగ చెప్పటంచేతకూడా (ఈతడు పరమాత్మే).

**217.** *"సమానే వృక్ష" ఇత్యాదివాక్యేన వ్యపదిశ్యతే।*
*జీవాద్విలక్షణత్వేన మహిమార్ణవ ఈశ్వరః॥*

217. *"సమానే వృక్షే పురుషో నిమగ్నోఽనీశయా శోచతి ముహ్యమానః। జుష్టంయదా పశ్యత్యన్య మీశం అస్యమహిమానమితి వీతశోకః।"* (శ్వే. 4-7; ముండకో. 3-1-2) (చెట్టువలె నాశముగల ఒకేదేహంలో జీవుడుంటూ భోగ్యంగాఉండే ప్రకృతిచేత మోహపడి బాధపడుతున్నాడు. వీడెప్పుడు (అదేదేహంలోనున్న) ఈశ్వరుడిని తనకంటె వేరైనవాడుగా, తన(జీవుని)మంచికర్మలచేత ప్రీతిచెందేవాడుగానూ చూసి, ఆతని పరత్వమును ఈవిధంగా చూస్తాడో, అపుడు తనబాధని (శ్రమని) పోగొట్టుకొంటూ, ఆతని గొప్పతనాన్ని పొందుతున్నాడు) అని మహిమాన్వితుడైనసర్వేశ్వరుడు ఈప్రకరణంలో జీవుడికంటె భిన్నమైనవాడుగ చెప్పబడుతున్నాడు. దీనిచేతనుగూడ ఈతడు జీవుడుగాడు.

*॥ సి. సూ. ॥ ప్రకరణాత్ ॥1-3-5 ॥*

***ప్రకరణాత్=*** ప్రకరణంచేతను (ఈతడు పరమాత్మే).

**218.** *పరస్యైవాత్రాఽ"థ పరా యయే"తి శ్రుతివాగ్భరైః।*
*ప్రకృతత్వాత్పరం బ్రహ్మైవైతత్ప్రకరణశ్రుతమ్॥*

218. వెనకటి ప్రకరణం *"అదృశ్యత్వాదిగుణకాధికరణ"*ప్రారంభంలో ***"అథపరాయయా"***అని ప్రారంభ వాక్యాలచేత పరమపురుషుడే చెప్పబడుతున్నాడన్నది స్థిరీకరింపబడింది. ఆతరువాతకూడా ఆప్రకరణానికి విచ్ఛేదం రాలేదనీ వెనుక చూపబడింది. అంచేత ప్రకరణంచేతకూడా, ఈతడు పరమపురుషుడే తప్ప జీవుడు

కానేరడు అని చూపబడింది.

*// సి. సూ.// స్థిత్యదనాభ్యాం చ//1--3--6//*

**స్థిత్యదనాభ్యాం చ=** (పరమపురుషుడు శరీరంలో) కేవలం ఉండటంవల్లనే, (జీవుడికి) కర్మఫల భోగాన్ని చెప్పటంవల్లనూ ద్యుభ్వాద్యాయతనం పరమపురుషుడే)

219. *"ద్వాసుపర్ణే"త్యాదిమంత్రే ఫలభోక్తృత్వముచ్యతే।*
*ఏకస్యాన్యస్య దేహాన్తస్థితిమాత్రం ప్రదర్శ్యతే॥*

220. *తత్రాఽనశ్నన్ దీప్యమానో ద్యుభ్వాద్యాయతనం భవేత్।*
*న తద్భోక్తా తతో ద్యుభ్వాద్యయనః పరమః పుమాన్॥*

*//ఇతి ద్యుభ్వాద్యధికరణమ్//*

219-220. *"ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే। తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి॥"* (శ్వే.4-6;ముండకో.3-1-1) (అందమైన (జ్ఞానమనే) రెక్కలున్నవీ, సమానమైనగుణాలుగలవీ, ఒకరికొకరుసహాయంగాఉన్నవీ అయిన రెండుపక్షులు (జీవుడు, పరమాత్మ) ఒకే చెట్టుమీద (దేహంలో) ఉన్నాయి, వాటిలోఒకటి (జీవుడు) పండినపండును (కర్మఫలాన్ని) తింటోంది. ఆ పండును తినని మరొకపక్షి (పరమాత్మ) బాగా ప్రకాశిస్తోంది) అనేవాక్యం ఈ ప్రకరణంలో కనబడుతోంది. ఇందులో జీవుడు కర్మఫలాన్ని అనుభవిస్తున్నాడనీ, పరమపురుషుడు కర్మఫలాన్ని అనుభవించకపోవటంచేత శరీరంలో ప్రకాశిస్తున్నాడనీ చెప్పబడుతోంది. వీరిద్దరిలోనూ కర్మఫలాన్ని భుజించకుండ ప్రకాశిస్తున్నాడనీ, సర్వజ్ఞుడుగా, మోక్షోపాయంగానూ చెప్పబడే పరమాత్మే ద్యుభ్వాద్యాయతనం (ద్యులోకం, భూమి మొదలైన వాటికి స్థానం) అవడానికి వీలవుతుందేగాని కర్మఫలాన్ని భుజించి దుఃఖిస్తున్న జీవుడు ద్యుభ్వాద్యాయతనం కావటానికి సాధ్యంగాదు. అంచేత భూమిమొదలైన లోకాలకిస్థానంగా ముండకంలో చెప్పబడేవాడు పరమాత్మే అవుతాడు.

*//ద్యుభ్వాద్యధికరణము సంపూర్ణం//*

## *// భూమాద్యధికరణమ్ // 1-3-2 //*

*// సి. సూ. // భూమా సంప్రసాదాదధ్యుపదేశాత్ // 1-3-7 //*

**భూమా=** పెద్దది (అని చెప్పబడేది పరమాత్మే), **సంప్రసాదాత్ అధి=** జీవుడికంటే మేలైనవాడిగా, **ఉపదేశాత్=** ఉపదేశించటంచేత.

221. *పరాత్మత్వం ప్రకరణావిచ్ఛేదాత్ప్రాక్ సమర్థితమ్।*
*తద్భేతోరేవ భూమాత్ర జీవ ఇత్యేతదస్యతే॥*

221. వెనకటిప్రకరణంలో "ప్రకరణాత్"అన్నసూత్రంలో పరమాత్మప్రకరణానికి విచ్ఛేదం కలగకపోవటం చేత ద్యుభ్వాద్యాయతనం పరమాత్మేనని నిరూపింపబడింది. "అలాకాకపోతే, ఛాందోగ్యంలో "**భూమా**"అని చెప్పబడ్డ తత్త్వంకూడా జీవప్రకరణానికి విచ్ఛేదంరాలేదుకనక జీవుడే అవాలి" అనే వాదం ఈ అధికరణంలో నిరసింపబడుతోంది.

పూ.222. *"యత్రనాన్యత్పశ్యతీ"తి వాక్యం సామని పఠ్యతే।*
*తత్ర భూమా ప్రత్యగాత్మా తస్మిన్ ప్రాణపదోదితే।*

223. నామాద్యాత్మోపదేశస్య సమాప్తేస్తదనన్తరమ్।
ప్రశ్నప్రత్యుత్తరాభావాత్ప్రాణప్రకరణస్య చ।।
*224 అవిచ్ఛేదాదత్ర భూమా ప్రత్యగాత్మేతి చేన్న తత్।

222-*224. **పూర్వపక్షం:** *"యత్ర నాన్యత్ పశ్యతి నాన్యత్ శృణోతి, నాన్యద్విజానాతి, సభూమా। అథయత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పమ్।।"* (ఛాం.7-23-1) (దేన్నితెలుసుకుంటే, మరోదాన్ని చూడటం, వినటం, తెలుసుకోవటంలేదో, అదే భూమ(పెద్దది). దేన్నితెలుసుకుంటే మరోదాన్ని చూడటం, వినటం, తెలుసుకోవటంయుంటుందో, అది అల్పం (చిన్నది)) అని సామవేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తులో ఒకవాక్యం ఉన్నది. ఇందులో భూమా(పెద్దది)అని చెప్పబడేది జీవుడా పరమాత్మా అనే సందేహం కలుగుతోంది. ఈప్రకరణప్రారంభంనుంచీ చూసినట్లైతే, ఇచ్చట చెప్పబడ్డ "భూమా" జీవుడేఅని తెలుస్తుంది. ఈప్రకరణారంభంలో ఆత్మజ్ఞానం పొందాలని నారదులు సనత్కుమారులదగ్గరకు వచ్చేరు. వచ్చి, *"సోహం భగవో మంత్రవిదేవాస్మి నాత్మవిత్ శ్రుతం హ్యేనమే భగవద్భ్యశేభ్యస్తాది శోకమాత్మవిత్"* (ఛాం.7-1-3) (భగవన్! నేనుమంత్రాన్నితెలుసుకున్నవాడినేతప్ప ఆత్మని తెలిసినవాడినిగాను. మీలాంటివారి దగ్గర 'ఆత్మను తెలుసుకొన్నవాడు శోకాన్ని అడ్డుకోగలడ"ని నేను విన్నాను) అనినారదుడు ఆత్మను తెలుసుకోవాలనే కోరికని చెప్పేడు. అప్పుడు సనత్కుమారులు నామమే బ్రహ్మంగా ఉపదేశించేరు. ఆపైన నారదులు నామంకంటే గొప్పది ఉన్నదాఅనిఅడిగేరు. దానికి సనత్కుమారులు వాక్కును బ్రహ్మంగా ఉపదేశించేరు. దీనికంటె గొప్పదైనది ఉందాఅన్న నారదునిప్రశ్నకి సనత్కుమారులు మనస్సు, సంకల్పము మొదలైన ఎన్నోవిషయాలని బ్రహ్మంగా ఉపాసించాలని ఉపదేశించేరు. చివరికి పధ్నాలుగోఖండంలో ప్రాణంతోకలిసిఉండటంవల్ల ప్రాణంఅనబడేజీవుడిని బ్రహ్మంగాఉపదేశించేరు. అంతకంటె గొప్పది ఉందాఅని నారదులు ప్రశ్నించనూలేదు, సనత్కుమారులు ఉపదేశించనూలేదు. ఆపైనున్నది ఇరవైమూడోఖండంచివరను ప్రాణప్రకరణానికొకవిచ్ఛేదమూ ఏర్పడలేదు. అందుచే ఇరవైనాలుగో ఖండంలో భూమాఅని చెప్పబడినది ప్రాణమని చెప్పబడ్డ జీవుడే అయి ఉండాలి.

సి.224* భూమా పరః సంప్రసాదాదధికత్వోపదేశతః।।
225. సంప్రసాదః ప్రత్యగాత్మేత్యన్యశ్రుత్యా ఉవసీయతే।
స్వోపాస్యాధిక్యవాదిత్వముక్త్వా ఉస్య ప్రాణవేదినః।।
226. "ఏషత్వి"తి తుశబ్దేనాధాతివాద్యన్తరం స్వయమ్।
ఉపక్షిప్యాస్య సత్యోపాసితుః ప్రాణాతివాదితః।।
227. ఆధిక్యోక్తేశ్చ విచ్ఛేదాత్ప్రాణప్రకరణస్య చ।
ప్రాణాదర్థాంతరత్వేన ప్రోక్తః సత్యపదోదితః।।
*228. అత్యంతసుఖరూపో ఉసౌ భూమా నారాయణః ప్రభుః।

224*-*228. ఈపూర్వపక్షం తప్పు. ప్రాణమనబడే జీవుడికంటే గొప్పవాడుగ 'సత్యం' అనబడే బ్రహ్మన్ని పదహారోఖండంలో ఉపదేశించటంచేత ప్రాణప్రకరణానికి విచ్ఛేదం ఏర్పడింది. అంచేత 'సత్యం' అనబడే బ్రహ్మమే 'భూమా" అనబడుతోందనే తీసుకోవాలి. *"ఏవం విజానన్ అతివాదీ భవతి"* (ఛాం. 7-15-4) (ఇలా ప్రాణాన్ని (జీవుడిని) బ్రహ్మంగ తెలుసుకొనేవాడు అతివాది అయినాడు) అని ప్రాణోపాసకుడు తనచేత ఉపాసింపబడేజీవుడే అతివిశిష్టమైనది అనిచెప్పే అతివాది అయ్యేడనిచెప్పి, ఆతరవాతదైన పదహారో

ఖండంలో *"ఏషతువా అతివదతి యస్సత్యేన అతివదతి"* (ఛాం. 7-16-1) (ఎవడు సత్యమనబడే బ్రహ్మం విషయంలో అతివాదిఅయేడో, వాడే (నిజంగ) అతివాదం చేసేవాడు) అని 'సత్యమనబడే బ్రహ్మమే అతివిశిష్ట మైనది' అని అతివాదం చేసే బ్రహ్మోపాసకుడు ప్రాణోపాసకుడికంటె విశిష్టుడని *'తు'* శబ్దంచేత చూపబడు తోంది. అంచేత ప్రాణప్రకరణానికి విచ్ఛేదం ఏర్పడింది. పైగా, *"యోవై భూమా తత్ సుఖం నాల్పే సుఖమస్తి భూమైవ సుఖమ్"* (ఛాం. 7-23-1) (పెద్దదైనదే సుఖమౌతోంది. అల్పమైనదానిలో సుఖం లేదు. పెద్దదే సుఖం.) వంటివాక్యాల్లో సత్యశబ్దంచేతచెప్పబడే ఈవస్తువు అతివిశేషమైనసుఖం అని చెప్పబడుతోంది. పరమపురుషుడు అతివిశిష్టమైనసుఖంగా సాధ్యంగాని, దుఃఖంలోకొట్టుమిట్టాడే జీవుడు అతివిశిష్టమైనసుఖం కాలేడు. అంచేత ప్రాణంకంటె భిన్నమైనవాడుగాను, అతివిశిష్టమైనసుఖంగా సత్యపదంచేత చెప్పబడుతున్న వాడుగ ఉన్న 'భూమా' సర్వేశ్వరుడైన నారాయణుడే అవుతాడన్నది స్పష్టం. దీన్నే సూత్రంలో భూమాఅనబడే వస్తువు సంప్రసాదుడి కంటేగొప్పవాడుగా చెప్పబడటంచేత పరమాత్మే అవటానికి సాధ్యంఅని చెప్పేరు. సంప్రసాదశబ్దం జీవుడిని చెప్తుందనడం *"ఏష సంప్రసాదో స్మచ్ఛరీరాత్ సముత్థాయ స్వేనరూపేణాభి నిష్పద్యతే"* (ఛాం. 8-12-2) (సంప్రసాదుడనబడే ఈ జీవుడు ఈశరీరంనుంచి బయలుదేరి స్వస్వరూపాన్ని పొందుతున్నాడు.) అనే వేదవాక్యంలో ప్రకటితం అవుతోంది.

### // సి. సూ.// ధర్మోపపత్తేశ్చ // 1-3-8 //

***ధర్మోపపత్తేః చ=*** (భూమాకి చెప్పబడే) ధర్మాలు (దానికి)తగిఉన్నవికావటంచేతకూడ (భూమా అంటే పరమాత్మే)

***228**** *స్వాభావికామృతత్వం చ స్వే మహిమ్న్యేవ సంస్థితిః//*

***229.*** *సర్వాత్మత్వం చైవమాదిధర్మా యే భూమని శ్రుతాః।*

*తేషాం పరస్మిన్నేవోపపత్తేర్భూమా పరః పుమాన్//*

*//ఇతి భూమాధికరణమ్ //*

228*-229. *'భూమా'*అనబడేవస్తువుకి ఈప్రకరణంలో ఎన్నోలక్షణాలు చెప్పబడుతున్నాయి. *"ఏతదమృతమ్"* (ఛాం.7-24-1) (ఇదే అమృతం)అని సహజంగా మరణంలేనిదిగాను, *"స్వేమహిమ్ని"* ఛాం. 7-24-1) (తనమహిమలో స్థిరమైనది) అని మరొకదానిని ఆధారంగా అవసరంలేనిదీ, *"సఏవాధస్తాత్ సఏవేదం సర్వం"* (ఛాం.7-25-1) (అదే కిందనున్నది, అదేఇదంతాను) అని సర్వాత్మగాఉండటం, ఈభూమాకి చెప్పబడు తున్నాయి. ఇవన్నీ, పరమాత్మకి తగియున్నవే తప్ప జీవుడికు తగినవికావు. అంచేత భూమా పరమపురుషుడే.

*భూమాధికరణము ముగిసెను.*

## //అక్షరాధికరణమ్// 1-3-3 //

### // సి. సూ.// అక్షరమమ్బరాన్తధృతేః // 1-3-9 //

***అమ్బరాన్తధృతేః=*** ఆకాశానికి కారణమైన మూలప్రకృతిని ధరించి ఉంచేదిగనుక, ***అక్షరమ్=*** అక్షరం అనబడేది (పరమాత్మే).

***230.*** *స్వే మహిమ్ని స్థితత్వం ప్రాక్ బ్రహ్మణః ప్రతిపాదితం।*

*తదన్యస్మిన్నపి పరాదస్తీత్యేతన్నివార్యతే//*

230. వెనకటిసూత్రంలో *"స్వేమహిమ్ని"* (ఛాం.7-24-1) అని తనమహిమలోనే స్థిరంగ ఉన్నదిగ ఉండటంవల్ల భూమా అనబడేది పరమాత్మే అని నిశ్చయింపబడింది. తనమహిమలోనే స్థిరంగాఉండటం అనే

గొప్పతనం పరమాత్మకంటే వేఱైనచిదచిత్తులకిన్నీ ఉంటుందనేవాదం ఈఅధికరణంలో నిరాకరింపబడుతోంది.

పూ.231. *గార్గిప్రశ్నే "స హోవాచైతద్వా" ఇత్యాది పఠ్యతే।*

*అత్రాక్షరం ప్రధానం స్యాదస్థూలత్వాది ధర్మవత్॥*

232. *ప్రధానేఽక్షరశబ్దస్య ప్రయోగాదక్షరాదితి।*

*సర్వకార్యాధారభూతస్యాకాశస్యాపి కారణే॥*

*233 *పృష్టే ప్రత్యుచ్యమానం తస్యాదవ్యాకృతమక్షరం।*

231-*233. **పూర్వపక్షం:** బృహదారణ్యకోపనిషత్తులో గార్గిప్రశ్నలో *"సహోవాచైతద్వైత దక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్తి అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమలోహితమస్నేహమచ్ఛాయమ్"* (బృహ 5-8-7) (యాజ్ఞవల్క్యులు ఇలాచెప్పేరు- ఇదే అక్షరమని బ్రహ్మజ్ఞానులు చెప్తున్నారు. అది పెద్దదికాని, అణువుకాని కానిది; పొట్టిదిగాని పొడుగుగాని కానిది; ఎఱ్ఱనిదికానిది, పచ్చతనంలేనిదది, నీడలేనిది...) అన్నవాక్యం కనబడుతోంది. ఇక్కడచెప్పబడే అక్షరం మూలప్రకృతా, జీవుడా లేక పరమాత్మా అన్నప్రశ్నవస్తే, ప్రధానం అనబడే మూలప్రకృతేనని నిశ్చయించాల్సిఉంది. ఎంచేతంటే, *"అస్థూలం, అనణు"* అని ప్రారంభించి దీంతో బాటు స్థూలత్వం కలిగినదీ, అణువుగాఉండేదీ వంటిధర్మాలు నిషేధింపబడ్డాయి. ప్రసక్తిఉన్నవే నిషేధింపబడ తాయిగాని ప్రసక్తిలేనివి నిషేధించడానికి శక్యంకాదుగదా! ప్రధానానికి కార్యమైనవస్తువుల్లో స్థూలంగా ఉండటం, సూక్ష్మంగాఉండటం వంటిధర్మాలని చూస్తుండటంచేత, కారణమైన ప్రధానంలోనూ ఇవిఉంటాయా అనే సందేహప్రసక్తి ఉంది. బ్రహ్మంలో ఇలాంటిప్రసక్తిలేదుగదా! *"అక్షరాత్ పరతఃపరః"* (ముండక. 2-1-2) (అక్షర మనబడే మూలప్రకృతికంటెపైనదైన సమష్టిపురుషుడి కంటెను పరుడైనవాడు) వంటివాక్యాల్లో మూల ప్రకృతి కిన్నీ అక్షరశబ్దప్రయోగం కనబడుతోంది. పైగా, ఆకాశం అన్నికార్యవస్తువులకీ ఆధారమైఉంది' అని యాజ్ఞ్య వల్క్యులు చెప్పటంలో *"కస్మిన్ ను ఖల్వాకాశ ఓతశ్చప్రోతశ్చ"* (బృహ 5-8-6) (ఆకాశం దేన్ని ఆశ్రయించి ఉన్నది?) అని గార్గిఅనేఆమె ప్రశ్నిస్తే, "ఆకాశం అక్షరాన్నాశ్రయించి ఉన్నది" అని బదులు చెప్పేరు యాజ్ఞ్య వల్క్యులు. ఇక్కడ ఆకాశానికాధారంగా చెప్పబడటం ఆకాశానికి కారణమైన మూలప్రకృతి అనేదే తగిఉన్నది.

సి.233* *మైవమత్రాక్షరపదవాచ్యః పరమపూరుషః॥*

234. *ఆకాశపారభూతస్య ప్రధానస్యాపి ధారణాత్।*

*"యదూర్ధ్వ"మితి చారభ్య కాలత్రితయవర్తినః॥*

235. *వికారజాతస్యాధారతయా ప్రోక్తం న వాయుమత్।*

*అంబరం కింతు తత్పారభూతమవ్యాకృతం భవేత్॥*

*236. *తదాధారతయోక్తం తదక్షరం న ప్రధానకమ్।*

233*-*236. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం దోషభూయిష్ఠం. ఇక్కడ అక్షరమనబడేవాడు పరమాత్మే. "ఆకాశం ఎందులో స్థిరంగాఉన్నది?" అన్న గార్గిప్రశ్నలో చెప్పబడ్డ ఆకాశం వాయువుకికారణమైన ప్రసిద్ధాకాశం గాదు. దానికికారణమైన ప్రధానమే ఇక్కడ ఆకాశమనబడుతోంది. ఎందువల్లంటే, *"యదూర్ధ్వం గార్గి దివో యత్ర వాక్ పృథివ్యా యదంతరాద్యావాపృథివీ ఇమేయద్భూతంచ భవచ్చ భవిష్యచ్చేత్యాచక్షతే ఆకాశఏవ తదోతంచ ప్రోతంచ"* (బృహ 5-8-6) (ఓగార్గీ! దేవలోకానికి పైన, భూమికి క్రిందా, దేవలోకం, భూమి వీటికి మధ్యనీ, భూతభవిష్యద్వర్తమానమనబడే మూడుకాలాల్లోనూఉన్న అన్నివస్తువులూ ఆకాశాన్నే ఆశ్రయించి ఉంటాయి)అని మూడుకాలాల్లోనూఉండే వికారముచెందేవస్తువులన్నీ, ఈఆకాశాన్నాశ్రయించేవిగా ఇక్కడ

చెప్పబడుతోంది. వికారముచెందేవస్తువుల్లోఒకటైన ప్రసిద్ధాకాశం అన్నికార్యవస్తువులకీ ఆశ్రయం కాలేదు. అంచేత ఇక్కడ ఆకాశమనబడేది అంబరమనబడే ప్రసిద్ధాకాశానికీ కారణమైన మూలప్రకృతే అయి ఉండాలి. అంచేత ఈమూలప్రకృతికీ ఆకాశంగా చెప్పబడే అక్షరం పరమాత్మే అవుతుందిగాని మూలప్రకృతి కాదు. కార్యవస్తుజాతంలోకనబడే స్థూలత్వం కలిగిఉండటంమొదలైనవి కారణమైన పరమాత్మదగ్గరలేవనే నిషేధం లోనూ తగకపోవడం అంటూఏమీలేదు. అందుచేత అక్షరం పరమాత్మే.

*// సి. సూ.// సా చ ప్రశాసనాత్ // 1-3-10 //*

***సా చ=*** (మూలప్రకృతిని ధరించటంఅనే) అదికూడా, ***ప్రశాసనాత్=*** గొప్పదైన నియమనంచేతనే (అక్షరం జీవుడు కానేరడు)

*పూ.236*.* *తర్హిజీవోస్త్వక్షరం తత్కృతాన్నచేతనవస్తునః//*

**237.* *ఆధారత్వోపపత్తేరిత్యేష వాదో నివార్యతే/*

236*-*237. **పూర్వపక్షం:** అక్షరమనబడేది మూలప్రకృతికాకపోయినా, జీవుడుకావచ్చు. మూలప్రకృతి లోఉన్న అన్నిఅచేతనపదార్థాలనీ జీవుడు ధరించగలవాడవటంచేత ఇలా నిశ్చయించడంలో దోషంఏమీలేదు. *"యస్యాక్షరం శరీరం"* మొదలైనవాటిలో జీవుడినిసూచించే అక్షరశబ్దం ప్రయోగింపబడింది. అంచేత అక్షరం జీవుడే.

*సి.237** *"ఏతస్యవా అక్షరస్యే"త్యాదినాఽస్యాక్షరస్య సా//*

*238.* *ధృతిః ప్రశాసనాదేవ భవతీత్యుపదిశ్యతే/*

*న చేదృక్ శాసనం బద్ధముక్తయోరపి సంభవేత్//*

237*-238.**సిద్ధాంతం:** ఈపూర్వపక్షం ఇక్కడనిరసింపబడుతోంది *"ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచన్ద్రమసౌ విధృతౌ తిష్ఠతః"*(బృహ3-8-9) (ఓగార్గీ! ఈఅక్షరాన్నిమించిన నియమనంచేత సూర్యుడు చంద్రుడు నిలబెట్టబడి ప్రకాశిస్తున్నారు.)వంటివాక్యాల్లో అక్షరమనబడేది గొప్పదైననియమనంచేత మూల ప్రకృతిమొదలైనవాటిని ధరించినిలిపేదిగా చెప్పబడుతోంది. ఉత్తమమైననియమనంఅంటే అన్నింట్లోనూ ప్రవేశించి నియమించటం. ఇలాంటినియమనం పరమాత్మకే తగియుందిగాని సంసారిజీవుడికో, ముక్తజీవుడికో తగదు. అంచేత అక్షరం పరమాత్మే అవాలి.

*// సి. సూ. // అన్యభావవ్యావృత్తేశ్చ // 1-3-11 //*

***అన్యభావవ్యావృత్తేః చ=*** అక్షరానికి పరమపురుషుడికంటె వేరైన అచేతనధర్మాన్ని, జీవుడిధర్మానీ్న కూడనివనిచూపటంచేత (అక్షరం పరమాత్మే); లేదా, **అన్యభావవ్యావృత్తేః చ=** (అక్షరంవంటిది) వేఱొకటి ఉండటాన్ని నిరసించటంచేతకూడా (అక్షరం పరమాత్మే).

*239.* *"అదృష్టం ద్రష్టృ చే"త్యాదివాక్యశేషతః పరాత్మతః/*

*అన్యత్వమక్షరస్యాస్య వ్యావర్తయతి చోపరి//*

*240.* *ఈదృగ్గుణవిశిష్టాన్యసద్భావం వా వ్యుదస్యతి/*

*తస్మాత్స్వశాసనాధీనసర్వధర్తా పరః పుమాన్//*

*// ఇత్యక్షరాధికరణమ్ //*

239-240. అక్షరం పరమాత్మేనని చూపటానికి మరొకకారణం చూపబడుతోంది. *"ఏతదక్షరం గార్గి అదృష్టం ద్రష్టృ, అశ్రుతం శ్రోత్రం... నాన్యదతోఽస్తి ద్రష్టృ, నాన్యదతోఽస్తి శ్రోతృ"* (బృహ 3(5)-8-11) (ఓగార్గీ!

అటువంటి ఈఅక్షరం వేరొకదానిచే చూడబడనిదై, అన్నింటిని చూస్తుంది. వేఱొకదానిచే వినబడనిదై అన్నింటినీ వింటుంది. ఈవిధంగా చూసేది, దీనికంటే వేఱొకటిలేదు. ఈవిధంగ వినేది దీనికంటె వేఱొకటి లేదు.)అని ఈప్రకరణంలోఒకవాక్యం ఉంది. ఇందులో అక్షరాన్ని చూచేదిగాను, వినేదిగాను చూపించటంచేత, ఇది చూడటం, వినటం చేయలేని అచేతనంగాదని స్పష్టం అవుతోంది. ఏఒక్కరిచేతా చూడబడనిదిగా అక్షరంఇక్కడ సూచింపబడుతోంది. దీనివల్ల అన్నింటినీ ఎప్పుడూ చూడశక్యంగానివాడూ, పరమాత్మచే ఎప్పుడూ చూడబడేవాడూ అయినజీవుడు అక్షరమవడం శక్యంగాదని స్పష్టంఅవుతోంది. ఇట్లా పరమపురుషుడికంటె వేఱైన అచేతనస్వభావాన్ని, జీవుడిస్వభావాన్నీ, అక్షరానికి తగనివని చూపించటంవల్ల అక్షరం పరమాత్మే అయి ఉండాలని స్పష్టం. ఈసూత్రానికింకోవిధంగా అర్థాన్నిచెప్పడం వాడుకలోఉంది. *"నాన్యోఽ తోఽస్తి ద్రష్టృ"* అని అక్షరంలా అన్నింటినీ చూసేదిగాను, ఎవరిచేతా చూడబడనిదిగాను మరొకటి లేదని చూపబడటంచేత ఈఅక్షరం పరమాత్మేఅవటానికిసాధ్యంఅని సూత్రానికి అర్థంగాగ్రహించాలి. అంచేత స్వనియమనంచేత అన్నింటినీధరించే అక్షరం పరమపురుషుడేఅని నిశ్చయం అయింది.

*అక్షరాధికరణము పూర్తైనది.*

## *॥ఈక్షతికర్మాధికరణమ్ ॥ 1-3-4 ॥*

### *॥ సి. సూ. ॥ ఈక్షతి కర్మవ్యపదేశాత్సః ॥ 1-3-12 ॥*

***ఈక్షతికర్మ=***చూసేవాడిగాచెప్పబడేవాడు, ***సః=***పరమాత్మే, ***వ్యపదేశాత్=***(పరమాత్మగ)చెప్పబడటంచేత.

** (సః అన్నపదం ఈపాదంలోఉన్న అన్నిఅధికరణాల్లోనూ సాధ్యాన్ని సమర్పించే పదం అవుతుంది)*

**241.** *పరస్యాన్యైర్దర్శనార్హత్వాభావః ప్రాక్ సమీరితః।*
*తర్హి దృశ్యతయోక్తో న పరస్స్యాదితి వార్యతే॥*

241. వెనకటి అధికరణంలో అక్షరమనబడే పరమపురుషుడు ఎవరిచేతా చూడబడనివాడుగా చెప్పబడ్డాడు. "అలాగైతే చూడబడేవాడుగా మరొకవాక్యంలో చెప్పబడినవాడు పరమాత్మకానేరడు" అనే వాదం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

**పూ.242.** *ప్రశ్నే "యః పునరేతం త్రిమాత్రేణే"త్యాది పఠ్యతే।*
*"పరం పురుషం" ఇత్యేవం నిర్దిష్టోఽత్ర చతుర్ముఖః॥*

**243.** *ఏకద్విమాత్రప్రణవమంత్రోపాసీనయోః క్రమాత్।*
*మర్త్యలోకాప్త్యంతరిక్షలోకప్రాప్త్యాత్మకే ఫలే॥*

**244.** *ఉక్త్వా త్రిమాత్రోపాసీనప్రాప్యత్వేన సమీరితః।*
*అంతరిక్షాత్పరో బ్రహ్మలోకస్తత్సాహచర్యతః॥*

***245.** *విరించలోకస్తత్రస్థేనేక్ష్యమాణస్స ఏవహి।*

242-*245.పూర్వపక్షం: *"యఃపునరేతం త్రిమాత్రేణోమిత్యేతేనైవాక్షరేణ పరంపురుష మభిధ్యాయీత స తేజసి సూర్యే సంపన్నః। యథా పాదోదరస్త్వచావినిర్ముచ్యతే ఏవం హవై సపాప్మనా వినిర్ముక్తః ససామభిరున్నీయతే బ్రహ్మలోకం సఏతస్మాజ్జీవఘనాత్ పరాత్పరం పురీశయం పురుషమీక్షతే।"* (ప్రశ్నో. 5-5) (మూడుమాత్రలుగల ఈఓం అనేఅక్షరంచేతనే ఈపరమపురుషుని ఎవడుధ్యానిస్తాడో, వాడు తేజోమయమైన సూర్యుడిలోచేరేవాడై పాముపొరనువదిలినట్లు పాపంనుంచివిముక్తుడై సామగానంచేసేవారిచేత

బ్రహ్మలోకాన్ని పొందింపబడతాడు. దేహేంద్రియాలకంటే, ఉత్తమమైన జీవుడికంటే, ఉత్తమమైన హృదయంలో ఉండేపురుషుడిని వాడుచూస్తాడు.)అన్నవాక్యం ప్రశ్నోపనిషత్తులో ఉన్నది. ఇక్కడ *"పరం పురుషం"* (ఉత్తముడైనపురుషుడిని) అనిచెప్పబడేవాడు సమష్టిపురుషుడైన చతుర్ముఖుడా లేక పరమాత్మా అన్నప్రశ్న వచ్చినప్పుడు చతుర్ముఖుడనేచెప్పడం సరైనది. ఎంచేతంటే, ఈప్రకరణంలో ఒకమాత్రతోఉన్న ప్రణవాన్ని ఉపాసించేవాడికి మనుష్యలోకప్రాప్తి, రెండుమాత్రలతోనున్న ప్రణవాన్నిపాసించేవాడికి మనుష్యలోకంకంటె ఉత్తమమైన అంతరిక్షలోకప్రాప్తి, ఫలంగా చెప్పబడ్డాయి. ఆపైన మూడుమాత్రలతోఉన్న ప్రణవాన్నుపాసించే వాడికి అంతరిక్షంకంటె ఉత్తమమైన బ్రహ్మలోకప్రాప్తిని ఫలంగా చెప్పబడింది. అంతరిక్ష లోకానికిమీదదిగా చెప్పబడే బ్రహ్మలోకం చతుర్ముఖబ్రహ్మలోకమే అవటానికి సాధ్యం. బ్రహ్మంతాలూకు లోకము కాదు. ఆలోకాన్ని పొందినవాడిచేత చూడబడేవాడు ఆలోకానికి అధిపతైన చతుర్ముఖుడే కాగలడు.

సి.245* *మైవమీక్షతికర్మాత్ర పరః పురుష ఏవ సః।*

246. *పరాదిత్వాదివాక్యాన్త్యశ్లోక ఈక్షతికర్మణః।*
*నిరుపాధికశాన్తత్వామృతత్వాద్యుపదేశతః॥*

247. *ఏవం సిద్ధే పరాత్మత్వే బ్రహ్మలోకపదం చ తత్।*
*"యత్తత్కవయ" ఇత్యేవమత్రోక్తం సూరి సేవితమ్॥*

248. *తద్వైకుంఠస్థానమేవ వదతీత్యవగమ్యతే।*
*అంతరిక్షావ్యవహితో న చ లోకోపి వేధసః॥*

249. *మధ్యే స్వర్గాదిలోకానాం బహూనాం సంభవాదతః।*
*అత్రేక్షతేః కర్మతయా శ్రుతో నారాయణః ప్రభుః॥*

॥ఇతి ఈక్షతికర్మాధికరణమ్ ॥

245*-249. **సిద్ధాంతం.:** ఈపూర్వపక్షం తప్పు. ***"జీవఘనాత్ పరాత్పరం పురిశయం పురుష మీక్షతే"*** (ప్రశ్నో. 5-5) (సంసారిజీవుడికంటె ఉత్తమమైన, నిత్యముక్తులకంటేగొప్పవాడైన హృదయంలోఉండే పురుషుడిని చూస్తాడు) అన్నవాక్యం తరువాత ఆప్రశ్న చివరిశ్లోకంలో ***"యత్తత్ శాన్తం అజరం అమృతం అభయం పరంచ"*** (ప్రశ్నో. 5-7) (ఆకలి దాహం మొదలైన ఆరు నీచమైన అవసరాలూ లేనిదీ, జరామరణాలు లేనిది, ఎవడికీభయవడనిదీ, అన్నిటికంటేఉత్తమమైనదీ) అని ఈ ఈక్షతికర్మపురుషుడికి సహజంగా ఆకలి, దాహం, చావు, ముసలితనం, మొదలైనవిలేవని ఉపదేశింపబడుతోంది. ఇలాంటిలక్షణాలు పరమపురుషుడికే తగిఉంటాయిగాని కర్మవశ్యుడైన చతుర్ముఖుడికి తగవు. బ్రహ్మలోకమనటం, బ్రహ్మంతాలూకులోకమేగాని చతుర్ముఖబ్రహ్మగారిలోకం గాదు. వెనకటి చివరిశ్లోకం(5-7)లో ఈలోకంగురించి ***"యత్ తత్ కవయో వేదయన్తే"*** (ఏలోకాన్ని నిత్యసూరులు చూస్తున్నారో) అని సూచించటంవల్ల ***"తద్విష్ణోః పరమంపదం సదాపశ్యన్తి సూరయః"*** (ప్రశ్నో.5-10,తై.సం.4-2.9.4) (విష్ణువుదైన సుప్రసిద్ధమైన పరమపదాన్ని నిత్యసూరులు ఎప్పుడూ చూస్తూంటారు.) అని చెప్పబడిన వైష్ణవమైన వైకుంఠలోకమేఇది అనిచెప్తుంది. అంతరిక్షానికి మీదిదైన లోకం గనుక బ్రహ్మలోకం చతుర్ముఖబ్రహ్మలోకమే అనడంసరిగాదు. అంతరిక్షానికి తరువాతిమెట్టుగామీదనున్న స్వర్గ లోకంమొదలైనవి ఎన్నోలోకాలున్నాయిగద! ఏలోకమో ఎలానిర్ణయించటం? అంటే ఒకేమాత్రతో ప్రణవాన్ను పాసించేవారికి మనుష్యలోకప్రాప్తియనబడే ఈజన్మనుగురించీ, రెండుమాత్రలతో ప్రణవాన్నుపాసించే వారికి అంతరిక్షలోకప్రాప్తిచేత ఉపలక్షింపబడిన తరువాతిజన్మనిగూర్చి కూడాచెప్పి, పరమపురుషవాచకమైన

మూడుమాత్రలుగల ప్రణవాన్ని (ఓంకారాన్ని) ఉపాసించేవారికి ఫలంగాచెప్పబడే బ్రహ్మలోకప్రాప్తి ఈజన్మ, పైజన్మలుగలవాటికంటె మేలైనపరమపురుషలోకప్రాప్తేఅవటం సాధ్యం. అందుచేతఇక్కడ అభ్యసింప బడే ఈక్షతికర్మపురుషుడు సర్వేశ్వరుడైన నారాయణుడే.

*ఈక్షతికర్మాధికరణము పూర్తియైనది.*

## ॥దహరాధికరణమ్ ॥ 1-3-5 ॥

### ॥ సి. సూ. ॥ దహర ఉత్తరేభ్యః ॥1-3-13 ॥

***ఉత్తరేభ్యః=*** ముందు వచ్చేవాక్యంలో చూపబడే కారణంచేత, ***దహరః=*** దహరాకాశమనబడేవాడు (పరమాత్మే)

**250.** *పూర్వం పురిశయానస్య పరాత్మత్వం సమర్థితమ్।*
*తస్యాకాశపదోక్తస్య స్థాప్యతేఽత్ర పరాత్మతా॥*

*250.* వెనకటిఅధికరణంలో *"పురిశయం పురుషమీక్షతే"* అన్నవాక్యంలో హృదయంలోఉండేవాడిగా చెప్పబడేవాడు పరమాత్మేననిసాధింపబడింది. మరోవాక్యంలో హృదయంలో వసించేవాడు ఆకాశం అని చూపించటంచేత ఈతడు పరమాత్మకాడనే ఆక్షేపంవస్తే, దానిని నిరాకరించి ఇతడు పరమాత్మే అని ఈఅధికరణంలో స్థాపింపబడుతోంది.

**పూ.251.** *ఛాందోగ్యే చా"థ యదిదమస్మిన్ని"త్యాది పఠ్యతే।*
*శ్రుతోఽత్ర దహరాకాశో భూతాకాశోఽవసీయతే॥*

***252.** *తత్రైవాకాశశబ్దస్య ప్రకర్షేణ ప్రసిద్ధితః।*

251-*252. **పూర్వపక్షం:** *"అథయదిదమస్మిన్ బ్రహ్మపురే దహరం పుణ్డరీకం వేశ్మ దహరోస్మిన్ అంతరాకాశస్తస్మిన్ యదంతస్తదన్వేష్టవ్యం తద్వావవిజిజ్ఞాసితవ్యమ్"*(ఛాం.8-1-1) (బ్రహ్మనికి వాసస్థానమైన ఈదేహంలో తామరపూవువంటి చిన్న(హృదయమనే) బ్రహ్మముండేస్థలంఉన్నది. దీనిలోసూక్ష్మ మైన ఆకాశం ఉన్నది. దానిలోఉన్నదాన్ని వెతకాలి. అదే తెలుసుకోదగినది) అనిఛాందోగ్యోపనిషత్తులో ఒకవాక్యం చెప్తోంది. ఇక్కడదహరాకాశమనబడేది పంచభూతాల్లోనొకటైనఆకాశమే కావటంసాధ్యం. పరమాత్మనికూడ ఆకాశమనడం ఉన్నా, భూతాకాశానికే ఆకాశమనిప్రసిద్ధి. పైగా, దహరాకాశంలోపలఉండే దాన్నే ధ్యానించదగినదిగా చెప్పటం చేత ఈదహరాకాశం ధ్యానించతగిన పరమాత్మవస్తువుకంటె వేరైన భూతాకాశమే అవాలి. అదే సాధ్యం.

**252*** *అన్వేష్టవ్యాధారతయా ప్రతీతేశ్చేతి చేన్న తత్॥*

**253.** *దహ్రాకాశః పరాత్మా ఽత్రోత్తరవాక్యోక్తధర్మతః।*
*స్వాభావికాత్మత్వమపహతపాప్మత్వమప్యథ॥*

**254.** *సత్యసంకల్పతా చాథ సత్యకామత్వమిత్యపి।*
*పరాత్మైకాన్తధర్మాస్తే పఠితా వాక్య ఉత్తరే॥*

**255.** *అన్వేష్టవ్యాన్తరం చాత్ర తదన్తస్స్థగుణాష్టకం।*
*దహ్రం చ గుణజాతం చ ప్రస్తుత్యాయ ద్వయోరపి॥*

**256.** *"తదన్వేష్టవ్యమి"త్యేవముపాస్యత్వం విధీయతే।*
*"యావాన్వా అయమాకాశస్తావాని"త్యాదివాక్యతః॥*

257. దహ్రభూతాకాశయోశ్చ స్పష్టం భేదః ప్రతీయతే।
అతశ్చ దహరాకాశః పరమాత్మా న ఖం భవేత్॥

252*-257. సిద్ధాంతం: ఈపూర్వపక్షంతప్పు. *"ఏష ఆత్మాఽపహతపాప్మా విజరోవిమృత్యుర్వి శోకో విజిఘత్సోఽపిపాసస్సత్యకామ స్సత్యసంకల్పః"* (ఛాం.8-1-5) (ఇతను సహజంగానే సర్వవ్యాపియై, పాపాలు లేనివాడై, జరామరణాలులేనివాడై, శోకంలేనివాడై, ఆకలిదప్పులులేనివాడై, అవాప్తసమస్తకాముడు, అప్రతిహతమైనసంకల్పం గలవాడు)అని పరమాత్మకేతగిన గుణాలు ఈవాక్యంలో చెప్పబడియుండటంచేత దహరాకాశం పరమాత్మగానేయుండటం సాధ్యం. *"తస్మిన్ యదన్త స్తదన్వేష్టవ్యమ్"* (ఛాం. 8-1-1) అని దహరాకాశంలోఉన్నదాన్నే ఉపాసించాలని చెప్పడంచేత దహరాకాశం ఉపాసింపదగిన పరమాత్మకంటె వేఱైనది అనడం తప్పు. *"అథయ ఇహాత్మాన మనువిద్యవ్రజన్త్యేతాంశ్చ సత్యాన్ కామాన్"* (ఛాం. 8-1-6) (ఎవరు ఈపరమాత్మను, ఈకల్యాణగుణాలనీఉపాసించి పరలోకాన్ని పొందుతున్నారో...) అని పరమాత్మతో బాటు ఆపరమాత్మకున్న అపహతపాప్మత్వము (పాపంలేకపోవడం), విజరత్వం (ముసలితనం లేకపోవడం), విమృత్యుత్వం (మరణంలేకపోవటం), విశోకత్వం (శోకంలేకపోవటం), విజిఘత్సత్వం (ఆకలి లేకపోవటం), అపిపాసత్వం (దాహంలేకపోవటం), సత్యకామత్వం (అడ్డులేని కోరికతీరడం), సత్యసంకల్పత్వం (అప్రతిహతమైన సంకల్పాన్ని కలిగియున్నవాడుగాఉండటం) అనే ఎనిమిదికల్యాణగుణాలని ఉపాసించే విధాన్ని ఈప్రకరణంలో చెప్పబడింది. అంచేత *"దహరోస్మిన్నన్తర ఆకాశ స్తస్మిన్ యదంతస్తదన్వేష్టవ్యమ్"* అనేవాక్యంలో *'తత్'* అనేశబ్దంచేత దహరాకాశమనబడే పరమాత్మనీ, ఆయనకున్న కల్యాణగుణాలని ఉపాసించాలని ఉపనిషత్తు విధించిందని గ్రహించటమే సరైనది. ఇంకా *"యావాన్ వా అయమాకాశః తావా నేషోంతర్హృదయ ఆకాశః"* (ఛాం. 8-1-3) (ఈభూతాకాశం ఎలా పెద్దదిగాయుందో అలాగే హృదయంలోఉండే ఈదహరాకాశంకూడా పెద్దదిగానేఉంది.)అని దహరాకాశానికి ఉపమానంగా భూతాకాశం చూపబడింది. ఇంచేతకూడా భూతాకాశంకంటె భిన్నమైన పరమాత్మే ఇక్కడ దహరాకాశమని చెప్పబడు తోందనీ, దహరాకాశం భూతాకాశంకాదనీ స్పష్టమౌతోంది.

*॥ సి. సూ. ॥ గతిశబ్దాభ్యాం తథాహి దృష్టం లింగం చ ॥ (1-3-14)*

***గతిశబ్దాభ్యాం=*** (దహరాకాశాన్ని అందరికీ) గతిగా చెప్పటంచేత, (దహరాకాశాన్నిసూచిస్తూ) బ్రహ్మలోక శబ్దం ప్రయోగింపబడటంచేతనూ, (దహరాకాశం పరమాత్మే). ***తథాహి దృష్టం=*** అలాగే (వేదవాక్యాల్లోనూ) కనబడుతోందిగదా!, ***లింగం=*** (గతిశబ్దాలే) తగిన చిహ్నాలైయున్నాయి.

258. అస్మింశ్చ దహరాకాశే చేతనానామజానతామ్।
ప్రత్యహం గమనం చాథ గంతవ్యదహరస్య చ॥

259. బ్రహ్మలోకపదోక్తిశ్చేత్యుభయం పరమాత్మతామ్।
బోధయత్యస్య దహ్రస్య దృష్టమన్యత్ర తద్ద్వయమ్॥

260. "సతి సంపద్య నే"త్యే"ష బ్రహ్మలోక" ఇతిశ్రుతేః।
కిమన్యదృష్ట్యా స్యాదత్ర శ్రూయమాణమిదం ద్వయమ్॥

*261. దహ్రస్య పరమాత్మత్వే లిఙ్గం పర్యాప్తమేవహి।

258-*261. *"తద్యథాహిరణ్యనిధిం నిహితమక్షేత్రజ్ఞాఉపర్యుపరిసంచరంతో నవిందేవయురేవం ఏవేమాస్సర్వాః ప్రజా అహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం నవిందంతి అనృతేనహి ప్రత్యూఢాః"* (ఛాం.

8-3-2) (బంగారపునిధిఉన్నచోట అదిఉన్నట్లుతెలియనివాడు దానిమీదినించే ఎన్నోసారులు తిరిగినా, ఆ బంగారునిధిని ఎలాపొందలేడో, అలాగేఈసమస్తచేతనులూ, బ్రహ్మలోకమనబడే ఈదహరాకాశందగ్గరకి ప్రతిరోజూ (నిద్రపోయేటపుడు) వెళ్ళినా, దీన్నితెలిసికోలేరు. ప్రకృతివల్ల వీళ్ళు కప్పబడిపోయినవాళ్ళుగదా!) అని అజ్ఞానులైనచేతనులు నిద్రించేటపుడుప్రతిరోజూ ఈదహరాకాశాన్నిపొందుతారని చెప్పబడుతోంది. '*ఏతం*' అని వెనకచెప్పబడినదహరాకాశాన్ని బ్రహ్మలోకశబ్దంతో ఈవాక్యం చెప్తోంది. ఇలా చేతనులకి ప్రతిరోజూ దహరాకాశాన్ని గతిగాచెప్పటంచేత, దహరాకాశాన్నిసూచిస్తూ బ్రహ్మలోకశబ్దాన్ని ప్రయోగించటంచేతనూ, ఈదహరాకాశం పరమాత్మేనని తెలుస్తోంది. *"లోక్యతఇతి లోకః"*అనే వ్యుత్పత్తివల్ల లోకశబ్దం తెలుసుకొన బడేదిగ చెప్పబడుతుంది. బ్రహ్మంతాలూకు లోకమని షష్ఠీతత్పురుషసమాసంగా ఉండటంతప్ప బ్రహ్మమైన లోకమని ఏకవిభక్తిగల సమాసంగా గ్రహించటం స్వరసమని పూర్వమీమాంసలోఉన్న నిషాదస్థపతి న్యాయంవల్ల తెలుస్తోంది. చేతనులు ప్రతిరోజూ వెళ్ళేస్థలంగాఉండే గొప్పతనాన్ని బ్రహ్మలోకశబ్దవాచ్యత్వం వేఱు వేదవాక్యాల్లో పరమాత్మకే చెప్పబడుతోందని *"ఇమాః సర్వా ప్రజాః సతిసంపద్యనవిధుస్సతి సంపద్యామః ఇతి"* (ఛాం. 6-9-2) (ఈప్రజలందరూ 'సత్'అనబడే బ్రహ్మాన్ని పొంది, "'సత్'ను పొందేం" అనితెలియకుండానేఉన్నారు) అనేవాక్యం చేతనులందరూ ప్రతిరోజూ నిద్రించేటప్పుడు బ్రహ్మందగ్గరకి వెళ్తున్నారని ఘోషిస్తోంది. *"ఏషబ్రహ్మ లోకస్సమ్రాడితి హోవాచ"* (బృహ 6-4-22) అన్నవాక్యం సర్వేశ్వరుడిని బ్రహ్మలోకమని సూచిస్తోంది. అంచేత ఇలా మిగతావేదవాక్యాల్లో పరమాత్మని గురించే గతిశబ్దాలు కనబడుతూండటంచేత ఇక్కడ దహరాకాశం పరమాత్మే. మరికొన్నివేదవాక్యాల్లో ఇవిఏమిటి చెప్పుతున్నాయన్నది అలా ఉండనియ్యండి. ఇక్కడ గతిశబ్దాలస్వరూపాన్ని చూసినట్లైతే, ఇవే దహరాకాశ మంటే పరమాత్మేనని నిశ్చయించే చిహ్నాలని స్పష్టమవుతుంది. అందరుచేతనులకీ, నిద్రించేటప్పుడు పొందదగినదిగా ఉన్నగొప్పతనాన్ని, బ్రహ్మలోకపదవాచ్యత్వాన్నీ పరమాత్మకితగినచిహ్నాలుగ తగినవేతప్ప, భూతాకాశాన్ని గురించిన చిహ్నాలు కాలేవు. అంచేత దహరాకాశం పరమాత్మే.

*॥ సి. సూ. ॥ ధృతేశ్చ మహిమ్నోఽస్యాస్మిన్నుపలబ్ధేః ॥ (1-3-15)*

**అస్యమహిమ్నః=** పరమాత్మమహిమైన, **ధృతేశ్చ=** సర్వలోకధారణం అనే గొప్పదనం, **అస్మిన్ ఉపలబ్ధేః=** ఈదహరాకాశంలో కనబడటంచేతను, (దహరాకాశం పరమాత్మే.)

*261** *బ్రహ్మైకాంతతయా సర్వవేదాన్తోద్ఘోషితస్యచ॥*

*262.* *జగద్ధృత్యాఖ్యభూమ్నో ఽస్మిన్ దహ్రే సంకీర్తనాదపి॥*

*దహ్రాకాశః పరః శ్రీమాన్ నారాయణ ఇతీర్యతే॥*

261*-262. *"యఆత్మా స సేతుర్విధృతిరేషాం లోకానాం అసంభేదాయ"* (ఛాం.8-4-1) (ఈఆత్మ, ఈలోకాలు ఒకదానితోనొకటికలసి విడిపోకుండా పెనవేసుకున్నట్లుగ వేరువేరుగ ధరించిఉన్నాడు) అని ఇక్కడ దహరాకాశం అన్నిలోకాలనీ ధరిస్తూనిలపెట్టేదిగా చెప్పబడుతోంది. *"ఏషసర్వేశ్వర ఏషభూతాధిపతిరేష భూతపాల ఏష సేతుర్విధరణఏషాం లోకానాం అసంభేదాయ"* (బృహ. 6-4-22) (ఇతనే సర్వేశ్వరుడు. ఇతనే జీవరాసులకధిపతి. ఇతనే జీవరాసులకిరక్షకుడు, ఈలోకాలు ఒకదానితోనొకటి కలిసిపోకుండ పెనవేసుకొనేటట్లు ధరించినిలిపేవాడు)మొదలైన అనేకవాక్యాల్లో ఈగొప్పతనం పరమాత్మకే చెప్పబడిఉంది. ఈకారణంచేతకూడా, దహరాకాశం పరమాత్మైన శ్రీమన్నారాయణుడే అయియుండ సాధ్యం.

*॥ సి. సూ.॥ ప్రసిద్ధేశ్చ ॥ (1-3-16)*

**ప్రసిద్ధేః చ=** (ఆకాశశబ్దం పరమాత్మకి) ప్రసిద్ధిపొందియుండడంచేతకూడా, (దహరాకాశం పరమాత్మే)

263. "కోహ్యేవాన్యాత్క " ఇత్యాదిష్వస్యాకాశపదస్యచ ।
పరాత్మని ప్రసిద్ధేశ్చ దహ్రోకాశః పరః పుమాన్॥

263. "కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేషఆకాశ ఆనందోనస్యాత్"(తై.ఆనం.7) (ఆనందమయుడై అంతటాప్రకాశించువాడవటంచేత ఆకాశమనబడేపరమాత్మ లేనిచో, ఎవడుఈజన్మలోనూ, మళ్ళీజన్మలోనూ ఆనందం పొందశక్యం?), "సర్వాణిహవాఇమానిభూతాని ఆకాశాదేవ సముత్పద్యన్తే" (ఛాం. 1-9-1) (అన్ని భూతాలున్ను ఆకాశమనబడేపరమాత్మనించే సృష్టింపబడ్డాయి.) మొదలైన వేదవాక్యాల్లో పరమాత్మకే ఆకాశశబ్దం ప్రసిద్ధిచెందటంచేతకూడా, దహరాకాశం పరమాత్మే అంటే దోషం లేదు.

॥ సి. సూ. ॥ ఇతరపరామర్శాత్స ఇతి చేన్నాసంభవాత్ ॥ (1-3-17)

**ఇతరపరామర్శాత్=** (పరమాత్మకంటెను భిన్నమైన- వేఱైన జీవుని సూచించటంచేత, **సః=** (దహరాకాశం) జీవుడే, **ఇతి చేత్=** అంటే, **న=** తగదు, **అసంభవాత్=** (దహరాకాశగుణాలు జీవుడివద్ద) ఉండశక్యం కాకపోవటంచేత.

పూ. *264. "యఏష సంప్రసాదోఽస్మా "దితి జీవః పరేతరః।

*264. **పూర్వపక్షం:** దహరాకాశం పంచభూతాల్లో ఒకటైనఆకాశంకాలేదన్నా, ప్రకాశించేదవటంచేత, ఆకాశమనదగిన జీవుడుగఉండవచ్చునుగదా! ఈప్రకరణంలో "అథ యఏష సంప్రసాదో ఽస్మాచ్ఛరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే। ఏషఆత్మేతి హోవాచ ఏతద మృతమభయ మేతద్బ్రహ్మ" (ఛాం.8-3-3) (ఏజీవుడు ఈదేహంనుంచి బయలుదేరి పరంజ్యోతినిపొంది తనస్వరూప ప్రకాశాన్ని పొందుతాడో, ఆతనినే ఆత్మయందురు. ఆతడే మరణములేని వాడు, భయములేనివాడు, ఆతడే బ్రహ్మం.)అని పరంజ్యోతియనబడే పరమాత్మకంటెవేఱైన సంప్రసాదుడనబడే జీవుడే పైవాక్యంలో చెప్పబడటంచేత దహరాకాశం జీవుడేయని గ్రహించతగినది.

సి.264* ప్రోక్త ఏవాత్ర దహరాకాశస్స్యాదితి చేన్న తత్॥
*265. అస్మిన్నసంభవాదుక్తగుణానాం దహ్రవర్తినామ్।

264*-*265. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. "దహరోస్మిన్ అంతర ఆకాశః" (ఛాం. 8-1-1) అని దహరాకాశాన్ని చెప్పి, దాన్నే "ఏషఆత్మాఽపహతపాప్మా" (ఛాం. 8-1-5) అన్నవాక్యంలో దానికి అపహతపాప్మత్వం (పాపంలేకుండడం)మొదలైన ఎనిమిదిగుణాలూ చెప్పబడ్డాయని ఇదివరకే చూపబడింది. ఈగుణాలు సంప్రసాదవాక్యంలో పరంజ్యోతియనబడే నారాయణుడికే తగిఉన్నాయిగాని శరీరంతో సంబంధం ఉన్న జీవుడికి తగినవి గాలేవు. అంచేత దహరాకాశం పరమాత్మే.

॥ సి. సూ. ॥ ఉత్తరాచ్చేదావిర్భూతస్వరూపస్తు ॥ 1-3-18 ॥

**ఉత్తరాత్ చేత్=** తరువాతఉన్న ప్రజాపతివాక్యంతో (అపహతపాప్మత్వం మొదలైన గుణాలు కలవాడు జీవుడే) అన్నట్లైతే, **ఆవిర్భూతస్వరూపః తు=** (పరంజ్యోతికటాక్షంవల్ల) ప్రకాశిస్తున్న స్వరూపం ఉన్న ముక్తుడు గదా! (అక్కడ చెప్పబడుతున్నాడు.)

పూ.265* ప్రజాపతేరుత్తరత్ర వాక్యే జీవోపి తాదృశః॥
*266. ధ్వస్తపాప్మత్వాదినోక్తస్తస్మాద్దహ్రస్సఇత్యసత్।

265*-*266. **పూర్వపక్షం:** ఈప్రకరణంతరవాతఉన్న "యఆత్మా అపహతపాప్మా" (ఛాం. 8-7-1) అనిమొదలయ్యే ప్రజాపతివాక్యంలో జీవుడికీ, అపహతపాప్మత్వంమొదలైనగుణాలు చెప్పబడ్డాయిగనుక

దహరాకాశం పరమాత్మేనని వెనకటిసూత్రంలో చెప్పినదితప్పు. అందుచేదహరాకాశం జీవుడే.

సి.266* *తిరోహితగుణః పూర్వం బ్రహ్మోపాసనయా తతః॥*

267. *ఆవిర్భూతస్వరూపస్తు తత్ర జీవః ప్రకీర్తితః।*

*స్వాభావికగుణో దభ్రస్త్వత్రాతో నాత్ర జీవధీః॥*

266*-267. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. మొదట సంసారిజీవుడి అపహతపాప్మత్వము మొదలైనగుణాలు మరుగుపడిఉన్నాయి. తరవాత పరమాత్మనుపాసించి మరుగుతొలగించుకొని ఆగుణాలు ప్రకాశింపజేసుకున్నాడు. ప్రజాపతివాక్యంలో ఇలా బ్రహ్మోపాసనంవల్ల ముక్తదశలో స్వరూపప్రకాశాన్ని పొందిన ముక్తజీవుడే అపహతపాప్మత్వం మొదలైన అష్టగుణాలనీ కలిగినవాడుగ చెప్పబడుతున్నాడు. ఇక్కడ దహరాకాశానికి సహజంగానే ఆఎనిమిదిగుణాలూఉన్నాయని ఘోషింపబడింది. అంచేత దహరాకాశం అంటే సహజంగానే అష్టగుణోపేతుడైన నారాయణుడుగ ఉండడంసాధ్యంగాని ఆతనిచే ఒకప్పుడు గుణావిష్కారం పొందే జీవుడుగా చెప్పటం హాస్యాస్పదమే. పైగా, అన్నిలోకాలనీ ధరించి ఉంచేవాడుగ యుండటంవంటి విశిష్టతలు ఇక్కడ దహరాకాశానికి చెప్పబడ్డాయి. ఇవి ముక్తజీవునికీ తగనివేఅవటంచేత దహరాకాశంగ జీవుల్లోఎవరూ అవటం సాధ్యంగాదు.

*॥ సి. సూ. ॥ అన్యార్థశ్చ పరామర్శః ॥ 1-3-19 ॥*

**పరామర్శః=** (జీవుడివిషయం) ఇక్కడ ఎత్తడం, **అన్యార్థశ్చ=** వేఱు ప్రయోజనకోసమే అవుతుంది.

268. *జీవస్వరూపావిర్భావాపదానాఖ్యాగ్ర్యసంపదః।*

*పరస్మిన్ సూచనాయాత్ర జీవస్య గ్రహణం కృతమ్॥*

268. దహరాకాశం జీవుడుకాకపోతే, సంప్రసాదవాక్యంలో ఈప్రకరణంలో జీవుడు ఎందుకు చెప్పబడ్డాడు?అనే ప్రశ్న వస్తుంది. *"పరంజ్యోతిరుపసంపద్య స్వేనరూపేణ అభినిష్పద్యతే"* అని పరంజ్యోతినిపొందటంచేతనే, జీవుడు స్వస్వరూపంతో ప్రకాశిస్తున్నాడని ఈవాక్యంలో చెప్పబడుతోంది. ఇలాగ జీవుడికికూడా స్వరూపప్రకాశాన్ని కలిగిస్తుందనే మహాప్రభావాన్ని దహరాకాశమైన పరమాత్మకి చూపించటానికే ఇక్కడ జీవుడు ఎత్తుకోబడ్డాడు. అంచేత దహరాకాశం పరమాత్మేనని చెప్పడానికి ఏమీ ఆటంకంలేదు.

*॥ సి. సూ. ॥ అల్పశ్రుతేరితి చేత్తదుక్తమ్ ॥ 1-3-20 ॥*

**అల్పశ్రుతేః=** అల్పపరిమాణంగలదిగా (దహరాకాశం) చెప్పబడటంచేత, (అది జీవుడే అవటం సాధ్యం) **ఇతి చేత్=** అన్నట్లైతే, **తత్ ఉక్తమ్=** దీనికి సమాధానం ఇదివరలోనే చెప్పబడింది.

269. *అల్పమానశ్రుతిస్త్వత్ర జీవస్యైవోపపద్యతే।*

*జ్యాయసో నేతి చేదత్ర పూర్వమేవోక్తముత్తరమ్॥*

269. *"దహరోస్మిన్ అంతరఆకాశః"* అన్నవాక్యంలో దహరాకాశం తక్కువపరిమాణమున్నదిగా చెప్పబడుతోంది. ఇది అణువుగాఉండేజీవుడికేతగునుగాని విభువైనపరమాత్మకితగదే అంటే, *"నిచాయ్యత్వా దేవమ్"* (బ్ర.సూ.1-2-7) అనే సూత్రంప్రకారం ఉపాసనకొరకే అల్పపరిమాణం ఉన్నవాడుగ పరమాత్మ చెప్పబడుతున్నాడని ఇదివరకే దీనికి సమాధానం చెప్పబడింది. అంచేత ఈకారణంచెప్పి, దహరాకాశం జీవుడని చెప్పడానికి కుదరదు. అంచేతకూడా దహరాకాశం పరమాత్మే.

*॥ సి. సూ. ॥ అనుకృతేస్తస్య చ ॥ 1-3-21 ॥*

**తస్య=** పరమాత్మకు **అనుకృతేః చ=** (జీవుడు) తగినవాడవటంచేత, (దహరాకాశం జీవుడికంటే వేఱైన

పరమాత్మే)

**270.** *పరానుకారాన్ముక్తస్య గుణాష్టకవిశిష్టతా।*
*అతోఽనుకర్తుర్జీవాచ్చాఽనుకార్యో దహరః పరః॥*

270. *"యదాపశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం। తదావిద్వాన్ పుణ్య పాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి"* (ముండకో. 3-1-3) (బంగారుఛాయమేనిగలవాడును, లోకమును సృష్టించువాడును, నియమించువాడును, చాలపెద్దవాడును, జగత్కారణమైనవాడును అయిన పురుషుని ఎప్పుడు జ్ఞానియైనవాడు చూచునో, అప్పుడు, ఆతడు పుణ్యపాపములను వదల్చుకొని (దులుపుకొని) దోషములేనివాడై (పరమపురుషునితో) గొప్పదియైన సామ్యమును పొందును.) అని ముక్తిదశలో జీవుడు పరమాత్మతో గొప్పదైన సామ్యాన్నిపొందుతాడని ఒకవేదవాక్యం చెప్తోంది. ఈసామ్యాపత్తిచేతనే ముక్తిదశలోజీవుడు అపహతపాప్మత్వంవంటి అష్టగుణాలనీ కలిగినవాడవుతాడు. ఇక్కడ చెప్పబడిన దహరాకాశం ఇట్లా అనుకరణంవల్ల ఈగుణాలని పొందలేదు. జీవుడు తనని అనుకరించేటట్లు సహజంగానే వాటినికలిగియుంటుంది. అంచేత అనుకరించే జీవుడికంటె వేఱైన, అనుకరింపబడుతున్న దహరాకాశం పరమాత్మే అవుతుంది.

*॥ సి. సూ.॥ అపి స్మర్యతే ॥ 1-3-22 ॥*

***స్మర్యతే అపి=*** (ఈవిషయం) స్మృతిలోకూడా చెప్పబడుతోంది.

**271.** *పరోపాస్త్యాఽస్య జీవస్య తత్సామ్యాపత్తిరుచ్యతే।*
*"ఇదం జ్ఞాన"మితి స్మృత్యాం దహ్రో జీవేతరః పరః ॥*

*॥ఇతి దహరాధికరణమ్ ॥*

271. *"ఇదం జ్ఞానముపాశ్రిత్య మమసాధర్మ్యమాగతాః। సర్గేపి నోపజాయన్తే ప్రళయే న వ్యథన్తిచ॥"* (భ.గీ.14-2) (ఈజ్ఞానంపొంది నాతోసామ్యతనిపొందేవాళ్ళు సృష్టికాలంలోనూ జన్మపొందరు, ప్రళయంలో నశించరు)అని స్మృతియైనభగవద్గీతలోకూడా పరమాత్మని ఉపాసించడంచేత ఈజీవుడు పరమాత్మని అనుకరిస్తాడు (పరమాత్మతో సామ్యాన్ని పొందుతాడు) అని చెప్పబడుతోంది. ఈకారణంచేతగూడా అనుకరించబడే దహరాకాశం అనుకరించే జీవుడికంటె వేఱైన పరమాత్మేనని తెలుస్తోంది.

*దహరాధికరణము పూర్తియైనది*

## ॥ ప్రమితాధికరణమ్ ॥ 1-3-6॥

*సి.సూ-॥ శబ్దాదేవ ప్రమితః ॥ 1-3-23 ॥*

***ప్రమితః =*** (బొటనవ్రేలు) పరిమితి గలవాడు (పరమాత్మే), ***శబ్దాత్ ఏవ=*** శబ్దము చేతనే.

**272.** *ప్రాగల్పపరిమాణత్వం పరాత్మన ఉదాహృతమ్।*
*తస్యైవాఙ్గుష్ఠపరిమాణవత్త్వం నిగద్యతే॥*

272. వెనకటిఅధికరణంలో *"దహరోస్మిన్నంతర ఆకాశః"* అని అతిచిన్నపరిమాణంగలదిగా చెప్పబడ్డ దహరాకాశం పరమాత్మేనని స్థాపించబడింది. అయినప్పటికీ, అల్పపరిమాణవిశేషమైన బొటనవ్రేలంతవాడుగ మరొకవేదవాక్యంలో చెప్పబడేవాడు సర్వేశ్వరుడికంటెవేఱైన జీవుడవవచ్చునే అనే ఆక్షేపం ఈఅధికరణంలో ఖండించబడుతూ, ఆటువంటివాడుకూడ పరమాత్మేనని నిర్ధారింపబడుతోంది.

పూ.273. "అఙ్గుష్ఠమాత్ర" ఇత్యాద్యాః కఠవల్లీష్వృచః శ్రుతాః।
తత్రాఙ్గుష్ఠప్రమాణోఽయం జీవ ఏవేతి నిశ్చయః॥

274. "ప్రాణాధిపోఽఙ్గుష్ఠమాత్ర" ఇత్యాదిశ్రుతివాక్యతః।
జీవాత్మనోఽఙ్గుష్ఠపరిమాణవత్త్వావబోధనాత్॥

273-274. **పూర్వపక్షం:** *"అఙ్గుష్ఠమాత్రః పురుషః"*(కఠ.2-4-12,13; 2-6-17) (బొటనవ్రేలంత పురుషుడు)అని మొదలయ్యే మూడుఋక్కులు కఠోపనిషత్తులో ఉన్నాయి. వీటిలో బొటనవ్రేలంత పరిమాణం ఉన్నవాడుగా చెప్పబడుతున్నవాడు జీవుడేఅవటానికివీలవుతుంది. ఎందుకంటే, *"ప్రాణాధిపః సఞ్చరతి స్వకర్మభిః అఙ్గుష్ఠ మాత్రః"* (శ్వేతా5-7) (ప్రాణాన్నినియమించేవాడై, తనకర్మలచేతనే కట్టుబడిన వాడై, బొటనవ్రేలంత పరిమాణంగలజీవుడు సంచరిస్తున్నాడు.) అని మరొక ఉపనిషద్వాక్యంలో కర్మవశుడైన జీవుడే అంగుష్ఠమాత్రుడుగ చెప్పబడటంచేత ఇక్కడ చెప్పబడే అఙ్గుష్ఠమాత్రుడుకూడ జీవుడే అవాలి.

సి.275. మైవమత్రాఙ్గుష్ఠమానప్రమితః పరమః పుమాన్।
"ఈశానో భూతభవ్యస్య "త్యేతదేకాన్తశబ్దతః॥

275. **సిద్ధాన్తం:** ఈపూర్వపక్షం సరిగాదు. *"అఙ్గుష్ఠమాత్రః పురుషః మధ్య ఆత్మని తిష్ఠతి। ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే॥* (కఠో. 2-4-12) (బొటనవ్రేలిపరిమాణంలోఉన్న పురుషుడు శరీరంలో మధ్యనున్నాడు. మూడుకాలాల్లోనూఉన్న అంతటికీ (అన్నింటికిని) ఈశ్వరుడైనవాడు అలా అనిష్టంగాలేడు) అన్నకఠవల్లిలోఉన్న మంత్రంలో ఈఅఙ్గుష్ఠప్రమాణపురుషుడు త్రికాలాల్లోనూ సర్వవస్తుజాతానికీ ఈశ్వరుడని చెప్పబడుతోంది. ఈమహత్వం పరమాత్మకే తగినదిగాని జీవుడికి తగదు. అంచేత కఠవల్లిలో చెప్పబడిన అఙ్గుష్ఠమాత్రుడు పరమాత్మే (సర్వేశ్వరుడే).

॥ సి. సూ.॥ హృద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్ ॥ 1-3-24 ॥

**హృది=** (పరమాత్మ) (బొటనవ్రేలిపరిమాణంగల) మనుష్యహృదయంలో (ఉండటంచేత), **అపేక్షయా తు=** అందువల్లనే (అంగుష్ఠపరిమాణం పరమాత్మకి చెప్పబడింది.) **మనుష్యాధికారత్వాత్=** (మనుష్య హృదయాన్నిగుఱించి చెప్పడం) మనుష్యులకే (ఉపాసనశాస్త్రంలో) అధికారముండటంచేత.

276. ఉపాసకహృదోఽఙ్గుష్ఠప్రమాణత్వాత్పరాత్మనః।
తత్ర స్థితేస్తదఙ్గుష్ఠమానత్వం తదపేక్షయా॥

277. శాస్త్రస్య తు మనుష్యాధికారత్వాత్తదపేక్షయా।
పరస్యాఙ్గుష్ఠమానోక్తిర్వ్యక్తిరన్యాపి వక్ష్యతే॥

276-277. అపరిచ్ఛిన్నుడైన పరమాత్మ బొటనవ్రేలంతవాడవటం ఎలాసాధ్యం? అంటే, ఉపాసకులని అనుగ్రహించడానికి పరమాత్మ వారిహృదయంలో వేంచేసిఉన్నాడు. వారిహృదయంకూడా బొటనవ్రేలిపరిమాణంలో ఉన్నది. అంచేతనే అక్కడ అవతరించిఉండేపరమాత్మ అఙ్గుష్ఠమాత్రపరిమాణం గలవాడుగ చెప్పబడుతున్నాడు. *"వాలాగ్రశతభాగస్య"*(శ్వేతా.5-9)అని ఉపనిషత్తుల్లో చెప్పబడినట్లుగ అణుపరిమాణుడైన జీవుడిని *"ప్రాణాధిపోఽఙ్గుష్ఠమాత్రః"*(శ్వేతా.5-7)అని అంగుష్ఠపరిమాణం గలవాడుగ చెప్పటంకూడా ఈహృదయంలో సంచరించటానికే అవుతుంది. అంచేత పరమాత్మని కఠవల్లి అఙ్గుష్ఠమాత్రపరిమాణుడిగా చెప్పటంలో దోషమేమీ లేదు. సర్పం, గుఱ్ఱం మొదలైనవాటికి బొటనవ్రేలే ఉండదే! వాటి హృదయంకూడా అందులోనుండే పరమాత్మవస్తువును, బొటనవ్రేలిపరిమాణంగలవాడిగ ఎలా

చెప్పటం? అంటే, పరమాత్మని భక్తియోగంతో ఉపాసించేప్రసక్తీ, అధికారం ఉండటంచేతా, పాము, గుఱ్ఱంవంటి వాటికి అవిలేకపోవటంచేతా, మనుష్యులహృదయాలు వాళ్ళవాళ్ళ బొటనవ్రేలిపరిమాణంతోటే ఉండటంచేతా ఇక్కడ మనుష్యులు ఉపాసించటానికి వారిహృదయాల్లో వేంచేసిఉండేవాడిని బొటనవ్రేలి పరిమాణంలో ఉన్నవాడని చెప్పటంలో తప్పులేదు. అంగుష్ఠమాత్రుడు పరమాత్మేనని చెప్పడానికి, ఇంకా మరికొన్ని యుక్తులతో తరువాతి ప్రాసంగికమైన మూడధికరణాల్లో నిరూపింపబడుతోంది.

(మధ్యనివచ్చిన)

## దేవతాధికరణమ్ ॥ 1-3-7 ॥

### ॥ సి. సూ.॥ తదుపర్యపి బాదరాయణస్సమ్భవాత్॥ 1-3-25 ॥

***తత్=*** బ్రహ్మోపాసనం, ***ఉపరి అపి=*** (మనుష్యులకంటే) గొప్పవారైన దేవతలు మొదలైనవారికిని (తగునని) ***బాదరాయణః=*** వ్యాసులవారు (భావిస్తున్నారు), ***సమ్భవాత్=*** (వారికిని అర్థిత్వసామర్థ్యాలు) కూడునుగనుక.

***278.*** *బ్రహ్మోపాసనశాస్త్రం ప్రాక్ ప్రోక్తం మర్త్యాధికారకమ్।*
*దేవాదీనామస్తి న వేత్యధికారోఽత్ర చిన్త్యతే॥*

278. వెనకటిసూత్రంలో బ్రహ్మోపాసనాన్నివిధించేశాస్త్రంలో మనుష్యులకధికారం ఉన్నదని చెప్పబడింది. మనుష్యులకంటే గొప్పవారైన దేవగంధర్వులు మొదలైనవారికి అందుకు అధికారం లేదా అన్న విషయం మధ్యని ప్రాసంగికంగ వచ్చే ఈఅధికరణంలో విచారింపబడుతోంది.

***పూ.279.*** *నోపాస్తావధికారోఽస్తి దేవాదీనామదేహినామ్।*
*దేహినిర్వర్తనీయేఽత్రోపాసనే న సమర్థతా॥*

279. **పూర్వపక్షం:** దేవతలవంటివాళ్ళకి బ్రహ్మోపాసనానికధికారంలేదు. ఎంచేతంటే, వాళ్ళకి దేహంఉందని ప్రమాణంలేకపోవటంవల్ల, దేహంలేదు. ఉపాసనమంటే, దేహమున్నవాళ్ళే చేయవలసినదిగా నిశ్చయింపబడింది. అంచేత ఈవిధంగ ఉపాసనంలో సామర్థ్యంలేక పోవటంచేతను, దేహంలేకపోవటంచేత దేహసంబంధంవల్ల కలిగే దుఃఖాలని తొలగించటానికి చేయబడే ఉపాసనంలో కోరికఅనే అర్థిత్వం దేవతలు మొదలైనవాళ్ళకి లేకపోవటంచేతనూ, వాళ్ళకి బ్రహ్మోపాసనానికి అధికారం లేదు.

***సి.280.*** *మైవం పరోపాసనం తదమరేష్వపి సంభవేత్।*
*ఇత్యేవం మన్యతే వ్యాసో భగవాన్బాదరాయణః॥*

***281.*** *తేషామర్థిత్వసామర్థ్యసంభవాదర్థితా చ సా।*
*పరమాత్మని కల్యాణగుణాఢ్యే భోగ్యతాధియా॥*

***282.*** *భవత్యథైషాం సామర్థ్యమపి సంభవతి స్వయం।*
*దేహేన్ద్రియాదిమత్త్వేన తద్వత్త్వం సర్వనాకినామ్॥*

***283.*** *వేదాన్తే శ్రూయతే సృష్టిస్థలే చోపాసనస్థలే।*
*తస్మాత్తేషాం తయోస్సత్త్వాదధికారోస్త్యుపాసనే॥*

280-283. **సిద్ధాన్తం:** ఈ పూర్వపక్షం దోషభూయిష్ఠం. వెనకచెప్పబడ్డ పరమాత్మోపాసనం దేవతలకి కూడా తగిందేఅని భగవాన్ బాదరాయణులైన వ్యాసులవారు భావిస్తున్నారు. ఎలాఅంటే, వారికి అర్థిత్వం

సామర్థ్యం అన్నరెండూ ఉండటంవల్ల పరమాత్మోపాసనానికి అధికారం ఉన్నది. కల్యాణగుణసముద్రుడైన పరమాత్మ భోగ్యత్వాన్నితెలిసినవారవటంచేత బ్రహ్మోపాసనంలో ఇచ్ఛఅనబడే అర్థిత్వం వాళ్ళకీ ఉండటంచేత సామర్థ్యంకూడా ఉంటుంది. సృష్టిస్థలాల్లో దేవతలవంటి అందరికీ పరమాత్మ నామరూపవ్యాకరణం చేసినట్లు వేదవాక్యాలు చెప్తున్నాయి. దేహేంద్రియాదులనేర్పరచటమే నామరూపవ్యాకరణమని చెప్పబడుతోంది. *"తౌ సమిత్పాణీ ప్రజాపతిసకాశమాజగ్మతుః"* (ఛాందో. 8-7-2.) (ఇంద్రుడును, విరోచనుడును, సమిధలను చేతిలోపట్టుకొని ప్రజాపతివద్దకు వెళ్ళేరు) వంటి ఉపాసననిచెప్పే వాక్యాల్లో ఇంద్రాదిదేవతలకీ కరచరణాదులున్న దేహాలున్నట్లు చెప్పబడుతోంది. అంచేత, దేహంఉంటే ఉపాసనాసామర్థ్యం ఉంటుంది. దేహంఉన్నవాళ్ళుగనుక, దానివలనవచ్చే దుఃఖాలున్నా, వాటిని తొలగించటానికి పరమాత్మోపాసనంలో ఇచ్ఛయనబడే అర్థిత్వమూఉండటంలో కొఱతేమీ లేదు. అంచేత ఈవిధంగ అర్థిత్వసామర్థ్యాలు దేవతలకీ ఉండటంచేత, వారికీ బ్రహ్మోపాసనంలోఅధికారం ఉంది.

*సి. సూ. ॥విరోధః కర్మణీతి చేన్నానేకప్రతిపత్తేర్దర్శనాత్॥ 1-3-26 ॥*

***కర్మణి=*** (యాగాది) కర్మలలో, **విరోధః=** విరోధం వస్తుందే, ***ఇతి చేత్=*** అన్నట్లైతే, ***అనేక ప్రతిపత్తేః=*** ఎన్నో శరీరాలని కలిగిఉండటం అనేది, ***దర్శనాత్=*** కనబడటంచేత, ***న=*** విరోధం లేదు.

***284.*** *దేహవత్త్వేచ దేవానాం విరోధః స్యాద్ధి కర్మణి।*
*బహుయాగేషు యుగపదాహూతస్యైకనాకినః॥*

***285.*** *సాన్నిధ్యాసంభవాత్సర్వత్రేతి చేన్న స్వశక్తితః।*
*సౌభర్యాదౌ దృశ్యతేఽయం నైకదేహపరిగ్రహః॥*

284-285. "దేవతలకుదేహంఉన్నట్లైతే, యాగాదికర్మలకి విరోధంకలుగుతుంది. ఎంచేతంటే, ఎన్నోయాగాల్లో ఒకేకాలంలో పిలవబడే ఒకశరీరమున్న ఒకదేవత ఆస్థలాలన్నింటికీ రావటంకుదరదు గనుక విరోధం వస్తుంది. అంచేత, దేవాదులకి దేహంలేదనే అనుకోవాలా" అంటే, దేహమున్నా, దేవతలు యాగాదికర్మల్లో ఒకేసమయంలో ఎన్నోస్థలాలకి రావటానికాటంకంలేదు. విశేషశక్తికలవాళ్ళుగనుక సౌభరిమునివంటివారు ఎన్నో శరీరాలని ధరించి ఎంతోమందిభార్యలతో ఏకకాలంలో ప్రీతిచెందినవారిగా పురాణాల్లో చదివేం. అలాగే, దేవతలుకూడా, వారివిశేషశక్తివల్ల ఎన్నోశరీరాలనిధరించి, ఎన్నోయాగాల్లో ఒకేకాలంలో హవిర్భాగాలని తీసుకోవటానికి రావచ్చునుగనుక, కర్మవిరోధాన్ని చూపి, దేవతలకి దేహంలేదని అనటానికి వీలుగాదు. అంచేత దేహమున్నందువలన అర్థిత్వసామర్థ్యాలకి లోటులేదుగనుక వెనక చెప్పినట్లు దేవతలకీ బ్రహ్మోపాసనానికి అధికారంఉన్నదని నిశ్చయమైంది.

*॥ సి. సూ. ॥శబ్ద ఇతి చేన్నాతః ప్రభవాత్ప్రత్యక్షానుమానాభ్యామ్॥ 1-3-27॥*

***శబ్దే (విరోధః)=*** (ఇంద్రాది) శబ్దంలో(విరోధం వస్తుంది), ***ఇతి చేత్=*** అన్నట్లైతే, ***అతః=*** వేదశబ్దాల్లోంచే ***ప్రభవాత్=*** (ఇంద్రాదిదేవతలు) సృష్టింపబడియుండటంచేత, ***న=*** విరోధం లేదు, ***ప్రత్యక్షానుమానాభ్యామ్=*** శ్రుతిస్మృతులనుంచి (ఇది తెలుస్తోంది).

***పూ.ప.286.*** *విరోధో వైదికే శబ్దే స్యాదనిత్యార్థయోగతః।*
*ఇన్ద్రాదిదేవదేహస్యానిత్యత్వాత్తస్య జన్మనః॥*

***287*.*** *ప్రాగ్వినాశాత్పరం చైషాం శబ్దానాం వేదవర్తినామ్।*

286-287*. **పూర్వపక్షం.** కర్మవిరోధంలేకపోయినా, దేవతలకిదేహమున్నా, మరొక విరోధం

ఏర్పడుతోంది. అదేమిటంటే - దేహమనేది అవయవాలతోఉన్నదిగనుక ఉత్పత్తివినాశాలని కలిగియున్నదిగ ఉండాలి. అంచేత ఇంద్రుడుమొదలైనదేవతల ఉత్పత్తికి పూర్వమూ, నశించినతరువాతా, వేదంలోకనబడే ఇంద్రుడుమొదలైన శబ్దాలకర్థం లేకపోవటం జరుగుతుంది. లేదా ఆవేదశబ్దాలు అనిత్యాలుగ ఎంచాల్సివస్తుంది. అంచేత ఇలా అనిత్యాలైన ఇంద్రాదిదేహాలతో సంబంధంఉండటంవల్ల ఇంద్రాదివేదశబ్దాలలో విరోధం వస్తుంది గనుక దేవతలకి దేహాలనొప్పుకోకూడదు. దేహంలేకపోయినా, వెనక చెప్పిన ప్రకారం అర్థిత్వసామర్థ్యాలు లేకపోవటంచేత దేవతలకి బ్రహ్మోపాసనానికి అధికారం లేదని సిద్ధిస్తుంది.

సి. *287 *అర్థశూన్యత్వమథవాఽనిత్యత్వమితి చేన్న తత్॥*

288. *ఇన్ద్రాదిశబ్దాదేవేన్ద్రాద్యర్థస్య ప్రభవాత్పునః।*
*నేన్ద్రాద్యా వైదికాశ్శబ్దాః ప్రవృత్తా వ్యక్తిమాత్రకే॥*

289. *గవాదిశబ్దవత్తత్రాకృతివాచితయా తతః।*
*ఏకవ్యక్తౌ వినష్టాయాం తత్తద్వైదికశబ్దతః॥*

290. *మనస్స్థితాచ్ఛావగతతత్తదర్థః ప్రజాపతిః।*
*అన్యం తదాకృతిం చేన్ద్రం సృజతీత్యవగమ్యతే॥*

*291. *శ్రుతిస్మృతిభ్యాం తస్మాన్న విరోధశబ్దగోచరః।*

287*-*291 **సిద్ధాన్తం:** ఈపూర్వపక్షంతప్పు. ఇంద్రాదిదేహాలు అనిత్యమైనా, ఇంద్రాది వేదశబ్దాలు నిత్యాలూ, అర్థంతోఉన్నవే. ఎలా అంటే, ఇంద్రాదివైదికశబ్దాలు దేవదత్తుడు మొదలైన లౌకికశబ్దాలలాగ ఆయాదేహాలుగల వ్యక్తులనిమాత్రం చెప్పేవిగావు. ఘటం, గోవు మొదలైన లౌకికశబ్దాల్లాగ ఆయాజాతులకు చెందిన అన్నివస్తువులనీ చెప్తాయి. ఒకఇంద్రుడు నశించినతరవాతకూడ చతుర్ముఖబ్రహ్మ తనమనస్సులోఉన్న ఆఇంద్రశబ్దంతోటే వజ్రహస్తుడైయుండటంమొదలైన ఇంద్రజాతిలక్షణాలని గుర్తించి వెనుకటిఇంద్రుడిలాగే ఉన్న మరోఇంద్రుడిని సృష్టిస్తాడు. అంచేత ఇట్లాఇంద్రాదిశబ్దాలనుంచే బ్రహ్మదేవుడు ఇంద్రాదులని సృష్టిస్తూండటం వల్ల ఇంద్రాది శరీరాలనిత్యాలైనంతమాత్రంచేత ఆశబ్దాలుఅనిత్యాలో, అర్థరహితాలో కావు. బ్రహ్మదేవుడు వేదశబ్దాలనుంచే ఇంద్రాదులని సృష్టిస్తాడనటానికి ప్రమాణమేమంటే, *"వేదేన రూపేస్యాకరోత్... ప్రజాపతిః"* (యజు.అష్ట. 2-6-2) (వేదంచేతనే ప్రజాపతి శరీరాలని సృష్టిస్తాడు), *"స భూరితివ్యాహరత్ స భూమి మసృజత"* (యజు.అష్ట.2-2-4-22)(వారు"భూః"అని ఉచ్చరించి భూమినిసృష్టించేరు) వంటి వేదవాక్యాల్లోనూ,

*"సర్వేషాం తు స నామాని కర్మాణి చ పృథక్ పృథక్।*
*వేదశబ్దేభ్య ఏవాదౌ పృథక్ సంస్థాశ్చనిర్మమే॥* *(మను. 1-21)*

(అన్నివస్తువులకీ సృష్టికాలంలో వారికర్మలని, వృత్తులనీ వేదశబ్దల్లోంచే వేఱువేఱుగా సృష్టించేరు. శరీరాల ఏర్పాటుగూడ వేఱుగానే సృష్టించేరు.

*"అనాదినిధనా హ్యేషా వాగుత్సృష్టా స్వయమ్భువా।*
*ఆదౌ వేదమయీ దివ్యాయతఃసర్వాఃప్రసూతయః॥* *(భార-శాన్తి-మోక్ష231-56)*

(ఆద్యంతాలులేనిదై, దివ్యమైన ఈవేదమయమైనవాక్కు ప్రజాపతిచేత సృష్టికాలంలో బయలు పరచబడింది. దానినుంచే అన్ని వస్తువులూ సృష్టింపబడ్డాయి.)

*"నామరూపఞ్చ భూతానాం కృత్యానాఞ్చప్రపఞ్చనం।*
*వేదశబ్దేభ్య ఏవాదౌ దేవాదీనాం చకార సః॥"* (వి.పు. 1-5-63)

(దేవతలుమొదలైనవారికి పేరు, రూపం, వృత్తులు మొదలైనవాటిని వారు వేదశబ్దాలనించే సృష్టికాలంలో చేసేరు.) వంటిస్మృతుల్లోనూ వేదశబ్దాలనుంచే ఇంద్రాదులు సృష్టింపబడ్డారని చెప్పబడుతోంది. అందువల్ల దేవతలు మొదలైనవారికి శరీరమున్నప్పటికీ, వేదవాక్యాలు అనిత్యాలుగానో, అర్థరహితాలుగానో ఉండనవసరంలేదు. ఈవిధంగ శబ్దవిరోధంలేకపోవటంచేత దేవతలకి ఉపాసనంలో అధికారముండటంలో ఏమీ దోషంలేదు.

*// సి. సూ.// అత ఏవ చ నిత్యత్వమ్// (1-3-28)*

***అత ఏవ=*** అందుచేతనే, ***నిత్యత్వం చ=*** (వేదానికి) నిత్యత్వంగూడ (సిద్ధిస్తోంది).

291*. *యతో ధాతా వైదికాచ్ఛ శబ్దాజ్జాతార్థసంస్మృతిః//*

292. *మన్త్రాదికృదృషీణామాకృతిశక్త్యాదికం పునః/*
*పరామృశ్య తదాకారశక్తియుక్తాన్ తదా తదా//*

293. *సృష్ట్వా తత్తన్మన్త్రకృతౌ తానేవ ప్రేరయత్యతః/*
*వేదనిత్యత్వమేషాం చ మన్త్రకృత్త్వమపి స్థితమ్//*

291*-293. ఈవిధంగ బ్రహ్మదేవుడు వేదశబ్దంనుంచే ఆయావస్తువుల నామరూపాలని తెలుసుకొని వాటినిసృష్టించటంచేత *"విశ్వామిత్రస్య సూక్తం భవతి"* (యజు. కాణ్ 5-2-4) (విశ్వామిత్రుల సూక్తమయినది) మొదలైనవాక్యాల్లో విశ్వామిత్రుడుమొదలైనఋషులు విశ్వామిత్రసూక్తం మొదలైన కొన్నివేదభాగాలని చేసేరని అన్నా ఆభాగాల్లోఉన్న వేదం పూర్తిగానిత్యమైనది. ఎలాగంటే, అధ్యయనంచేయకనే తపోబలంచేతనే కొన్నివేదభాగాలని సాక్షాత్కరించుకొనగలవారై పూర్వకల్పంలోఉన్న విశ్వామిత్రుడుమొదలైనఋషులను వారిగురించిచెప్పే వేదశబ్దాలతో తల్చుకొని, వాళ్ళలానే రూపాలనీ,శక్తులనీకలిగిన వేరుఋషులని నైమిత్తికప్రళయంతరువాత సృష్టికాలంలో బ్రహ్మసృష్టించేడు. వాళ్ళుగూడా బ్రహ్మచేత నియమింపబడి అధ్యయనంచెయ్యకనే ఆవిశ్వామిత్రసూక్తంమొదలైనవాటిని సాక్షాత్కరించుకొని ఇతరులచే అధ్యయనం చేయించేరు. అందుచేతనే, వేదంనిత్యమైయున్నా, సాక్షాత్కరింపజేసుకోవటంతో కొన్నివేదభాగాలని కొంతమంది ఋషులవని వేదాల్లోనే చెప్పబడుతోంది. అంచేత వేదాల నిత్యత్వానికి ఎలాంటి కొఱతా లేదు.

*// సి. సూ. // సమాననామరూపత్వాచ్చావృత్తావప్యవిరోధో దర్శనాత్ స్మృతేశ్చ//(1-3-29)*

***ఆవృత్తౌ అపి=*** (ప్రాకృతప్రళయంతరువాత) మళ్ళీసృష్టించినపుడు, ***సమాననామరూపత్వాత్ చ=*** (సృష్టింపబడే వస్తువులు) వెనుకటికల్పంలోలాగే నామరూపాలుకలిగిఉండటంచేత, ***అవిరోధః=*** విరోధం కలగదు. ***దర్శనాత్=*** వేదవాక్యాలనుంచీ, ***స్మృతేశ్చ=*** స్మృతులనించీ (ఇట్లా తెలియటంచేత)

294. *కృత్స్ననాశే జగత్సృష్ట్వావృత్తావప్యుక్తరీతితః/*
*సమాననామరూపత్వాదవిరోధోఽవగమ్యతామ్//*

295. *స పునర్భగవాన్ సాక్షాత్ బ్రహ్మాణం చ చతుర్ముఖమ్/*
*సృష్ట్వా యథాపూర్వమేవ సర్వవేదాన్ స్వహృద్ధృతాన్//*

296. *చతుర్ముఖాయోపదిశ్య సృష్టికార్యేచ పూర్వవత్/*
*తం నియుజ్య స్వయంచాపి నియన్తృత్వేన వర్తతే//*

297. *పూర్వానుపూర్వీం తామేవ స్మృత్వా సంస్కారతో దృఢాత్/*

*తయోరేవోచ్చార్యమాణత్వం వేదస్యాపౌరుషేయతా॥*

298. *నిత్యతా చేదృశశ్చార్థః శ్రుతిస్మృత్యవబోధితః।*

*దేవాదీనామతోఽస్త్యేవాధిక్రియా బ్రహ్మవేదనే॥*

*॥ఇతి దేవతాధికరణమ్॥*

294-298. నైమిత్తికప్రళయంలో బ్రహ్మ ఇదివరకటిలానేసృష్టించటంచేత శబ్దవిరోధంలేదని ముందర చూపబడుతోంది. బ్రహ్మ, వేదాలుమొదలైన అన్నిపదార్థాలూ నశించే ప్రాకృతప్రళయంలో వేదాలకి నిత్యత్వమూ, శబ్దవిరోధమూ లేకపోవటంఎలాసాధ్యమనే ఆక్షేపం ఇక్కడ నిరసించబడుతోంది. అన్నిపదార్థాలూ నశించి తిరిగిలోకంసృష్టింపబడేటప్పుడు సృష్టింపబడేపదార్థాలు వెనకటికల్పంలోలాగే నామరూపాలుగలవిగా సృష్టింపబడటంచేత నైమిత్తికప్రళయవిషయంలోచెప్పినట్లుగా ఇక్కడకూడా విరోధంలేదని తెలుసుకోవాలి. పరమపురుషుడైన నారాయణుడు బ్రహ్మండాన్నీ చతుర్ముఖబ్రహ్మనీకూడ వెనకటికల్పంలోలాగే సృష్టించి తనమనసులోఉన్న వేదాలనన్నిటినీకూడా బ్రహ్మకుపదేశించి వెనకటికల్పంలోఉన్నబ్రహ్మ సృష్టిచేసినట్లుగనే ఈబ్రహ్మకూడా సృష్టిచేసేటట్లుగా నియమించి తానుకూడ ఆతనికంతర్యామిగా ఉండి సృష్టికార్యాన్ని వాడిచేతచేయిస్తాడు. అంచేత వేదాలనిత్యత్వానికేలోటూలేదు. వేదాలనిత్యత్వమంటే శబ్దాల ఆనుపూర్వి అనబడే వరసలనిత్యత్వమే అవుతుంది. వెనకటికల్పంలోఉన్న వేదాల ఆనుపూర్వినే స్పష్టమైన సంస్కారం చేత తల్చి అదేఆనుపూర్వితో ఉపదేశించటమే వేదాల నిత్యత్వం అపౌరుషేయత్వం అవుతాయి. అనిత్యమైనశబ్దాలకి వేఱొకవిధంగా నిత్యత్వం కుదరదు. ఈవిధంగా వేదాలు నిత్యాలవటం, ఒకపురుషుడివల్ల చేయబడకపోవటం ఉండటంచేత వేదాలు అనిత్యాలైతే వచ్చే శబ్దవిరోధమేఱ్పడదు. వేదాలకి ఆనుపూర్వి-నిత్యత్వంచేత వచ్చే నిత్యత్వం, అపౌరుషేయత్వమూ ఉన్నాయని శ్రుతిస్మృతులవలన స్పష్టంగా తెలుస్తోంది. *"సూర్యా చంద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్"*(తై. నా) (పరమాత్మ సూర్యుడు, చంద్రుడు మొదలైన వాటిని వెనుకటి కల్పంలోవలెనే సృష్టించెను). "*యో బ్రహ్మాణం విదధాతిపూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై*"( శ్వే. 6-18) (ఎవడు బ్రహ్మను ముందుగా సృష్టించి వానికి వేదములను ఉపదేశించెనో) వంటి వేదవాక్యాలున్నూ,

*"యథర్తుష్వృతు లిఙ్గాది నానారూపాణి పర్యయే।*

*దృశ్యన్తే తాని తాన్యేవ తథాభావా యుగాదిషు॥"* (వి.పు-1-5-65)

(ఎట్లా ఆయా ఋతువుల్లో పువ్వులు పూయటం, వర్షాలు పడటంవంటి అనేకవిధాలైన చిహ్నాలు మారిమారికనబడుతాయో, అలానే యుగాలు, కల్పాలు మొదలైనవాటిలోకూడా, పూర్వంలానే, పదార్థాలు సృష్టించబడుతున్నాయి.) మొదలైనస్మృతులును ఈఅర్థాన్ని తెలియజేస్తున్నాయి. అందుచే ఈవిధంగా శబ్దవిరోధంవంటి దోషాలున్నూ లేకపోవటంచేత దేవతలుమొదలైనవారికి బ్రహ్మవిద్యలో అధికారానికి ఎలాంటి ఆటంకమూ లేదు.

*(మధ్యను వచ్చిన) దేవతాధికరణము పూర్తి యైనది.*

## *॥ మధ్వధికరణమ్॥ 1-3-8 ॥*

### *పూ.సూ. మధ్వాదిష్వసంభవాదనధికారం జైమినిః॥1-3-30।*

**మధ్వాదిషు=** మధువిద్యమొదలైన కొన్నివిద్యల్లో, **అసమ్భవాత్=** (అధికారం) తగిఉండకపోవటంచేత, **అనధికారమ్=** (దేవతలకి) అధికారలేమిని, **జైమినిః=** జైమినిమహర్షి చెప్తున్నారు.

299. అధికారోఽస్తి దేవానాం బ్రహ్మవిద్యాస్వితీరితం।
తదసమ్భవశఙ్కా చ తద్విశేషే నిరస్యతే॥

299. దేవతలకుసామాన్యంగా బ్రహ్మవిద్యల్లోఅధికారమున్నదని వెనకటిఅధికరణంలో స్థాపించబడ్డది. చెప్పబడిన కొన్నిబ్రహ్మవిద్యల్లో వాళ్ళకి అధికారం ఉండవీలుగాదనే ఆక్షేపం ఈఅధికరణంలో నిరాకరించ బడుతోంది. ఇక్కడ మొదటిరెండుసూత్రాలూ పూర్వపక్ష సూత్రాలు; మూడోసూత్రం సిద్ధాన్తసూత్రం.

పూ. 300. వస్వాదిత్యదేవానాం ప్రాప్తానాం వసుతాదికమ్।
తత్ప్రాపకేషు మధ్వాదిష్వర్థితాదేరసంభవాత్॥

301 అధికారాభావమత్ర మన్యతే జైమినిర్గురుః।
యే యాసు విద్యాసూపాస్యా నహ్యత్రైషామధిక్రియా॥

300-301. **పూర్వపక్షం:** మధువిద్యవంటివాటిలో, వసువులు, ఆదిత్యులు మొదలైన దేవతలను ఉపాసిస్తే వసుపదవి, ఆదిత్యపదవి మొదలైనపదవులు పొందవచ్చునని చూపబడింది. అంచేత, ఈపదవులని పొందిన వసువులు, ఆదిత్యులు వంటివారికి ఈపదవుల్లో కోరిక ఉండదు. వాళ్ళే ఉపాస్యదేవతలవటంచేత వాళ్ళేఈవిద్యల్లో తమనేఉపాసించాలి అనటం ఈదేవతలకి కుదరదు. ఈరెండు కారణాలచేతా, మధువిద్యవంటివాటిలో వసు, ఆదిత్యులవంటి దేవతలకి అధికారంలేదు అని ఆచార్యజైమిని భావం.

పూ.సూ. ॥జ్యోతిషి భావాచ్చ॥1-3-31॥

***జ్యోతిషి=*** పరంజ్యోతియైన పరమాత్మవిషయంలో, ***భావాత్ చ=*** (దేవతలకు) ఉపాసనంఉంటుందని చెప్పటంచేత, (వారినే ఉపాసించే మధువిద్య మొదలైనవాటిలో, వసు మొదలైనవారికి అధికారంలేదు).

302. బ్రహ్మణ్యుపాస్తిరుక్తాత్ర "తం దేవా" ఇతి నాకినామ్।
సాధారణ్యేన సిద్ధాయాం తస్యాం విబుధమర్త్యయోః॥

303. విశిష్యశ్రవణం త్వేషాం బ్రహ్మణ్యోపాస్త్యనుష్ఠితిమ్।
నివారయత్యతస్తేషాం మధ్వాదిష్వనధిక్రియా॥

302-303. *"తందేవా జ్యోతిషాం జ్యోతిరాయుర్హోపాసతేఽమృతమ్"* (బృహ.6-4-14) (జ్యోతులకన్నింటికీ జ్యోతియైన ఆపరమాత్మను ఆయుస్సుగాను, అమృతంగాను దేవతలుపాసిస్తారని దేవతలకి పరంజ్యోతియైన పరమపురుషుడిని ఉపాసించటమే లక్ష్యంగ చెప్పబడుతోంది. మనుష్యులకీ, దేవతలకీ, పరమాత్మోపాసనం సామాన్యమైయుండగా, "**దేవతలు**" పరంజ్యోతిని ఉపాసిస్తున్నారని విశేషంగా చెప్పటంచేత, పరమాత్మకంటే వేరైన వసు, ఆదిత్యులవంటివారిని ఉపాసించటంలో దేవతలకధికారంలేదని తెలియజెయ్యబడుతోంది. అందువల్ల, వసుమొదలైనవాళ్ళకి మధువిద్యవంటివాటిలో అధికారం లేదని స్పష్టమౌతోంది.

సి.సూ॥ భావం తు బాదరాయణోఽస్తి హి॥ (1-3-32)

***భావం తు=*** (మధువిద్యవంటివాటిలో వసుమొదలైన దేవతలకి) అధికారం ఉంటుందని ***బాదరాయణః=*** బాదరాయణులు (భావిస్తున్నారు). ***అస్తి హి=*** (వసుమొదలైనవారిని శరీరంగ గ్రహించిన బ్రహ్మన్ని ఉపాసించటం, మరొక కల్పంలో వసుమొదలైన పదవులను పొందటం వారికి) తగినదేగదా!

304. వస్వాదీనాం చ మధ్వాదౌ భగవాన్ బాదరాయణః।
మన్యతేఽధిక్రియాయోగం వస్వాదయ ఇమే సురాః॥

305. కల్పాన్తరేపి సంప్రాప్య మధ్యే వస్వాదితాపదమ్।
అన్తే బ్రహ్మప్రాప్తుకామా మధువిద్యాత్మికామిమామ్॥

306. బ్రహ్మవిద్యామధిష్ఠాయ స్వావస్థం బ్రహ్మ నిత్యశః।
అర్హన్త్యుపాసితుం తస్మాత్తేషామత్రాస్త్యధిక్రియా॥

॥ ఇతి మధ్వధికరణమ్॥

304-306. **సిద్ధాన్తం.** వెనకటిరెండుసూత్రాలచేతాచెప్పబడిన పూర్వపక్షం సరిగాదనిన్నీ, మధువిద్య వంటివాటిలో వసువుమొదలైనదేవతలకి అధికారంఉంటుందనీ, బాదరాయణులు (వ్యాసులు) భావిస్తున్నారు. వసువువంటివాళ్ళకి వాళ్ళవాళ్ళపదవులు ఇప్పుడులభించినా, మరోకల్పంలోకూడా ఆ పదవులు కావాలనికోరి మధువిద్యవంటివాటిని అనుష్ఠించటంలో ఏమీ దోషంలేదు. పైగా ఈమధువిద్యవంటి వాటిలో వసుమొదలైనవారికంతర్యామిగానున్న పరమాత్మనే వీళ్ళుపాసిస్తున్నారు. అంచేత ***"తందేవా జ్యోతిషాం జ్యోతిః ఉపాసతే"***(దేవతలు ఆపరంజ్యోతినే ఉపాసిస్తున్నారు.) అన్నవేదవాక్యానికి విరోధంకూడా లేదు. అంచేత వసువుమొదలైనవాళ్ళు తమకిఅంతరాత్మైన పరమాత్మనే ప్రతిదినంఉపాసించి తరువాతి కల్పంలో మోక్షంపొందే ముందరికాలంలో వసువుమొదలైనపదవులని తిరిగిపొందిఅనుభవించి ఆకల్పాంతంలో మోక్షాన్ని పొందుతున్నారని స్పష్టమౌతోంది. అందువల్ల వసువువంటివారికి మధువిద్య మొదలైనవాటిలో అధికారం ఉంటుందనటంలో ఎలాంటి దోషమూ లేదు.

(మధ్యను వచ్చిన) మధ్వధికరణము పూర్తియైనది.

మధ్యనువచ్చు అపశుద్రాధికరణము.

## ॥ అపశూద్రాధికరణమ్॥ 1-3-9 ॥

మధ్యనువచ్చు అపశుద్రాధికరణము.

### ॥ సి. సూ.॥ శుగస్య తదనాదరశ్రవణాత్తదాఽఽద్రవణాత్సూచ్యతే హి ॥ 1-3-33 ॥

***తదనాదరశ్రవణాత్=*** హంసయొక్క అనాదరవాక్యాన్ని వినటంవల్ల, ***తదా=*** అప్పుడు, ***ఆద్రవణాత్=*** (రైక్వునిగురించి) వెళ్ళటంచేత, ***అస్య శుక్=*** జానశ్రుతియొక్క శోకం ***సూచ్యతే హి=*** సూచింపబడుతోందిగదా!

307. బ్రహ్మవిద్యాధిక్రియోక్తా దేవానాం యోగ్యతాన్వయాత్।
శూద్రస్యాప్యధికారోఽస్తు తత్సత్త్వాదితి వార్యతే॥

307. దేవతలకు అర్థిత్వసామర్థ్యత్వాలనబడే యోగ్యతలుండటంచేత బ్రహ్మవిద్యలో అధికారం ఉంటుందని వెనకటి అధికరణంలో చెప్పబడింది. శూద్రుడికికూడా అలాంటియోగ్యత ఉండటంచేత బ్రహ్మవిద్యలో అధికారం ఉండాలే అనే వాదం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

పూ.308. శూద్రస్యాప్యధికారోఽత్ర బ్రహ్మవిద్యాసు విద్యతే।
శ్రౌతధీవిరహేప్యస్య పురాణశ్రవణాదినా॥

309. బ్రహ్మస్వరూపతద్ధ్యానప్రకారజ్ఞానసంభవాత్।
ముముక్షుతాసంభవాచ్చ సామర్థ్యార్థిత్వసంభవాత్॥

*310. తస్మాజ్జానశ్రుతిం రైక్వశ్శూద్రేత్యామన్త్ర్య తస్య హి।

308-*310. **పూర్వపక్షం:** ఛాన్దోగ్యోపనిషత్తులో నాలుగో ప్రపాఠకంలో ఈక్రింది ఇతిహాసం ఉంది. జానశ్రుతి అనే ఆయన ధర్మాలని విశేషంగా చేస్తూండేవాడు. సామాన్యధర్మాలని విశేషంగాచేసినప్పటికీ

బ్రహ్మవిద్యఅనే విశేషధర్మంలోఅభినివేశంలేనివాడైన ఇతన్ని దిద్దుబాటు చేయాలనుకున్న ఇద్దరుమహాత్ములు హంసలరూపాలతో ఇతనుండేస్థలంమీదుగా ఎగిరివెళ్ళుతూ ఉండిరి. వాటిలోవెనకగాఎగురుతున్నహంస ముందుగావెళ్ళుతున్నహంసనిచూసి, "ఓయ్! మందదృష్టీ! (మందగించినదృష్టిగల ఓహంసా!) జానశ్రుతి తేజస్సు సూర్యుడిలాప్రకాశిస్తోంది. ఆజ్యోతిని సమీపించి నశించిపోకు!" అని అన్నది. దాన్నివిన్న ముందరి హంస "ఈజానశ్రుతిని రైక్వుడనుకుంటున్నావా, బ్రహ్మజ్ఞానైన ఆరైక్వుడే గొప్పవాడు. ధర్మిష్ఠుడైనా, ఈ జానశ్రుతికి బ్రహ్మజ్ఞానం లేకపోవటంవల్ల రైక్వుడితో సాటిరాడు." అని అర్థమయేటట్లుగా చెప్పింది. దాన్నివిన్న రెండో హంస "ఈరైక్వుడు ఎవరు" అనిఅడగ్గా, "లోకంలోకనబడే మంచికర్మలు, మంచిజ్ఞానం, ఎవరి కర్మజ్ఞానాల్లో ఉన్నాయో వారు ఆరైక్వులు" అనిచెప్పింది ఆముందరవెళ్ళేహంస. తనకి బ్రహ్మజ్ఞానంలేదని నిందించే ఈ మాటనివిన్నజానశ్రుతి వెంటనే, రైక్వుడిని వెతికివచ్చేటట్లు తనసేవకుడినొకడిని పంపి, వారెక్కడ ఉంటారో తెలుసుకొని, వారిని తానేవెళ్ళి ఆశ్రయించి, వారుకోరిన వాటినిచ్చి, 'మీరు ఉపాసించే పరదేవతను నాకుకూడా ఉపదేశించండ'ని ప్రార్థించేడు. ఆరైక్వుడుకూడా, *"ఆజహారేమాః శూద్ర! అనేనైవ ముఖేన ఆలాప యిష్యథాః"*(ఛాం.4-2-5)(ఓశూద్రుడా! నీశక్తికితగినకానుకల నిచ్చేవు. దీన్నేకోరుకొని (నీవుచాలకాలం నాకు శుశ్రూషచేయకపోయినా,) నావద్ద ఉపదేశాన్ని పొందుతావు.) అనిచెప్పి, అతనికి బ్రహ్మవిద్య నుపదేశించేడు. ఇక్కడ జానశ్రుతిని "శూద్ర" అనిపిల్చి అతనికి బ్రహ్మోపదేశంచెయ్యటంచేత బ్రహ్మవిద్యని ఉపదేశంపొందటానికి శూద్రుడికికూడా అధికారంఉన్నదని స్పష్టమౌతోంది. శూద్రుడు వేదాధ్యయనం చేయతగకపోయినా, పురాణశ్రవణంవంటివాటివల్ల బ్రహ్మస్వరూపాన్ని గురించీ, ఉపాసనాన్ని గురించీ, తెలుసుకోవచ్చును. అంచేత వాడికీ సామర్థ్యంఉన్నది. మోక్షాన్నిపొందాలనేకోరికకూడా వాడికుండ దగినదవటం చేత అర్థిత్వంకూడా ఉంది. ఇలా అర్థిత్వసామర్థ్యాలనబడే అర్హతలుండటంచేత శూద్రుడికికూడా బ్రహ్మవిద్యలో అధికారం ఉన్నదనటానికి ఆటంకంలేదు. జానశ్రుతివృత్తాంతంకూడా దీన్నే బలపరుస్తోంది.

*సి. 310** *ఉపాదిశద్బ్రహ్మవిద్యామితి వాదోఽసమఞ్జసః॥*

*311.* *జానశ్రుతేర్హంసనిన్దావాక్యానుశ్రవణాద్ధురుమ్।*
*తదైవ రైక్వం ప్రత్యేవాద్రవణాత్సూచ్యతేఽస్య శుక్॥*

*312.* *తాముద్దిశ్యైవ శూద్రేతి గురూక్తిర్నతు జాతితః।*
*వేదాన్తవాక్యజనితవిజ్ఞానస్యైవ వేదనే।*

*313.* *ఉపాయత్వశ్రుతేస్తస్య శూద్రజాతావసమ్భవాత్।*
*అర్థిత్వసమ్భవేప్యస్య సామర్థ్యం తు న విద్యతే॥*

*314.* *పురాణశ్రవణానుజ్ఞా కృతా పాపప్రశాన్తయే।*
*శూద్రస్యాతః పరోపాస్తౌ సర్వథా నాస్త్యధిక్రియా॥*

310*- 314. **సిద్ధాన్తం.** ఈపూర్వపక్షం సరైనదిగాదు. హంసనిన్దావాక్యాన్ని విన్న వెంటనే జానశ్రుతి అనేఆయన, రైక్వుడినిగురించివివరం తెలుసుకుందికి ప్రయత్నించటంచేత ఇతనికి శోకంకలిగిందని తెలుస్తోంది. అందువల్ల *"శోచతీతి శూద్రః"* అనేవ్యుత్పత్తిప్రకారం బాధపడుతున్న వాడవటంచేత ఇతను "శూద్ర!" అని పిలవబడ్డాడుతప్ప జాతినిబట్టికాదనిస్పష్టం. పైగా, వేదాన్తవాక్యంవల్లకలిగిన జ్ఞానమే బ్రహ్మోపాసనానికి ఉపాయమౌతోందని చెప్పబడుతోంది. వేదాధ్యయనంచేయడానికి అధికారంలేని శూద్రుడికి అలాంటిజ్ఞానం ఉండడానికి వీలుకాకపోవటంచేత ఆతనికర్థిత్వమున్నా, బ్రహ్మవిద్యకిసామర్థ్యం లభించదు. పురాణశ్రవణంచేత

కలిగేజ్ఞానం బ్రహ్మోపాసనకుపయోగపడదు. పాపంతొలగటానికిమాత్రమే శూద్రుడికి పురాణశ్రవణానికి అధికారం ఇయ్యబడింది. అంచేత బ్రహ్మోపాసనానికి శూద్రుడికి ఎలాంటి అధికారమూ లేదు.

*// సి. సూ.// క్షత్రియత్వగతేశ్చ// 1-3-34 //*

***క్షత్రియత్వగతేః చ=*** జానశ్రుతి క్షత్రియుడే అని తెలియటంచేతను (శూద్రుడికి బ్రహ్మవిద్యలో అధికారం లేదు)

**315.** *జానశ్రుతేశ్చ శుశ్రూషో"ర్బహుదాయీ"తి వాక్యతః।*
*క్షత్రియత్వప్రతీతేశ్చ తదాహ్వానం న జాతితః॥*

315. ఈప్రకరణంలో జానశ్రుతినిగురించి *"బహుదాయీ"*(ఛాం. 4-1-1) అని అధికంగా దానంచేసే వాడనీ, *"బహుపాక్యః"* అని ప్రారంభించి *"సర్వత ఏవమేతదన్నమత్స్యన్తి"*(4-1-1) అని భోగ్యంగ వండిన ఆహారాన్ని ఎంతోమందికి ఎక్కువగాఇచ్చేవాడని చెప్పబడింది. సామాన్యంగా దానంచెయ్యడానికీ అలాంటి ఉద్దేశ్యంతో వండినఆహారాన్ని దానంచేయటానికీ శూద్రుడికి అధికారం లభించదు. పైగా, *క్షత్తా* అనబడే రథాన్నితోలేవాడిని ఇతను రైక్వుడిని వెతకటానికి పంపినట్లుగానూ చెప్పబడింది. ఈకారణాలవల్ల ఇతను క్షత్రియుడే అని స్పష్టమౌతోంది. అంచేత ఇతన్ని 'శూద్రుడా!' అని పిలవటం జాతివల్లగాదు అని తెలుస్తోంది. అంచేత ఇట్లా పిలచినందువలన శూద్రుడికి బ్రహ్మవిద్యలో అధికారం ఉంటుందని చెప్పసాధ్యంగాదు.

*// సి. సూ. //ఉత్తరత్ర చైత్రరథేన లిఙ్గాత్// 1-3-35//*

***ఉత్తరత్ర=*** తరువాత (చెప్పబడే), ***చైత్రరథేన=*** చిత్రరథవంశానికి చెందిన క్షత్రియుడిని (జానశ్రుతి క్షత్రియత్వాన్నిగూడ తెలుసుకుంటున్నాము), ***లిఙ్గాత్=*** (కాపేయనుడితో చేరిఉండటం అనే) గుర్తులచేత (అక్కడ చెప్పబడిన చైత్రరథుడనే రాజనినీ తెలుసుకుంటున్నాము)

**316.** *అస్యాం సంవర్గవిద్యాయాముత్తరాఖ్యాయికాస్థలే।*
*క్షత్రియస్యైవ సమ్బన్ధో బ్రాహ్మణేతరజాతిషు॥*

**317.** *అభిప్రతారిణశ్చైత్రరథాఖ్యస్య ప్రతీయతే।*
*జానశ్రుతిరతశ్చాత్ర రైక్వాన్యః క్షత్రియో మతః॥*

**318.** *కాపేయసాహచర్యాచ్చ జ్ఞాయతేఽభిప్రతారిణః।*
*అన్యత్ర దర్శనాచ్చైత్రరథతా రాజతాపి చ॥*

316-318. ఈసంవర్గవిద్యాప్రకరణంలో మొదట్లోవచ్చే జానశ్రుతినిగూర్చిన కథనుంచి, జానశ్రుతి క్షత్రియుడని తెలుస్తోందని వెనకటిసూత్రంలో చెప్పబడింది. ఇదే ప్రకరణంలో చివరనివచ్చే కాపేయవృత్తాన్తం వల్లకూడా బ్రాహ్మణక్షత్రియులకిమాత్రమే ఈవిద్యతో సంబన్ధం ఉంటుందని తెలియచేయటంవల్ల జానశ్రుతి కూడ క్షత్రియుడేకావాలిఅని ఈసూత్రంలో నిరూపించబడుతోంది. ఆకాపేయ వృత్తాన్తంలో కపిగోత్రానికి చెందిన వాడవటంచేత కాపేయుడనే బ్రాహ్మణుడికీ, మరొక బ్రహ్మచారీ, అభిప్రతారి అనేవాడికీ ఈవిద్యలో అన్వయం ఉంటుందని చూపబడుతోంది. కాపేయునుడూ, బ్రహ్మచారీ, బ్రాహ్మణులనేది స్పష్టం. అభిప్రతారి యన్నవాడు చిత్రరథవంశానికిచెందినవాడని తెలియచెయ్యటంవల్ల, క్షత్రియుడే అవాలి. అందువల్ల బ్రాహ్మణ క్షత్రియులకే ఈవిద్యతోసంబంధం చూపబడుతోంది. మొదటున్న రైక్వజానశ్రుతి వృత్తాంతంలోకూడా, రైక్వుడు బ్రాహ్మణుడని తెలుస్తోంది. అంచేత అతనితోఈవిద్యలో అన్వయించేవాడుగా చెప్పబడే జానశ్రుతి క్షత్రియుడే అయిఉండటానికి తగును. అభిప్రతారనేవాడు చిత్రరథవంశానికి చెందిన వాడనీ, అందుచేత అతను క్షత్రియుడే అని ఎలా

చెప్పగలరంటే, కాపేయనుడితో కలిసిఉండటం అనే చిహ్నంవల్ల తెలుస్తోంది. అదిఎలాగంటే, *"ఏతేన వై చైత్రరథం కాపేయో అయాజయత్"* (తాండ్య 2-12-5) (చిత్రరథవంశానికి చెందినవాడికి కపిగోత్రానికి చెందిన వారు యాగవిశేషాన్నిచేయించేర)నే వేదవాక్యంనుంచి కపిగోత్రానికిచెందిన బ్రాహ్మణుడితో సంబంధం గలవాడు చిత్రరథవంశానికి చెందినవాడని తెలుస్తోంది. *"చైత్రరథోనామ ఏకః క్షత్రపతిరజాయత"*(శతపథ 11-5-3-13) (చైత్రరథుడని ఒకరాజుండెను.) అన్న మరొకవేదవాక్యంనుంచి చైత్రరథుడుక్షత్రియుడేఅని తెలుస్తోంది. అంచేత ఇక్కడ బ్రాహ్మణుడైన కాపేయనుడితో సంబంధమున్న అభిప్రతారి క్షత్రియుడే అవాలి. కనుక మొదట్లోఉన్న వృత్తాన్తంలోనూ, బ్రాహ్మణుడైన రైక్వునితో సంబంధమున్న జానశ్రుతీ, క్షత్రియుడే అవటంతగును. కనుక ఆతనిని 'శూద్ర'అని పిలవటాన్నిబట్టి, బ్రహ్మవిద్యలో శూద్రుడికధికారంఉంటుందని చెప్పడం కుదరదు.

*// సి. సూ.// సంస్కారపరామర్శాత్తదభావాభిలాపాచ్చ // 1-3-36 //*

***సంస్కారపరామర్శాత్=*** (విద్యనుపదేశించేవాక్యాల్లో) ఉపనయనంమొదలైన సంస్కారాలని చూపటం చేతను, ***తదభావాభిలాపాత్ చ=*** (శూద్రుడికి) ఈసంస్కారాలు ఉండవని చెప్పటంచేతను, (శూద్రుడికి బ్రహ్మవిద్యలో అధికారంలేదు).

***319.*** *విద్యోపదేశవాక్యేషు సంస్కారస్యాభిమర్శనాత్।*
*శూద్రస్య తదభావాచ్చ నాధికారోఽత్ర విద్యతే॥*

319. బ్రహ్మవిద్యనుపదేశించేవాక్యాల్లో *"ఉపత్వా నేష్యే"* (ఛాం. 4-4-5) *"తం హోప నిన్యే"* (ఆపస్తంబశ్రౌతసూత్రం) అని ఉపనయనంవంటి సంస్కారాలని బ్రహ్మోపదేశానికి అంగంగా చేసేవిగా కనబడుతోంది. *"నశూద్రే పాతకంకించిత్ నచసంస్కార మర్హతి"*(మను10-126) ((ఇతరవర్ణాలవారికివలె) ఉల్లి, వెల్లుల్లి మొదలైనవి తినటంవంటి కార్యాలవల్ల శూద్రుడికిపాపం రాదు. ఆతనికి ఉపనయనంవంటి సంస్కారాలూ ఉండవు) మొదలైన వాక్యాల్లో శూద్రుడికి ఉపనయనంవంటి సంస్కారంఉండదని చెప్పబడుతోంది. దీన్నుండి గూడ సంస్కారంలేని శూద్రుడికి సంస్కారాన్నపేక్షించే బ్రహ్మవిద్యలో అధికారం లేదు అని విశదమౌతోంది.

*// సి. సూ.// తదభావనిర్ధారణే చ ప్రవృత్తేః // 1-3-37 //*

***తదభావనిర్ధారణే=*** శూద్రత్వంలేదని నిశ్చయం చెయ్యబడ్డతరువాతే, ***ప్రవృత్తేః=*** బ్రహ్మవిద్యని ఉపదేశించడం ప్రారంభించటంచేత (బ్రహ్మ విద్యలో శూద్రుడికి అధికారంలేదు)

***320.*** *జాబాలస్య చ శుశ్రూషోశ్శూద్రత్వభావనిశ్చయే।*
*స్థితే సత్యేవోపదేశప్రవృత్తేర్నాస్య యోగ్యతా॥*

320. జబాలఅనేఆమెకుమారుడైన సత్యకాముడనేవాడు బ్రహ్మవిద్యని ఒకఆచార్యుడినుంచి ఉపదేశం పొందగోరినవాడై తనతల్లిని తనగోత్రమేదిఅని ప్రశ్నిస్తే తాను పెద్దవారికి దాస్యంచెయ్యటంలోనే నిమగ్నురాలై ఉండటంవల్ల గోత్రాన్ని విచారించలేదని ఆమెచెప్పగా ఆచార్యుడివద్ద ఆపిల్లడు అలానేచెప్పి బ్రహ్మోపదేశాన్ని చేయాలని ప్రార్థిస్తే, *"నైతదబ్రాహ్మణో వివక్తు మర్హతి ... ఉప ... త్వానేష్యే"* (ఛాం. 4-4-5) (త్రైవర్ణికుడు కానివాడు ఇలాగ సత్యాన్ని దాచకుండ చెప్పలేడు. అంచేత నీకు ఉపనయనం చేస్తున్నాను) అని ఆచార్యుడు వాడు శూద్రుడుకాడని నిశ్చయంచేసికొన్న తరువాతే బ్రహ్మవిద్యోపదేశం చేసేరని ఛాందోగ్యంలో వృత్తాంతం ఉన్నది. దీనినుండిగూడ శూద్రుడికి బ్రహ్మవిద్యలో అధికారంలేదని స్పష్టమౌతోంది.

*// సి. సూ.// శ్రవణాధ్యయనార్థప్రతిషేధాత్ // 1-3-37 //*

*శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్*= (శూద్రుడికి) వేదం వినటం, అధ్యయనం చేయటం, దానిఅర్థాన్ని తెలుసుకొని అనుష్ఠించటం వేదంలో నిగ్రహింపబడటంచేత, (శూద్రుడికి బ్రహ్మవిద్యలో అధికారం లేదు.)

**321.** *శూద్రస్య వేదశ్రవణాధ్యయనాదీని సర్వథా।*
*నిషిధ్యన్తే తతస్తస్య నాధికారోఽస్త్యుపాసనే॥*

321. *"శూద్రసమీపే నాధ్యేతవ్యమ్"* (శూద్రుడిసమీపంలోఅధ్యయనం చేయకూడదు.) *"శూద్రోఽయజ్ఞీయః"* (శూద్రుడు యజ్ఞంచేయతగనివాడు)అని శూద్రుడికి వేదవాక్యాన్ని వినటం, అధ్యయనం చెయ్యటం, వేదార్థాన్నితెలుసుకొని అనుష్ఠించటం, ఏవిధంగానూ కూడదని వేదంలో నిషేధింపబడుతోంది. అంచేత శూద్రుడికి బ్రహ్మవిద్యలో అధికారంలేదు.

## ॥ సి. సూ.॥ స్మృతేశ్చ ॥ 1-3-39 ॥

***స్మృతేః చ:*** స్మృతులవల్లకూడా (శూద్రుడికి అధికారంలేదని సిద్ధింపబడుతోంది).

**322.** *"న చాస్యోపదిశేద్ధర్మ"మిత్యాదిస్మృతివాక్యతః।*
*శ్రవణాదినిషేధశ్చ స్పష్టో నాఽతోఽస్య యోగ్యతా॥*

*॥ఇత్యపశూద్రాధికరణమ్॥*

322. *"న చాస్యోపదిశేద్ధర్మం న చాస్య వ్రతమాదిశేత్"* (మను 4-80) (వేదధర్మాన్ని శూద్రుడికి ఉపదేశించకూడదు. వేదవ్రతాన్నిచేసేటట్లు వాడినికట్టడిచేయతగద)ని మనుస్మృతిమొదలైన స్మృతుల్లోకూడా, వేదంవినడం, అధ్యయనంచేయటం, అందులోచెప్పబడిన అర్థాలనిఅనుష్ఠించటం మొదలైనవికూడదని నిషేధింపబడ్డాయి. అంచేత, వేదాన్తంలోచెప్పబడిన బ్రహ్మవిద్యని అనుష్ఠించటం శూద్రుడికికూడదని సిద్ధించింది.

అపశూద్రాధికరణము ముగిసినది.

## ॥ అథ ప్రమితాధికరణ శేషః ॥ 1-3-6 ॥

## ॥ సి. సూ.॥ కమ్పనాత్॥ 1-3-40 ॥

**కమ్పనాత్**= (దేవతలకి అంగుష్ఠమాత్రుడంటే) వణుకుచెప్పబడటంచేత (అంగుష్ఠమాత్రుడు పరమాత్మే.

**323.** *ప్రాసఙ్గికం సమాప్యాథ ప్రకృతస్య పరాత్మతామ్।*
*అఙ్గుష్ఠప్రమితస్యైవ వక్తుం యుక్తిః ప్రదర్శ్యతే॥*

323. ప్రసక్తానుప్రసక్తంగా దేవతలకీ, శూద్రులకీ, బ్రహ్మవిద్యలో అధికారముందా అన్న విషయాన్ని మధ్యని లేవనెత్తిన దేవతాధికరణం మధ్వధికరణం, అపశూద్రాధికరణం అనే మూడధికరణాల్లో విచారించి, తీర్మానించినతర్వాత, ప్రకృతమైన ప్రమితాధికరణం తిరిగి ప్రారంభించబడుతోంది. ఈఅధికరణంలో ప్రకృత విషయమైన అంగుష్ఠమాత్రుడు పరమాత్మే అని నిరూపించే మరో రెండుయుక్తులని, తరువాతి రెండు సూత్రాల్లో చూపుతున్నారు.

**324.** *కఠేఽత్ర "యదిదం కిఞ్చ"త్యాదినాభిహితాద్భయాత్।*
*అఙ్గుష్ఠప్రమితప్రాణశబ్దవాచ్యోత్థితాత్సదా॥*

**325.** *వజ్రాదివోద్యతాత్సర్వదేవానాం కమ్పనాద్భృశమ్।*
*అఙ్గుష్ఠప్రమితస్తాదృక్స్వభావః పరమః పుమాన్॥*

324-325. *"అఙ్గుష్ఠమాత్ర పురుషః"* అని కఠవల్లిలో (2-4-12, 2-6-17) రెండు మంత్రాల్లో

అంగుష్ఠమాత్రపురుషుడినిగురించి చెప్పి మధ్యని,

*"యదిదం కిఞ్చ జగత్సర్వం ప్రాణఏజతి నిస్సృతం।*
*మహద్భయం వజ్రముద్యతం య ఏతద్విదురమృతాస్తే భవన్తి॥*
*భయాదస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః।*
*భయాదిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః॥* (కఠ 2-6-2,3)

(ప్రాణమనబడే అంగుష్ఠపరిమాణముగలవాడినుంచి పుట్టిజీవించే, లోకమంతా మీదకివిసిరిన వజ్రాన్ని చూసినట్లుగ, (ఈప్రాణాన్నిచూసి)గొప్పభయంతో వణుకుతోంది. వీడిభయంచేత అగ్ని మండుతోంది. సూర్యుడు మండిస్తున్నాడు, ఇంద్రుడూ, వాయువూ, ఐదోవాడైన యముడూ, తమతమకార్యాలని చేస్తున్నారు) అనేమంత్రాల్లో ప్రాణమనే ఈఅంగుష్ఠమాత్రుడికి భయపడి అంతమందిదేవతలూ ఎప్పుడూ బాగాగొప్పదైన వజ్రాన్నిచూసి వణికినట్లు వణుకుతున్నారనిచెప్తోంది. ఇంతమహత్తుగలవాడు పరమాత్మేకావాలిగాని జీవుడు గాలేడు. *"భీషాస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః। భీషాస్మాదగ్ని శ్చేన్ద్రశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః॥* (తై.ఆనం.8-1) (ఈపరమాత్మకిభయపడి గాలివీస్తోంది. ఇతనంటేభయంచేత సూర్యుడు ఉదయిస్తున్నాడు, అగ్ని, ఇంద్రుడు, పంచముడైన యముడు ఇతనిభయంవల్లనే తమతమ కార్యాలని చేస్తున్నారు.) అన్న ఆనందవల్లిమంత్రంలో దేవతలకిభయంకలిగించే ఈగొప్పతనం పరమాత్మకేతగినదిగ చెప్పబడుతోంది. అంచేత, అంగుష్ఠమాత్రుడు పరమపురుషుడే అవుతాడు.

## *॥ సి. సూ. ॥ జ్యోతిర్దర్శనాత్ ॥ 1-3-41 ॥*

**జ్యోతిర్దర్శనాత్:** (అంగుష్ఠమాత్రుడు) మంచివిశేషమైన జ్యోతిస్సు ఉన్నవాడుగ కనబడటంవల్లకూడా, (అంగుష్ఠమాత్రుడు పరమాత్మే.)

**326** *"న తత్ర సూర్య" ఇత్యాదివాక్యోక్తస్య స్థలేఽత్ర చ।*
*సర్వభాసాం కారణస్య పరాసాధారణస్య చ॥*
**327.** *జ్యోతిషో దర్శనాన్నిత్యనిర్గతాతిశయస్య చ।*
*అఙ్గుష్ఠప్రమితః శ్రీమాన్ నారాయణ ఇతీర్యతే॥*

*॥ఇత్యఙ్గుష్ఠప్రమితాధికరణమ్॥*

326-327. *"అఙ్గుష్ఠమాత్రఃపురుషః"*(కఠ1-4-12,2-6-17) అనిమొదలయ్యే రెండుమంత్రాల మధ్య, *"న తత్ర సూర్యో భాతి నచంద్రతారకం నేమావిద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః। తమేవ భాన్త మనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదంవిభాతి॥"*(కఠ.2-5-15) (ఆపురుషుడిదగ్గర సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలూ, మెరుపూ కాంతీ ఉన్నవాళ్ళుకాలేరు. అగ్నినిగురించి వేరేచెప్పాలా? ప్రకాశించేతేజస్సుగల ఆపురుషుడివల్లే అన్నీ తేజస్సుగలవైనాయి. ఆయనతేజస్సుచేతనే ఇవన్నీ ప్రకాశిస్తున్నాయి.) అన్నమంత్రంలో అన్నితేజస్సులకీ కారణమైనదై, ఎప్పుడూ తనదితప్పవేఱొకవిశేషమైనకాంతి అంటూలేనిదై, పరమాత్మకేతగినదైనప్రకాశం అంగుష్ఠమాత్రుడికుందని ఉద్ఘోషింపబడుతోంది. అందువల్లకూడా అంగుష్ఠమాత్రుడు **"నారాయణ పరోజ్యోతిః"** అనిచెప్పబడే పరంజ్యోతైన శ్రీమన్నారాయణుడే అవటం కుదురుతుంది.

*అంగుష్ఠప్రమితాధికరణము సంపూర్ణమైనది.*

## *॥ అర్థాన్తరత్వాదివ్యపదేశాధికరణమ్ ॥ 1-3-10 ॥*

## *॥ సి. సూ.॥ ఆకాశోఽర్థాన్తరత్వాదివ్యపదేశాత్॥ 1-3-42 ॥*

***అర్థాన్తరత్వాది వ్యపదేశాత్=*** (నామరూపాలున్న జీవుడికంటే) వేరైనవాడుగాఉండటంవంటి స్వభావాలని చెప్పటంచేత, ***ఆకాశః=*** ఆకాశము (అనబడేవాడు పరమాత్మే)

***328*** *సామాన్యాకాశశబ్దస్య శ్రుతస్య దహరాన్తికే।*
*ఆశఙ్క్యార్థో జీవ ఇతి పరమాత్మేతి సాధ్యతే॥*

328. *"ఆకాశో హవై నామరూపయోర్నిర్వహితా తే యదన్తరా తద్బ్రహ్మ తదమృతం స ఆత్మా"* (ఛాం. 8-14-1) (ఆకాశమే నామరూపాలని నిర్వహించేది. అవిలేకుండాఉన్నది ఏదో, అదే బ్రహ్మంగాను అమృతంగాను ఆత్మగానూ ఉన్నది.) అని సామవేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తులో దహరాకాశం అనబడేవాడు జీవుడేఅని పూర్వపక్షంలోవాదిస్తే, దాన్నిఖండించి పరమాత్మేనని ఈఅధికరణంలో నిర్ధారించి నిరూపించబడింది.

***పూ.329.*** *సామ్న్య "కాశో హవై నామరూపయో"రితి పఠ్యతే।*
*అత్రాకాశో ముక్తజీవస్తస్యైవ ప్రస్తుతత్వతః॥*

****330.*** *ధూత్వేత్యుత్తరవాక్యే చేత్యేవం వాదో న యుజ్యతే।*

329-*330.**పూర్వపక్షం:**ఛాందోగ్యంలో **"ఆకాశోహవై"**అనిమొదలయ్యేవాక్యంలో ఆకాశమనబడేవాడు ముక్తిపొందినజీవుడే. ఈవాక్యానికిముందు ముక్తుడైనజీవుడిగురించి ప్రజాపతివాక్యం కనబడటంచేత, దానితరవాతఉన్న *"అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం చంద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య। ధూత్వా శరీరమకృతం కృతాత్మా బ్రహ్మలోకమభిసంభవామి॥* (ఛాం. 8-13-1) (గుఱ్ఱం వెంట్రుకలను దులుపుకున్నట్లును, చంద్రుడు రాహువునోట్లోంచి విడిపించుకున్నట్లున్నూ, శరీరాన్ని విదల్చుకొని కృతార్థుడినై, నిత్యమైన బ్రహ్మలోకాన్ని పొందుతున్నాను.) అన్నమంత్రంలో ముక్తజీవుడిగురించి ప్రస్తావం ఉండటంచేతను, వాటితరువాత ఉన్న **"ఆకాశో హవై"** అన్నవాక్యంకూడా, ముక్తజీవుడినిచెప్తోందనిగ్రహించటమే తగినది. ఈముక్తజీవుడు ముక్తినిపొందటానికి ముందు నామరూపాలున్నవాడైఉండటంచేత *"నామరూపయోః నిర్వహితా"* అనిచెప్పటంకూడా ఇతనివిషయంలో తగిఉన్నదే. ఇప్పుడు నామరూపాలనివదిలిఉండే ముక్తస్థితిలోఉన్నవాడవటంచేత బ్రహ్మమనీ, అమృతమనీ, అతన్నిచెప్పాలి. అనంతజ్ఞానరూపమైన ప్రకాశాన్ని కలిగిఉండటంవల్ల ఇతన్నాకాశం అనటమూ తగును. అంచేత ఈవాక్యంలోచెప్పబడేవాడు ముక్తజీవుడే.

***సి.330*.*** *అత్రాకాశో నామరూపనిర్వోఢా పరమః పుమాన్॥*

***331.*** *నామరూపాస్పర్శరూపార్థాన్తరత్వోపదేశతః।*
*తన్నామరూపకర్తృత్వం బద్ధముక్తోభయాత్మతః॥*

***332*** *అర్థాన్తరత్వం వక్త్యస్య బద్ధస్తద్భాగుపాధితః।*
*తన్నిర్వోఢా న ముక్తోఽపి జగద్వ్యాపారదూరగః॥*

***333.*** *"అనేన జీవేనే"త్యాదివాక్యైస్తు పరమాత్మనః।*
*నిర్వోఢృత్వం తయోర్నామరూపయోః ప్రతిపాదితమ్॥*

***334.*** *ధూత్వేత్యత్రాభిసంభావ్యతయైవ ప్రకృతః పరః।*
*తస్మాదత్రాకాశశబ్దవాచ్యో నారాయణః ప్రభుః॥*

330*-334. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షంసరిగాదు. ఇక్కడ నామరూపాలని నిర్వహించే వాడిగ చెప్పబడే ఆకాశానికి **"తే యదన్తరా"**అని ఆనామరూపాలస్పర్శమేలేదనిచెప్పటంచేత, ఇతను నామరూపా

లున్నవాడుగఉన్నజీవుడికంటె వేఱైనపరమపురుషుడే అవాలి. బద్ధదశలోనూ, ఇతను కర్మసంబంధంవల్లనే నామరూపాలున్నవాడు. అప్పుడుకూడా, నామరూపాలని నిర్వహించేవాడుగాడు. జగద్వ్యాపారం లేనివాడుగ చెప్పబడే ముక్తాత్మకీ నామరూపాలని నిర్వహించేస్వభావం కుదరదు. అంచేత ఇక్కడనామరూపాలని నిర్వహించేవాడిగ (ఏర్పాటుచేసేవాడిగ) చెప్పబడే ఆకాశం బద్ధులు, ముక్తులు అనబడే రెండురకాల జీవులకంటే వేఱైనపరమాత్మే అయియుండతగును. *"సర్వాణి రూపాణి విచిత్య ధీరః నామాని కృత్వా"* (పు.సూ.), *"అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి"* (ఛాం. 6-3-2) వంటి వేదవాక్యాల్లో పరమాత్మే నామరూపాలని ఏర్పరచేవాడుగా చెప్పబడుతున్నాడుగదా! పైగా, సహజంగానే పెద్దవాడవటం, ఇతరులని పెద్దవాళ్ళనిగాచేయటాన్నీ చూపే బ్రహ్మశబ్దమూ, సహజంగానే మరణంలేనివాడనీ, సర్వవ్యాపిగా ఉండేవాడనీచూపే అమృతం, ఆత్మ అనబడే శబ్దాలున్నూ ఈఆకాశం పరమాత్మేనని తెలియజేస్తున్నాయి. జీవుడికి సహజంగ ఈమహత్వాలు లేవుగదా! ఇంకా, ఈవాక్యంముందున్న ప్రజాపతివాక్యానికి ముందు దహరాకాశమైన పరమాత్మనిగురించి ప్రస్తావంఉన్నది. ఆదహరాకాశమే ఇక్కడకూడా ఆకాశమని చెప్పబడు తోందని గ్రహింపదగినది. మధ్యనున్న ప్రజాపతివాక్యం ఈదహరాకాశాన్నుపాసించేవాడి స్వరూపాన్ని చెప్తోంది. దానితరవాతున్న *"ధూత్వా శరీరం ... బ్రహ్మలోకం అభిసంభవామి"* (ఛాం. 8-13-1) (శరీరాన్నివదిలి బ్రహ్మలోకాన్ని పొందగలన)నే వాక్యంగూడ, ఈఉపాసకజీవుడినిచెప్పి, వాడివల్లపొందతగినవాడిగ బ్రహ్మన్ని గూడ చెప్తోంది. అంచేత వెనకటివాక్యంలో బ్రహ్మన్నిగురించిన ప్రస్తావమూ ఉన్నది. జీవుడిప్రస్తావంకూడా ఆవాక్యంలోఉన్నా, వెనకచెప్పినట్లు, నామరూపాలనేర్పరచటంవంటి మహత్వాలు జీవుడికికుదిరేవిగాక పోవటంచేత, పురుషసూక్తాదుల్లో నామరూపనిర్వాహకుడిగా చెప్పబడిన సర్వేశ్వరుడైన నారాయణుడే ఇక్కడ చెప్పబడ్డ ఆకాశం అని ప్రకటితం అవుతోంది.

## // సి. సూ.// సుషుప్త్యుత్క్రాన్త్యోర్భేదేన // (1-3-43)

**సుషుప్త్యుత్క్రాన్త్యోః=** (జీవుడు) నిద్రించేటప్పుడూ మరణసమయంలో బయటకు పోయేటప్పుడూ ***భేదేన=*** వేరువేరుగానే (జీవుడినీ, పరమాత్మనీ చెప్పటంచేత ఆకాశము జీవుడుకానేరదు.)

***335 పూ.*** *ఐక్యోపదేశాద్భేదస్య 'నేహే'తిచ నిషేధతః।*

*335.**పూర్వపక్షం:** *"తత్త్వమసి","అహం బ్రహ్మస్మి"* వంటివాక్యాల్లో జీవుడూ బ్రహ్మం ఒకటే అనిచెప్పబడుతోంది. *"నేహ నానాస్తి"*వంటివాక్యాల్లో బ్రహ్మంకంటెవేరైన జీవుడులేడనీచెప్పబడుతోంది. వీటివల్లముక్తిచెందినజీవుడే పరమాత్మ, పరబ్రహ్మం, పరమేశ్వరుడనీ వ్యవహరించబడుతున్నాడని తెలుస్తోంది. అంచేత ఇక్కడ "**ఆకాశము**'నబడేవాడు జీవుడే.

***335*.*** *జీవాదర్థాన్తరో బ్రహ్మ నేతి వాదో నిరస్యతే॥*

***336.*** *సుషుప్త్యుత్క్రాన్తికాలేషు "ప్రాజ్ఞేనే"త్యాదివాక్యయోః।*
*ఉక్తజీవపరిష్వఙ్గారోహయోః ప్రత్యగాత్మతః॥*

***337.*** *పరస్య భేదేనోక్తేశ్చ తదన్యోఽస్తి పరః పుమాన్।*
*స్వేనైవ పరిరంభాదిస్స్వపతో హి న సంభవేత్॥*

335*-337. **సిద్ధాన్తం.** ఈపూర్వపక్షం ఈసూత్రంలో నిరసింపబడుతోంది. ఎలాఅంటే *"ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తో నబాహ్యమ్ కిఞ్చనవేద నాన్తరమ్"* (బృహ6-3-21) (మహాజ్ఞానైన పరమాత్మవల్ల (నిద్రించేటపుడు) బాగా పరిష్వంగంచేయబడిన జీవుడు లోపలా, బయటా ఉన్నటువంటి దేన్నీ తెలుసుకోడు)

అని నిద్రించేటప్పుడూ, *"ప్రాజ్ఞేనాత్మనాన్వారూఢ ఉత్సర్జన్ యాతి"* (బృహ6-3-35) ((మరణకాలంలో) మహాప్రాజ్ఞానైన పరమాత్మతో ఒకవిధమైన చేరికపొందినవాడై దేహాన్ని వదిలి (జీవుడు) పోతున్నాడు)అని మరణకాలంలోనూ, జీవుడు పరమాత్మచేత (క్రమంగా) బాగా స్పృశింపబడుతున్నాడనీ, ఒకవిధమైన చేరికపొందటం కుదరకపోవటంచేత ఈవాక్యాలు నిద్రించేటప్పుడూ మరణసమయంలోనూ జీవుడినీ, పరమాత్మనీ వేఱువేఱుగానే చెప్పటంచేత జీవుడికంటే భిన్నమైన పరమపురుషుడున్నాడని స్పష్టమౌతోంది. అందువల్ల ఇక్కడ ఆకాశమనబడేవాడు జీవుడికంటె భిన్నమైన పరమాత్మే.

*// సి. సూ.// పత్యాదిశబ్దేభ్యః // 1-3-44 //*

***పత్యాది శబ్దేభ్యః=*** 'పతి' మొదలైన శబ్దాలవల్ల సూచింపబడటంవల్లనూ (పరమాత్మ జీవుడికంటే భిన్నమైనవాడే.)

**338.** *అత్ర "సర్వస్యాధిపతి"రితి వాక్యే పరాత్మని।*
*ప్రాజ్ఞే శ్రుతేభ్యః పత్యాదిశబ్దేభ్యః ప్రత్యగాత్మతః॥*

**339.** *విలక్షణోఽయమైక్యోక్తిస్తథా భేదనిషేధవాక్।*
*సర్వస్య బ్రహ్మకార్యత్వప్రయుక్తేతి సమర్థితమ్॥*

*॥ఇత్యర్థాన్తరత్వాదివ్యపదేశాధికరణమ్॥*

*॥ఇతి ప్రథమాధ్యాయే తృతీయః పాదః॥*

338-339. *"సర్వస్యాధిపతిస్సర్వస్య వశీ సర్వస్యేశానః"* (బృహ 6-4-22) (అన్నింటికిని శిరోభాగమైనవాడును, అన్నింటిని వశమునందు ఉంచుకున్నవాడై అంతటికీ నియామకుడై ఉండేవాడు) అని ప్రారంభించి, ఈప్రకరణంలో ప్రాజ్ఞుడనిపించుకున్నవాడు, పరమాత్మైనవాడు, అన్నిజీవులకీ నాయకుడుగాను, ప్రభువుగాను, ఈశ్వరుడుగాను, ఉన్నట్లు చెప్పబడటంచేత ఈతడు జీవుడికంటె వేఱైనవాడనితెలుస్తోంది. జీవుడూ, పరమాత్మా ఒకటేఅనీ, వేఱుగాదనీ, వేదవాక్యాలు చెప్పటం లోకాలన్నీ, బ్రహ్మకార్యమనీ, శరీరమనీ, బ్రహ్మం అన్నిలోకాలకీ కారణంగాను, అంతర్యామిగాను, ఉండటంవల్లనేఅని, మొదటే నిరూపించబడింది. అంచేత, ఇక్కడ వ్యవహరించబడే ఆకాశం జీవుడికంటె భిన్నమైన పరమాత్మేనని నిర్ధారణ అయింది.

*అర్థాన్తరత్వాదివ్యపదేశాధికరణం సంపూర్ణం.*

*మొదటి అధ్యాయం మూడోపాదం పూర్తైంది.*

## *// అథ చతుర్థః పాదః //*

### *// ఆనుమానికాధికరణమ్ // (1-4-1)*

*// సి. సూ.//ఆనుమానికమప్యేకేషామితి చేన్న శరీరరూపక విన్యస్తగృహీతేర్దర్శయతి చ // 1-4-1 //*

***ఏకేషామ్=*** కఠవల్లిలో, ***ఆనుమానికం అపి=*** అవ్యక్తమనబడే మూలప్రకృతి, (జగత్కారణంగ చెప్పబడుతోందే) ***ఇతి చేత్=*** అన్నట్లైతే, ***న=*** అది సరిగాదు. ***శరీరరూపకవిన్యస్తగృహీతేః=*** (రథం, రథసారథి మొదలైన) రూపాల్లో, (రథంగా) రూపధారణమైన శరీరాన్నే (అవ్యక్తమని) గ్రహించటంచేత, ***దర్శయతి చ=*** వాక్యశేషంగూడా దీన్నే చూపుతోంది.

**340.** *పూర్వత్ర స్పష్టజీవాదిలిఙ్గవాక్యం విచారితం।*
*అత్రాత్యన్తస్పష్టజీవలిఙ్గవాక్యం విచార్యతే॥*

340. మొదటిపాదంలో సుస్పష్టతలేని జీవాదిలింగవాక్యాలు విచారింపబడ్డాయి; రెండోపాదంలో స్పష్టతలేని జీవాదిలింగవాక్యాలు విచారింపబడ్డాయి. మూడోపాదంలో స్పష్టమైన జీవాదిలింగవాక్యాలు విచారింపబడ్డాయి. నాలుగోపాదంలో జీవుడు,అచిత్తువంటివాటి లింగాల(చిహ్నాల)ని చూపే బాగాస్పష్టమైన వేదవాక్యాలు పరిశీలింపబడుతున్నాయని భావం.

**341.** *అత్యన్తస్పష్టజీవాదిలిఙ్గవాక్యవిచారణాత్।*
*లక్షణస్య బ్రహ్మభిన్నే ఽతివ్యాప్తిర్వార్యతేఽత్ర చ॥*

341. ఈవిధంగా బాగాస్పష్టమైన జీవాదిలింగాలున్న వాక్యాలని వివరించటంచేత, వెనకటి రెండుపాదాల్లోలాగే ఈపాదంలోగూడా బ్రహ్మలక్షణానికి చిదచిత్తుల్లో అతివ్యాప్తి రాదని చూపబడుతోంది.

**342.** *పూర్వం జీవాత్పరః కశ్చిత్ నేతి వాదో నిరాకృతః।*
*అత్ర ప్రకారాన్తరేణ ప్రవృత్తస్స నివార్యతే॥*

342. వెనకటిఅధికరణంలో జీవపరైక్యతాభావంలో జీవుడికంటే వేఱైన పరమాత్మలేడనిచెప్పే వాదం ఖండించబడింది. పరమాత్మేలేకపోవటంతో జీవుడికంటె భిన్నమైన పరమాత్మ ఉండడనేవాదం ఈఅధికరణంలో ఖండింపబడుతోంది.

**పూ.343.** *"మహతః పరమవ్యక్త"మితి మన్త్రే కఠశ్రుతేః।*
*అవ్యక్తశబ్దేనోక్తం తత్-ప్రధానమపి కారణమ్॥*

**344** *తత్తన్త్రప్రత్యభిజ్ఞానాత్పూరుషాత్పఞ్చవింశకాత్।*
*"పురుషాన్న పరం కిఞ్చి"దిత్యన్యస్య చ వారణాత్॥*

343-344. **పూర్వపక్షం:** *"ఇన్ద్రియేభ్యఃపరా హ్యర్థాః అర్థేభ్యశ్చ పరం మనః। మనసస్తుపరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః॥ మహతఃపరమవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః। పురుషాన్నపరం కిఞ్చిత్ సాకాష్ఠా సా పరాగతిః॥"* (కఠో.1-3-10,11) (ఇంద్రియాలకంటె గొప్పవైనవి అర్థాలు, అర్థాలకంటె మనసు గొప్పది. మనస్సు కంటె గొప్పది బుద్ధి, బుద్ధికంటె గొప్పది ఆత్మయైన మహత్తు. మహత్తు కంటె గొప్పది అవ్యక్తం. అవ్యక్తంకంటె గొప్పవాడు పురుషుడు. పురుషుడికంటె గొప్పది వేఱేమీ లేదు. ఆపురుషుడే చివరి హద్దైనవాడుగాను, గొప్పదైనగతిగాను ఉన్నాడు.) అని కఠవల్లిలో చెప్పబడుతోంది. ఇక్కడ అవ్యక్తశబ్దంచేత చెప్పబడేది సాంఖ్యులచేత జగత్కారణంగా అంగీకరింపబడే మూలప్రకృతే అయిఉండాలి. ఎంచేతంటే, సాంఖ్యులు మహాన్అనబడే అచేతనతత్త్వంకంటే దానికికారణమైన అవ్యక్తమనబడేమూలప్రకృతి గొప్పదనీ, అలాంటి మూలప్రకృతికంటే పురుషుడని చెప్పబడే జీవుడు గొప్పవాడనీ, ఆజీవుడికంటే గొప్పవాడైన ఈశ్వరుడనే తత్త్వం అంటూవేరేలేదనీ అంటారు. ఈకఠవల్లి మంత్రాల్లో *"మహతః పరమవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః"*అని మహత్తుకంటే అవ్యక్తం(మూలప్రకృతి) గొప్పదనీ, అవ్యక్తం కంటే పురుషుడనబడే జీవుడు గొప్పవాడనీ సాంఖ్యమతవాదం చెప్తోంది. *"పురుషాన్నపరం కించిత్ సాకాష్ఠా సాపరా గతిః"* అని ఇరవైయైదో తత్త్వమైన పురుషుడికంటె గొప్పదైన తత్త్వమేలేదని ఈశ్వరతత్త్వనిషేధంకూడా చేయబడింది. ఈకారణాలచేత ఈవేదవాక్యం నిరీశ్వరసాంఖ్యులచేత జగత్కారణంగాచెప్పబడి, అవ్యక్తమనీ, ప్రధానమనీ ఆనుమానికమనీ పిలవబడుతున్న మూలప్రకృతే జగత్కారణంగా చెప్తోందని స్పష్టం అవుతోంది.

**సి.345.** *ఇతి చేన్న రథత్వేన శరీరం యద్ధి రూపితమ్।*
*తద్గ్రాహ్యవ్యక్తశబ్దోఽతః నాశబ్దం తన్న కారణమ్॥*

346. *"ఆత్మానం రథినం విద్ధీ"త్యాదిపూర్వోక్తమన్త్రతః।*
*ఉపాసనోపాయభూతా ఆత్మదేహాదయః క్రమాత్॥*

347 *రూపితా యే రథిత్వాద్యైర్వశీకార్యత్వ ఏష్వథ।*
*పరాః ప్రోక్తా "ఇన్ద్రియేభ్యః పరా" ఇత్యాది మన్త్రతః॥*

348 *తత్రేన్ద్రియాదయస్తే చ స్వస్వశబ్దేన భాషితాః।*
*శరీరం తు రథత్వేన రూపితం న స్వశబ్దతః॥*

349. *పరిశేషాత్పూర్వముక్తవాక్యస్థావ్యక్తశబ్దతః।*
*తదేవ గృహ్యతేఽతోఽత్ర నైవ తన్త్రాభిమర్శనమ్॥*

350. *న పఞ్చవింశకః ప్రోక్తః "పురుషః పర"ఇత్యతః।*
*వశీకార్యే పరాం కాష్ఠాం గతః ప్రాప్యః పరః పుమాన్॥*

351. *ఇమమర్థం వాక్యశేషః ప్రదర్శయతి చ స్ఫుటం।*
*"యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞస్తద్యచ్ఛేజ్జ్ఞాన" ఇత్యపి॥*

345-351. **సిద్ధాన్తం:** ఈపూర్వపక్షం తప్పు. వెనకచెప్పిన (కఠో3-10,11) మంత్రాలకి ముందర *"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవచ। బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ॥ ఇన్ద్రియాణి హయానాహు ర్విషయాంస్తేషు గోచరాన్"* (కఠో3-3,4) (ఆత్మని రథస్థుడుగాను, శరీరాన్ని రథంగాను తెలుసుకో. బుద్ధిని సారథిగాను, మనస్సుని కళ్ళెంగాను తెలుసుకోవాలి. ఇంద్రియాలని గుఱ్ఱాలుగాను, శబ్దం మొదలైన విషయాలని ఆగుఱ్ఱాలు వెళ్ళే మార్గాలుగాను చెప్తున్నారు.) అని ప్రారంభించి, *"విజ్ఞానసారథి ర్యస్తు మనః ప్రగ్రహవాన్నరః। సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్॥"* (కఠ3-9) అన్నదాన్నిబట్టి ఉన్న మంత్రాల్లో సంసారమార్గాలకి అవతలిగట్టైన విష్ణువుయొక్క పరమపదాన్ని (పరమప్రాప్యమైనస్వరూపాన్ని) పొందగోరే ఉపాసకుడిని రథాన్నెక్కి ప్రయాణంచేసే రథస్థుడుగాను, వాడిశరీరాన్ని రథంగాను, బుద్ధిని రథసారధిగాను, మనస్సుని కళ్ళేలుగాను, ఇంద్రియాలని గుఱ్ఱాలుగాను, విషయాలని ఆగుఱ్ఱాలు వెళ్ళే దారులుగాను, రూపాలనిచ్చి, ఎవడికి ఈరథంమొదలైనవి వశంలోఉన్నాయో, వాడే సంసారానికి ఆవలిగట్టైన విష్ణువుతాలూకు పరమపదాన్ని పొందుతాడని చెప్పబడింది. దీన్నిబట్టి చూస్తే *"ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థాః"* అనే తరువాతి మంత్రాలు ఆఉపాసకుడికి రథం మొదలైనవాటిగ ఉపయోగపడేశరీరంమొదలైనవాటిలో దేనికి ఏదివశపడుతుంది అన్నదేముఖ్యమైందని చెప్పబడుతోందని తెలుస్తోంది. వాటిలో గుఱ్ఱాలుగ చెప్పబడ్డ ఇంద్రియాలకంటే మార్గాలుగా చెప్పబడిన విషయాలే వశపరుచుకొనవలసినవాటిలో ముఖ్యమైనవని మొదట చెప్పబడుతోంది. ఇంద్రియాలని వశపరచుకోవటంచేత, విషయాలదగ్గరే ఉంటే ఇంద్రియాలు వశంలో స్థిరంగా ఉండలేవని భావం. మార్గాలుగ చెప్పబడిన ఆవిషయాలకంటే మనస్సును వశపరుచుకోవటం ముఖ్యమని తరువాతికార్యంగా చెప్పబడింది. విషయాలదగ్గరలేకపోయినా, మనస్సు విషయప్రవణమై ఉంటే ప్రయోజనం లేదని భావం. అలాంటి మనస్సుకంటే, సారథిగాచెప్పబడినబుద్ధిని వశంలోఉంచటంముఖ్యమని దానితరువాతి మెట్టుగా చెప్తున్నారు. అలాంటి బుద్ధిలో స్థిరతలేకపోతే మనస్సుని వశపరచుకొన్నా ప్రయోజనంలేదని భావం. ఆబుద్ధి కంటే రథంఎక్కి ప్రయాణిస్తున్నవాడుగాచెప్పబడ్డ ఆత్మని వశంలోఉంచుకోవటం ముఖ్యంఅని తరువాతిమెట్టుగ చెప్పబడుతోంది. ఆత్మే కర్తగనుక, వెనకచెప్పినవన్నీ ఆత్మయొక్క ఇచ్ఛకి లోబడి యుండటంవల్ల, ఆతడిని 'మహాన్' (గొప్పవాడు) అనిచెప్పి వెనకచెప్పినవాటిని వశపరుచుకోవటంకంటె

ఆత్మని వశపరచుకోవటం ముఖ్యమని చెప్పబడుతోంది. తరువాతి మెట్టుగ **'మహతః పరమవ్యక్తమ్'** అని గొప్పవాడైన ఆఆత్మని వశపరచుకోవటంకంటె రథంగాచెప్పబడిన శరీరాన్నివశపరచుకోవటమే ముఖ్యమని చెప్పబడుతోంది. *"శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్"* అనిచెప్పినట్లు అన్నిపురుషార్థాలనీ సాధించటానికి శరీరమే ఆత్మకి సహాయపడటంవల్ల ఆత్మని వశపరుచుకోవటంకంటె శరీరాన్ని వశపరుచుకోవటమే ముఖ్యమని భావం. ఆశరీరంకంటె సర్వాంతర్యామైన పరమపురుషుడిని వశపరుచుకోవటమే ముఖ్యమని తరువాతిమెట్టుగ ఘోషింపబడుతోంది. వెనకచెప్పినవన్నీ ఆతని సంకల్పంప్రకారం నడిచేవేఅవటంచేత ఆతన్ని వశపరచు కోవటమే చాలాముఖ్యమని భావం. *"పురుషాన్నపరం కిచిత్ సాకాష్ఠా సాపరాగతిః"* అనిఉపాసనాన్ని పూర్తి చేయించే ఉపాయాల్లో చివరిదైనదిగ ఉన్నవాడు పరమపురుషుడేఅని చెప్పబడుతోంది. వశీకార్య పరంపరను చెప్పే ఈమంత్రాల్లో వెనకటిమంత్రాల్లో రథంవంటివిగ చెప్పబడ్డ శరీరంమొదలైనవే గ్రహింపబడుతున్నాయని స్పష్టంగా తెలుస్తోంది. ఇంద్రియం, మనస్సు, బుద్ధి, ఆత్మ మొదలైనవి వెనకటి మంత్రాల్లో ఏయేశబ్దాలవల్ల గ్రహింపబడినాయో, ఆయాశబ్దాలచేతనే వశీకార్యపరంపరనుచెప్పే తరువాతిమంత్రాల్లోనూ గ్రహింపబడ్డాయి. వెనకటి మంత్రాల్లో విషయశబ్దంచేత గ్రహింపబడిన శబ్దాదివిషయాలు తరువాతి మంత్రాల్లోనూ విషయశబ్ద పర్యాయమైన అర్థశబ్దంచేతనే గ్రహింపబడుతోంది. అంచేత వెనకటిమంత్రంలో ఎంచబడినశరీరమే తరువాతి మంత్రంలోనూ ఎంచబడి అవ్యక్తశబ్దంచేత చెప్పబడుతోందని స్పష్టమవుతోంది. అంచేత ఇక్కడ సాంఖ్యులచేత ఒప్పుకోబడిన మూలప్రకృతి అవ్యక్తశబ్దంచేత చెప్పబడలేదు. కనుక ఇక్కడ సాంఖ్యతత్త్వప్రక్రియ తలంచబడ లేదు. **'పురుషః పరః'**అని వశపరచుకోవటానికితగిన పదార్థాలకిచివరిహద్దైన పరమపురుషుడే చెప్పబడే వాడవటంచేత ఈపురుషుడు సాంఖ్యులచేతచెప్పబడే జీవుడుగా కుదరదు. అంచేత ఇక్కడ సాంఖ్యప్రక్రియ ఏమాత్రమున్నూలేదు. కనుక ఇంతవరకూ అవ్యక్తశబ్దంచేత ఇక్కడ రథంగాచెప్పబడ్డ శరీరమే గ్రహింప బడుతోందని స్పష్టమవటంచేత, ఇక్కడ మూలప్రకృతి జగత్కారణంగా చెప్పబడలేదు.

*"యచ్ఛేద్వాఙ్మనసి ప్రాజ్ఞః తద్యచ్ఛేత్ జ్ఞాన ఆత్మని।*
*జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేత్ శాన్త ఆత్మని॥ (కఠ. 1-3-13)*

(జ్ఞానైనవాడు వాక్కుమొదలైన ఇంద్రియాలని మనస్సుకి వశపరచాలి. ఆమనస్సుని ఆత్మలోనిబుద్ధికి వశపరచాలి. ఆబుద్ధిని గొప్పదైనజీవాత్మకు వశపరచాలి. ఆజీవాత్మని ఎలాంటి నీచత్వంలేని పరమాత్మకి వశపరచాలి.) అని వెనకచెప్పినమంత్రాల తరవాతవచ్చే మంత్రాలనించిడి ఇక్కడ వశీకార్యపరంపరే చెప్పబడుతోందేతప్ప కారణపరంపరచెప్పబడలేదని తెలియచేయటంచేత అవ్యక్తశబ్దంచేత మూలప్రకృతిని చెప్పలేదనీ, శరీరాన్నే చెప్తోందనీ స్పష్టం అవుతోంది.

## సి.సూ॥ సూక్ష్మం తు తదర్హత్వాత్ ॥ (1-4-2)

**సూక్ష్మంతు=** (పంచభూతాలకీ)సూక్ష్మస్థితియైన మూలప్రకృతే(శరీరమైంది), **తదర్హత్వాత్=** (స్థూలమైన శరీరస్థితిలోనే) కార్యం చెయ్యతగినది అవటంచేత.

**352.** *శరీరావస్థమవ్యక్తమేవ కార్యార్హమిత్యతః।*
*శరీరమేవ తేనేహాఽవ్యక్తశబ్దేన గృహ్యతే॥*

352.అతీన్ద్రియవస్తువునిచెప్పే అవ్యక్తశబ్దంచేత ఇంద్రియాలచేతతెలియబడే శరీరాన్ని చెప్పటం ఎలాకుదురుతుందంటే, ఇంద్రియాలచేత తెలుసుకొనబడనిదిగనుకనే అవ్యక్తమనబడే ఆమూలప్రకృతే స్థూలస్థితినిపొంది శరీరమైంది. అచేతనపదార్థమై, శరీరంగా మార్పుచెందిన ఆమూలప్రకృతే రథంలాగ పురుషార్థసాధనప్రయత్నాలని చేయతగినదైఉండటంచేత అదే అవ్యక్తమనిచెప్పటానికి తగిఉంది.

*// సి. సూ.// తదధీనత్వాదర్థవత్ // (1-4-3)*

***తదధీనత్వాత్=*** (పరమపురుషుడికి) వశపడిఉండటంవల్ల, ***అర్థవత్=*** (మూలప్రకృతి) ఉపయోగం ఉన్నదైంది.

***353.*** *పరమాత్మశరీరత్వాత్తదధీనతయాఽర్థవత్।*
*భూతసూక్ష్మమితి హ్యత్రావ్యక్తశబ్దేన గృహ్యతే॥*

353. భూతాలసూక్ష్మస్థితైనమూలప్రకృతి కార్యమైన శరీరాన్ని ఇక్కడ అవ్యక్తశబ్దంచేత చెప్పబడుతోందని ఒప్పుకున్నవాళ్ళైతే సాంఖ్యసిద్ధాంతాన్నే ఈవేదవాక్యం చెప్పేదిగా గ్రహించాలంటే వైదికులమైన మేం మూలప్రకృతినీ, దానివికారాలైన వాటినీగూడ అంగీకరించేం. కాని సాంఖ్యులలాగ వాటిని స్వతంత్రమైనవిగా అంగీకరించలేదు. మూలప్రకృతిమొదలైన అన్నింటినీ పరమాత్మకి శరీరంగాను, ఆతనికివశపడియున్నవి గనుక ప్రయోజనం కలిగియున్నవాటిగానే మేం అంగీకరిస్తున్నాం. అంచేత అవ్యక్తశబ్దంచేత మూలప్రకృతికార్యమైన శరీరాన్ని చెప్పటంతోమాత్రం సాంఖ్యమతాన్ని ఈవేదవాక్యం చెప్పేదిగా గ్రహించటానికి వీలుగాదు.

*// సి. సూ.// జ్ఞేయత్వావచనాచ్చ // (1-4-4)*

***జ్ఞేయత్వావచనాత్ చ=*** (ముముక్షువుకి) తెలుసుకోదగినదిగా (అవ్యక్తాన్ని) చెప్పకపోవటంచేతను, (సాంఖ్యతత్త్వప్రక్రియ ఇక్కడ చెప్పబడలేదు)

***354.*** *యది తన్త్రప్రక్రియా స్యాత్ వ్యక్తావ్యక్తేతి తద్గిరః।*
*వక్తవ్యా జ్ఞేయతాఽస్యాపి నోక్తా సాఽతో న సా మతా॥*

354. *"వ్యక్తావ్యక్తజ్ఞవిజ్ఞానాత్"* (సాంఖ్యతత్త్వకారిక) (వ్యక్తమనబడేది స్థూలమైనలోకం. అవ్యక్తమనబడేది మూలప్రకృతి. పురుషుడు మొదలైనవారిని తెలుసుకుంటేనే మోక్షం లభిస్తుంది) అనే వాక్యంప్రకారం అవ్యక్తమైన మూలప్రకృతిని తెలుసుకుంటే మోక్షం లభిస్తుందని సాంఖ్యులు చెప్తారు. ఈవేదవాక్యంలో అలా చెప్పబడలేదు. అంచేతగూడ సాంఖ్యతత్త్వప్రక్రియ ఇచ్చట చెప్పబడలేదని సిద్ధించింది.

*// సి. సూ.// వదతీతి చేన్న ప్రాజ్ఞో హి ప్రకరణాత్ // (1-4-5)*

***వదతీతి చేత్=*** (అవ్యక్తాన్ని తెలుసుకోదగినదిగా) చెప్పబడిందే అంటే, ***న=*** లేదు, ***ప్రకరణాత్=*** ప్రకరణాన్ని పరిశీలిస్తే, ***ప్రాజ్ఞో హి=*** (అక్కడ చెప్పబడేవాడు) పరమాత్మేగదా!

***పూ.ప. *355*** *"అశబ్దమి"తి వాక్యేనాఽవ్యక్తస్య జ్ఞేయతోచ్యతే।*

*355. **పూర్వపక్షం.** ఈవేదవాక్యాన్ననుసరించి ఉన్నఒక మంత్రంలో *"అశబ్దమస్పర్శ మరూపమవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ యత్। అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్యతం మృత్యుముఖాత్ ప్రముచ్యతే॥*(కఠ.1-3-15) (శబ్దస్పర్శరూపరసగంధాలు మొదలైనవిలేనిదిన్నీ, నాశంలేనిదీ ఆదిఅంతంలేనిదీ, మహత్తుకుఆవలిదీ, స్థిరంగాఉన్నదీ అయిన అటువంటి తత్త్వాన్ని ధ్యానించడంచేత సంసారంనుంచి ముక్తుడ వుతాడు.) అని ముముక్షువుచేత తెలుసుకోలేని ఒకతత్త్వం చెప్పబడుతోంది. ఈతత్త్వానికి శబ్దస్పర్శాదులు లేకపోవటంవల్ల అలాంటినిషేధప్రసక్తిఉన్న మూలప్రకృతే ఇదిఅని తెలుస్తోంది. *"మహతఃపరమ్"* అని మహత్తు కంటే గొప్పదైనదని చెప్పటంచేత ఇది మూలప్రకృతేఅని స్పష్టమౌతోంది. అంచేత ఇక్కడ మూలప్రకృతిని ముముక్షువులచేత తెలుసుకొనవలసినదిగా చెప్పలేదంటూ వెనకటిసూత్రంలో చెప్పటం సరిగాదు.

***సి.355**** *నైవం ప్రాజ్ఞస్య తత్రోక్తేస్తథైవ ప్రకృతత్వతః॥*

355* **సిద్ధాంతం.** ఈపూర్వపక్షం దోషభూయిష్టం. ఈప్రకరణంలో *"అశబ్దమ్"*అని ప్రారంభం అయేమంత్రానికి ముందు *"విజ్ఞానసారథిర్యస్తు మనఃప్రగ్రహవాన్ నరః। సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్॥"* (కఠ.1-3-9) (జ్ఞానాన్ని సారథిగాను, మనస్సుని కళ్ళేలుగాను కలిగిన మనుష్యుడు సంసార మార్గానికి ఆవలిదైన విష్ణువుయొక్క పరమపదాన్ని పొందుతాడు.), *"ఏష సర్వేషు భూతేషు గూఢోऽऽత్మా న ప్రకాశతే। దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥"* (కఠ1-3-12) (అన్నిపదార్థాల్లోనూ, కనబడకుండా ఉన్న ఈపరమాత్మ సామాన్యంగా ఎవరికీ కనబడడు. సూక్ష్మబుద్ధిగలవారి విశేషమైన సూక్ష్మబుద్ధిచేతనే చూడబడుతుంది.) అని రెండుమంత్రాల్లోనూ పరమాత్మే పొందటానికీ, తెలుసుకోవటానికీ తగినవాడుగా చెప్పబడ్డాడు. ఈమంత్రాలకిమధ్య *'పురుషాన్నపరం కించిత్'*అని పురుషశబ్దంచేత చెప్పబడే వాడు ఇరవైయారోతత్త్వమైన పరమపురుషుడేగాని ఇరవైయైదోతత్త్వమైన జీవుడుగాడని దీనివల్ల స్పష్టం అవుతోంది. ఈప్రకరణబలాన్ని చూస్తే, *"అశబ్దమ్"* అన్నమంత్రంలో చెప్పబడ్డవాడు పరమాత్మేనని తెలుస్తోంది. *"యత్తదద్రేశ్యమ్"* (ముండకో.1-6) అనిప్రారంభమయ్యేమంత్రంలో ఆపరమపురుషుడికి శబ్దస్పర్శాది గుణాలు లేవనిచెప్పటం అదృశ్యత్వాదిగుణకాధికరణంలో స్థిరీకరించబడింది. అంచేత ఇక్కడ శబ్దస్పర్శాదులు లేనిదిగా చెప్పబడే తత్త్వంకూడ ఆపరమాత్మేనని అనటానికి సందేహంలేదు. *'మహతః పరమ్'* అని చెప్పటం, *"బుద్ధేరాత్మా మహాన్పరః"* అన్నపుడు *"మహాన్"*అనిచెప్పబడే జీవుడికంటే ఉత్తముడైన పరమాత్మనే చెప్పుతున్నదనటానికి సందేహంలేదు. అంచేత ఈప్రకరణంలో మూలప్రకృతిని ముముక్షువులచేత తెలుసుకో దగినదిగ చెప్పలేదని సందేహించక్కరలేదు.

## సి.సూ॥ త్రయాణామేవ చైవముపన్యాసః ప్రశ్నశ్చ ॥ (1-4-6)

***త్రయాణామ్ ఏవ=*** (ఉపాయం, ఉపేయం, ఉపేత అనబడే) మూడింటినిగురించీ ***ఏవమ్=*** ఈవిధంగా (ముముక్షువులచే తెలుసుకొనదగినదిగా) ***ఉపన్యాసః=*** బదులు చెప్పబడింది, ***ప్రశ్నః చ=*** (ఆమూడింటిని గురించే) ప్రశ్నకూడా (ఉంది).

***356.*** *అత్ర ప్రకరణే "యేయ"మిత్యారభ్యాऽऽసమాప్తితః।*
*ఉపాస్యోపాసనోపాసితౄణాం జ్ఞేయతయా బహుః॥*

***357.*** *ఉపన్యాసస్తథా ప్రశ్నస్త్రయాణామేవ దృశ్యతే।*
*తస్మాదవ్యక్తస్య నేహ గ్రహణం తాన్త్రికస్య హి॥*

356-357. ఈప్రకరణంలో ఉపాయం (పొందటానికిమార్గమైన ఉపాసనం), ఉపేయం (పొందబడే పరమాత్మ), ఉపేత (పొందే జీవుడు) అనేమూడింటినిగురించే ముముక్షువులచేత తెలుసుకోదగినవిగ ప్రశ్న-సమాధానముల రూపంలో తయారైనదేతప్ప సాంఖ్యతంత్రసిద్ధమైన అవ్యక్తమనబడే మూలప్రకృతినిగురించి అలాంటి ప్రశ్నగాని సమాధానంగాని తయారుచేయబడలేదని ఈప్రకరణాన్నిబట్టి తెలుస్తుంది. ఎలాఅంటే, యముడినుండి మూడువరాలనిపొందిన నచికేతుడనే ఋషికుమారుడు,

*"యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతి చైకే।*
*ఏతద్విద్యామనుశిష్టస్త్వయాऽహం వరాణామేష వరస్తృతీయః॥ (కఠ. 1-1-20)*

(ముముక్షువైన మనుష్యుడు మోక్షాన్నిపొందేటపుడు ఆమోక్షప్రకారాన్నిగురించి "ఇలా ఉన్నది', 'ఇలాలేదు' అని వాదిప్రతివాదులవివాదంకారణంగా సందేహమేదైనవస్తే దేవరవారినుంచి ఉపదేశంపొంది నేను ఆసందేహాలని పోగొట్టుకుందునుగాక; ఇది వరాల్లో మూడోవరం అవుతుంది) అనుమూడోవరంవల్ల మోక్ష స్వరూపాన్ని విన్నదాన్నిబట్టి, ఉపాసించబడే పరమపురుషస్వరూపాన్నీ, ఉపాసనస్వరూపాన్నీ, ఉపాసించే

జీవస్వరూపాన్ని గురించీ అడిగేడు.

*"తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణం।*

*అధ్యాత్మయోగాధిగమేన దేవం మత్వా ధీరో హర్షశోకౌ జహాతి॥ (కఠ 1-2-12)*

(ఎవరిచేతాచూడశక్యంగానివాడు, (కర్మచేత)మూతవేయబడినవాడు, అన్నిజీవరాసుల్లోనూ లోపలప్రవేశించి వ్యాపించియుండేవాడు, హృదయగుహలోఉండేవాడు, అంతర్యామిగానున్నవాడు, అనాదియైనవాడు అయిన దేవుడిని (పరమాత్మని) ఆత్మస్థానంలో (మనస్సులో) స్థిరంగా నిలుపుకోవటంచేత కలిగే జీవాత్మజ్ఞానంచేత తెలుసుకొని జ్ఞానియైన ఉపాసకుడు సుఖదుఃఖాలని వదులుతాడు.) అన్న ప్రాప్యబ్రహ్మస్వరూపాన్నీ, పొందేవాడైన జీవుడిస్వరూపాన్నీ, ప్రాపకమైన ఉపాసనాన్నీ సామాన్యసాధనంగా యముడు ఉపదేశిస్తే వాటిస్వరూపాన్ని ఇంకా బాగా తెలుసుకోవాలని,

*"అన్యత్రధర్మాత్ అన్యత్రాధర్మాత్ అన్యత్రాస్మాత్ కృతాకృతాత్।*

*అన్యత్రభూతాచ్చ భవ్యాచ్చ యత్తత్ పశ్యసి తద్వద॥"*

((లోకంలో సుఖదుఃఖసాధనంగా ప్రసిద్ధమైన) ధర్మమనబడే పుణ్యం, అధర్మంఅనబడే పాపం మొదలైనవాటి కంటె విలక్షణమైన (మోక్ష)సాధనాన్నీ, మూడుకాలాల్లోనూ పరిచ్ఛిన్నాలైనవాటికంటే వేరైనప్రాప్యాన్నీ, ప్రాప్తుడినీ, నీకుతెలిసినట్లుగా ఉపదేశించాలి)అని నచికేతుడు అడిగేడు. యముడుకూడా, *"**నజాయతే మ్రియతే వా**"* (కఠ.1-2-18)(ఈజీవుడు పుట్టటంలేదు, మరణించటమూ లేదు)అని ప్రారంభించి ప్రాప్తైన జీవుడి స్వరూపాన్నీ, *"**అణోరణీయాన్**"* (కఠ.1-2-20) (అణువు కంటే అణువైనవాడు) అనిమొదలుబెట్టి *"**కఇత్థా వేద యత్ర సః**"* (కఠ.1-2-25) (ఆతడు ఎలా ఉంటాడో ఎవరూ తెలుసుకోలేదు)అన్నది సూక్ష్మంగాఉన్న మంత్రాలెన్నింట్లోనో ప్రాప్యమైన పరమాత్మస్వరూపాన్నీ, *"**నాయమాత్మా**"* (కఠ.1-2-23) అన్నమంత్రంచేత ప్రాపకమైన ఉపాసనాన్నీ, *"**ఆత్మానం రథినం విద్ధి**"*(కఠ.1-3-3) అని ప్రారంభించి, *"**తద్విష్ణోః పరమం పదం**"* (కఠ.1-3-9) అని మధ్యనీ, *"**దుర్గం పథస్తత్ కవయోవదన్తి**"* (కఠ.1-3-14) అనిసూక్ష్మంగా ఉపాసించేవిధాన్నీ, ఉపాసనవల్లపొందే వైష్ణవపరమపదప్రాప్తిఅనబడే మోక్షస్వరూపాన్నీ, స్పష్టంగా ఉపదేశించేడు. ఈవిధంగా ఉపాయం, ఉపేయం, ఉపేత అనబడేమూడింటినిగురించే ఈప్రకరణంలో ముముక్షువులు తెలుసుకొన దగినవిగ ప్రశ్నసమాధానరూపంలోఉన్నదేతప్ప మూలప్రకృతిని గురించి అలాంటి ప్రస్తావమే లేదు గనుక ఇక్కడ అవ్యక్తశబ్దంచేత సాంఖ్యులుచెప్పే మూలప్రకృతి ఎత్తుకోబడలేదు.

## సి.సూ॥ మహద్వచ్చ ॥ (1-4-7)

**మహద్వత్ చ=** (**బుద్ధేరాత్మా మహాన్ పరః** అన్నప్పుడు) ఎలా మహత్తు గ్రహింపబడలేదో, (అలాగే "**మహతః పరమవ్యక్తమ్**" అన్నప్పుడు కూడా మూలప్రకృతి గ్రహింపబడలేదు).

***358.*** *"బుద్ధేరాత్మా మహాని"త్యత్రాత్మశబ్దాత్ యథా మహాన్।*

*న గృహ్యతే తథాऽవ్యక్తశబ్దేనాపి న తాన్త్రికమ్"*

358. *"**బుద్ధేరాత్మా మహాన్ పరః**"* (కఠ. 1-3-10) అన్నప్పుడు మహత్తును ఆత్మఅని చెప్పటంవల్ల, అది సాంఖ్యతంత్రసిద్ధమైన మహత్తుగాదు అని ఎలా తెలుస్తోందో, *"**మహతః పరమవ్యక్తమ్**"* (కఠ. 1-3-10) అన్నప్పుడు మహత్తనబడే ఆ ఆత్మకంటెవిశిష్టమైన అవ్యక్తాన్ని చెప్పటంచేత ఈ అవ్యక్తం సాంఖ్యమత సిద్ధమైన అవ్యక్తం గాదని తెలుస్తోంది.

ఆనుమానికాధికరణము పూర్తియైనది.

## ॥ చమసాధికరణమ్. ॥ 1-4-2 ॥

*// సి. సూ.// చమసవదవిశేషాత్ // (1-4-8)*

**చమసవత్=** చమసంలాగ, **అవిశేషాత్=** విశేషంగాచెప్పకపోవటంచేత ('అజా'అనబడేది అబ్రహ్మాత్మక మూలప్రకృతి గాదు).

*359.* *అవ్యక్తాఖ్యప్రధానస్య స్వతంత్రత్వం నిరాకృతమ్।*
*అజామంత్రేణ తత్సిద్ధిరిత్యాశఙ్క్య నిరస్యతే॥*

359. వెనకటిఅధికరణంలో అవ్యక్తమన్న మూలప్రకృతి బ్రహ్మాత్మకంకానిదిగానూ స్వతంత్రమైనదిగానూ సాంఖ్యపక్షం నిరసింబడుతోంది. *"అజామేకామ్"* అని మొదలయే శ్వేతాశ్వతరమంత్రంలో మూలప్రకృతికి స్వతంత్రకారణత్వం చెప్పబడిందని ఆక్షేపంవస్తే, ఆఆక్షేపం ఈఅధికరణంలో నిరాకరింపబడుతోంది.

*పూ.360.* *శ్వేతాశ్వతరవేదేఽ"జామేకా"మిత్యాది పఠ్యతే।*
*తత్రాజా తన్త్రసిద్ధా స్యాదకార్యత్వశ్రుతేస్తథా॥*

**361.* *స్వాతంత్ర్యేణ ప్రజానాం చ స్రష్టృత్వశ్రవణాదపి।*

360-*361. **పూర్వపక్షం:** శ్వేతాశ్వతరోపనిషత్తులో *"అజామేకాం లోహితశుక్లకృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః। అజో హ్యేకో జుషమాణోఽనుశేతే జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః॥* (శ్వే 4-5) (ఎరుపు(రజోగుణం), తెలుపు(సత్త్వగుణం) నలుపు(తమోగుణం) అనబడే మూడురంగులు (గుణాలు) కలదై, తనవంటి ఎంతోమందిప్రజనుగలదై, జన్మంలేని ఒకదానితో (మూలప్రకృతితో) జన్మంలేని ఒకడు (సంసారి జీవుడు) ఆనందంతోఉన్నాడు. అనుభవింపబడిన దీన్ని (మూలప్రకృతిని) జన్మంలేని మరొకడు (ముక్త పురుషుడు) వదిలివెళ్ళిపోయేడు.) అనిచెప్పబడింది. ఇక్కడ **'అజా'** (జన్మంలేని)అని మూలప్రకృతిని చెప్పటంచేతనూ, ఎన్నోపదార్థాలని తానే స్వతంత్రంగా సృష్టించినట్లు చెప్పటంచేతనూ, ఈమంత్రం బ్రహ్మాత్మకముకానటువంటి స్వతంత్రప్రకృతినే కారణంగా చెప్తోంది అని తెలుస్తోంది.

*సి.361** *మైవమబ్రహ్మాత్మికాజా కారణత్వేన నోచ్యతే॥*

*362.* *జన్మాయోగశ్రుతేరేవ నియమో నహి తద్గ్రహే।*
*యథా'ర్వాగ్బిల' ఇత్యాదౌ చమసాఖ్యే చ సాధనే॥*

*363.* *శ్రుతేపి వాక్యశేషేణ శిరసశ్చమసత్వధీః।*
*తథాత్ర తంత్రసిద్ధాజాగ్రహణే న నియామకమ్॥*

**364.* *సృష్టేర్హేతుత్వమేవోక్తం న స్వాతన్త్ర్యమిహోచ్యతే।*

361*-*364. **సిద్ధాన్తం.** ఈపూర్వపక్షం తప్పు. **'అజా'**(జన్మంలేనిది)అని మూలప్రకృతిని చెప్పినంతలో, అది బ్రహ్మాత్మకంగానిదని సిద్ధించదు. జన్మలేనిదైతే, బ్రహ్మాత్మకంకానిదిగకూడా ఉండాలనినిర్బంధమేమీ లేదుగద! ఇక్కడ ఒకదృష్టాంతం గమనించతగినది. యాగాల్లో సోమపానంచేయటానికి ఉపయోగపడేపాత్రం 'చమసం'అనబడుతుంది. అది మీదనుమూతితోనూ కిందనుపెద్దది(వెడల్పు)గాను ఉంటుంది. బృహదారణ్యకం లోమాత్రం *"అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నః"* (బృహ 4-2-3) (క్రిందను మూతి(ద్వారము) ఉన్నదిగాను. మీద విశాలంగా పెద్దదిగాఉండేది చమసం)అని ఒకరకమైనచమసం చెప్పబడింది. తినటానికి (త్రాగటానికి) సాధనం కావటంతో 'చమసం'అనబడే ఇది మీదనువెడల్పుగాను, క్రిందనుమూతిగలదిగానూ ఉన్నదనీ ఈవాక్యంనుంచి తెలుస్తోంది. కాని ఇలాంటిచమసమేది? అని ఈవాక్యాలనించి తెలియదు. అలాగే, అజామంత్రంలోకూడా, మూలప్రకృతి బ్రహ్మాత్మకమా, కాదా అన్నదితెలియదు. *"ఇదం తచ్ఛిరః ఏష హ్యర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వ*

*బుధ్నః"* (బృహ 4-2-3) (ఇట్లాఉన్నది తలే అవుతుంది. తినటానికిసాధనంకావటంతో చమసమనేదిఇదేగదా క్రింద మూతి(ద్వారం)గలదీ, మీదపెద్దదిగానూ ఉన్నది)అని తరవాత ఉన్నవాక్యశేషంనుంచి చమసం తలేఅని తెలుస్తోందంటే, అక్కడ 'చమసమ'నబడేది తలేనని వాక్యశేషంలో విశేషించిచెప్పటంవల్లనే, ఈఅజావాక్యంలో **'అజా'**అనిచెప్పబడ్డ మూలప్రకృతి అబ్రహ్మాత్మకమైనదని మరోవాక్యంలో విశేషించి చెప్పబడలేదు. అంచేత ఇదిఅబ్రహ్మాత్మకప్రకృతిగాదు. *"బహ్వీః ప్రజాః సృజమానామ్"* అన్నప్పుడుకూడా మహత్తుమొదలైన ఎన్నోతత్త్వాలని ప్రకృతిసృష్టిస్తుందని చెప్తోందేతప్ప స్వతంత్రంగా సృష్టిస్తోందని చెప్పలేదు. అంచేత సాంఖ్యులుచెప్పే అబ్రహ్మాత్మకమైన మూలప్రకృతి ఈవాక్యంలో చెప్పబడలేదని తెలుస్తోంది.

### *// సి. సూ.// జ్యోతిరుపక్రమా తు తథా హ్యధీయత ఏకే // (1-4-9)*

***జ్యోతిరుపక్రమా తు=*** (**'అజా'** అనబడే ఈ మూలప్రకృతి) పరంజ్యోతైన బ్రహ్మాన్ని కారణంగా గలదే అవుతుంది, ***ఏకే=*** ఒకశాఖకి చెందినవాళ్ళు, ***తథాహి అధీయతే=*** అలాగేకదా చెప్తున్నారు.

*364** *బ్రహ్మకారణికైవైషాఽజా తథా తైత్తిరీయకాః//*

*365.* *అధీయతే"ఽణోరణీయా"నిత్యారభ్య పరాత్మతః/*
*సర్వోత్పత్త్యా తదాత్మత్వవాదిమన్త్రగణస్థలే//*

**366.* *"అజామేకా"మితి ప్రోక్తాజా పరాత్మాత్మికైవ సా/*

364*-*366. తైత్తిరీయోపనిషత్తులో *"అణోరణీయాన్ మహతో మహీయానాత్మా"* (తై-నా 10-1) (అణువుకంటే అణువై, గొప్పదానికంటే గొప్పదై పరమాత్మఉంటాడు) అని ప్రారంభించి *"అతః సముద్రాగిరయశ్చ....తిష్ఠత్యన్తరాత్మా"* (తై-నా10-3)(సర్వాంతరాత్మగాఉండటంచేతనే, ఈపరమాత్మనుంచే సముద్రాలు, పర్వతాలు మొదలైనవన్నీ సృష్టింపబడ్డాయి.)అనిప్రారంభించి సర్వాత్మైన ఆపరమాత్మనించే అన్నీపుట్టినవనిచెప్పే మంత్రాల్లోనే ***'అజామేకామ్"*** అని ప్రారంభించే ఈమంత్రంకూడా చెప్పబడుతోంది. అంచేత ఈమూలప్రకృతికిన్నీ, బ్రహ్మమే ఆత్మగాను, కారణంగాను అంగీకరించబడిందని స్పష్టమవుతోంది.

### *// సి. సూ.// కల్పనోపదేశాచ్చ మధ్వాదివదవిరోధః // (1-4-10)*

***కల్పనోపదేశాత్ చ=*** సృష్టినిచెప్పినప్రకారం, ***మధ్వాదివత్=*** (ఆదిత్యుడు) మధువవటం, కార్యమవటం మొదలైనవాటిలాగ, ***అవిరోధః=*** (ప్రకృతికిఉండే అజాత్వంఅనబడే జన్మరాహిత్యానికీ, బ్రహ్మంవల్ల సృష్టింపబడటానికీ) విరోధంలేదు.

*366** *"అస్మాన్మాయీ"తి వాక్యేన సృష్టేరత్రోపదేశతః//*

*367.* *అజాత్వబ్రహ్మకార్యత్వధర్మయోర్న పరస్పరమ్/*
*విరోధో, లయకాలే తు నామరూపే విహాయ తత్//*

*368.* *బ్రహ్మదేహతయా తిష్ఠత్యచిద్వస్త్వజతా తతః/*
*భజమానా సృష్టికాలే తే అజా బ్రహ్మహేతుకా//*

*369.* *ఆదిత్యస్య యథా సృష్టౌ మధుత్వం కార్యతా తథా/*
*తస్యైవ లయకాలే తు సూక్ష్మస్థితిరకార్యతా//*

*//ఇతి చమసాధికరణమ్ //*

366*-369. ఈప్రకరణంలో *"అస్మాన్ మాయీ సృజతే విశ్వమేతత్"* (శ్వే 4-9) (ఈప్రకృతినుంచి మాయియైన భగవానుడు ఈలోకాన్ని సృష్టించేడు) అన్నవాక్యంవల్ల, మూలప్రకృతి పరమాత్మచేత సృష్టింప

బడ్డది అని తెలుస్తోంది. *"అజామేకామ్"* అన్నమంత్రంలోమాత్రం *'అజా'* (జన్మ లేనిది) అని అదే మూలప్రకృతి చెప్పబడుతోంది. ఈరెండింటికీ విరోధంరాదా? అంటే, రాదు. ఎంచేతంటే, మూలప్రకృతి అనబడే అచేతన పదార్థం ప్రళయకాలంలో నామరూపాలని పోగొట్టుకొని బ్రహ్మానికి శరీరమైఉంది. అప్పుడు మహత్తు వంటి వాటిగ పరిణమించేజన్మని అది పొందదు. అంచేతనే, ఈకారణస్థితినిబట్టిన అది అజా(జన్మలేనిది) అనబడు తోంది. *"ధాతా యథా పూర్వమకల్పయత్"* (పరమాత్మ పూర్వకల్పంలోలాగనే వస్తువులని **కల్పించేడు** (సృష్టించేడు)అన్నట్లుగా *'కల్పన'* అనబడేసృష్టిని పరమాత్మచేసేటప్పుడు అదేమూలప్రకృతి మహత్తు, అహంకారం, ఐదు తన్మాత్రలు, ఇంద్రియాలు, ఐదు భూతాలు మొదలైనవాటిగ పరిణమించి నామరూపాలని పొందుతోంది. అందువల్ల ఈకార్యస్థితినిగలిగిన అది బ్రహ్మాన్నికారణంగ గ్రహించేదైఉంది. అంచేత ఈవిధంగా *'కల్పన'*అనబడే సృష్టే ఈమూలప్రకృతికి ఈకార్యస్థితిలో ఉపదేశించబడిందవటంచేత కారణస్థితిలో దానిని *'అజా'* (జన్మ లేనిది) అనటంలో విరోధంలేదు. ఇక్కడ ఉదాహరణంఒకటి కనబడుతుంది. *"నైవోదేతా నాస్తమేతా"* (ఛాం.3-11-1) (ఈసూర్యుడు ఉదయించడమూ లేదు, అస్తమించటమూ లేదు) అని ప్రళయకాలంలో సూర్యుడు ఉదయాస్తమయాలు లేక సూక్ష్మస్థితిలోఉన్నాడని ఒకవేదవాక్యం చెప్తోంది. అదే సూర్యుడు సృష్టికాలంలో ఉదయాస్తమయాలూ నామరూపాలూ మొదలైనవాటిని గలిగినవాడై స్థూలస్థితైన కార్యస్థితిలోఉన్నాడు, దేవతలకు భోగ్యమైన మధువుగాఉండేస్థితిని పొందేడని *"అసౌవా ఆదిత్యోదేవమధు"* (ఛాం.3-1-1) (ఈసూర్యుడు దేవతలనుభవించే మధువైనాడు) వంటివాక్యాలు చెప్తున్నాయి. కార్యకారణ దశాభేదంవల్లనే ఒకేసూర్యుడు స్థూలసూక్ష్మస్థితులు కలిగినవాడవటానికి విరోధంలేనట్లే మూలప్రకృతికూడా కార్యకారణదశాభేదంచేత జన్మంకలిగినదవటం, జన్మలేనిదవటమూ జరగటానికి ఎలాంటి ఆటంకం లేదు.

<u>*చమసాధికరణం పూర్తైంది.*</u>

## *॥ సఙ్ఖ్యోపసఙ్గ్రహాధికరణమ్ ॥ 1-4-3 ॥*

### *॥ సి. సూ.॥ న సఙ్ఖ్యోపసఙ్గ్రహాదపి నానాభావాదతిరేకాచ్చ ॥ 1-4-11 ॥*

***సఙ్ఖ్యోపసఙ్గ్రహాత్ అపి=*** ఇరవైఐదుతత్త్వాలనే (పఞ్చ పఞ్చజనాః అన్నశ్రుతి) చెప్తున్నప్పటికీ, ***న=*** (సాంఖ్యమతతత్త్వాలు ఇక్కడచెప్పబడ్డాయని)ఏఱ్పడలేదు. ***నానాభావాత్=*** (సాంఖ్య తత్త్వాలకంటే) వేరైఉండటంవల్లనూ, ***అతిరేకాత్ చ=*** (ఇరవైఐదుకంటే) ఎక్కువగాఉండటంచేతను.

***370.*** *ప్రాస్తమబ్రహ్మాత్మకత్వమజాయా హేత్వభావతః।*
*"యస్మి"న్నిత్యత్ర తల్లిఙ్గమస్తీత్యేతన్నిరస్యతే॥*

370. వెనకటిఅధికరణంలో *'అజా'*వాక్యంలో చెప్పబడిన మూలప్రకృతి అన్నది అబ్రహ్మాత్మకమైనదని ప్రత్యేకంగాచెప్పబడకపోవటంచేత అది సాంఖ్యతంత్రసిద్ధమైన అబ్రహ్మాత్మకమూలప్రకృతి కాదని నిరూపింప బడింది. ఈఅధికరణంలో *"యస్మిన్ పఞ్చ"*అనిమొదలయ్యే మంత్రంలో అబ్రహ్మాత్మకమూలప్రకృతితాలూకు చిహ్నాం ఉన్నది అనేవాదం నిరసింపబడుతోంది.

***పూ.371.*** *"యస్మిన్ పఞ్చే"తి మన్త్రోఽస్తి బృహదారణ్యకశ్రుతౌ।*
*ఏష మన్త్రస్సాఙ్ఖ్యతన్త్రతత్త్వబోధక ఇష్యతే॥*

***372.*** *పఞ్చవింశతిసఙ్ఖ్యాకతన్త్రతత్త్వప్రతీతితః।*
*మోక్షాధికారాదేతాని తాన్త్రికాణీతి నిశ్చయః॥*

371-372. పూర్వపక్షం. *"యస్మిన్ పఞ్చపఞ్చజనాః ఆకాశశ్చ ప్రతిష్ఠితః। తమేవమన్య ఆత్మానం*

*విద్వాన్ బ్రహ్మామృతోఽమృతమ్॥*" (బృహ.6-4-17) (ఏ ఆత్మకి ఐదైదులు (ఇరవైయైదు) తత్త్వాలూ ఆకాశమూ స్థిరంగాఉన్నాయో, పెద్దదీ, నాశంలేని ఆఆత్మ ఇటువంటిదనితెలుసుకున్న మనుష్యుడుకూడా ముక్తి పొందుతాడు.) అన్నమంత్రం బృహదారణ్యకంలోఉంది. ఇందు *'పఞ్చజనాః'* అన్నపదం ఐదు తత్త్వసమూహాలని చెప్తోంది. అంచేత ఇరవైయైదుతత్త్వాలే *'పఞ్చపఞ్చజనాః'* అన్నప్రారంభంవల్ల చెప్పబడ్డాయని స్పష్టం. ఈఇరవైయైదు తత్త్వాలూ స్థిరంగాఉన్న ఆత్మఅనే పురుషతత్త్వాన్ని తెలుసుకుంటే ముక్తి ఉంటుందనీ ఇక్కడ చెప్పబడుతోంది. వీటివల్ల సాంఖ్యమతంలో చెప్పబడిన ఇరవైయైదుతత్త్వాలే ఇక్కడ చెప్పబడుతున్నాయని స్పష్టమౌతోంది. అవి ఏవంటే 1. ఐదు భూతాలు, 2. ఐదు తన్మాత్రలు, 3. ఐదు జ్ఞానేంద్రియాలు, 4. ఐదు కర్మేంద్రియాలు, 5. మిగిలిన ప్రకృతి, మహత్తు, అహంకారం, మనస్సు, ఆత్మ. వీటిలో *"ఆకాశశ్చ"* అని ఆకాశాన్ని ప్రత్యేకంగ మళ్ళీచెప్పటం ఎక్కువ ఆదరంవల్లనేనని గ్రహించాలి. ఆత్మ మిగిలినవాటికి స్థానంగాను, తనంతతానే స్థిరమైనవాడుగా ఉండటంచేత, *"యస్మిన్"* అనిపురుషతత్త్వాన్ని ఇరవైయైదుతత్త్వాలకీ స్థానంగా చెప్పటానికి ఆటంకమేమీలేదు. కనుక అబ్రహ్మాత్మకమైన సాంఖ్యతత్త్వాలనిచెప్పేదే ఈమంత్రమని సిద్ధించింది.

**సి.373.** *మైవం, "యస్మిన్పఞ్చపఞ్చజనా" ఇత్యాదివాక్యతః ।*
*పఞ్చవింశతిసంఖ్యోపసంగ్రహాదపి తత్పదాత్॥*

**374.** *నాత్ర తన్త్రప్రతీతిస్స్యాదేషాం తేభ్యః పృథక్త్వతః।*
*'యస్మిన్ని'తి పదప్రోక్తబ్రహ్మాశ్రయతయా సదా॥*

**375.** *తేషాం బ్రహ్మాత్మకత్వం హి జ్ఞాయతే చాతిరేకతః।*
*యచ్ఛబ్దవాచ్యశ్చాకాశశ్చాధికః పఞ్చవింశతేః॥*

**376.** *సంఖ్యాసంగ్రహ ఏవాత్ర నాస్తీతి జ్ఞాప్యతేఽపినా।*
*అత్ర పఞ్చజనాభిఖ్యాః పఞ్చ సన్తీతి కథ్యతే॥*

373-376. **సిద్ధాన్తం.** ఈపూర్వపక్షం దోషభూయిష్ఠం. *"యస్మిన్ పఞ్చ పఞ్చజనాః"* అని ఇరవైయైదు తత్త్వాలనేచెప్పటంవల్ల, **రెండుకారణాలచేత** సాంఖ్యతత్త్వాలిక్కడ చెప్పబడ్డాయని అనటానికికుదరదు. ఎంచేతంటే, బ్రహ్మాత్మకంగాని ఇరవైయైదుతత్త్వాలనే సాంఖ్యులు అంగీకరించేరు. కాని ఇక్కడ *"యస్మిన్ పఞ్చపఞ్చజనాః; ఆకాశశ్చప్రతిష్ఠితః। తమేవమన్య ఆత్మానం బ్రహ్మ"* అన్నఈమంత్రంలో ఈతత్త్వాలు బ్రహ్మం అనబడేపరమాత్మని ఎప్పుడూ ఆశ్రయించిఉండేవిగా చెప్పబడుతున్నాయి. ఇక్కడ తత్త్వాలకి ఆశ్రయంగాచెప్పబడేది జీవుడే అనిగ్రహిస్తే బ్రహ్మశబ్దానికి ముఖ్యార్థం సిద్ధించకపోవడం, ఇరవైయైదుతత్త్వాల్లో ఉన్న జీవాత్మకి ఆశ్రయంగా ఆజీవాత్మనే చెప్పటం అనే ఈరెండు అస్వారస్యాలు వస్తున్నాయి. అంచేత, ఇక్కడ బ్రహ్మాత్మకమైనతత్త్వాలే చెప్పబడుతున్నాయన్నది స్పష్టం. ఈవిధంగా, అబ్రహ్మాత్మకమైన సాంఖ్యతత్త్వాలకంటే, భిన్నమైన బ్రహ్మాత్మకతత్త్వాలే చెప్పబడుతున్నాయనే కారణంవల్ల ఇక్కడ సాంఖ్య ప్రక్రియలేదన్నది స్పష్టం. ఇది మొదటి కారణం. ఇక రెండోకారణం - *'యస్మిన్ పఞ్చపఞ్చజనాః'* అన్న మంత్రంలో *"యస్మిన్"* అన్నపదంచేత ఒకతత్త్వంగాను, *"ఆకాశశ్చ"*అన్న పదంచేత ఒకతత్త్వంగానూ అయి, ఇలా ఇరవైయైదుకంటె ఎక్కువగ రెండుతత్త్వాలు చెప్పబడటమే. ఈవిధంగా రెండుకారణాలచేతనూ ఇక్కడ చెప్పబడినవి సాంఖ్యతత్త్వాలుగావని స్పష్టమౌతోంది. *'యస్మిన్'*అని జీవుడినే చెప్పినట్లు గ్రహించడం అస్వారస్యమని ముందరే చూపబడింది. ఆదరాతిశయంతో ఆకాశాన్నిమళ్ళీ ప్రత్యేకంగాఎత్తుకోవటంఅన్నది అస్వారస్యనిర్వాహమే అన్నది స్పష్టం. కనుక *"పఞ్చపఞ్చజనాః"* అని ఇరవైయైదుతత్త్వాలనే చెప్పిందని

గ్రహించినా, అబ్రహ్మాత్మకమైన సాంఖ్యతత్త్వాలకంటే ఇవివేఱైనవికావటంచేతనూ, ఇరవైయైదు తత్త్వాలకంటే ఎక్కువగాఉండటంచేతా, ఇక్కడచెప్పబడేవి సాంఖ్యతత్త్వాలుగావని నిరూపించబడింది. సూత్రంలో *"సఙ్ఖ్యోప సఙ్గ్రహాదపి"* (ఇరవైయైదుతత్త్వాలనే చెప్పినప్పటికీ) అన్నప్పుడు **అపి**శబ్దంచేత నిజంగా ఇక్కడ ఇరవైయైదు తత్త్వాలు చెప్పబడలేదనితెలుస్తోంది. ఎందువల్లంటే: *"పఞ్చ పఞ్చజనాః"* అని ఐదువస్తువుల సమూహాలైదు చెప్పబడ్డాయని అంగీకరించటంలో *'పఞ్చజనాః"* అన్న పదంలో లింగవ్యత్యయమైన అస్వారస్యం వస్తోంది. పైగా, ఐదైదువస్తువులున్న ఐదు సమూహాలిక్కడ చెప్పబడినట్లు చెప్పడంకుదరదు. కర్మేంద్రియాలైదూ, జ్ఞానేంద్రియాలైదూ, తన్మాత్రలైదు, భూతాలైదు, మిగిలిన ప్రకృతి, మహదహంకారాలు మనస్సు, ఆత్మగాను ఐదని ఐదుసమూహాలను చెప్పాలని అనుకున్నా, అది ఆకాశాన్నిప్రత్యేకంగా చెప్పడం చేతనే. పంచభూతాలనబడే ఒకసమూహం సిద్ధించదు. అంచేత *"సప్త సప్తర్షయః"* (సప్తర్షులు ఏడుగురు) అన్నట్లుగ **"పఞ్చ పఞ్చజనాః"** అని పంచజనాలు అని పేరున్న ఐదు పదార్థాలు ఇక్కడ గ్రహించటమే తగినదని తెలుస్తోంది.

### *// సి. సూ.// ప్రాణాదయో వాక్యశేషాత్ // 1-4-12 //*

***వాక్యశేషాత్=*** (వెనకటివాక్యాన్నివివరించే) వాక్యశేషంనుంచి ***ప్రాణాదయః=*** ప్రాణం మొదలైనవే (ఐదు పంచజనాలని తెలుస్తోంది.)

***377.*** *పఞ్చప్రాణాదయః పఞ్చజనా బ్రహ్మాశ్రయా ఇతి।*
*"ప్రాణస్య ప్రాణ"మిత్యాదివాక్యశేషాత్ప్రతీయతే॥*

377.*"పఞ్చ పఞ్చజనాః"* అని చెప్పబడ్డ ఐదు పంచజనాలు ఏవి? అంటే, ఈమంత్రాన్ని వివరించటానికేర్పాటైన తరువాతిమంత్రంలో *"ప్రాణస్యప్రాణముత చక్షుషశ్చక్షుః శ్రోత్రస్యశ్రోత్రం (అన్నస్యా న్నం) మనసో యే మనో విదుః"* (బృహ-6-4-18) (ప్రాణమనబడే స్పర్శేంద్రియానికి ప్రాణంగానూ, కంటికి కన్నుగానూ, చెవికి చెవిగానూ, అన్నానికి (ముక్కుకీ, నాలుకకీ) అన్నంగానూ, మనస్సుకి మనస్సుగాను దేనిని తెలుసుకుంటున్నారో) అని బ్రహ్మంవల్ల సత్తని (ఉనికిని) పొందినవాటిగ చెప్పబడ్డ ప్రాణం (త్వగింద్రియం), కన్ను, చెవి, అన్నం, మనస్సు అనేఐదే వెనకటిమంత్రంలో పంచజనాలని చెప్పబడిందని తెలుస్తోంది.

### *// సి. సూ.// జ్యోతిషైకేషామసత్యన్నే // 1-4-13 //*

***ఏకేషాం=*** కాణ్వపాఠంలో, ***అసతి అన్నే=*** అన్నంలేకపోయినప్పుడు, ***జ్యోతిషా=*** (వెనకటి మంత్రంలోఉన్న) జ్యోతిశ్శబ్దంచేత (పంచజనాలు ఇంద్రియాలు అని తెలియజేయబడుతోంది.)

***378.*** *అసత్యన్నేపి కాణ్వానాం పాఠే పఞ్చజనా ఇమే।*
*ఇన్ద్రియాణీతి బుధ్యేత జ్యోతిశ్శబ్దాత్పురోదితాత్॥*

***379.*** *ప్రకాశకానాం బ్రహ్మోక్త్వా ప్రకాశకమనన్తరం।*
*"పఞ్చపఞ్చే"త్యుక్తితస్స్యుస్తాందృశ్యేవేన్ద్రియాణి హి॥*

***380.*** *అతో "యస్మిన్పఞ్చ పఞ్చే"త్యాదినా పరమాత్మని।*
*అక్షభూతస్థితిప్రోక్తైర్నైవ కథ్యేత తాన్త్రికమ్॥*

*// ఇతి సంఖ్యోపసంగ్రహాధికరణమ్ //*

378-380. కాణ్వపాఠంలో *"ప్రాణస్య ప్రాణమ్"* అన్నమంత్రంలో అన్నం చెప్పబడకపోవటంచేత ఐదనబడేలెక్క సిద్ధించదేయన్నప్రశ్న వస్తోంది. *"యస్మిన్ పఞ్చ"*అన్నమంత్రానికి ముందరి మంత్రంలో *"తం దేవా జ్యోతిషాం జ్యోతిరాయుర్హోపాసతేఽమృతమ్"*(బృహ 6-4-16) (జ్యోతులకి జ్యోతై, నాశంలేనిదై, ప్రాణులు

ఊపిరివదలటానికి కారణమైన ఆపరమాత్మనే దేవతలుపాసిస్తున్నారు.) అని బ్రహ్మంచేత ప్రకాశం పొందే జ్యోతులు కొన్నిఉన్నాయని చెప్పబడుతోంది. జ్యోతులంటే ఇవి కొన్నిటిని ప్రకాశింపజేసేవనీ, వీటిని కూడ ప్రకాశింపజేసేది బ్రహ్మమేఅని ఈమంత్రంలో చెప్పి, తరువాతి మంత్రంలో *"పఞ్చ పఞ్చజనాః"* అని చెప్పటం వల్ల విషయాలనిప్రకాశింపజేసే ఇంద్రియాలే పంచజనశబ్దపదంవల్ల చెప్పబడుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యప్రాణాన్ని జ్యోతిఅనటం కుదరకపోవటంచేత స్పర్శేన్ద్రియం వాయుసంబంధంగలది కావటంచేతను, *"ప్రాణస్య ప్రాణమ్"*అన్నప్పుడు ప్రాణమనబడేది స్పర్శేన్ద్రియమేఅవుతుంది. *"చక్షుషః"* అని కన్ను, *"శ్రోత్రస్య"* అని చెవీ ఎత్తుకోబడ్డాయి. ***"అద్యతే అనేనేతి అన్నమ్"*** అన్నవ్యుత్పత్తిచేత అదనానికి (తినటానికి) ఉపయోగ పడేనాలుక, అన్నమనబడేపృథివిచేత పోషింపబడేనోరూ, ***అన్న***శబ్దంచేత తంత్రేణా (కలిసిచెప్పుకోవటంవల్ల) చెప్పబడుతున్నాయి. ***"మనసః"***అని మనస్సనబడే ఇంద్రియం చెప్పబడుతోంది. కనుక, ఈఐదూ జ్ఞానప్రకాశకాలైన అన్నిఇంద్రియాసీ, చూపుతున్నాయి. కాణ్వపాఠంలో నాలిగింటినిచెప్పటం ఐదోదానికికూడా ఉపలక్షణం. *"పఞ్చ పఞ్చజనాః"*అని ఇంద్రియాలని, ***"ఆకాశశ్చ"***అని ఆకాశంచేత ఉపలక్షింపబడిన భూతాలని చెప్పి, *"యస్మిన్ ప్రతిష్ఠితః"* అనటంచేత ఈఇంద్రియభూతాలు బ్రహ్మలో స్థిరపడినవిగా ఈమంత్రంచేత చెప్పబడటంచేత ఇచ్చటసాంఖ్యతత్త్వాలని చెప్పేదిగా గణించటానికి అవకాశమే లేదు.

*సంఖ్యోపసంగ్రహాధికరణము పూర్తైనది.*

## *॥ కారణత్వాధికరణమ్. ॥ 1-4-4 ॥*

### *॥ సి. సూ.॥ కారణత్వేన చాకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః ॥ (1-4-14)*

**ఆకాశాదిషు=** ఆకాశంమొదలైన కార్యాలకి, **కారణత్వేన చ=** కారణంగాకూడా, **యథావ్యపదిష్టోక్తేః=** సర్వజ్ఞత్వంవంటి గొప్పతనాలున్నదానిగా వెనకచెప్పబడిన బ్రహ్మన్నే చెప్పుండటంచేత (బ్రహ్మమే జగత్కారణమని వేదాన్తవాక్యాలు చెప్తున్నాయి.)

***381.*** *అబ్రహ్మాత్మప్రధానస్య కారణత్వమవైదికమ్।*
*ఇత్యుక్తం తత్ర వేదానామైకకణ్ఠ్యోక్తిరస్యతే॥*

381. వెనకటధికరణంలో అబ్రహ్మాత్మకప్రకృతికి జగత్కారణత్వాన్ని చెప్పటం అవైదికమని నిరూపింప బడింది. ఆప్రకృతినే జగత్కారణంగా వేదాలు ఏకకంఠంతో ఘోషిస్తున్నాయనే వాదం ఈఅధికరణంలో త్రోసిపుచ్చబడుతోంది.

***పూ.ప.382.*** *'సదేవే'త్య'సదే'వేతి క్వచిదవ్యాకృతం తథా।*
*ఉచ్యతే కారణం వస్తు వాక్యైః కారణబోధిభిః॥*

***383*** *బ్రహ్మణః కారణత్వేతు సత్త్వాసత్త్వాదిబాధతః।*
*సర్వవాక్యైకకంఠ్యం న భవేత్, తన్నోదితే పునః॥*

***384*** *సత్త్వాసత్త్వావ్యాకృతత్వాన్యాసతే కాలభేదతః।*
*అనాదిత్వాత్స్ర్పష్టికాలే పరిణామిత్వతస్తథా॥*

****385*** *నామరూపవియోగేనావ్యక్తత్వాత్ప్రళయే తతః।*

382-*385. **పూర్వపక్షం:** *"సదేవసోమ్యేదమగ్ర ఆసీత్"* (ఛాం. 6-2-1) (ఇది ప్రారంభంలో సత్‌గానే ఉండెను)అన్నవాక్యంలో జగత్కారణమైనది 'సత్' (నిత్యమైనస్వరూపాన్ని కలిగిఉంది.) అని చెప్పబడింది. ***"అసదేవ ఇదమగ్ర ఆసీత్"*** (ఛాం. 6-2-1) ***"అసద్వా ఇదమగ్ర ఆసీత్"*** (తై. ఆనం. 7) (ఇది మొదట అసత్తుగానే

ఉన్నది)అన్నవాక్యాల్లో జగత్కారణమైనది **'అసత్'**(మారుతున్నది)అని చెప్పబడింది. *"తద్ధేదం తర్హ్యవ్యాకృత మాసీత్"* (బృహ.3-4-7) (అట్టిఇది అప్పుడవ్యాకృతమై ఉన్నది.) అనే మరొకవాక్యంలో ఆకారణవస్తువు **'అవ్యాకృతం'**అనేది మూలప్రకృతికిప్రసిద్ధమైనపేరౌతోంది. నిత్యమైయుండటమనే 'సత్'గాఉండే స్వభావాన్ని, పరిణామశీలైన 'అసత్'అనబడే స్వభావాన్ని బ్రహ్మానికే చెందడంశక్యంగాకపోవటంచేతను, ఈవాక్యాల్లోచెప్ప బడే జగత్కారణం బ్రహ్మంగాదు. అంచేత, వేదవాక్యాలు ఏకకంఠంగా బ్రహ్మాన్నేకారణంగా చెప్తున్నాయని గ్రహించశక్యంగాదు. అందువల్ల నిత్యమైన స్వరూపం గలదవటంచేత, **'సత్'**అనీ, సృష్టికాలంలో పరిణమించే **'అసత్'**అనిచెప్పతగినదీ, ప్రళయకాలంలో నామరూపవ్యాకరణాలు లేనిదవటంచేత, అవ్యాకృతమని ప్రసిద్ధి పొందినదైన మూలప్రకృతే ఈవాక్యాల్లో జగత్కారణంగా చెప్పబడుతోందని గ్రహించడమే తగినది.

*సి.385** *కారణం తత్ప్రధానం స్యాదితి వాదోఽసమఞ్జసః॥*

*386.* *సర్వజ్ఞాత్వాద్యుక్తధర్మవిశిష్టస్యైవ సర్వదా।*
*ఆకాశాదిషు కార్యేషు కారణత్వేన కీర్తనాత్॥*

*387.* *బ్రహ్మైవ కారణమితి సర్వవాక్యైర్వినిశ్చయః।*
*"సత్యం జ్ఞాన"మితి శ్రుత్యా ప్రకృతస్య విపశ్చితః॥*

*388.* *సర్వేషూత్తరవాక్యేషు సమ్బన్ధః పరిదృశ్యతే।*
*ఏవమేవ హి సర్వత్ర, తస్మాత్ బ్రహ్మైవ కారణమ్॥*

385*-388.**సిద్ధాంతం.** ఈపూర్వపక్షంతప్పు. తైత్తిరీయంలో *"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"* (తై.ఆ) (వికారంలేనిదీ స్వయంప్రకాశమైనదీ. దేశకాలవస్తుపరిచ్ఛిన్నతలేనిదిగా ఉన్నది బ్రహ్మం.) అనిన్నీ, *"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా"* (తై.ఆ-1) (సర్వజ్ఞుడైన బ్రహ్మతోబాటు సమస్తకల్యాణగుణాలనీ ముక్తుడనుభవిస్తాడు.)అని సర్వజ్ఞమైనబ్రహ్మం చెప్పబడి, తరువాత ఉపాయంగ *"తస్మాద్వా ఏతస్మాత్ ఆత్మన ఆకాశః సమ్భూతః"* (తై.ఆ.-1) (అలాంటి ఈఆత్మనుండి ఆకాశం ఉద్భవించింది.) అనిప్రారంభించి ఆబ్రహ్మాన్నే జగత్కారణంగా చెప్పి అదే **'అసత్'**అనీ చెప్పబడింది. ఛాందోగ్యంలోనూ, *"తదైక్షత బహుస్యామ్"* (ఛాం.6-2-3) (నేనే అనేకములుగా అగుగాకఅని బ్రహ్మం సంకల్పించింది) అని సర్వజ్ఞుడూ సత్యసంకల్పుడూ అయిన పరమాత్మని చెప్పి, ఆతనినే *"తత్ తేజోఽసృజత"* (ఛాం.6-2-3) (ఆపరమాత్మ తేజస్సును సృష్టించెను.) అని జగత్కారణంగాచెప్పి, ఆపరమపురుషుడినే **'సత్' 'అసత్'** అనీ చెప్తోంది. కనుకఈవిధంగా *"జన్మాద్యస్య యతః"* (బ్ర.సూ. 1-1-2)వంటిసూత్రాల్లో సర్వజ్ఞుడుగాను, సత్యసంకల్పుడుగాను, ఇంకా అనేక కల్యాణగుణవిశిష్టుడిగాను ఉపపాదింపబడ్డబ్రహ్మమే ఎప్పుడూ ఆకాశంమొదలైన సమస్తపదార్థాలకీ కారణంగ వేదవాక్యాల్లో ఘోషింపబడియుండటంచేత అన్నివాక్యాలచేతా, బ్రహ్మమేజగత్కారణంగా చెప్పబడుతోందని నిశ్చయించటానికి ఎలాంటి ఆటంకమూలేదు.

## *॥ సి. సూ. ॥ సమాకర్షాత్ ॥ (1-4-15)*

**సమాకర్షాత్=** సర్వజ్ఞుడుగా చెప్పబడిన బ్రహ్మ **'సత్','అసత్'** వంటి పదాలచేత చెప్పబడటంచేత (బ్రహ్మమే అన్ని వాక్యాల్లోనూ జగత్కారణంగా చెప్పబడుతోంది.)

*389.* *ప్రాక్ "సోఽకామయతే"త్యుక్తబ్రహ్మణస్సృజతో జగత్।*
*"అసద్వా" ఇదమిత్యత్ర, "తద్ధే"త్యుక్తస్య చోపరి॥*

*390.* *"స ఏష" ఇతివాక్యే చ సమాకర్షాదసత్పదమ్।*

*అవ్యాకృతపదం చాహ బ్రహ్మావ్యక్తశరీరకమ్॥*

391. *తథా బ్రహ్మాత్మశబ్దౌ చ న ప్రధానావబోధకౌ।*

*కారణత్వప్రసఙ్గో౽తః ప్రధానస్య న విద్యతే॥*

*॥ఇతి కారణత్వాధికరణమ్॥*

389-391. *"సో౽కామయత బహుస్యామ్ ప్రజాయేయ"* (తై.ఆ.6-2) (ఆబ్రహ్మం *"నేను అనేకముగ అగుగాక. దానికొఱకుజన్మిస్తాను"* అని సంకల్పించేడు.) అని తైత్తిరీయంలో సర్వజ్ఞుడుగా వెనక చెప్పబడ్డ జగత్కారణపురుషుడే తరువాత *"అసద్వాఇదమగ్రఆసీత్"*(తై.ఆ.7-1) (ఈలోకం మొదట అసత్తుగానే ఉండింది) అని *'అసత్'*అనే శబ్దంచేత చెప్పబడ్డాడు. బృహదారణ్యకంలో *"తద్ధేదం తర్హ్యవ్యాకృత మాసీత్"* (బృహ.3-4-7) (అలాంటిఈలోకం అప్పుడవ్యాకృతమైఉన్నది.)అని మొదట చెప్పబడ్డ అవ్యాకృతం, తరవాత *"స ఏష ఇహ ప్రవిష్ట ఆనఖాగ్రేభ్యః"* (బృహ3-4-7) (అలాంటి ఈపరమపురుషుడే నఖాగ్రంనుంచి కార్యపదార్థమంతటా వ్యాపించిఉన్నాడు)అని లోపలప్రవేశించి నియమించే సర్వజ్ఞుడిగా చెప్పబడింది. కనుక *'అసత్'* అనీ, *'అవ్యాకృతమ'*నీ నామరూపవిభాగంలేని మూలప్రకృతిని శరీరంగా గ్రహించే, బ్రహ్మన్నే చెప్తోంది. *"బ్రహ్మావా ఇదమగ్ర ఆసీత్"* (బృహ 3-4-11) *"ఆత్మైవేదమగ్ర ఆసీత్"* (బృహ 3-7-17) అనీ జగత్కారణాన్ని బ్రహ్మమనీ, ఆత్మఅనీ, వేదవాక్యాలు చెప్పేయి. ఈపదాలు మూలప్రకృతిని చెప్పలేదు. కనుక మూలప్రకృతి జగత్కారణ మవటానికి అవకాశమే లేదు. పరమాత్మ, పరబ్రహ్మం, అయిన నారాయణుడే జగత్కారణమని అన్ని వేదవాక్యాలూ ఏకకంఠంగా చెప్పుతున్నాయన్నది స్పష్టం.

*కారణత్వాధికరణము పూర్తైంది.*

## ॥ జగద్వాచిత్వాధికరణమ్ ॥ 1-4-5 ॥

## ॥ సి. సూ.॥జగద్వాచిత్వాత్ ॥ 1-4-16 ॥

***జగద్వాచిత్వాత్=*** (కర్మశబ్దం) లోకాన్ని చెప్పటంచేత (ఇక్కడచెప్పబడేది బ్రహ్మమేతప్ప జీవుడుగాడు)

392. *సర్వత్ర చేతనస్యైవ జగత్కారణతోచ్యతే।*

*ఇత్యుక్తం ప్రాక్, చేతనస్స కర్మిజీవో న చేతరః॥*

393. *తేనాధిష్ఠితమేవైతత్ప్రధానం హేతురిష్యతే।*

*ఇత్యసౌ సాంఖ్యవాదో౽త్రాధికృతౌ వినివార్యతే॥*

392-393. వెనకటిఅధికరణంలో ***'జ్ఞానమున్న చేతనుడొక్కడే జగత్కారణంగా అన్నివేద వాక్యాల్లోను ఉద్ఘోషింపబడుతున్నాడు'*** అని నిరూపించబడింది. ఈఅధికరణంలో ***'ఆచేతనుడు కర్మవశ్యుడైన జీవుడేగాని పరమాత్మకానేరడు; అలాంటి జీవుడివల్ల అధిష్ఠింపబడ్డ ప్రధానమే జగత్కారణమవాలి'*** అనే సాంఖ్యవాదం త్రోసిపుచ్చబడుతోంది.

పూ.394. *కౌషీతకీశ్రుతౌ "యో వై బాలాకే" ఇతి పఠ్యతే।*

*వేదితవ్యతయాత్రోక్తః వియుక్తః ప్రకృతేః పుమాన్॥*

395. *"యస్య వైత"దితి శ్రుత్యా కర్మసమ్బన్ధితోక్తితః।*

*బ్రహ్మణస్తు న తద్యోగః పుణ్యపాపాత్మకర్మణి॥*

*396. *రూఢత్వాత్కర్మశబ్దస్య తదేవాత్రోక్తమిత్యతః।*

394-*396. **పూర్వపక్షం.** కౌషీతకీ ఉపనిషత్తులో, *"యో వై బాలాకే ఏతేషాం పురుషాణాం కర్తా, యస్య*

*వైతత్ కర్మ స వై వేదితవ్యః*" (కౌ. 4-18) (బాలాకీ! ఎవడు ఈపురుషులకి కర్తో, *ఎవడికి ఈపుణ్యపాపరూప కర్మఉందో, వాడే తెలుసుకోదగినవాడు) (*ఇది పూర్వపక్షానికి అనుకూలమైన అర్థం. సరైన అర్థాన్ని సిద్ధాంతంలో చూడవలెను.) అన్నవాక్యం కనబడుతోంది. ఇక్కడ "*యస్య వైతత్ కర్మ*"అని కర్మసంబంధం ఇతనికి చెప్పబడుతూండడంచేత, ఇతడు జీవుడే అవాలి. ప్రకృతిసంబంధంలేని వీడిక్కడ తెలియదగినవాడుగ ఉపదేశింపబడుతున్నాడు. పుణ్యపాపరూపమైనకర్మం బ్రహ్మానికి ఉండదు. '***క్రియతే ఇతి కర్మ***' (చేయబడుతోంది గనుక లోకం కర్మఅనబడుతోంది.)అన్న వ్యుత్పత్తిచేత కర్మశబ్దం లోకాన్నిచెప్తోందని గ్రహించి, '**ఎవడికి ఈలోకం కార్యమో**'అని ఈవాక్యం చెప్తోందని అర్థం చెప్పుకోవాలంటే; పుణ్యపాపాల్లోనే రూఢిగల కర్మశబ్దాన్ని లోకంసూచిస్తోందని చెప్పడం అస్వారస్యమే. పైగా, అలా గ్రహిస్తే, "*ఏతేషాం పురుషాణాం కర్తా*" అని మొదట చెప్పిన దాంతో పునరుక్తి వస్తుంది. కనుక, తనకర్మమూలంగా ఈలోకానికి కారణమైఉన్న కర్మజీవుడే ఇక్కడ చెప్పబడుతున్నాడనే గ్రహించాలి. కనుక, వాడిచేతఅధిష్ఠింపబడ్డ ప్రధానమే జగత్కారణం అనే సాంఖ్యమతమే వేదసమ్మతమైనది.

*సి.396*.* *కర్మిజీవాధిష్ఠతైతత్ప్రధానం హేతురిత్యసత్॥*

*397.* *యస్య వైతత్కర్మ స ఇత్యుక్తకర్మపదస్య చ।*
*బ్రహ్మకార్యజగద్వాచిత్వాన్న న్నసాంఖ్యోక్తపుంగ్రహః॥*

*398.* *బాలాకినా బ్రహ్మతయా ప్రోక్తాదిత్యాదికర్మిణామ్।*
*తత్త్వం నిరాకృత్య, పరజ్ఞాపనాయైవ భాషితే॥*

*399.* *వాక్యేఽస్మిన్ కర్మశబ్దేన పుణ్యపాపాది నోచ్యతే।*
*అజ్ఞాతజ్ఞాపనాసిద్ధేః కార్యం క్రియత ఇత్యతః॥*

*400.* *ప్రాక్ప్రస్తుతాదిత్యముఖజగద్వాచ్యేతదిత్యపి।*
*అతశ్చైతజ్జగత్కృత్స్నం యస్య కార్యం పరాత్మనః॥*

**401.* *నారాయణస్స ఏవాత్ర వేదితవ్యతయోచ్యతే।*

396*-*401. **సిద్ధాంతం.** ఈపూర్వపక్షం సరిగాదు. ఈప్రకరణప్రారంభంలోనే "*బ్రహ్మ తే బ్రువాణి*" (నీకు **బ్రహ్మన్ని**ఉపదేశిస్తాను.) అని బ్రహ్మనుగురించినఉపదేశమే ప్రారంభించబడింది. కర్మసంబంధం ఉన్న ఆదిత్యుడుమొదలైనవాళ్ళని బాలాకిఅనేఅతను జగత్కారణంగా ఉపదేశిస్తే, వాళ్ళు జగత్కారణం కాలేరని చెప్పి, అజాతశత్రువనేవాడు "*యోవై బాలాకే ఏతేషాం పురుషాణాం కర్తా, యస్య వైతత్ కర్మ సఏవ వేదితవ్యః*" (కౌషీ. 4-18) (ఓ బాలాకీ! ఎవడు ఆదిత్యుడుమొదలైన (కర్మసంబంధమున్న) ఈపురుషులని సృష్టిస్తాడో, ఎవడికి ఈలోకమంతాకార్యమో, ఆతడే తెలుసుకొనదగినవాడు.)అని జగత్కారణంగ ఉండేవాడు కర్మసంబంధమున్న ఆదిత్యుడుమొదలైనవాళ్ళకంటె, పైవాడైనపరమ పురుషుడేనని ఈవాక్యంలో ఉపదేశిస్తున్నాడు. కనుక, ఇతను కర్మసంబంధమున్నవాడు కాలేడు. అంచేత, ఈవాక్యంలో కర్మశబ్దం పుణ్యపాపకర్మాన్ని చెప్పలేదు. అంచేత, ఈపదం, "**క్రియతే ఇతి కర్మ**" (చేయబడుతోంది గనుక కర్మ అనబడుతోంది లోకం) అన్నవ్యుత్పత్తిచేత కార్యమైనలోకాన్నిగురించినదని గ్రహించితీరాలి. అలాగ్రహించకపోతే, కర్మిజీవులే జగత్కారణమని మోహంలోఉన్నబాలాకికి తెలియని విషయాన్నజాతశత్రు ఉపదేశించేడని కుదరకపోతుంది. పైగా, "*యస్యవా ఏతత్ కర్మ*" (ఎవనికి ఇదికార్యమో) అనేవాక్యంలో కర్మశబ్దం '***ఏతత్***' అనేపదంచేత విశేషించి చెప్పబడుతోంది. ఏతచ్ఛబ్దంకూడా వెనక ప్రస్తావింపబడిందీ, ప్రత్యక్షంగా కనబడేదీ అయిన లోకాన్ని

స్వరసంగా చూపిస్తుంది. ఇట్లా తీసుకుంటే, *"ఏతేషాం పురుషాణాం కర్తా"* అన్నదానితో పునరుక్తిఉండదు. ఎలాఅంటే, "ఎవడు నువ్వు చెప్పిన ఈపురుషులని సృష్టిస్తాడో (వీరిని గాక) ఈలోకమంతా ఎవడికి కార్యమో" అని అర్థాన్ని తీసుకుంటే, పునరుక్తి ఉండదు. జీవుడికర్మం జగత్సృష్టికి కారణమవటాన్ని తీసికొని వాడిని లోకానికి కర్తఅని నిర్దేశించటం స్వరసంగాదు. కనుక, ఏపరమాత్మకి ఈలోకమంతా కార్యవస్తువైందో, అటువంటి పరమాత్మైన నారాయణుడే ఇక్కడ తెలుసుకోదగినవాడని చెప్పబడుతున్నాడని స్పష్టమౌతోంది.

*// సి. సూ. // జీవముఖ్యప్రాణలిఙ్గాన్నేతి చేత్తద్వ్యాఖ్యాతమ్ // 1-4-17 //*

***జీవముఖ్యప్రాణలిఙ్గాత్=*** జీవుడివిగాను, ముఖ్యప్రాణానివిగాను చిహ్నాలు ఇక్కడ కనబడటంచేత, ***న=*** ఇతడు పరమాత్మ కాడు. ***ఇతి చేత్=*** అంటే, ***తత్=*** ఆవాదానికి, ***వ్యాఖ్యాతమ్=*** ఇదివరకే సమాధానం చెప్పబడింది.

*పూ.401*.* *ఏవమేవేత్యత్ర వాక్యే భోక్తుర్జీవస్య లిఙ్గతః//*

**402.* *"అథాస్మిన్ప్రాణ" ఇత్యాదౌ ముఖ్యప్రాణస్య చాన్వయాత్/*

401*-*402. **పూర్వపక్షం.** ఈప్రకరణాన్ని పూర్తిగాపరిశీలిస్తే జీవుడిచిహ్నాలూ, ముఖ్యప్రాణం చిహ్నాలూ కనబడటంవల్ల, ఇక్కడతెలుసుకోదగినవాడుగా చెప్పబడేవాడు జీవుడేఅవుతాడు. ఎలా అంటే, బాలాకికి ఉపదేశంచేయప్రారంభించిన అజాతశత్రువనేవాడు వాడిని నిద్రిస్తున్న ఒకమనుష్యుడివద్దకి పిల్చుకొనిపోయి, వాడిని కొన్నిపేర్లతో పిలిచేడు. ఆనిద్రిస్తున్నవాడు లేవలేదు. తరువాతవాడిని కర్రతో కొట్టి లేపేడు. లేపి, *'క్వఏష ఏతద్బాలాకే పురుషోऽశయిష్ట? క్వవా ఏతదభూత్? కుత ఏతదాగాత్?"* (కౌషీ. 4-35) (ఓ బాలాకీ! ఈపురుషుడు లేవటానికి ముందు ఎక్కడ నిద్రించేడు? వీడి కరణసమూహం ఎక్కడ ఉండేది (లేవకమునుపు)? ఎక్కడనుంచి బైటకు వచ్చింది?) అని అడిగేడు. బాలాకికి బదులుచెప్పటం తెలియలేదు. తానే సమాధానాన్ని చెప్పటానికి ప్రారంభించిన అజాతశత్రు *"హితానామ హృదయస్యనాడ్యః... యథా సుప్తః స్వప్నం నకథఞ్చన పశ్యతి"* (కౌషీ. 4-38) అన్న మంత్రంచేత హృదయనాడుల్లో వీడు నిద్రిస్తూన్నాడు అనిచెప్పేడు. *"అథాస్మిన్ ప్రాణ ఏవ ఏకథా భవతి"* (కౌషీ. 4-39)(నిద్రించినప్పుడు కరణసమూహం ఈజీవుడి ప్రాణంలోనే ఒకటిగా ఉండేది.) అని ప్రారంభమయే మంత్రంలో నిద్రిస్తున్నపుడు కరణాలు ఒకటిగా ప్రాణంగాఉంటాయని చెప్పేడు. *"స యథా అగ్నేర్విస్ఫులిఙ్గా ఏవమేవ ఏతస్మాదాత్మనః ప్రాణాః యదాయతనం విప్రతిష్ఠన్తే"* (కౌషీ. 4-40) (వాడు లేచేటప్పుడు నిప్పులోంచి రవ్వలలాగ, ఈఆత్మనించి ప్రాణాలు ముందున్నస్థానానికి వెళ్ళేయి.) అని ప్రారంభమయే మంత్రంలో ***'ఎక్కడనుంచి కరణాలు బైటకు వచ్చేయి'*** అన్న ప్రశ్నకు బదులు చెప్పేడు. చివరగా *"తద్యథా శ్రేష్ఠిస్స్వైర్భుఙ్క్తే యథా స్వరః శ్రేష్ఠినం భుఞ్జన్తి/ ఏవమేవైష ప్రజ్ఞాత్మా ఏతైరాత్మభి ర్భుఙ్క్తే ఏవమేవైత ఆత్మాన ఏనం భుఞ్జన్తి//"* (కౌషీ. 4-44) (ఎలా శ్రీమంతుడైనవాడొకడు తనపరివారంతోగూడా అనుభవిస్తున్నాడో, ఎలా ఆతనికి చెందినవారు ఆతనిని రక్షిస్తున్నారో, అలాగే జ్ఞానమున్న ఈ ఆత్మ వాడిని చేరిన మిగతాఆత్మలతో అనుభవిస్తున్నాడు. ఇతరాత్మలు గూడ, ఆతనిని రక్షిస్తున్నాయి.) అన్నమంత్రంలో ఇతను అనుభవించేవాడుగా చూపబడ్డాడు. ఈవిధంగా, జీవుడికేతగిన చిహ్నాలూ. ఆతనికి ఉపకరణమైన ముఖ్యప్రాణంతాలూకు చిహ్నాలుకూడా ఇక్కడ కనబడటంచేత, ఇక్కడ తెలుసుకోదగినవాడుగ చెప్పబడినవాడు జీవుడుగానే శక్యంగాని పరమాత్మ కానేరడు.

*సి. 402** *నాయం పరాత్మేతి చేత్ప్రాక్ పరిహారోऽస్య దర్శితః//*

*403.* *ఉపక్రమాదినా బ్రహ్మపరత్వే నిశ్చితే సతి/*

సర్వం తదనురోధేన నేయం లిఙ్గమితీరితమ్॥

404. ప్రాతర్దనే జీవముఖ్యప్రాణలిఙ్గప్రకీర్తనం।
తత్తచ్ఛరీరకబ్రహ్మోపాసార్థమితి భాషితమ్॥

405. ఇహ చా'స్మిన్ ప్రాణ'ఇతి సామానాధికరణ్యతః।
ప్రాణాన్తర్యామ్యుపాస్త్యర్థం యుక్తం ప్రాణప్రకీర్తనమ్॥

*402-405. **సిద్ధాంతం.** ఈపూర్వపక్షం తప్పు. *"జీవముఖ్యప్రాణలిఙ్గాన్నేతి చేత్"* (1-1-32) అని మొదలయే ప్రథమపాదంలోని చివరిసూత్రంలో ఇక్కడపూర్వపక్షంలోవచ్చిన ఇదేఆక్షేపం వచ్చినపుడు, "ఉపక్రమం, ఉపసంహారం మొదలైనవాటితో ఒకప్రకరణాన్ని బ్రహ్మపరంగా నిశ్చయించేటపుడు అక్కడ "జీవుడు ముఖ్యప్రాణం మొదలైన వేఱువేఱుతత్త్వాల చిహ్నాలు కనబడితే, వాటిని ఆప్రకరణం బ్రహ్మాన్ని చెప్పేదని నిశ్చయించటానికి విరుద్ధంకాకుండా అర్థం చెప్పుకోవాలి" అని తగిన సమాధానం చెప్పబడింది. ఈప్రకరణంలో గూడ ఉపక్రమంలో *"బ్రహ్మ తే బ్రువాణి"* (కౌషీ. 4-4) (బ్రహ్మాన్ని నీకు ఉపదేశిస్తాను)అని బ్రహ్మాన్నిగురించే ఆరంభింపబడింది. మధ్యనుగూడ *"యస్య వైతత్ కర్మ"* (కౌషీ. 4-26) అని లోకమంతటినీ సృష్టించే బ్రహ్మమే చెప్పబడిందని వెనకటి సూత్రంలో నిరూపించబడింది. ఉపసంహారంలోనూ, *"సర్వాన్ పాప్మనోऽపహత్య సర్వేషాంభూతానాంశ్రైష్ఠ్యం స్వారాజ్య మాధిపత్యం పర్యేతి య ఏవం వేద"* (కౌషీ. 4-45) (దీన్నెఱింగినవాడు అన్నిపాపాలనీ తొలగించుకొని, అన్ని జీవరాసులకీ శ్రేష్ఠమైనవాడుగాను, వాటికి నాయకుడిగాను, కర్మవశంగానివాడుగాను, అయియున్నాడు) అని కర్మవశంగానిదైన మోక్షాన్ని పొందటం ఫలంగాచెప్పింది. కనుక బ్రహ్మమే ఇక్కడతెలుసుకొనతగినదిగా చెప్పబడుతోందని తెలుస్తోంది. ఈవిధంగా ఈప్రకరణం బ్రహ్మపరమని నిశ్చయమైనప్పుడు పూర్వపక్షంలో లేవనెత్తిన జీవముఖ్యప్రాణలింగాలని దీనికి విరోధం లేకుండ అర్థాన్ని చెప్పుకోవాలి. వెనకనెత్తుకొనబడిన మొదటిపాదంలోని చివరిసూత్రంలో చేతనశరీరకబ్రహ్మోపాసనం, అచేతనశరీరకబ్రహ్మోపాసనం, కేవలబ్రహ్మోపాసనం అన్న మూడువిధాల ఉపాసనం అంగీకరింపబడటంచేత, జీవముఖ్యప్రాణలింగాలు, అవి శరీరంగాఉన్న బ్రహ్మ ఉపాసనంకోసమే ఉన్నాయని గ్రహించాలని సమాధానం చెప్పబడింది. అలానే ఇక్కడగూడ *"అథాస్మిత్ ప్రాణ ఏవ ఏకధా భవతి"*(కౌషీ. 4-39) అనేమంత్రంలో *"అస్మిన్ ప్రాణే"* అనేదానికి సమానాధికరణంగ అర్థాన్ని తీసుకోవటమే తగును తప్ప "ఈజీవుడివద్ద నున్న ప్రాణంలోనే" అని వ్యధికరణంగా పూర్వపక్షంలో అర్థాన్ని తీసుకోవడం తగియుండదుకనుక *"ప్రాణమును శరీరముగ గ్రహించిన ఈపరమాత్మవద్ద"* అని సమానాధికరణంగా అర్థాన్ని గ్రహించాలి. కనుక *'ప్రాణాన్ని శరీరంగా గ్రహించిన బ్రహ్మాన్నే ఉపాసించాలి'* అని చూపటానికే ప్రాణము ఎత్తుకోబడిందని స్పష్టం.

*॥ సి. సూ.॥ అన్యార్థం తు జైమినిః ప్రశ్నవ్యాఖ్యానాభ్యామపి చైవమేకే ॥ (1-4-18) ॥*

***ప్రశ్నవ్యాఖ్యానాభ్యాం=*** ప్రశ్నసమాధానాలనించి, ***అన్యార్థం తు=*** (జీవలింగమో అంటే) మరొకదాని కోసం (చెప్పబడిందని తెలుస్తోందని) ***జైమినిః=*** జైమిని మహర్షి (భావిస్తున్నారు.) ***అపి చ=*** పైగా, **ఏకే=** మరొకశాఖకు చెందినవారు, **ఏవమ్=** ఇట్లానే చెప్తున్నారు.

406 దేహాతిరిక్తజీవస్య సద్భావప్రతిపాదనమ్।
తదన్యబ్రహ్మసద్భావజ్ఞాపనాయేతి జైమినిః॥

407. "క్వైష ఏత"దితి ప్రశ్నా ద"థాస్మిన్ప్రాణ" ఇత్యతః।
"సతా సోమ్యే"త్యాదివాక్యసమార్థోత్తరవాక్యతః॥

408. *ఏకే చ శాఖిన"స్తస్మిన్ శేత" ఇత్యవసానగమ్।*

*పరాత్మవిషయం వాక్యం సంవాదేఽస్మిన్ప్రత్ని హి॥*

*॥ఇతి జగద్వాచిత్వాధికరణమ్॥*

406-408. ప్రాణాన్నీ, పరమాత్మనీగూడ ఒకేవిధంగ తీసుకున్నట్లు, జీవుడిని, బ్రహ్మాన్నీ ఈప్రకరణంలో ఒకేరకంగా తలంచకపోవటంవల్ల ఇక్కడ జీవశరీరకబ్రహ్మోపాసనం చెప్పబడుతోందని అనడానికి వీలు కాకపోవటంచేత జీవలింగాలనెలా నిర్వహించటం? అంటే, జైమినిమహర్షి ఇలా నిర్వహించేరు: *"ఈప్రకరణంలో* ***నిద్రిస్తున్నవాడినికఱ్రతో కొట్టిలేపటంవంటివాటితో, దేహంకంటెవేరైన జీవుడున్నాడని చూపటం ఆజీవుడికంటె భిన్నమైన బ్రహ్మమున్నా ఉన్నదని చూపటానికే: ప్రశ్నసమాధానాలనించి, ఇదితెలుస్తోంది***"అని. ఇది యెలాగంటే నిద్రిస్తున్నవాడిని కఱ్రతోలేపటంద్వారా దేహం, ప్రాణంవంటివాటి కంటే జీవుడు భిన్నమైనవాడని చూపి, "*క్వైష ఏతద్బాలాకే*"(4-35)అనిమొదలయ్యే మంత్రంతో అజాతశత్రు బాలాకిని మూడుప్రశ్నలడిగేడు. కఱ్రతోకొట్టి లేపటంవంటివాటితో దేహాదులకంటే భిన్నమైనవాడు జీవుడని చూపటంచేత ఈజీవుడికంటే భిన్నమైనదానిని చూపటానికే ప్రశ్నలడగబడ్డాయని తెలుస్తోంది. ఈప్రశ్నలకి సమాధానాలు బాలాకికి తెలియదనటంచేత *"హితా నామ"* (4-38), *"యథా సుప్తః"* (4-39), *"స యథా"*(4-40) అనిమొదలయ్యే మూడు మంత్రాలచేత, మూడుప్రశ్నలకీ క్రమంగా అజాతశత్రు సమాధానాలు ఇచ్చేడు. *"క్వైష ఏతద్బాలాకే"* అని మొదటి ప్రశ్న, *"హితానామ హృదయస్య నాడ్యః"* అని ప్రారంభమయే సమాధానమూ జీవుడి స్వప్నస్థితిని గురించినవేతప్ప, పూర్వపక్షంలో చెప్పినట్లు సుషుప్తి(నిదురించు)స్థితిని గురించినవిగావు. ఎంచేతంటే, *"సతాసోమ్య తదా సమ్పన్నో భవతి"* (ఛాం. 6-8-1) (సోమ్యా! నిద్రించేటపుడు 'సత్'అనబడే బ్రహ్మంతోబాటు ఇతడొకడై ఉన్నాడు.) *"ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తో నబాహ్యం కించనవేదనాంతరం"* (బృహ.6-3-21) (సర్వజ్ఞుడైన పరమాత్మచేత, ఆలింగనంచేయబడిన ఈజీవుడు (నిద్రించేటపుడు) లోపలా, బయటా ఉన్న ఏఒక్కదాన్నీ తెలుసుకోవటంలేదు.) అనేఉపనిషద్వాక్యాల్లో జీవుడిసుషుప్తిస్థానంగా బ్రహ్మాన్ని చెప్పిందే తప్ప నాడులను చెప్పలేదు. రెండో సమాధానంలో, *"యదా సుప్తః స్వప్నం న కథంచన పశ్యతి"* (ఎప్పుడు నిద్రిస్తున్నవాడు ఎలాంటిస్వప్నాన్నీ, చూడలేడో) అని కలనిచూడలేనిస్థితిని చెప్పటంచేత, మొదటిప్రశ్న, సమాధానం స్వప్నాన్ని దర్శించే స్వప్నస్థితిని గురించినవేఅని తెలుస్తోంది. రెండో ప్రశ్న, సమాధానం సుషుప్తి స్థానమైన బ్రహ్మం గురించినవే అని తెలుస్తోంది. నిద్రించేటపుడు, ఎక్కడ ఒంటరివాడై ఉన్నాడో, అక్కడనుంచే బయటకురాగలుగుటంచేత తెలివితెచ్చుకొనేటప్పుడు ఎక్కడనుంచివస్తున్నాడనే మూడోప్రశ్న, దానిసమాధానం కూడా, బ్రహ్మాన్ని గురించినవే అనికూడా ఈకారణంచేత స్పష్టమౌతున్నాయి. ఇక్కడ జవాబులో *"ప్రాణః"* (4-40) అన్నపదం, పూర్వపక్షంలో చెప్పినట్లే ప్రాణాన్నిమాత్రం చెప్పలేదు. ప్రాణంతోకూడినజీవులనే లక్షించింది. *"యదా సుప్తః స్వప్నం న కథంచన పశ్యతి"*(4-39) అన్న తరువాతి మంత్రప్రకారంకూడా వెనకటి మంత్రంతో పూర్వపక్షంలో చేర్చటం అస్వరసము. ఇలాఅర్థాన్ని తీసుకున్నా, *"అథాస్మిన్ ప్రాణ ఏవ ఏకథా భవతి"* అన్నమంత్రభాగానికి పూర్వపక్షప్రకారం ***'నిద్రించినతర్వాత, అంటే, నిద్రనుంచి మేలుకున్నప్పుడు కరణసమూహం ప్రాణంలో కలుస్తోంది.'*** అన్నఅర్థం వస్తుంది. ఇది పూర్వపక్షికీ కుదరదు. కనుక, "జీవుడు స్వప్నంచూసేటప్పుడు ఎక్కడఉన్నాడు" అన్నది రెండోప్రశ్న; ప్రాణశరీరకమైన బ్రహ్మంలోఉన్నాడన్నది దీనికి సమాధానం. *"**జీవుడు మేలుకుంటున్నప్పుడు, ఎక్కడినుంచి ప్రవేశిస్తు న్నాడు?**"* అన్నది మూడోప్రశ్న. బ్రహ్మంనుండి ప్రవేశిస్తున్నాడు అన్నది దీనికి సమాధానం. ఈప్రశ్న సమాధానాలనుంచి, జీవుడికంటె వేరైన బ్రహ్మాన్ని తెలియచేయటానికే ఇక్కడ జీవలింగాలు చెప్పబడ్డాయని స్పష్టం అని జైమినిభావం. భోక్తృత్వం

(అనుభవించేవాడుగ ఉండటం)అనేది జీవుడికేతగిన చిహ్నమని పూర్వపక్షంలో చెప్పింది తప్పు. కర్మచేత ఏర్పడని భోక్తృత్వం పరమాత్మకీ ఉంటుందిగదా! *"ఏతే ఆత్మానమేనం భుఞ్జన్తి"* (4-44)అని పరస్మైపదపాఠంలో జీవులు పరమాత్మని రక్షించినట్లు చెప్పటంకూడా, కించిత్కారం చేసి ఆయనయొక్క శేషిత్వరక్షణం చేయడాన్ని చెప్పటమే గనుక దోషంలేదు. పైగా, ఈ అజాతశత్రు బాలాకి సంవాదాన్ని చెప్పే మరొక (వాజసనేయ) శాఖలో ఇలాగే ప్రశ్నించి, సమాధానం చెప్పినపుడు, *"య ఏషోఽన్త ర్హృదయ ఆకాశస్తస్మిన్ శేతే"* (బృహ.4-1-17)((నిద్రించేవాడు) హృదయంలోఉండే ఆకాశమనబడే పరమాత్మవద్ద పడుక్కొని ఉండెను) అని చెప్పటంచేత నిద్రించేస్థితిలోఉండే జీవుడికి ఆధారంగాఉండేవాడు బ్రహ్మమేనని తెలుస్తోంది. *"దహరోఽస్మి న్నంతర ఆకాశః"* (ఛాం. 8-1-1) వంటిచోట్ల, ఆకాశశబ్దం పరమాత్మని లక్షించటం ప్రసిద్ధమే. కనుక, ఇక్కడ జీవుడిగురించి ప్రస్తావించటం, ఆజీవుడికంటె భిన్నమైన పరమాత్మని తెలియజేయ టానికే అని ప్రకటితమౌతోంది. ఈవిధంగా, ఈప్రకరణంపూర్తిగ పరమాత్మపరమేనని సిద్ధించినపుడు పరమాత్మే ఇక్కడ తెలుసుకోదగినవాడనీ, జగత్కారణంగానూ చెప్పబడుతున్నాడనీ, పురుషుడనే జీవుడు తెలుసుకోదగిన వాడుగానో, వాడిచేతఅధిష్ఠింపబడినప్రధానం జగత్కారణంగానో చెప్పబడలేదని స్పష్టమౌతోంది.

*జగద్వాచిత్వాధికరణము పూర్తియైనది.*

## ॥వాక్యాన్వయాధికరణమ్.॥ 1-4-6 ॥

### ॥ సి. సూ.॥ వాక్యాన్వయాత్ ॥ 1-4-19 ॥

**వాక్యాన్వయాత్=** వాక్యాలు పూర్తిగా పరమాత్మకే తగినవవటంచేత, (ఇక్కడ చూడతగినవాడుగా చెప్పబడేవాడు పరమాత్మే.)

409. *పూర్వత్ర కర్మశబ్దస్య జగదర్థకతాశ్రయాత్।*
*వాక్యస్య భోక్తృపరతా నిరస్తాధికృతౌ త్విహ॥*

410. *కర్మజన్యఫలాత్తైవ సాక్షాత్సంప్రతిపాద్యతే।*
*తత్పరత్వం చ వాక్యస్య యుక్తమిత్యేతదస్యతే॥*

409-410. వెనకటిఅధికరణంలో *"యస్య వైతత్ కర్మ"* అన్నపుడు కర్మశబ్దం కార్యమైనలోకాన్ని చెప్తూండటంచేత, **'ఆవాక్యం కర్మాధీనభోక్తైనజీవుడిని చెప్తోంది'** అన్నపక్షం త్రోసిపుచ్చబడింది. ఈఅధికరణంలో కర్మఫలాన్ని అనుభవించే జీవుడినే ప్రత్యక్షంగా చెప్పటంచేత *"ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః"* (బృహ-6-5-6) (ఈఆత్మ వినదగినది. తలంచదగినది, ప్రత్యక్షముగ చూచినట్లు ధ్యానించతగినది.) అన్న వాక్యంలో చెప్పబడ్డవాడు జీవుడే అనే పక్షం నిరసింపబడుతోంది.

పూ. 411. *"న వా అరే పత్యు"రితి బృహదారణ్యకశ్రుతౌ।*
*ద్రష్టవ్యత్వేన సంప్రోక్తః పురుషస్త్వాన్త్రికో మతః॥*

412. *పతిజాయాపుత్రవిత్తపశ్వాదిప్రియతాన్వయాత్।*
*జీవప్రతీతిరస్త్యాదౌ తథా మధ్యావసానయోః॥*

413. *వియుక్తాచిద్ధర్మజీవస్వరూపజ్ఞానమేవ హి।*
*తన్త్రేఽమృతత్వహేతుత్వేనోచ్యతేఽతోఽత్ర తాదృశమ్॥*

*414. *స్వరూపమమృతత్వాయ ద్రష్టవ్యత్వేన కథ్యతే।*

411-*414. **పూర్వపక్షం.** బృహదారణ్యకంలో *"న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి -*

*ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి"* (బృహ. 6-5-6) (పతికోరికకోసం పతి ప్రియుడవలేదు; ఆత్మకోరిక కోసం పతి ప్రియుడైనాడు.) అనిప్రారంభించి పతిస్థానంలో జాయా (భార్య), పుత్రులు, విత్తం(ధనం), పశువులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, లోకాలు, దేవతలు, వేదాలు, భూతాలు, సర్వంఅయిన ఒక్కొక్కదాన్నీ పెట్టి, ఎన్నోపర్యాయాలు ఇదేరీతిలో చెప్పి, *"ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః, మైత్రేయి, ఆత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాతే ఇదం సర్వం విదితమ్॥"* (మైత్రేయీ! ఆత్మే చూడతగింది, వినదగింది, తలంచదగింది, ధ్యానింపతగింది. ఆత్మఅనేది చూడటానికీ, వినటానికీ, తల్చుకుందికీ, తెలుసు కుందికీ తగినదై, ఇవన్నీ తెలిసినది అయింది.) అనిచెప్పబడింది. ఇక్కడ *'ద్రష్టవ్యః'* అనబడ్డవాడు చూడతగిన వాడుగ సాంఖ్యులచేతచెప్పబడే పురుషుడే అయిఉండాలి. ఎంచేతంటే, ఈప్రకరణప్రారంభంలోనూ, మధ్యనీ, చివరనూకూడా ఆపురుషుడి ప్రస్తావమే ఉన్నది. భర్త, భార్య, పిల్లలు, ధనం, పశుసంపద మొదలైనవి ఈఆత్మకి ప్రీతికరమైనవనిచెప్పటంచేత ప్రారంభంలో సంసారిపురుషుడి ప్రస్తావమే ఉన్నది. మధ్యనిగూడా *"విజ్ఞానఘన ఏవ ఏతేభ్యో భూతేభ్యస్సముత్థాయ తాన్యేవానువినశ్యతి న ప్రేత్య సంజ్ఞాస్తి"* (బృహ6-5-13), (జీవుడనబడేవీడే ఈభూతాలతోఏర్పడ్డ శరీరాలతో పుట్టి, వాటితోనే నశిస్తున్నాడు; చివరనుగూడ *"విజ్ఞాతారమరే కేన విజానీయాత్"* (బృహ.6-5-15), (జ్ఞానమున్నవాడైన వీడిని దేనితో తెలుసుకోవాలి?) అని జ్ఞానియైన ఈసంసారిజీవుడే చెప్పబడ్డాడు. ఈశ్వరుడు ఈప్రకరణంలో చెప్పబడలేదు. అంచేత ఈతడు జీవుడేఅయి ఉండాలి. *"అమృతత్వస్య తు నాశాస్తి విత్తేన"* (బృహ.6-5-3) (మోక్షాన్ని ధనంచేత పొందదలవటంకూడా కుదరదు.) అనిమొదటేఉండటంచేత, ఈవాక్యం మోక్షోపాయాన్ని చెప్తుందని ప్రకటితమౌతోందే; కనుక ఇదెట్లా సంసారిపురుషుడినిచెప్పటం కుదురుతుంది? అంటే, సాంఖ్యమతప్రకారం అచేతనమైన మూలప్రకృతి స్వభావాలని ఆవేశింపజేసుకొని పొందవీలులేని పురుషుడి స్వరూపాన్ని తెలుసుకోవటమే మోక్షోపాయంగా చెప్పబడుతోంది. అంచేత, ఇక్కడ, జీవాత్మతాలూకు ప్రకృతి వియుక్తమైన స్వరూపాన్ని తెలుసుకోవటం మోక్షోపాయంగా చెప్పబడినదిగా గ్రహించటానికి లోటులేదు. ప్రకృతివియుక్తమైన ఆత్మలన్నీ, ఒకేరకానికి చెందినవవటంచేత, ఒక ఆత్మని తెలుసుకుంటే, అన్ని ఆత్మలూ తెలుస్తాయని చెప్పటానికీ తగిఉంది. కనక, ఈవిధంగా ఇక్కడపురుషుడేచెప్పబడ్డాడని స్పష్ట మవటంచేత, ఆపురుషుడితోకలిసిఉన్న మూలప్రకృతే జగత్కారణమనటమే వేదాన్తాలనిశ్చయమై ఉండాలి.

*సి. 414** *అతః ప్రధానం తద్వ్యక్తం విశ్వకారణమిత్యసత్॥*

*415.* *సమన్వయాదత్ర కృత్స్నవాక్యస్య పరమాత్మని।*
*ద్రష్టవ్యత్వేన నిర్దిష్టస్స ఏవ పరమః పుమాన్॥*

*416.* *జీవస్య స్వేష్టసంపత్త్యై యతః పత్యాదయః ప్రియాః।*
*తద్వియుక్తమతో ధ్యేయం రూపం సన్త్యజ్య తాన్ప్రియాన్॥*

*417.* *అసఙ్గతేయముక్తిస్స్యాదన్వేష్టవ్యం ప్రియం హి తత్।*
*"పత్యాదీనాం స్వకామాయ న స్యుః పత్యాదయః ప్రియాః॥*

*418.* *ఆత్మనస్తు హి కామాయే"త్యుక్త్వా "ఽఽత్మా వా అరే" ఇతి।*
*ద్రష్టవ్యత్వేన నిర్దిష్టో జీవాన్యః పర ఏవ సః॥*

*419.* *స్వీయాన్ప్రతి ప్రియత్వం చ పత్యాదీనాం యదిచ్ఛయా।*
*సపరస్సత్యసఙ్కల్పో ఽతిప్రియః పురుషోత్తమః॥*

*414-419. **సిద్ధాంతం.** ఈపూర్వపక్షం దోషభూయిష్ఠం. ఇక్కడున్న అన్నివాక్యాలూ పరమాత్మకే తగినవిగనక, ఇక్కడ చూడదగినవాడుగా చెప్పబడ్డవాడు పరమపురుషుడే. పూర్వపక్షంలో చెప్పినవిధం చూస్తే, *"జీవుడికి తనకోరిక తీరడానికి పతి మొదలైనవారు ప్రీతిపాత్రులవటంచేత, ప్రీతిపాత్రులైన వాళ్ళని వదిలి, వారితోసంబంధంలేని ఆత్మస్వరూపం మోక్షానికి కారణంగా ధ్యానింపతగింది"* అని ఈప్రకరణంనుంచి స్పష్టమౌతుంది. ప్రీతిపాత్రమేదో అదే వెతకవల్సినదిగాఉండటంలో ఇష్టమైనదాన్ని వదిలేసి, వేరొకదాన్ని వెతకమని చెప్పే ఈఅర్థం తగినదిగా లేదు. కనుక "పతిమొదలైనవారు వారివారి కోరిక నెరవేరుటకు కారణము ప్రీతిగాలేదు; ఆత్మకోరిక నెరవేరుకారణమే ఇష్టమౌతోంది"అని చెప్పి 'ఆత్మే దర్శింపతగినది'అని దర్శింప తగినదిగా చెప్పబడిన ఆత్మ జీవుడికంటే వేఱైన పరమాత్మే కావాలి. అందుచేత తమకుచెందినవారిని గురించి పతిమొదలైనవారు ఎవడిని కోరుకోవటంచేత ఇష్టులౌతున్నారో, సత్యసంకల్పుడూ, ఎక్కువ ప్రీతియైనవాడూ ఆపరమాత్మా అయిన పురుషోత్తముడే ఇక్కడ దర్శనీయుడుగా చెప్పబడ్డాడని స్పష్టమౌతోంది. ప్రకృతి వియుక్తమైన ఆత్మలన్నీ ఒకేవిధమైనవికావటంచేత, ఒకఆత్మను తెలుసుకుంటే, అన్నిఆత్మలూ తెలిసినవైనా, అచేతనవస్తువులు తెలుసుకోబడినవిగ కావటానికి వీలుకాకపోవటంచేత, *"ఇదం సర్వం విదితం"* (ఇవన్నీ తెలుసుకొనబడినవి) అని చెప్పటం పూర్వపక్షికి తగిఉండదు, చేతనాచేతనాలన్నీ అయిన పరమాత్మే ఇక్కడ ఆత్మఅని తీసుకొంటేనే ఇది ఇక్కడ కుదురుతుంది. ఈకారణంచేతనే, *"ఇదం సర్వం యదయమాత్మా"* (బృహ-6-5-7) అని ఈఆత్మేఅన్నీ అని చెప్పటం, పరమాత్మేఇతడని గ్రహిస్తేనే కుదురుతుంది. *"తమేవం విద్వానమృత ఇహ భవతి నాన్యః పన్థాః"* (పు.సూ) (పరమపురుషుడుగా, ఇక్కడ ఈవిధంగా తెలిసేవాడే మోక్షమును పొందించేవాడు; మోక్షంపొందటానికి వేఱుమార్గంలేదు)అని పరమపురుషజ్ఞానాన్నే మోక్షోపాయంగా మరికొన్ని వేదవాక్యాలు చెప్పటంచేత, మోక్షకారణమూ, మైత్రేయి చేత దర్శింపతగినవాడు గానూ చెప్పబడ్డ ఇతడు, పరమాత్మేకావాలి. *"తస్య హ వా ఏతస్య మహతో భూతస్య నిఃశ్వసితమ్"* (బృహ-6-5-11) (ఈపరమాత్మవస్తువు నిశ్వాసమే (వదిలిన ఊపిరే) అన్నీ) అనిఇక్కడ ఇతన్ని సకల జగత్కారణంగ చెప్పటంవల్ల, ఇతను పరమాత్మేగాని, కర్మవశ్యుడూ, కర్మంనశించిన తరువాత కార్యంలేని వాడుగా ఉండే సాంఖ్యపురుషుడుగాడని స్పష్టమౌతోంది. ఈవిధంగ ఇక్కడున్న అన్నివాక్యాలూ పరమాత్మకే తగినవిగనక, ఇక్కడ దర్శనీయుడుగా చెప్పినవాడు పరమాత్మే.

*|| సి. సూ.|| ప్రతిజ్ఞాసిద్ధేర్లిఙ్గమాశ్మరథ్యః || 1-4-20 ||*

(జీవుడినిచెప్పేశబ్దాలచేత పరమాత్మని ఈప్రకరణంలో చెప్పటం) ***ప్రతిజ్ఞాసిద్ధేః=*** పరమాత్మవస్తువు ఒక్కదాన్నే తెలుసుకుంటే, అన్నిటినీ తెలుసుకున్నౌతుందనే ప్రతిజ్ఞ సిద్ధించటానికి ***లిఙ్గం=*** చిహ్నమౌతుంది (అని) ***ఆశ్మరథ్యః=*** ఆశ్మరథ్యుడు అనువారు చెప్పేరు.

*420.* *సర్వజ్ఞానప్రతిజ్ఞాయాస్సిద్ధేర్లిఙ్గమిదం మతమ్।*
*యజ్జీవవాచిభిశ్శబ్దైః పరమాత్మాభిభాషణమ్॥*

*421.* *యది జీవః పరాత్మైవ న తత్కార్యతయా భవేత్।*
*తదా పరాత్మవిజ్ఞానాత్ జీవజ్ఞానం న సంభవేత్॥*

*422.* *ఉత్పత్తిశ్చ లయశ్చాస్య జ్ఞాయతే పరమాత్మతః।*
*అతః పరోక్తిర్జీవాత్మశబ్దేనేత్యాశ్మరథ్యకః॥*

420-422. ఈప్రకరణంలో జీవాత్మనిచెప్పే ఎన్నోశబ్దాలు, పరమాత్మనేచెప్పటం చూస్తున్నాం. దీనికి

కారణాన్ని రెండుమతాంతరస్థులు రెండువిధాలుగచెప్పటాన్ని ఈసూత్రంలోనూ, తరువాతిసూత్రంలోనూ చెప్పి, తమ సిద్ధాంతాన్ని మూడోసూత్రంలో సూత్రకారులు ప్రకటిస్తున్నారు. అందులో ఈసూత్రంలో వివరింపబడే ఆశ్మరథ్యులభావం ఇలాఉన్నది. *"ఆత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాతే ఇదం సర్వం విదితమ్"* (ఆత్మ చూడటం, వినటం, తలంచటం, తెలుసుకోవటం చెయ్యగలిగినా, ఇదంతా, తెలుసుకోబడినది అయింది.?) అని ఈప్రకరణంలో పరమాత్మను తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్టౌతుందని చెప్పబడింది. ఈప్రతిజ్ఞ సిద్ధించటానికే ఇక్కడ జీవుడినిచెప్పేశబ్దాలతో పరమాత్మనిచెప్పటం. జీవుడైనవాడు బ్రహ్మంతాలూకు కార్యంగానే ఉన్నవాడు. దానివల్లనే, బ్రహ్మన్నితెలుసుకుంటే జీవుడినికూడాతెలుసుకున్నట్లైందని ఇక్కడ చెప్పబడుతోంది. ఇలా జీవుడు పరమాత్మేనని గ్రహించనినాడు, పరమాత్మని తెలుసుకుంటే అన్నింటినీ తెలుసుకున్నట్లే అనిచెప్పటం కుదరదు. జీవుడు బ్రహ్మదగ్గరనే ఉంటాడనీ, బ్రహ్మలోనే లయిస్తాడనీ వేదవాక్యాల్లో చెప్పబడినందువల్ల, ఇద్దరూ ఒకటేనని తెలుస్తోంది. కనుక, ఒకదాన్ని తెలుసుకుంటే అన్నింటినీ తెలుసుకున్నట్లౌతుందన్న ప్రతిజ్ఞావాక్యం సిద్ధించటానికి చిహ్నంగా ఇక్కడ జీవుడినిచెప్పేశబ్దాలచేత పరమాత్మచెప్పబడ్డాడని ఆశ్మరథ్యులవారు చెప్పేరు.

## *॥ సి. సూ.॥ ఉత్క్రమిష్యత ఏవంభావాదిత్యౌడులోమిః॥ 1-4-21 ॥*

***ఉత్క్రమిష్యతః=*** శరీరంలోంచి బయలువెడలి ముక్తిపొందేటపుడు, ***ఏవంభావాత్=*** జీవుడు బ్రహ్మగానే అవటంచేత, (జీవుడినిచెప్పేశబ్దాలచేత ఇక్కడ పరమాత్మనేచెప్తోంది) ***ఇతి=*** అని, ***ఔడులోమిః=*** ఔడులోమి అన్నవారు చెప్పేరు.

**423.** *జీవస్య బ్రహ్మకార్యత్వే బహుదోషప్రసజ్గతః।*
*"న జాయత" ఇతి శ్రుత్యా తస్య నిత్యత్వసిద్ధితః॥*

**424.** *పూర్వత్రోక్తమయుక్తం తస్యోత్క్రమిష్యత ఏవహి।*
*బ్రహ్మభావాజ్జీవశబ్దేనోక్తిరిత్యౌడులోమికః॥*

423-424. వెనకచెప్పిన ఆశ్మరథ్యపక్షంలో ఎన్నోదోషాలు రావటంచేత, ఔడులోమి అన్నవారు మరోవిధంగా భావిస్తున్నారు. *"న జాయతే మ్రియతే"* (కఠ.1-2-18) (జీవుడు జన్మించటం, చనిపోవడం లేదు) అని, జీవుడికి సృష్టిప్రళయకాలాల్లోనూ, ఉత్పత్తివినాశాలులేవని చెప్పబడింది. పూర్వకర్మఫలాన్ని అనుభవించటానికి శరీరంతోవీడికుండేసంయోగవియోగాలే జన్మమరణాలని చెప్పబడుతున్నాయి. కనుక, జీవుడిని బ్రహ్మకార్యంగా చెప్పటం సరిగాదు. ఇలా గ్రహించకపోతే, జీవుల్లో జ్ఞానం మొదలైన వాట్లో సమత్వం ఉండటం అనేది కుదరదు. ప్రళయకాలంలో, ఆకాశం మొదలైనవి, తామే తమకికారణమైన పరమాత్మతో ఒకటిగాఅవడంలాగ, జీవుడుకూడా మోక్షోపాయాలననుష్ఠించకుండానే ప్రళయకాలంలో పరమాత్మలోఒకటిగా అయేవాడు అవటంచేత మోక్షోపాయాలని విధించేశాస్త్రాలు ఈసందర్భంలో నిష్ప్రయోజకాలయినాయి. ఘటం తనకి కారణమైన మట్టిఅయినపుడు ఘటస్వరూపానికి నాశంకలిగినట్లు, జీవుడు పరమాత్మతో ఒకటైనపుడు జీవస్వరూపమే నశించటంచేత ఆమోక్షాన్ని ఎవరూ కోరుకోరు కనుక *"ఏష సంప్రసాదః అస్మాచ్ఛరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే"*(ఛాం.8-3-4) (ఈజీవుడు ఈశరీరంలోంచి వెలువడి పరంజ్యోతిని పొంది తన స్వస్వరూపాన్ని పొందుతాడు.) *"యథా నద్యః స్యన్దమానాః సముద్రే అస్తం గచ్ఛన్తి నామరూపే విహాయ। తథా విద్వాన్ నామరూపమాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్॥"* (ముండకో.3-2-8) (ప్రవహించేనదులు నామరూపాలనివదిలి సముద్రంలో ఎలాచేరుతాయో, అలానే జ్ఞానవంతుడైనవాడు నామరూపాలనుంచి విడివడి అన్నింటికంటే పైవాడైన దివ్యపురుషుడిని పొందుతాడు.)అని

చెప్పినట్లు మోక్షాన్ని పొందేటపుడు, జీవుడు పరమాత్మగానే ఔతున్నాడనీ, అందువల్ల ఈప్రకరణంలో జీవుడిని చెప్పే శబ్దాలచేత పరమాత్మే చెప్పబడుతున్నాడు అని గ్రహించటమే తగింది అని ఔడులోమి భావం.

*// సి. సూ.// అవస్థితేరితి కాశకృత్స్నః // (1-4-22)*

**అవస్థితేః=** పరమాత్మ జీవుడిలో ఉండటంచేత (జీవునిచెప్పే శబ్దాలచేత సూచింపబడుతున్నాడని) **కాశకృత్స్నః=** కాశకృత్స్నులనే ఆచార్యులు భావిస్తున్నారు.

*425.* *అనేకదోషదుష్టత్వాదేతదప్యసమఞ్జసమ్।*
*శరీరభూతే జీవాత్మన్యాత్మత్వేన పరాత్మనః॥*

*426.* *అవస్థితేరస్య జీవశబ్దేన ప్రతిపాదనమ్।*
*అంతర్యామిబ్రాహ్మణే చ తథాన్యత్ర శ్రుతావపి॥*

*427.* *చిదచిద్భ్యాం శరీరిత్వం బ్రహ్మణో ఘుష్యతే ముహుః।*
*వక్త్యేవం కాశకృత్స్నోఽ ఉదసూత్రకర్తుర్మతం ప్రియమ్॥*

425-427. మోక్షంపొందేటపుడు జీవుడు బ్రహ్మంగానే ఔతాడని ఔడులోమి భావించటం తప్పు. ఇట్లా గ్రహించటంలోనూ, అనేకదోషాలువస్తాయి. అలాంటప్పుడు కొన్నిప్రశ్నలు తలెత్తుతాయి. మోక్షంపొందటానికి పూర్వం బ్రహ్మంకాకుండటం సహజమైందా, లేక ఏదేనాకారణంచేత చేయబడిందా? అన్నది మొదటిప్రశ్న. ఒకకారణంచేత అలాఅయిందన్నా, జీవుడు బ్రహ్మం కాకుండాఉండటం నిజమైనదా లేక అసంగతమా? అన్నది రెండోప్రశ్న. ఈప్రశ్నలకు ఎలాసమాధానం చెప్పినా, దోషాలు వస్తాయి. ముక్తికి పూర్వం జీవుడు బ్రహ్మం కాకపోవటం సహజమైనదని, మొదటిప్రశ్నకి బదులుచెప్తే, జీవుడికీబ్రహ్మనికీ భేదం స్వభావసిద్ధమైనదికావటం చేత జీవస్వరూపముండేహద్దుల్లో భేదం పోదు.; ఇక మోక్షదశలో జీవబ్రహ్మభేదంతోకూడా జీవస్వరూపమే నశిస్తుందంటే, అప్పుడు నశించేపదార్థం బ్రహ్మంఅయింది అనిచెప్పటం కుదరదు; తననాశానికి ఎవడూ ఆశపడడనే దోషంగూడా వస్తుంది. ఇక 'జీవుడు బ్రహ్మంకాకుండటం ఒకకారణంవల్లఅయింది' అని మొదటి ప్రశ్నకి సమాధానంచెప్పేటపుడు 'జీవుడిట్లా బ్రహ్మం కాకుండాఉండటం నిజమాకాదా' అన్నరెండోప్రశ్నకి సమాధానం చెప్పవలసివస్తుంది. జీవుడు బ్రహ్మంకాకపోవటం నిజమేఅంటే అప్పుడు ఉపాధి(బ్రహ్మం, జీవుడికి నిజమైనకారణం), బ్రహ్మం అన్నరెండుతప్ప వేఋపదార్థం లేకపోవటంచేత, అవయవాల్లేని బ్రహ్మం ఉపాధిఅవటం భిన్నంగాను, విడిగాను వేఋపదార్థంగాఉండలేదుగనుక, బ్రహ్మభేదమనేది ఉపాధిలోనే యుండాలి. ఇలా ముక్తికిపూర్వం జీవుడు బ్రహ్మంగానేఉంటాడు గనుక ***'ముక్తిపొందేటప్పుడు బ్రహ్మమైనాడు'*** అన్న వెనకటిసూత్రంలో చెప్పినది కుదరదు. ఇక *"**జీవుడు ఒక ఉపాధివల్ల బ్రహ్మం కాకపోవటం నిజంగాదు**"* అనిరెండోప్రశ్నకి సమాధానమైతే, అప్పుడు, బ్రహ్మభేదమే అసత్యంకావటంవల్ల, ***'ముక్తిలో ఎవరు బ్రహ్మమౌతారు?'*** అన్నప్రశ్న వస్తుంది. ***'అజ్ఞానమనే ఉపాధిచేత గుహ్యమైన తనస్వరూపంగల బ్రహ్మమే ముక్తిలో మరుగుబడని స్వరూపమున్న బ్రహ్మమైంది'*** అంటే: ఎప్పుడూ, ముక్తిపొందిఉన్నదీ, తానే ప్రకాశించేదీఅయిన జ్ఞానరూపమైనదిగాఉన్న బ్రహ్మాన్ని అజ్ఞానమనేఉపాధి మరుగుపరిచిందనటం కుదరదు. ఎంచేతంటే, ఒక వస్తువు దాగిఉండటంఅంటే, దానిస్వరూపముండగా ప్రకాశంలేకపోవటమే అవుతుంది. ఇక్కడ ప్రకాశ స్వరూపమై ఉండటం బ్రహ్మంఅని అంగీకరించటంవల్ల, అదిదాచబడినపుడు దానిస్వరూపమే నశించాలి; దీన్ని తప్పించాలీఅంటే దాగబడటం ఉండదని గ్రహించాలి. కనుక ఎప్పుడూ ప్రకాశించే స్వరూపాన్ని కలిగియున్నది గానే బ్రహ్మాన్ని అంగీకరించాల్సి ఉండటంచేత, ***'ముక్తిని పొందేటప్పుడు జీవుడు బ్రహ్మమైనాడు'*** అని

వెనకటిసూత్రంలో చెప్పినది ఇక్కడగూడ కుదరదు. *"ఏష సంప్రసాదః"* అనీ, *"యథా నద్యః"* అనీ ఆరంభమయే వాక్యాలు ఔడులోమిపక్షానికి అనుకూలమైనవని వెనకచెప్పటమూ దోషమే. ఆవాక్యాల్లో *"పరంజ్యోతి రుపసంపద్య"* (పరంజ్యోతిని చేరి) అనిన్నీ, *"పరాత్పరం పురుషముపైతి దివ్యమ్"* (మేలైనవాటికంటె మేలైన దివ్యపురుషుని చేరును) అనీ ముక్తిదశలో పొందేవాడుగ జీవుడినీ, పొందబడేవాడుగ పరమాత్మనీ వేఱువేఱుగ చెప్పటంచేత ఈవాక్యాలు ఔడులోమిపక్షానికి బాధకాలేఅవుతాయి. కనుక జీవాత్మనిచెప్పేశబ్దాలతో పరమాత్మని చెప్పటానికి వేఱుకారణాన్ని చెప్పాల్సివస్తుంది. ప్రమాణాలకి తగిన కారణం ఏదని పరిశీలించి నపుడు *"య ఆత్మనితిష్ఠన్ యస్యాత్మాశరీరం"* (బృహ5-7-22) (ఎవడు ఆత్మయందున్నాడో, ఎవనికి ఆత్మశరీరమో) *"ఏష సర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకో నారాయణః"* (సుబా.7) (అన్ని భూతాలకీ అంతరాత్మై, పాపంలేనివాడై అప్రాకృతుడైన నారాయణుడనేదేవుడు ఒక్కడే) మొదలైన అంతర్యామి బ్రాహ్మణాది వాక్యాల్లో పరమాత్మ జీవుడికిఆత్మైఉంటుందనీ, జీవుడు పరమాత్మకి శరీరమై ఉంటాడనీ, ఎన్నోచోట్ల చెప్పబడ్డంవల్లా, ఇలా జీవుడిలో ఆత్మగా పరమాత్మఉండటమే, జీవుడిని ఉద్దేశించే శబ్దాలచేత పరమాత్మఉద్దేశింపబడటానికి నిజమైన కారణమని తెలుస్తోందని కాశకృత్స్నులనబడే ఆచార్యులు తీర్మానించేరు. అంతేకాకుండా మరోసూత్రాన్ని సూత్రకారులు చెప్పకపోవటంవల్లా, *"అన్యశ్చ రాజన్ స పరః తథాన్యః పంచవింశకః। తత్స్థత్వాదను పశ్యన్తి హ్యేకఏవేతి సాధవః"* (భార. మోక్ష. 357-33) (ఓరాజా! పరమాత్మవేఱైనవాడే; ఇరవైయైదోతత్త్వమైన జీవుడూవేఱైనవాడే. పరమాత్మ జీవుడిలోఉండటంచేత, సాధు జనం ఇద్దరినీ ఒకటిగానే చూస్తారు.) అని సూత్రకారులు తామే మహాభారతంలో ఈఅర్థాన్ని చాలాస్పష్టంగా వివరించటంచేతా, ఇదే సూత్రకారుల పరమసిద్ధాంతమని అరచేతిలోఉసిరికాయలా ప్రకటితం ఔతోంది.

*వాక్యాన్వయాధికరణం పూర్తైంది*

## *॥ ప్రకృత్యధికరణమ్. ॥ 1-4-7 ॥.*

### *॥ సి. సూ.॥ ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్ ॥ 1-4-23 ॥*

***ప్రకృతిః చ=*** (బ్రహ్మం) ఉపాదానకారణంగా అయినది; ***ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్=*** (ఈవిధంగా తీసుకొంటేనే) ప్రతిజ్ఞ, దృష్టాంతమూ విరోధించకుండా ఉండటంవల్ల,

***428.*** *యదభ్యుపగతం పూర్వం జగత్ప్రతి పరాత్మనః।*
*ఉపాదానత్వమేతన్న స్యాదిత్యేతన్నివార్యతే॥*

428. క్రిందటి అధికరణంలో "ఆత్మని తెలుసుకుంటే అన్నింటినీ తెలుసుకున్నట్లౌతుంది" అన్న వాక్యంతో పరమాత్మ లోకానికి ఉపాదానకారణంగా అయినాడని అంగీకరింపబడింది. ఇది సాధ్యంగాదనే పూర్వపక్షివాదం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

***పూ.429.*** *నిమిత్తమేవ జగతో నోపాదానం భవేత్పరః।*
*లోకే తయోః కారణయోర్భేదనైయత్యదర్శనాత్॥*

***430.*** *"అస్మాన్మాయీ"త్యాదివాక్యైర్భేదస్య ప్రతిపాదనాత్।*
*బ్రహ్మణో నిర్వికారత్వశ్రుతిబాధాదపీత్యసత్॥*

429-430*. **పూర్వపక్షం:** పరమాత్మ లోకానికి నిమిత్తకారణంగానే సాధ్యంగాని ఉపాదానకారణం అవటానికి సాధ్యంగాదు. లోకంలో ఘటంమొదలైనవాటికి మట్టిమొదలైనవే ఉపాదానకారణం అవటం, వాటి

కంటె వేర్రైన కుమ్మరివాడు మొదలైనవాళ్ళు నిమిత్తకారణంకావటం, నిమిత్తం, ఉపాదానమూ వేఱవటంఅనే ఈనియమానికి ఎక్కడా భంగంకలగలేదనీ మనం చూస్తున్నాం. *"అస్మాన్ మాయీ సృజతే విశ్వమేతత్"* (శ్వే. 4-9) (ఈప్రకృతితో మాయ (ప్రకృతి)గలవాడు ఈలోకాన్ని సృష్టిస్తాడు.)వంటి వాక్యాల్లో ఉపాదానమైన మూల ప్రకృతికీ నిమిత్తమైనపరమపురుషుడికీ భేదమే చెప్పబడుతోంది. బ్రహ్మమే లోకంగా వికారం పొందుతూండటం చేత లోకానికి ఉపాదానకారణమైందని గ్రహిస్తే, బ్రహ్మం వికారంలేనిదనిఘోషించే ఎన్నోవాక్యాలు విరోధిస్తాయి. కనుక, బ్రహ్మంలోకానికి నిమిత్తకారణంగామాత్రం అయిందనీ, మూలప్రకృతే లోకానికి ఉపాదాన కారణమై ఉందనీ గ్రహించటమే తగినది.

సి.431. *సర్వజ్ఞానప్రతిజ్ఞానదృష్టాంతానుపరోధతః।*
*నిమిత్తమాత్రం న బ్రహ్మోపాదానం చ జగత్ప్రతి॥*
432. *బ్రహ్మవిజ్ఞానేన సర్వవిజ్ఞానాత్మప్రతిజ్ఞయా।*
*"యేనాశ్రుతం శ్రుత"మితి వాక్యావగతయా తథా॥*
433. *"యథా సోమ్యే"తి వాక్యోక్తమృత్తత్కార్యనిదర్శనాత్।*
*బ్రహ్మైవోపాదానమితి జ్ఞాయతే, బ్రహ్మ తత్ యది॥*
434. *నిమిత్తహేతురేవ స్యాత్ జగద్జ్ఞానం న తద్ధియా।*
*న భవేద్ధి కులాలాదిధియా కార్యఘటాదిధీః॥*
435. *విలక్షణస్య సర్వస్మాత్సర్వశక్తేః పరాత్మనః।*
*శాస్త్రమాత్రాధిగమ్యస్య కార్యకారణరూపయోః॥*
436. *అవస్థయోరపి సదా చిదచిద్బాహ్యం శరీరిణః।*
*ఏకస్యైవ నిమిత్తత్వోపాదానత్వే హ్యబాధితే॥*
437. *వికారాస్తు శరీరేఽచిద్వస్తున్యేవ హి సఙ్గతాః।*
*అతః కార్యదశాయామప్యవికారిత్వమక్షతమ్॥*
438. *జగచ్ఛరీరకస్యాస్యోపాదానత్వేఽపి సర్వథా।*
*"అస్మాన్మాయీ"త్యాదినాఽవగమ్యతే దోషశూన్యతా॥*

430-438. **సిద్ధాంతం.** ఈపూర్వపక్షం తప్పు. బ్రహ్మన్నొక్కదాన్నీ తెలుసుకుంటే, సమస్తాన్నీ తెలుసు కున్నట్లే అవుతుందని వేదవాక్యాల్లో ప్రతిజ్ఞచేయబడుతోంది. దీనికి దృష్టాంతాలు చూపబడ్డాయి. ఇవి ఒకదాన్తో ఒకటి విరోధించకుండటానికి లోకానికి బ్రహ్మం నిమిత్తకారణంమాత్రమేగాక ఉపాదానకారణంగూడఅని గ్రహించాలి. *"ఉతతమాదేశ మప్రాక్ష్యః యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతం అవిజ్ఞాతం విజ్ఞాతం"* (ఛాం. 6-1-3) (దేన్ని వింటే, విననిదంతా విన్నదే అవుతుందో, దేన్ని తల్చుకుంటే, తలవనిదంతా తల్చినదే అవుతుందో, దేన్ని తెలుసుకుంటే, తెలియనిదంతా తెలిసినదగునో, అట్టి నియమించేపదార్థాన్ని విన్నావా?") అన్నవాక్యం బ్రహ్మన్ని తెలుసుకుంటే అన్నింటినీ తెలుసుకున్నట్లౌతుందన్న ప్రతిజ్ఞావాక్యం. *"యథా సోమ్య ఏకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్"* (ఛాం. 6-1-4) (సోమ్యా! ఎలాగ ఒకమట్టిగడ్డని చూస్తే, మట్టితో చెయ్యబడ్డ కుండ, బాన, పిడత, పాలికవంటి అన్నివస్తువులూ తలంపుకివస్తాయో, (అలాగే బ్రహ్మన్ని తెలుసుకుంటే, అంతా, తెలుసుకున్నట్లౌతుంది)) అన్నవాక్యంలో మట్టిగడ్డనితెలుసుకుంటే, దాన్నించి

తయారయే అన్నివస్తువులనీ తెలుసుకున్నట్లుగా (బ్రహ్మాన్నితెలుసుకుంటే సమస్తం తెలిసినట్లవుతుంది) అన్న దృష్టాంతం చెప్పబడింది. దీన్నించి, ఘటం, పాలిక మొదలైనవాటికి మట్టి ఉపాదానకారణమైనట్లుగా, సమస్త లోకానికీ బ్రహ్మం ఉపాదానకారణమైనదని తెలుస్తోంది. బ్రహ్మాన్ని కుమ్మరిలాగ నిమిత్తకారణంగా మాత్రం గ్రహిస్తే, బ్రహ్మాన్నితెలుసుకుంటే లోకమంతటినీ తెలుసుకున్నట్లౌతుందనటం కుదరదు. నిమిత్తమాత్రమైన కుమ్మరిని తెలుసుకున్నా, వాడిచేత తయారుచేయబడే చట్టి, బాన, మొదలైన వాటిని గూడ తెలుసుకున్నట్లు అవదుగదా! లోకంలో నిమిత్తం, ఉపాదానం ఒకటిగా ఎక్కడా కనబడవుగనుక, బ్రహ్మం రెండుగాఉండటం శక్యంగాదు అనటంకూడా కుదరదు. లోకంలోఉన్న అన్నిపదార్థాల కంటే భిన్నమైనవాడు పరమాత్మ. అన్ని విధాలైన శక్తులూ గలవాడాయన. ఇటువంటి మహత్తులు గలవాడని శాస్త్రాలవల్ల సృష్టికిముందర ఆయన సూక్ష్మమైన చేతనాచేతనాలని శరీరంగ గ్రహించినవాడుగ అయినాడని తెలుస్తోంది. ఇలాంటిపరమాత్మ ఒక్కడే లోకానికి నిమిత్తకారణంగాను ఉపాదానకారణంగాను ఉండటానికి ఎటువంటి ఆటంకమూ లేదు. బ్రహ్మాన్ని ఉపాదానకారణంగా తీసుకుంటే, ఉపాదానకారణంగాఉన్న మట్టి మొదలైనవాటికిలా దానికీ వికారాన్నంగీ కరించాల్సివస్తుందనీ, దీనివల్ల బ్రహ్మానికి వికారంలేదనిచెప్పే శ్రుతులకి విరోధంవస్తుందనీ చెప్పటంకూడా కుదరదు. పరమపురుషుడు లోకానికి ఉపాదానకారణమైనప్పుడు కలిగేవికారాలు ఆయనకి శరీరంగాఉన్న అచేతనాలతోటే ఉంటాయి. కనుక కార్యవస్తువైనప్పుడూ బ్రహ్మ స్వరూపం వికారంలేనిదిగానేఉంది. కనుక బ్రహ్మం వికారంచెందనిది అనిచెప్పే వాక్యాలు విరోధించవు. *"అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్"* (శ్వే.4-9) (ఈప్రకృతితో మాయ(ప్రకృతి)గలవాడు ఈలోకాన్ని సృష్టిస్తాడు.) మొదలైన వాక్యాలు లోకాన్ని శరీరంగా గ్రహించి ప్రకృతికి అధిపతిగాఉన్నవాడు లోకానికి ఉపాదానకారణమైనా, లోకానికున్న దోషాలచేత ఆతడేవిధం గానూ, స్పృశించబడడనే చూపుతున్నాయి. కనుక, బ్రహ్మం ఉపాదాన కారణంగాఉన్నాడని చెప్పటానికి ఎలాంటి ఆటంకమూ లేదు.

*// సి. సూ.//అభిధ్యోపదేశాచ్చ// 1-4-24 //*

**అభిధ్యోపదేశాత్ చ:** (బ్రహ్మం తానే అనేకమవాలని) సంకల్పించెనని చెప్పటంవల్లనూ, (బ్రహ్మం ఉపాదానకారణం ఔతోంది).

***439.*** *స్వస్యైవ బ్రహ్మణస్సృష్టుస్సోఽకామయత బహ్వేతి।*
*"తదైక్షతే"తి చ బహుభావచిన్తోపదేశతః॥*

****440.*** *బ్రహ్మైవ విశ్వోపాదానం నిమిత్తం చేతి గమ్యతే।*

439-*440. *"సోఽకామయత బహుస్యామ్"* (తై.ఆ.6-2) ('నేనే అనేకముగ అగుదును' అని బ్రహ్మం సంకల్పించెను), *"తదైక్షత బహుస్యామ్"* (ఛాం.6-2-3) ('నేనే అనేకముగనగుదున'ని ఆపరమాత్మ సంకల్పించెను)అని నిమిత్తకారణమైఉంటూ సృష్టించేబ్రహ్మం సృష్టిసంకల్పం చేసేటప్పుడు 'నేనీలోకాన్ని సృష్టిస్తాన'ని సంకల్పించినట్లుగచెప్పక, 'నేనే అనేకమగుదున'ని సంకల్పించినట్లు వేదవాక్యాలు చెప్పటంచేత బ్రహ్మం లోకానికి నిమిత్తకారణంగా ఉండటమేకాక, ఉపాదానకారణంగాకూడా ఉన్నదని స్పష్టమౌతోంది.

*// సి. సూ.//సాక్షాచ్చోభయామ్నానాత్// 1-4-25 //*

**సాక్షాత్:** ప్రత్యక్షంగానే **ఉభయామ్నానాత్ చ:** నిమిత్తమైఉండటం. ఉపాదానమైఉండటం అనే) రెండు స్వభావాలూ బ్రహ్మానికుంటాయని ఒకవేదవాక్యంచెప్పటంచేతకూడా (బ్రహ్మం లోకానికి ఉపాదానకారణమైంది)

440* *"కింస్విద్వనం క" ఇత్యాద్యైస్సాక్షాదామ్నాయతే పరః॥*

*441 *ఉపాదానం నిమిత్తం చేత్యతో బ్రహ్మైవ తద్ద్వయమ్।*

440*-*441. వెనకటిసూత్రాల్లో చెప్పినట్లు ప్రతిజ్ఞ, దృష్టాంతం, అభిధ్యోపదేశం అనే చిహ్నాలు మాత్రం కాకుండా వేదవాక్యమే నేరుగ బ్రహ్మానికి నిమిత్తత్వం, ఉపాదానత్వం అన్న రెండుస్వభావాలూ ఉంటాయని సూచించటంచేతకూడ, బ్రహ్మం లోకానికి నిమిత్తకారణంగా ఉండటంతోబాటు ఉపాదానకారణంగా కూడా ఉంటుందని నిశ్చయింపబడింది. *"కిమ్స్విద్వనం క ఉ స వృక్ష ఆసీత్ యతో ద్యావాపృథివీనిష్టతక్షుః। మనీషిణో మనసా పృచ్ఛతేదుతత్ యదధ్యతిష్ఠద్భువనాని ధారయన్॥* (యజు-అష్. 2-8-7) ((ఈలోకానికి) వనంలాగ ఆధారమైఉండేదేది? ఈలోకాలని ధరించినిలిపేవాడు ఏఉపకరణాలని అధిష్ఠించిఉన్నాడు? ఓజ్ఞానులారా! బుద్ధితో దీనిని విచారించండి.) అని ప్రశ్నించి, *"బ్రహ్మవనం బ్రహ్మ స వృక్ష ఆసీత్ యతో ద్యావాపృథివీనిష్టతక్షుః। మనీషిణో మనసా విబ్రవీమి వో బ్రహ్మాధ్యతిష్ఠద్భువనాని ధారయన్॥* (బ్రహ్మమే (ఈలోకానికి) వనంలా ఆధారమైఉంది: ఈలోకాన్ని సృష్టించటానికి చెట్టులా, ఉపాదానంగాఉన్నదికూడా బ్రహ్మమే; ఈలోకాలనిధరించినిలిచే బ్రహ్మం ఉపకరణమైనతననే అధిష్ఠించిఉంటుంది. జ్ఞానులారా! బుద్ధితో (దీన్ని)పరిశీలించి మీకు చెప్తున్నాను.) అని సమాధానంఇచ్చింది యజుర్వేదంలో ఒకవాక్యం. *"భువనాని ధారయన్"*అని లోకానికి నిమిత్తంగా ఎత్తుకొనబడిన బ్రహ్మాన్నే *"బ్రహ్మ స వృక్ష ఆసీత్"* అని ఉపాదాన కారణంగా, ఈవాక్యం చెప్పడంచేత లోకానికి నిమిత్తకారణంగానూ, ఉపాదానకారణంగానూ ఉన్నది బ్రహ్మమే అని స్పష్టమౌతోంది.

### *॥ సి. సూ.॥ ఆత్మకృతేః ॥ 1-4-26 ॥*

**ఆత్మకృతేః:** (బ్రహ్మం) తననుతానే సృష్టించుకుంటుందని చెప్పటంచేత (బ్రహ్మం ఉపాదానకారణంగా అయింది)

441* *"తదాత్మానం స్వయ"మితి ప్రకృతస్య పరాత్మనః॥*
442. *సృష్టేః కర్మత్వకర్తృత్వే ప్రతీయేతే పరశ్చ సః।*
*నామరూపాశ్రయః కార్యం కర్తా చ తదనాశ్రయః॥*

441*-442. *"సోఽకామయత బహుస్యామ్"* (తై.ఆ-6-2) (**'నేనే అనేకముగనగుదును'** అని ఆబ్రహ్మము సంకల్పించెను.) అనిచెప్పినట్లు, సృష్టించడానికి ప్రారంభించినట్లు ఈప్రకరణంలో చెప్పబడ్డ బ్రహ్మం *"తదాత్మానం స్వయమకురుత"* (తై. ఆ. 7-1) (ఆబ్రహ్మం తనను తానే సృష్టించుకొనెను) అనితానే సృష్టికి కర్తగానూ, విషయంగానూ అయిందని చెప్పబడింది. నామరూపవిభాగంలేని చేతనాచేతనాలని శరీరంగా స్వీకరించిన ఆపరమాత్మే సృష్టికి కర్తగానూ, ఆవిభాగాలున్న చేతనాచేతనాలని శరీరంగాగల ఆపరమాత్మే సృష్టింపబడే పదార్థంగానూ అవటంవల్ల సృష్టికి తానే కర్తగానూ, విషయంగానూ అవటానికి విరోధంలేదు. ఇలా తననుతానే సృష్టించుకున్నట్లు చెప్పటంచేత, నిమిత్తకారణమైన బ్రహ్మమే ఉపాదానకారణంగాకూడా అయిందని స్పష్టమౌతోంది

### *సి.సూ ॥ పరిణామాత్॥ 1-4-27 ॥*

**పరిణామాత్:** ఐశ్వర్యాన్నిచూపే పరిణామాన్నే ఇక్కడబ్రహ్మానికిచెప్పటంవల్ల (బ్రహ్మం గొప్పతనానికి లోటులేదు)

443. *అత్రోపదిశ్యమానస్య పరిణామస్య సర్వథా।*
*పరే నదోషావహతా త్వైశ్వర్యావహతా భృశమ్॥*

444. అపృథఙ్నామరూపాతిసూక్ష్మా చిజ్జీవదేహినః।
విభక్తనామరూపాచిజ్జీవదేహతయా శ్రుతౌ॥
445. పరిణామోపదేశో హి "తద్ధేద"మితి వాక్యతః।
అతోఽపుమర్థాదిదోషాశ్శరీరచిదచిద్గతాః॥
446. దశాద్వయేఽస్యాత్మభూతం బ్రహ్మాపహతపాప్మకమ్।
స్థూలసూక్ష్మావస్థకృత్స్నవస్తునో బ్రహ్మ దేహతా॥
447. తదాత్మత్వం బ్రహ్మణశ్చ వేదాన్తే బహు పఠ్యతే।
అతోఽనఘః పరాత్మైవోభయమప్యత్ర కారణమ్॥

443-447. వెనకచెప్పినట్లుగా, బ్రహ్మమే లోకంగా పరిణమించే ఉపాదానంగా గ్రహిస్తే, బ్రహ్మంతాలూకు నిర్వికారత్వంమొదలైన శ్రుతిసిద్ధమైనమహత్తులకు దోషంవస్తుందే అంటే, ఇక్కడ చెప్పబడే పరిణామం బ్రహ్మానికి అతివిశేషత్వాన్ని కలిగిస్తుందేతప్ప లోటుతనాన్ని కలిగించదుగనుక, ఆటంకంలేదు. ఎలాగంటే, *"తద్ధేదంతర్హ్యవ్యాకృతమాసీత్ తన్నామరూపాభ్యాం వ్యాక్రియత"* (బృహ-3-4-7) (ఇది మొదట నామరూపవ్యాకరణంలేనిది; అది నామరూపవిభాగాన్ని పొందింది) అన్న వాక్యంవల్ల, సృష్టికిపూర్వం నామరూపవిభాగాలున్న స్థూలచేతనాచేతనాలని శరీరంగా గ్రహించినదైందని అర్థం. బ్రహ్మంపొందే పరిణామం ఇదేఒతుంది. బ్రహ్మ స్వరూపానికి ఎటువంటి వికారం ఉండదు. బ్రహ్మకి శరీరంగాఉండే అచేతనాలకి స్వరూపవికారం, చేతనులకి సుఖదుఃఖాదులూ అపురుషార్థాలూ అయిన స్వరూపవికారాలూ ఏర్పడుతున్నాయ్. ఈలోటుపాట్లు స్థూలసూక్ష్మస్థితులు రెండింటిలోనూ, బ్రహ్మస్వరూపానికి అంటవు. బ్రహ్మం ఎప్పుడూ, దోషాలకి ప్రత్యనీకంగానే ఉంటుంది. చేతనాచేతనరూపమైన లోకం బ్రహ్మానికి ఎప్పుడూ శరీరంగానే ఉన్నది. బ్రహ్మం వాటికి ఆత్మగాఉన్నదనటం - *"యస్య పృథివీ శరీరం... యస్యాత్మా శరీరం"* (ఏపరమాత్మకు భూమి శరీరమో... ఎవనికి ఆత్మ శరీరమో), *"ఏష సర్వభూతాంతరాత్మా ఽపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణః"* (అన్నిపదార్థాలకీ అంతరాత్మై, దోషాలంటనివాడై, పరమపదవాసుడైన దేవుడు నారాయణుడనేవాడు ఒక్కడే.) మొదలైన అనన్యథాసిద్ధమైన (వేరువిధాల్లో నిర్వహింపశక్యంగాని) ఎన్నో శ్రుతులనించి స్పష్టమౌతోంది. కనుక, దోషాలంటనిపరమాత్మే లోకానికి నిమిత్తోపాదానకారణాలు రెండూ అయిఉంటాయని ప్రకటితమౌతోంది.

## ॥ సి. సూ. ॥ యోనిశ్చ హి గీయతే ॥ 1-4-28 ॥

**యోనిశ్చ *గీయతే* హి:** 'యోని' (ఉపాదానం) అని బ్రహ్మం కీర్తింపబడుతోందిగదా!; (అంచేత ఉపాదానంకూడా అయింది)

448 "యద్భూతయోనిం", "కర్తారమీశం పురుష"మిత్యృచోః।
పరః కృత్స్నస్య జగతో యోనిత్వేన హి గీయతే॥
449. యోనిశబ్ద ఉపాదానవాచీత్యత్రైవ గమ్యతే।
"యథోర్ణనాభి"వాక్యేనాతః పరే హేతుతాద్వయమ్॥

॥ఇతి ప్రకృత్యధికరణమ్॥

448-449. *"యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః"*(ముండకో.1-1-6) (జ్ఞానులు దేన్ని భూతాలకి యోనిగా చూస్తున్నారో) అనీ, *"కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం"* (ముండకో.3-1-3) (లోకాన్ని సృష్టించి నియమించేవాడూ, పెద్దవాడూ, యోనిఅయి(ఉపాదానకారణమై)ఉన్న పరమపురుషుడిని) అనీ ఈపరమాత్మ

వస్తువు వేదవాక్యాల్లో లోకానికి 'యోని' అనిఘోషింపబడుతోంది. మొదటివాక్యంలో యోనిశబ్దం ఉపాదాన కారణాన్నే చెప్తోందని *"యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చయథా పృథివ్యామోషధయః సంభవన్తి। యథా సతః పురుషాత్ కేశలోమాని తథాక్షరాత్, సంభవతీహ విశ్వమ్"* (ముండకో.1-1-8) (సాలెపురుగెలా తానుబైటకుతెచ్చే దారాన్ని తానేలోపలికితీసుకుంటోందో, భూమిలోంచి ఎలాఎన్నోరకాలైన పంటలుపండుతున్నాయో, జీవమున్న పురుషుడినుంచి ఎట్లా రోమాలు మొదలైనవి పుడుతున్నాయో, అలాగే పరమాత్మనించి లోకంసమస్తం పుడుతోంది.)అని దాని తరువాతివాక్యంనుంచి తెలుస్తోంది. రెండోవాక్యంలో, 'కర్తారం'అని సర్వేశ్వరుడిని నిమిత్తకారణంగా చూపటంచేత, 'యోనిం' అని ఉపాదానంగా ఔతుందని చూపబడుతోందని స్పష్టమౌతోంది. కనుక, ఇలాపరమాత్మ లోకానికినిమిత్తకారణంగాను, ఉపాదానకారణంగాను అయిఉంటాడనటం స్పష్టం. .

ప్రకృత్యధికరణము పూర్తైంది.

## ॥సర్వవ్యాఖ్యానాధికరణమ్॥1-4--8 ॥

### ॥ సి. సూ.॥ఏతేన సర్వే వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః॥ 1-4-29 ॥

**ఏతేన:** ఇంతవరకూ **సర్వే:** అన్ని కారణవాక్యాలూ, **వ్యాఖ్యాతాః** వ్యాఖ్యానం చేయబడ్డాయి.

450. *కారణత్వముపాస్యత్వముక్తం నారాయణస్య హి।*
*అయుక్తం తదిదం రుద్రః క్వచిచ్ఛాఖాసు కథ్యతే॥*

451. *కారణత్వేనేతి శంకా పూర్వోక్తన్యాయసఞ్చయైః।*
*నిరస్తేతి జ్ఞాపయితుం ప్రవృత్తేయమధిక్రియా॥*

450-451. ఈఅధ్యాయంలో నారాయణుడే జగత్కారణంగానూ, ముముక్షూపాస్యుడుగానూ నిరూపింపబడ్డాడు; ఇది సరిగాదు, రుద్రుడు, బ్రహ్మ మొదలైనవాళ్ళుకూడా కొన్ని శాఖల్లో కారణంగ చెప్పబడుతున్నారుగదా అనే సందేహం వెనకచెప్పిన న్యాయాలచేతనే నిరసింపబడుతోంది అని చూపటానికి ఈ అధికరణం ఉద్భవించింది.

పూ. 452. *"యదాతమస్తది"త్యాద్యైః శ్వేతాశ్వతర ఉచ్యతే।*
*రుద్రస్యైకస్య జగతః ప్రలయేஉవస్థితిస్తతః।*

*453. *తస్యైవ కారణత్వం స్యాదిత్యేతదసమఞ్జసమ్।*

452-*453. **పూర్వపక్షం.** శ్వేతాశ్వతరోపనిషత్తులో *"యదా తమస్తన్నదివా నరాత్రిర్నసన్న చాసచ్ఛివ ఏవకేవలః। తదక్షరం తత్సవితుర్వరేణ్యం ప్రజ్ఞాచతస్మాత్ ప్రసృతాపురాణీ॥*(శ్వే.4-18) (ఎప్పుడు తమస్సు మాత్రం ఉన్నదో, పగలు, రాత్రి, సత్, అసత్ అన్నవేవీ లేవో, శివుడు మాత్రం ఉండెనో, ఆపరవస్తువే నాశం లేనిది; అదే సూర్యుడిలోఉండే కోరదగిన వస్తువు, పురాతనమైన జ్ఞానంకూడా దాన్నుంచే వెలికి వస్తోంది.)అని నాలుగో అధ్యాయంలో చెప్పబడే వాక్యంవల్ల శివుడే సమస్తలోకాలూ నశించినతరువాత ఉండే సర్వకారణుడుగ చెప్పబడ్డాడని స్పష్టమౌతోంది. *"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్", "బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్", "ఆత్మవా ఇదమేక ఏవాగ్ర ఆసీత్",* అనియు, *"తమోవా ఇదమేకమాస। నాసదాసీన్నో సదాసీత్తదానీం తమ ఆసీత్। ప్రజాపతిర్వా ఇదమేక ఆసీత్। నాహరాసీత్ నరాత్రిరాసీత్। సోఽస్మిన్ అన్ధే తమసి ప్రాసర్పత్॥"* (మొదట తమస్సు ఒక్కటేయుండెను. తమస్సు శరీరంగాగల ప్రజాపతి ఒక్కరే ఉండేవారు. పగలూ లేదు రాత్రీ లేదు. ఆయన ఈఅంధతమస్సులో మెల్లిగ కదులుతూఉండెను.)అనే ఎన్నోశ్రుతివాక్యాల్లోచెప్పబడే పరవస్తువు శివుడే

అని ఈఉపనిషద్వాక్యం నిర్ణయిస్తోంది. పైగా, *'తదక్షరమ్'* అనటంచేత ముండకాది ఉపనిషత్తుల్లో అక్షరమనీ, *'తత్సవితుర్వరేణ్యం'* అనటంతో ఛాందోగ్యశ్రుతిలోనూ గాయత్రిలోనూ సూర్యమధ్యాంతరవర్తిఅనీ, *"ప్రజ్ఞాచ తస్మాత్ ప్రసృతా పురాణీ"* అనటంవల్ల, *"తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి"* వంటి వాక్యాల్లో జగత్సృష్టి సంకల్పాశ్రయంగా చెప్పబడిన పరవస్తువు శివుడే అని ఈవాక్యంవల్ల నిర్ణయింపబడుతోంది. కనుక శివుడే జగత్కారణవస్తువని గ్రహించాలి.

సి*453 *ఉక్తన్యాయకలాపేన సర్వే కారణవాదినః॥*

454. *శ్రీమన్నారాయణపరా వేదాన్తాః ప్రతిపాదితాః।*
*నారాయణస్యైవ బహుభావసంకల్పనాదిభిః॥*

455. *ధర్మైరసాధారణైశ్చ కారణత్వే సునిశ్చితే।*
*శివాదిశబ్దాస్తత్రైవ నేతవ్యా రూఢిభఙ్గతః॥*

456. *విపర్యయోఽత్ర కిం న స్యాదితి శఙ్కా నసంభవేత్।*
*నారాయణపదస్యాస్య రూఢ్యా యోగేన వా తథా॥*

457. *తదన్యపరతాఽయోగాత్ ఐత్వాసంభవతస్తథా।*
*సంజ్ఞాయాం వై ణత్వవిధేః శ్రీశత్వాసంభవాదపి॥*

458. *అతో నారాయణస్యైవ కారణత్వాదికం స్థిరమ్।*
*అతశ్చాలోద్యేతి చాథ ధ్యేయో నారాయణస్సదా॥*

459. *ఇత్యాది కథితం వేదే సూత్రకారైశ్చ పఞ్చమే।*
*అభ్యాసోఽత్రాధ్యాయపరిసమాప్తిద్యోతకో భవేత్॥*

*॥ ఇతి సర్వవ్యాఖ్యానాధికరణమ్ ॥*

*॥ ప్రథమాధ్యాయః పరిసమాప్తః ॥*

*453-459. **సిద్ధాంతం.** ఈపూర్వపక్షంతప్పు. వెనకచూపబడ్డ మీమాంసాన్యాయాలచేత *"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్", "బ్రహ్మవాఇదమగ్ర ఆసీత్", "ఆత్మా వా ఇదమేకమేవాగ్ర ఆసీత్"* మొదలైనవాక్యాల్లో జగత్కారణతనుచెప్పే *సత్ బ్రహ్మత్మాదులు* సామాన్యశబ్దాలు. *"ఏకో హ వై నారాయణ ఆసీత్ నబ్రహ్మ నేశానః"* (మహోపనిషత్) (నారాయణుడొక్కడే మొదటఉండెను. బ్రహ్మ లేడు, శివుడూ లేడు) వంటివాక్యాల్లో విశేషశబ్దమైన నారాయణశబ్దంచేత చెప్పబడేవాడినేచూపుతుందని నిర్ణయింపబడింది. *"పునరేవనారాయణః సోన్యత్కామో మనసాధ్యాయత...తత్రబ్రహ్మ చతుర్ముఖోఽజాయత...లలాటాత్ త్ర్యక్షః శూలపాణిః పురుషో ఽజాయత"* (మహోపనిషత్) (మరొకసారి నారాయణుడు మనస్సుతో సంకల్పించెను. ...నారాయణునినుండి, ఉద్భవించిన అండంలో చతుర్ముఖుడనే బ్రహ్మ జన్మించేడు.... నుదుటి నుండి మూడుకన్నులుగలవాడున్నూ, శూలం చేతిలోధరించిన వాడూఅయిన పురుషుడు జన్మించెను.) *"అథపురుషో హవై నారాయణోఽకామయత ప్రజాః సృజేయేతి.... నారాయణాద్బ్రహ్మా జాయతే నారాయణాద్రుద్రో జాయతే"* (నారాయణోపనిషత్) (నారాయణుడనే పరమపురుషుడు 'ప్రజలని సృష్టిస్తాన'ని సంకల్పించేడు. నారాయణుడినుంచి బ్రహ్మ సృష్టింపబడ్డాడు. నారాయణుడినుంచి రుద్రుడుసృష్టింపబడెను.) వంటివాక్యాల్లో నారాయణుడే జగత్సృష్టి సంకల్పంచేసేడని ప్రకటితమౌతోంది. *"నారాయణాదేవ సముత్పద్యన్తే నారాయణాత్ ప్రవర్తన్తే, నారాయణే*

*ప్రలీయన్తే*" (నారాయణోపనిషత్) వంటివాక్యాలవల్ల నారాయణుడే సమస్తవస్తుజాతానికీ సృష్టిస్థితిలయాలని చేసేవాడని స్పష్టమౌతోంది. ఈవిధంగా నారాయణుడే బ్రహ్మ రుద్రాదిసకలజగత్కారణుడని నిర్ణయింప బడినప్పుడు కొన్నికారణవాక్యాల్లో కనబడే శివహిరణ్యగర్భాదిశబ్దాల్లో రూఢిని ప్రక్కకిపెట్టి, అవికూడా నారాయణుడినే చెప్పుతున్నాయనే గ్రహించాలి. శివహిరణ్యగర్భాది శబ్దాలున్న కారణవాక్యాలని పరిశీలించే టప్పుడు ముందువెనకల వచ్చేవిషయాలని మనసులో బాగా ఉంచుకోవాలి. (1). ఉపనిషత్తుల్లో చెప్పబడే పరబ్రహ్మం ఒక్కటే. ఈశ్వరులు అనేకులుండడానికి సాధ్యంగాదు. అంచేత, నారాయణుడు, శివుడు, అనే ఇద్దరిని పరబ్రహ్మం అని చెప్పశక్యంగాదు. ఇద్దరినీ ఒకరేఅనితీసుకోవాలంటే, ఒకరినిస్రష్టగాను, మరొకరిని సృష్టింపబడేవాడుగాను, ఒకరిని అపహతపాప్ముడుగాను ఇంకొకరిని అనపహతపాప్ముడిగాను, ఒకరిని అకర్మవశ్యుడుగాను, మరొకరిని కర్మవశ్యుడుగాను, ఎన్నోవేదవాక్యాలు చెప్పటంచేత, ఇద్దరూ ఒకరేఅవటానికి వీలుగాదు. కనుక నారాయణుడు, విష్ణు, హరి, అనంతుడు, పురుషుడు, మహాపురుషుడు, ఉత్తమపురుషుడు, శివుడు, శంభు, ఈశుడు, ఈశ్వరుడు వంటి పదాలచేత ఉపనిషత్తుల్లో చెప్పబడినవాడు ఒకడే అయిఉండాలి. (2). ఇక ఈపదాలచేత చెప్పబడేవాడు నారాయణుడా, రుద్రుడా అన్నప్రశ్న వస్తుంది. నారాయణుడని తీసికుంటే, శివరుద్రాదిపదాలు యౌగికంగ నారాయణుడినే చెప్తున్నాయని గ్రహించాలి. రుద్రుడనితలిస్తే, నారాయణాదినామాలు యౌగికంగా శివుడినిచెప్తున్నాయని గ్రహించాలి. ఇక ఎట్లాగ్రహించటంఅన్నది, ప్రమాణ యుక్తులకి తగినదా? అన్నప్రశ్నే చివరికి మిగిలేది. (3). నారాయణాదిశబ్దాలు విష్ణువులో రూఢినిగలవనీ, శివాదిశబ్దాలు శివుడికి రూఢినిగలవనీ నిర్వివాదం. ఈరెండురకాల్లోను, ఒకదానిలో రూఢినిపక్కకిపెట్టి, యౌగికంగా అర్థాన్ని గ్రహించితీరాలి. అలా నారాయణశబ్దంలో రూఢినిప్రక్కకిపెట్టి, "నారములకు అయనమై యున్నవాడు" అన్న యౌగికార్థాన్ని గ్రహిస్తే శివపరంగాచూస్తే నారాయణశబ్దంలో ఉన్న 'ణత్వం' బాధింపబడు తోంది. "*నారాణాం అయనం*" (నరసమూహాలకి స్థానమైనవాడు) "*నారాః అయనం యస్య సః*" (నరసమూహాలని స్థానంగాగలవాడు) అనే వ్యుత్పత్తులున్నపదం "***నారాయనః***" అనేఅవుతుంది. "***పూర్వపదాత్ సంజ్ఞాయామగః***" అన్నపాణినిసూత్రప్రకారం ఆపేరుచేతసుప్రసిద్ధుడైన విష్ణువుని చెప్పినప్పుడే "***నారాయణః***" అనిమారుతుంది. ఆపదంయౌగికంగా వేరెవరినైనా చెప్పాలంటే "***నారాయనః***" అనే ఉంటుంది. "***నారాయణః***" అనిఉంటే, దేవతలలో విష్ణువునుతప్పవేరెవరినీ చెప్పదు. "***నారాయనః***" అనిఉన్నప్పుడు, ఆఅర్థానికితగిన ఎవరినైనాచెప్పాలి. వేదంలో కారణపురుషుడినిచెప్పే ఎన్నో వాక్యాల్లో "***నారాయణః***" అనిప్రయోగం కనపడుతుందే తప్ప "***నారాయనః***" అని ఒక్కచోటకూడా లేదు. కనుక నారాయణనామాన్ని శివపరంగాచెప్పటం సాధ్యంగానికార్యం. శివపరతత్త్వాన్ని సాధించటానికి ఎక్కువగా పాటుపడ్డ అప్పయ్యదీక్షితులవారు కూడా 'ణత్వం బాధిస్తోంది'అని వదిలేసేరన్నది ప్రసిద్ధం. కనక శివాదిశబ్దాలని నారాయణపరంగా గ్రహించాలేగాని నారాయణశబ్దాన్ని శివపరంగా గ్రహించవీలుగాదని తేల్చటమైంది. కనుక ఉపనిషత్తులన్నీ నారాయణుడినే సర్వకారణంగా చెప్పేయని గ్రహించటమే సరైనది. పైగా నారాయణనామానికి శివాదినామాలకిలేని అర్థప్రాబల్యంకూడాఉంది. శివరుద్రాదిశబ్దవాచ్యుడైన దేవుడు నారాయణుడినుండి పుట్టిన వాడనీ, వాడివల్లనే జీవించిఉన్నాడనీ, వాడిలోనే లయిస్తాడనీ కర్మవశ్యుడనీ, పాపంపోనివాడనీ, క్రూరమైనవాడనీ, ఇతరులనుంచి వరాలని పొందేవాడనీ, వేదాల్లోనే ఎన్నోచోట్ల ఉద్ఘోషింపబడుతోంది. ఇలాంటిన్యూనతలు ఒక్కడికే చెప్పలేక పోవటంలో సర్వస్రష్టృత్వం, సర్వరక్షకత్వం, సర్వసంహారకత్వం, సర్వాంతర్యామిత్వం మొదలైన ఎన్నో విశిష్టతలు చెప్పబడుతున్నాయి. ఇది నారాయణనామానికున్న అర్థప్రాబల్యం. కనుక అన్ని వేదవాక్యాలూ నారాయణుడినే పరవస్తువుగ చెప్తున్నాయని గ్రహించటమే సరైనమార్గం. ఇంకా, నారాయణుడు, విష్ణువు,

హరి, అనంతుడు పురుషుడు మొదలైన శబ్దాలు ఉపనిషత్తుల్లో నూటికిపైగా స్థానాల్లో ఉద్ఘోషింపబడ్డాయి. శివాది శబ్దాలు పద్దెనిమిదిస్థలాల్లోనే చెప్పబడ్డాయి. నారాయణాదినామాలు సాధారణంగా కారణవాక్యాల్లోనే కనబడుతున్నాయి. శివాదిశబ్దాలు ఒకటిరెండుచోట్లల్లోనే కారణవస్తువుని చెప్పటానికి ప్రయోగింపబడ్డాయి. దీనితో శివకారణత్వాన్ని సాధింపచూస్తే, కారణవాక్యాల్లో చెప్పబడిన ఆకాశప్రాణజ్యోతిరాదిశబ్దాలతో ఆకాశాది కారణత్వం చెప్పవలసి వస్తుంది. అవిఅచేతనాలవటంచేత కారణంకాలేవంటే, ఇంద్రాది శబ్దాలతో ఇంద్రుడు మొదలైన వాళ్ళకిగూడా కారణత్వంచెప్పాల్సివస్తుంది. వాళ్ళు సృష్టింపబడినవాళ్ళుగానూ, కర్మవశ్యులుగాను వేదంలోనే చెప్పబడుతున్నారంటే, రుద్రుడుకూడా సృష్టింపబడినవాడుగాను, పాపంతీరనివాడుగానూ, వేదవాక్యాల్లో చెప్పబడినవాడవటంచేత, కారణపురుషుడు అవలేడు. అంచేత, సత్, బ్రహ్మ, ఆత్మ, అక్షరం, ఆకాశం, జ్యోతి, ప్రాణం, మొదలైన శబ్దాల్లాగ, శివరుద్రాది శబ్దాలూ, నారాయణపరమైనట్లుగానే గ్రహించాలి. లేనినాడు, వేదమంతా, పరస్పరవిరుద్ధమై త్యాజ్యమౌతుంది. ఇందుచేతనే, నారాయణసూక్తంలో అక్షరపరంబ్రహ్మ పరమాత్మ పరంజ్యోతి; పరతత్త్వ శంభు శివాది శబ్దాలు నారాయణపరమే అని నిర్ణయింప బడింది. పైగా, శివరుద్రాదిపదాలు విష్ణుసహస్రనామంలోనూ, ఇతిహాస పురాణాల్లో ఎన్నోస్థానాల్లోనూ నారాయణపరంగానే చెప్పబడ్డాయి. నారాయణనామం శివుడిగురించి అట్లా చెప్పలేదు. బ్రహ్మచేత భగవానుడి నామాలైన శివరుద్రాదినామములు రుద్రుడికి పెట్టబడ్డాయని శతపథ బ్రాహ్మణంలో స్పష్టంగా చెప్పబడింది. *"నతునారాయణాదీనాం నామ్నామన్యత్ర సంభవః। అన్యనామ్నాం గతిర్విష్ణు రేకఏవ ప్రకీర్తితః।। ఋతే నారాయణాదీని నామాని పురుషోత్తమః। ప్రాదా దన్యత్ర భగవాన్......"* (నారాయణుడు మొదలైన నామాలు ఇతరదైవాలని చెప్పవు. ఇతరదైవాలపేర్లకీ విష్ణువొక్కడే చేరేస్థలంగ కీర్తి పొందిఉన్నాడు. నారాయణుడు వంటిపేర్లనితప్ప ఇతరనామాలని భగవానుడు ఇతరులకు ఇచ్చి కటాక్షించేడు) అని వామనపురాణంలోకూడా చెప్పబడింది. కనుక, అపౌరుషమైన వేదం రుద్రాదినామాలతో పరమపురుషుడైన నారాయణుడిని చెప్పటంలో ఆశ్చర్యమేమీ లేదు. *"యథాతమః... శివఏవ కేవలః"* అన్న వాక్యంలో రుద్రుడే సర్వకారణునిగా చెప్ప బడుతున్నాడని చెప్పటమూ తప్పే. *"యథా తమః..."* **(ఎప్పుడు** తమస్సు మాత్రం నశించదో) అని ఈవాక్యం ప్రారంభంకావటంచేత ఇదిమరొక ప్రసిద్ధవాక్యానికి అనువాదం అనితేల్తోంది. ఆపురోవాదవాక్యమేది అన్నప్రశ్న వచ్చినప్పుడు *"పృథివ్యప్సు ప్రలీయతే... అవ్యక్తమక్షరే లీయతే అక్షరమ్ తమసి లీయతే తమః పరే దేవ ఏకీభవతి పరస్తాన్ న సన్నాసన్ నసదసత్"* ( భూమి జలంలో లయమౌతుంది ... అవ్యక్తం అక్షరంలో లయమౌతుంది. అక్షరం **తమస్సులో లయిస్తుంది.** తమస్సు పరమాత్మతో ఒకటౌతుంది. **ఆతమస్సుకు పైన సత్తులేదు అసత్తుకూడలేదు. సదసత్తులూలేవు.**) అన్న సుబాలోపనిషద్వాక్యమే పురోవాదమనతగిందని తెలుస్తుంది. ఆఉపనిషత్తులోనే తరువాత *"నైవేహ కించన అగ్ర ఆసీత్। దివ్యో దేవ ఏకో నారాయణః"* (మొదట ఇక్కడ ఒక్కటీ లేదు. పరమపదవాసుడైన నారాయణుడనే దేవుడు ఒక్కడే ఉండెను.) అని నారాయణుడినే సకలజగత్కారణుడుగా చెప్పటంచేత, *"యస్య అవ్యక్తం శరీరం యస్య అక్షరం శరీరం యస్య మృత్యుః శరీరం... ఏష సర్వభూతాంతరాత్మా అపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణః"* (ఎవనికి అవ్యక్తంశరీరమో, ఎవనికి అక్షరం శరీరమో, ఎవనికి మృత్యువనబడే తమస్సు శరీరమో, వాడు సర్వభూతాలకీ అంతరాత్మ, పాపంలేనివాడై, పరమపదంలో వసించిఉండే నారాయణుడనే దేవుడొక్కడే.)అని తమస్సునధిష్ఠించిఉన్నవాడు నారాయణుడే అని చెప్పుటచేతనున్నూ, ఇక్కడచెప్పబడిన శివుడుకూడా నారాయణుడేఅని స్పష్టమౌతోంది. *"శాశ్వతం శివం అచ్యుతం"* అని నారాయణానువాకంలోనూ, *'సర్వః శర్వః శివః స్థాణుః"* అని శ్రీవిష్ణుసహస్ర నామంలోనూ శివనామం నారాయణపరమని నిర్ణయింపబడినదిగా అనుసంధించటం. ఇంకా *"తదక్షరమ్"* అని

అక్షరశబ్దంచేత చెప్పబడేవాడూ నారాయణుడే అని *"అక్షరం పరమం ప్రభుం నారాయణం"* అనినారాయణాను వాకం నిర్ణయించింది. ఛాందోగ్యాదిశ్రుతుల్లో సూర్యమండలమధ్యవర్తిగా ఘోషింపబడేవాడూ పుండరీకాక్షుడైన నారాయణుడే గనుక *"తత్ సవితుర్వరేణ్యం"*అని ఇచట ఘోషింపబడేవాడూ ఆతడే. కనుక, ఈవిధంగా *"యథా తమః"* మొదలైన మంత్రాలు నారాయణుడినే లక్ష్యించినవి అవటంచేత శివాదికారణత్వశంకకి స్థానంలేదు. పైగా, పరమాత్మవస్తువును చెప్పే పురుషసూక్తంచివరను *"హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ"*అని పరవస్తువుని లక్ష్మీనాథుడిగా చెప్పబడింది. లక్ష్మీపతిత్వం నారాయణుడికేఉండటంచేత లక్ష్మిలేని దేవుళ్ళైన బ్రహ్మరుద్రాదులు పరమాత్మవస్తువు కాలేరు. అంచేత, నారాయణుడొక్కడే జగత్కారణంగానూ, ముముక్షూపాస్యుడుగానూ, ఆయ్యాడన్నది ఆలసింపశక్యం గానిది. అంచేతనే బ్రహ్మసూత్రకారులైన వ్యాసుల వారే పంచమవేదమైన మహాభారతంలో *"ఆలోడ్య సర్వ శాస్త్రాణి విచార్య చ పునః పునః। ఇదమేకం సునిష్పన్నం ధ్యేయో నారాయణః సదా।* (అను. 186-11) (అన్ని శాస్త్రాలనీ పరిశీలించి మళ్ళీమళ్ళీ విచారించినా, ***'నారాయణుడొకడే ఎల్లపుడును ధ్యానింప తగినవాడు'*** అనటం ఒక్కటే నిశ్చయంగా తేలింది.) అని ఉద్ఘోషించేరు. *"వ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః"* అని రెండుసార్లు చెప్పటం ఈమొదటి అధ్యాయం ఇక్కడితో పూర్తైంది అని చూపటానికే.

సర్వవ్యాఖ్యానాధికరణము పూర్తియైనది. మొదటి అధ్యాయము సంపూర్ణము.